
'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 182

SUNDAY Special

ఆదివారం 22-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పుడితే కూతురిగా పుట్టాలి

ఇంట కూతురు ఉంటే ఆ ఇంటికి వచ్చే కళ వేరు. ప్రతి కూతురూ ఒక వరం.. అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం సందర్భంగా కూతురుగా, కూతురికి తల్లిగా ఉన్న రచయిత్రుల అభిప్రాయాలు.

- వివరాలు 13లో



పంత్, గిల్ సెంచరీలు

బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 287/4 డిక్లేర్డ్...రిషభ్ పంత్, శుబ్‌మన్ గిల్ శతకాలు... బంగ్లాదేశ్ విజయలక్ష్యం 515...ప్రస్తుతం 158/4.

- వివరాలు 14లో



'ఉక్రెయిన్'పై ఏం చేద్దాం?

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై జో బైడన్‌తో ప్రధాని మోదీ చర్చలు జరిపారు. యుద్ధానికి తెర దించే మార్గాలపై లోతుగా చర్చించారు.

- వివరాలు 6లో▶



ఆతిశి అనే నేను..

ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత ఆతిశి.. శనివారం రాజ్‌నివాస్‌లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

- వివరాలు 6లో▶



ఐఏఎఫ్ చీఫ్‌గా అమర్‌ప్రీత్‌సింగ్

భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ నియమితులయ్యారు.

- వివరాలు 6లో▶



విధుల్లో చేరిన బెంగాల్ జూడాలు

పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లు 42 రోజుల సమ్మెను విరమించి.. శనివారం విధుల్లో చేరారు.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

నారీ శక్తికి తిరుగులేదు



మహిళలు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని, పట్టుదల విషయంలో నారీ శక్తికి తిరుగులేదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మార్పు కోసం మహిళలు పోరాడాలని, పోరాటంలో స్వయంగా పాత్రధారులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

- వివరాలు 16లో▶

నిర్మాణం పూర్తికాకున్నా సర్టిఫికెట్ల జారీ పొరపాటే



కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంలో లోపాలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. ఇంజనీర్లపై ప్రశ్నల వర్షం కురిపించింది. బరాజ్‌ల నిర్మాణం పూర్తికాక ముందే పూర్తయినట్లు సర్టిఫికెట్లు ఎందుకిచ్చారని నిలదీసింది.

- వివరాలు 5లో▶

పీఏసీ భేటీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్



అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ నియామకంలో సంప్రదాయాన్ని పాటించలేదంటూ బీఆర్ఎస్ నిరసన తెలిపింది. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన పీఏసీ తొలి భేటీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

- వివరాలు 3లో▶

ఫార్మాసిటీని రద్దు చేయలేదు!



'హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ' ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేసినట్టు వస్తున్న వార్తలు సరికాదని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. 2016 జూన్ 10న జారీ చేసిన జీవో 31కు ప్రభుత్వం కట్టుబడి ఉందని ధ్రువీకరించింది.

- వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



కంగ్రాట్స్ సార్! మీరు నిజంగా రక్తదానం చేసినా ఇంత పబ్లిసిటీ వచ్చేది కాద్సార్!

ధర..దడ



బతుకమ్మ, దసరా పండుగల ముందు కొండెక్కుతున్న నిత్యావసరాలు

పోటాపోటీగా పెరుగుతున్న బియ్యం, నూనెలు, కూరగాయల ధరలు

వారం క్రితం సన్‌ఫ్లవర్ నూనె లీటర్ రూ.105	ఫైన్ రకం బియ్యం కిలో రూ.70పైనే..
ప్రస్తుతం రూ.125 పైనే..	ఇప్పటికే రూ.60కి చేరిన టమాటా, ఉల్లి

- ఇంకా దిగిరాని వెల్లుల్లి.. మెల్లిగా పెరిగిపోతున్న పప్పులు
- గత వారం పదిరోజుల్లో 20 నుంచి 30 శాతం పెరిగిపోయిన ధరలు
- ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయంటున్న మార్కెట్ వర్గాలు
- మధ్యతరగతి వారూ కొనలేనంతగా రేట్ల మంట
- ధరల మంటపై ప్రభుత్వం నుంచి స్పందన లేదనే విమర్శలు
- రైతు బజార్లు, రేషన్‌షాపుల్లో తక్కువ ధరకు నిత్యావసరాలు విక్రయిస్తే బాగుంటుందనే సూచనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పండుగల ముందు నిత్యావసరాల ధరలు చుక్కలు తాకుతున్నాయి. రోజురోజుకూ నూనెలు, బియ్యం, కూరగాయల ధరలు పోటాపోటీగా పెరుగుతున్నాయి. రాష్ట్రమంతా ఘనంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ రెండు వారాల్లోనే మొదలవనుంది. తర్వాత పదిరోజుల్లోనే దసరా పండుగ ఉంది. ఈ సమయంలో ధరల పెరుగుదల సామాన్య జనంలో ఆందోళన రేపుతోంది. బియ్యం ధరలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంటే.. నూనెలు, కూరగాయల ధరలు గత వారంలోనే ఒక్కసారిగా 20–30 శాతం వరకు పెరగడం ఇబ్బందిగా మారుతోంది. ఇలా పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను, బ్లాక్ మార్కెటింగ్‌ను నియంత్రించడంపైగానీ.. సామాన్యులకు తక్కువ ధరలో సరుకులు అందించడంపైనగానీ ప్రభుత్వం దృష్టిపెట్టడం లేదనే విమర్శలున్నాయి.

బియ్యం మార్కెట్‌పై నియంత్రణ లేక..

రాష్ట్రంలో సన్నబియ్యం బంగారమైపోతోంది. పప్పులతో పోటీపడుతూ రేటు పెరుగుతోంది. జైశ్రీరాం, సోనామసూరి, హెచ్ఎంటీ రకాల బియ్యం రేటు కిలో రూ.70కిపైగా పలుకుతోంది. రైతుల నుంచి సన్నరకాల ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2,500 నుంచి రూ.3,000కే కొనుగోలు చేస్తున్న మిల్లర్లు.. సన్న బియ్యానికి డిమాండ్ ఉండటంతో అడ్డగోలు రేటుకు విక్రయిస్తున్నారు. బియ్యం మార్కెట్‌పై

మిగతా 2వ పేజీలో ▶



"నూనెలు కొనే పరిస్థితి లేదు

వంట నూనె ధరలు ఒక్కసారిగా పెరిగాయి. సన్ ఫ్లవర్ మొన్నటిదాకా 105 వరకు ఉంటే.. ఇప్పుడు 125, 130 రూపాయలకు పెంచారు. పామాయిల్ 90 నుంచి 120కి పెంచి అమ్ముతున్నారు. శనగపప్పు మొన్నటిదాకా కిలో 85 రూపాయల దాకా ఉంటే.. ఇప్పుడు 110 రూపాయలు తీసుకుంటున్నారు. – దుర్గ, నల్లగొండ

దురుద్దేశంతో మహాపచారం

వాడని నెయ్యి.. తయారు కాని లడ్డూతో ఏపీ సీఎం చంద్రబాబు దుర్మార్గ రాజకీయం

జరగనిది జరిగినట్లుగా దుష్ప్రచారం చేస్తూ ఆ దేవదేవుడిని అప్రతిష్టపాలు చేసే కుతంత్రం

- వారే మహాపచారం తలపెట్టి రాజకీయ లబ్ధి కోసం నిందలు
- నిర్దేశించిన ప్రమాణాలు లేకుంటే నెయ్యి ట్యాంకర్‌ను గోడౌన్‌లోకే అనుమతించరు
- ప్రతి నెయ్యి ట్యాంకర్, లారీలో సరుకులకు ముగ్గురు టెక్నీషియన్లతో వేర్వేరుగా పరీక్షలు
- 3 పరీక్షల్లోనూ నాణ్యంగా ఉంటేనే నెయ్యి ట్యాంకర్/ సరుకుల లారీ గోడౌన్‌లోకి..
- ఆవు నెయ్యి నాణ్యత కచ్చితంగా లెక్కించేందుకు సీఎఫ్‌టీఆర్ఐ నుంచి అధునాతన పరికరాలు
- నాణ్యత లేదని ఆ ల్యాబ్‌లో తేలడంతో 4 ట్యాంకర్ల నెయ్యిని తిరుపతి గోడౌన్ నుంచి వెనక్కి పంపేసిన టీటీడీ
- అసలు తిరుమల చేరని "నెయ్యి"పై చంద్రబాబు క్షుద్ర రాజకీయం

12లో



ఆ 4 ట్యాంకర్ల నెయ్యి అస్సలు వాడలేదు

ఏఆర్ డెయిరీకి తిప్పి పంపించాం

ప్రఖ్యాత ఆంగ్ల వెబ్‌సైట్ 'ది ప్రింట్'తో టీటీడీ ఈవో శ్యామలరావు

12లో

లడ్డూ ప్రసాదం 'కల్తీ'ని సంచలనంగా మార్చొద్దు



- రాజకీయ పార్టీలు, ధార్మిక సంస్థలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి
- సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఏపీ సర్కారుకు సూచన

12లో

జమిలి ముసుగులో దేశాన్ని కబళించే కుట్ర

రాష్ట్రాల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శ

- విపత్కర సమయంలో ఏచూరి లేకపోవడం తీరనిలోటని వ్యాఖ్య
- నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప నేత అన్న సీఎం
- కండువాలు మార్చే కాలంలో సిద్ధాంతం కోసం నిలబడిన నేత ఏచూరి: కేటీఆర్

3లో



ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

రూ.8,888 కోట్ల 'అమృత్' పనుల్లో అవినీతి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- సీఎం బావమరిది కంపెనీకి అనుచిత లబ్ధి
- అర్హత లేకున్నా.. రూ. వేల కోట్ల పనులు
- బీజేపీ స్పందించకుంటే కుమ్మక్కు అయినట్టు భావిస్తాం



వివరాలు 3లో

టైమ్ చెప్ప వస్తా..

రూ. 8,888 కోట్ల టెండర్ల గురించి నువ్వు చెప్పింది నిజమైతే అక్కడే రాజీనామా చేస్తా: మంత్రి పొంగులేటి

- లేదంటే నువ్వు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్
- కేటీఆర్‌కు రెవెన్యూ మంత్రి సవాల్
- అమృత్ టెండర్లు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనివే..



వివరాలు 3లో



జలమయమైన అమీర్‌పేట ప్రధాన రహదారి

3 గంటలు.. 9 సెం.మీ.

హైదరాబాద్ నగరాన్ని శనివారం రాత్రి కుండపోత వాన ముంచెత్తింది. 3 గంటల వ్యవధిలోనే 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వచ్చే రెండ్రోజులు హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

2లో

క్లుప్తంగా...

విదేశీ పర్యటనకు 'భట్టి'



సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం అమెరికా, జపాన్ దేశాల పర్యటనకు బయల్దేరి వెళ్లారు. ఈ నెల 21 నుంచి అక్టోబర్ 4 వరకు ఆయన రెండు దేశాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. అక్కడ మైనింగ్, హరిత ఇంధన రంగాలపై జరగనున్న అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొంటారు. ప్రముఖ సంస్థల ప్రధాన కార్యాలయాలను సందర్శించి రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించనున్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరగనున్న అంతర్జాతీయ మైనింగ్ సదస్సులో వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చిస్తారు. అనంతరం హోవర్ డ్యామ్‌ను సందర్శించనున్నారు. 26న లాస్‌ఏంజెలిస్ చేరుకుని 27న అక్కడి ఎడ్వర్డ్స్ అండ్ సాన్‌బోర్న్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ను పరిశీలిస్తారు. 28న పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులతో సమావేశమవుతారు. 29న జపాన్‌లోని టోక్యోకు చేరుకుని 30న స్థానిక దౌత్యవేత్త ఇవ్వనున్న విందులో పాల్గొంటారు. అక్కడే పెట్టుబడిదారులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. అక్టోబర్ 1న పెట్టుబడిదారులతో సమావేశమవుతారు. యామన్షి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, అక్టోబర్ 2న తోషిబా, కవాసకి సంస్థల ప్రధాన కార్యాలయాలను సందర్శిస్తారు. అనంతరం ఓసాకా చేరుకుని అక్టోబర్ 3న పానాసోనిక్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి, అక్టోబర్ 4న హైదరాబాద్ చేరుకుంటారు. ఆయనతో పాటు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, సింగరేణి ఇన్‌చార్జి సీఎండీ ఎన్.బలరామ్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు కూడా వెళ్లారు.

ఢిల్లీలో రాష్ట్ర పెవిలియన్ స్టాల్స్‌కు విశేష స్పందన

ప్రపంచ ఆహార సదస్సులో 12 స్టార్టప్ కంపెనీల స్టాల్స్

సాక్షి, న్యూఢిల్లీ: హస్తినలో మూడు రోజుల పాటు జరిగిన ప్రపంచ ఆహార సదస్సులో రాష్ట్రానికి చెందిన స్టార్టప్ కంపెనీలు విశేష ఆదరణను సొంతం చేసుకున్నాయి. ఢిల్లీలోని భారత మండపంలో ఏర్పాటు చేసిన సదస్సులో రాష్ట్రానికి చెందిన పెవిలియన్‌ను ఏర్పాటు చేశారు. అందులో 12 స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులు, ఎగుమతులకు సంబంధించిన వివరాలను సందర్శకులకు క్షుణ్ణంగా వివరించాయి. ఆహారశుద్ధి పరిశ్రమల ప్రతినిధులతో రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ సుష్మ సమావేశమై రాష్ట్రంలో మరిన్ని ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఉత్తరాది రాష్ట్రాల ప్రతినిధులతోపాటు విదేశాలకు చెందిన వారు స్టార్టప్‌లను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు మక్కువ చూపారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నిత్యం తనిఖీలు నిర్వహించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. తనిఖీల వివరాలను ప్రతి నెలా తనకు నివేదిక రూపంలో అందించాలని స్పష్టం చేశారు. ఆహార భద్రత అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని డైట్ క్యాంటీన్లను తనిఖీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల హెచ్‌వోడీలు నెలకు కనీసం రెండు సార్లు జిల్లాల్లోని ఆస్పత్రులను సందర్శించి హెచ్‌ఆర్, అటెండెన్స్, ఎక్విప్‌మెంట్, మెడిసిన్, శానిటేషన్, డైట్ ఇతర అంశాలను తనిఖీ చేయాలన్నారు. సచివాలయంలోని తన చాంబర్‌లో శనివారం వైద్య,ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారినుద్దేశించి మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణుల ఆరోగ్యంపై ఎక్కువగా శ్రద్ధ చూపాలన్నారు. డీఎంహెచ్‌ఓలు, ఆస్పత్రి సూపరింటెండెంట్లు, టాస్క్‌ఫోర్స్ కమిటీలపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తానని మంత్రి స్పష్టం చేశారు.

కాంట్రాక్టు యోగా ఇన్‌స్ట్రక్టర్లకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాస్పత్రుల్లో 842 యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 421 పోస్టులను పురుషులతో, మరో 421 పోస్టులను మహిళలతో భర్తీ చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. వీటిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్టు వెల్లడించింది. పురుష యోగా ఇన్‌స్ట్రక్టర్లు నెలకు కనీసం 32 యోగా తరగతులు, మహిళా యోగా ఇన్‌స్ట్రక్టర్లు నెలకు 20 యోగా తరగతులకు హాజరు కావాలని స్పష్టం చేసింది. ప్రతి తరగతి గంటసేపు ఉంటుందని, ఒక్కో తరగతికి రూ.250 చొప్పున పారితోషికం చెల్లిస్తామని తెలిపింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించింది. ఉమ్మడి జిల్లా ఆయుష్ హెడ్ క్వార్టర్స్‌లో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈ నెల 24న ఆదిలాబాద్, హైదరాబాద్, 25న నిజామాబాద్, 26న మెదక్, రంగారెడ్డి, 27న వరంగల్, నల్లగొండ, 28న కరీంనగర్, 30న ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో ఇంటర్వ్యూలు జరగనున్నాయి.

ఇంజనీరింగ్‌పై అదే క్రేజ్

కాలేజీలు తగ్గినా.. సీట్లు పైకే



కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీలు.. చేరుతున్న విద్యార్థుల వివరాలు

సంవత్సరం	మొత్తం కాలేజీలు	ప్రభుత్వ కాలేజీల్లో..	ప్రైవేటు కాలేజీల్లో..	మొత్తం సీట్లు	ప్రవేశాలు	శాతం
2020-21	186	3,151	95,837	98,988	65,720	66.39
2021-22	180	4,069	1,05,704	1,08,773	77,700	70.54
2022-23	178	4,825	1,03,890	1,11,769	82,350	76.37
2023-24	175	5,667	1,11,769	1,17,426	91,001	77.50
2024-25	174	5,907	1,05,573	1,12,069	1,06,107	86.39

సాక్షి, హైదరాబాద్: ఒకవైపు ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య తగ్గుతున్నా, సీట్లు మాత్రం ఏటా పెరుగుతున్నాయి. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థుల సంఖ్యా ఏయేటికాయేడు పెరుగుతూనే ఉంది. రాష్ట్రంలో 2020-21లో 186 ఇంజనీరింగ్ కాలేజీలుంటే, 2024-25 విద్యా సంవత్సరానికి అవి 174కు తగ్గాయి. 20-21లో 98,988 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, ఈ ఏడాది సీట్లు 1,12,069కు పెరిగాయి. ఇంజనీరింగ్‌లో చేరేవారి సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతూ, ఇది ఈ సంవత్సరం లక్ష దాటింది. చిన్న పట్టణాల్లో కాలేజీలు క్రమంగా మూతపడుతున్నాయి. ఇక్కడ విద్యార్థులు చేరేందుకు ఇష్టపడటం లేదని ప్రవేశాల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. విద్యార్థులు ఇంటర్ నుంచే హైదరాబాద్‌లో చదివేందుకు వస్తున్నారు. ఇదే ట్రెండ్ ఇంజనీరింగ్‌లోనూ కొనసాగుతోంది. దీంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీల్లో ఎక్కువగా సీట్లు భర్తీ అవుతున్నాయి.

ఏటా పెరుగుతున్న ప్రవేశాలు | ఈ ఏడు లక్షపైనే చేరికలు

ఎక్కువ మంది ఇంజనీరింగ్ వైపే..

రాష్ట్రవ్యాప్తంగా ఏటా 4.5 లక్షల మంది ఇంటర్మీడియట్ పాసవుతున్నారు. ఇందులో 75 శాతంపైగా ఎంపీసీ గ్రూపు విద్యార్థులే ఉంటున్నారు. వీరిలో లక్ష మంది వరకూ రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరుతున్నారు. ఎన్ఐటీలు, అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీల్లో చేరేవాళ్లు, ట్రిపుల్ఐటీలు, ఇతర కేంద్ర సంస్థల్లో చేరేవాళ్లు మరో 10 వేల మంది వరకూ ఉంటారని అంచనా. ఈ ఏడాది ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగానికి 2.40 లక్షల మంది దరఖాస్తు చేశారు. వీరిలో 1.80 లక్షల మంది పాసయ్యారు. కన్వీనర్ కోటా కింద 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు కలిపి మొత్తం 86,943 సీట్లు ఉన్నాయి. వీటిలో 75,107 సీట్లు భర్తీ చేశారు. దాదాపు 31 వేల బీ కేటగిరీ సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రంలోని ఇప్పటికే ఉన్న ప్రైవేటు వర్సిటీలు, కొత్తగా మంజూరైన మరో ఐదు ప్రైవేటు వర్సిటీలు, డీమ్డ్ వర్సిటీల క్యాంపస్‌లలో కనీసం 10 వేల మంది చేరినట్టు అంచనా. బాసర ఆర్‌జీయూకేటీ, హెచ్‌సీయూలోని సీఆర్‌రావు విద్యా సంస్థతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ పరిసర ప్రాంతాల్లోని డీమ్డ్ వర్సిటీల్లో మరో 10 వేల మంది చేరే వీలుంది.

మోజు పెంచిన కంప్యూటర్ సైన్స్

ఎందుకీ క్రేజ్

ఇంజనీరింగ్ తర్వాత ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడాలని విద్యార్థులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రెండ్‌ను బట్టి చూస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో చేరే వారే ఎక్కువగా ఉంటున్నారు. దీంతో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, దాని అనుబంధ కోర్సుల్లో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. మరోవైపు రాష్ట్రంలో ఐటీ కంపెనీల నియామకాలన్నీ కంప్యూటర్ కోర్సులు చేసినవారితోనే జరుగుతున్నాయి. డిగ్రీ, ఇతర కోర్సుల్లోనూ కంప్యూటర్ అనుబంధం ఉంటే తప్ప ఐటీ ఉద్యోగాలకు వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థుల డిమాండ్‌కు తగ్గట్టుగా ప్రైవేటు కాలేజీలు కూడా కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో సీట్లు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాగా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీల్లోనే మంచి ఫ్యాకల్టీ ఉంటుందని విద్యార్థులు భావిస్తున్నారు. దీంతో పాటు అన్ని బ్రాంచీల్లోనూ మార్పు అనివార్యమవుతోంది. ఐటీ ఆధారిత బోధన విధానం తప్పనిసరి అవుతోంది. అందుకే విద్యార్థుల్లో ఇంజనీరింగ్‌పై క్రేజ్ పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు.

ఏఐ ప్రభావమే మార్చేస్తోంది



ఇంజనీరింగ్‌లోని అన్ని బ్రాంచీల్లోనూ ఆర్టిఫిషియల్ టెక్నాలజీ దూసుకొస్తోంది. కంప్యూటర్ సైన్స్‌లోనే కాదు... సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్‌లోనూ ఏఐ లేకుండా ముందుకెళ్లడం కష్టం. అందుకే బ్రాంచీ ఏదైనా ఏఐ మీద విద్యార్థులు దృష్టి పెడుతున్నారు. ఇంజనీరింగ్ చేస్తూనే... ఏఐ నేర్చుకుంటున్నారు. దీనిద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. అందుకే ఎక్కువ మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు.

\- డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి
రెక్టార్, జేఎన్‌టీయూహెచ్

తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలు భేష్

ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసలు

- సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి విషయంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసించింది. గత నెలలో వాషింగ్టన్‌లో ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తదుపరి చర్చల కోసం ప్రపంచబ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్ నేతృత్వంలో వరల్డ్ బ్యాంక్ కంట్రీ ఆపరేషన్ హెడ్ పాల్ ప్రోసీ, అర్బన్ ఇన్‌ఫ్రా, ప్రాజెక్ట్ లీడ్ నటాలియా కె, డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్ట్ మహిమాపత్ రే శనివారం హైదరాబాద్ వచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా, వైద్య, సాగునీటి రంగాలను తమ ప్రభుత్వ ప్రాధాన్యాలుగా పెట్టుకున్నామని, ఆయా రంగాల్లో తాము తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి వివరించారు. తాము ప్రాధాన్యంగా తీసుకుంటున్న ప్రాజెక్టులకు ఆర్థిక సహకారంతో పాటు అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ప్రాజెక్టులు నిలిచేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. విద్యా, వైద్య రంగాల్లో రేవంత్‌రెడ్డి దార్శనికత బాగుందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని మార్టిన్ రైజర్ ప్రశంసించారు. ప్రపంచ బ్యాంకు ఏ రంగాలను ప్రాధాన్య అంశాలుగా ఎంచుకుందో అవే తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయని మార్టిన్ రైజర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకరించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.



ప్రపంచబ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్‌కు జ్ఞాపికను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

'ఏటీసీల్లో సిబ్బంది కొరతను అధిగమించాలి'

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో సిబ్బంది కొరతను అధిగమించాలని సీఎం ఎ.రేవంత్ అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్న నేపథ్యంలో సిబ్బంది కొరత లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రస్తుత ఇండస్ట్రీ అవసరాలకనుగుణంగా సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, మార్కెట్ అవసరాలకనుగుణంగా ఏటీసీల్లో సిలబస్ ఉండాలని, ఈ మేరకు సిలబస్ మార్పునకు ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించి నిపుణుల సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆదేశించారు. వృత్తి నైపుణ్యం అందించే ఏటీసీలను, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో సీ.ఎస్ శాంతికుమారి, కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జార్ఖండ్ హైకోర్టు సీజేగా జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు



- హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు నుంచి బదిలీ చేసిన రాష్ట్రపతి ముర్ము
- పలు హైకోర్టులకు సీజేలుగా మరికొందరు జడ్జీల నియామకం
- గతంలో తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ సీజేగా పనిచేసిన జస్టిస్ రామచంద్రరావు

సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ మామిడన్న సత్యరత్న రామచంద్రరావు నియమితులయ్యారు. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ రామచంద్రరావును జార్ఖండ్ హైకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బదిలీ చేశారు. అలాగే మరికొందరు న్యాయమూర్తులను ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, మేఘాలయ, జమ్మూకశ్మీర్-లడఖ్, మద్రాస్ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులుగా నియమించారు. మరో ముగ్గురు జ్యుడీషియల్ అధికారులను మద్రాస్ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తులుగా నియమించారు. ఈ నెల 17న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. దీంతో శనివారం కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2012లో ఏపీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులైన జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు... 2013లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2021 ఆగస్టు 31న తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2021 అక్టోబర్ 12న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. అనంతరం 2023 మే 30న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రరావు తండ్రి జస్టిస్ ఎం.జగన్నాథరావు 1997-2000 మధ్య సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు.

ధర.. దడ

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం కూడా దీనికి మరింత ఊతమిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం జైశ్రీరాం రకం రా రైస్ (ముడి బియ్యం) మార్కెట్‌లో 26 కిలోల బ్యాగ్ ధర రూ.1,800 వరకు ఉండగా.. స్టీమ్ రైస్ ధర రూ.1,500 వరకు ఉంది. సోనా మసూరి, హెచ్ఎంటీ రకాల ధరలు రూ.1,700కు చేరాయి.

కేంద్రం ప్రకటనతో పెరిగిన వంట నూనెల ధర

వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 20% పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించటంతో వాటి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్), సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్, వేరుశనగ నూనెలపై దిగుమతి సుంకాన్ని 12.5 % నుంచి 32.5%కి పెంచుతున్నట్టు కేంద్రం ఈనెల 14న ఉదయం ప్రకటన చేయగా.. అదే రోజు సాయంత్రానికే నూనెల ధరలు రూ.20కుపైగా పెరిగాయి. ఇటీవలి వరకు లీటర్ రూ.105గా ఉన్న పొద్దుతిరుగుడు నూనె ధర ప్రస్తుతం రూ.130-140కి చేరింది. పామాయిల్ రేటు రూ.95 నుంచి రూ.120 దాటిపోయింది. వేరుశనగ నూనె రూ.170 దాటింది. నిజానికి కొత్తగా దిగుమతి అయ్యే నూనెలపైనే పన్ను పెరిగింది. కానీ ఇప్పటికే దిగుమతి అయి, నిల్వ ఉన్న స్టాక్‌పైనా అధిక రేటు వసూలు చేస్తుండటం గమనార్హం. అంతే కాదు.. ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'విజయ' నూనె ధరలనూ అమాంతం పెంచేశారు. ప్రభుత్వం 'విజయ' వంట నూనెలను తక్కువ ధరకు అందించే అవకాశమున్నా.. ఆ దిశగా చర్యలు లేవని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

కేంద్రం విజ్ఞప్తిని పట్టించుకోని వ్యాపారులు

సుంకం పెంపునకు ముందే దిగుమతి చేసుకున్న స్టాక్ అయిపోయే వరకు కంపెనీలు.. నూనెల ధరలను గరిష్ట రిటైల్ ధర కంటే తక్కువగా ఉంచాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా సుంకం పెంపునకు ముందే దిగుమతి అయిన సుమారు 30 లక్షల టన్నుల వంట నూనెల స్టాక్ ఉందని.. అది 45-50 రోజుల వరకు సరిపోతుందని అంచనా. అయినా కూడా హోల్‌సేల్ నుంచి రిటైల్ వరకు అన్నిచోట్లా వంటనూనెల ధరలు పెంచేశారు. దసరా నాటికి ఇంకా ధరలు పెరుగుతాయనే ప్రచారంతో.. వినియోగదారులు కొనుగోలు చేసి పెట్టుకుంటుండటం గమనార్హం.

అందుబాటులో లేని ఉల్లి, వెల్లుల్లి..

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఉల్లి, వెల్లుల్లి ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం రాష్ట్రంలో వెల్లుల్లి కిలో రూ. 350 నుంచి రూ.400 వరకు ఉండగా.. ఉల్లి ధర కిలో రూ.60 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. మన దేశంలో అవసరమైన వెల్లుల్లిలో అత్యధికంగా 40% వరకు మధ్యప్రదేశ్ నుంచే వస్తోంది. దీనితోపాటు వెల్లుల్లి పండించే రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లోనూ.. వాతావరణ పరిస్థితులు కలసి రాక దిగుబడి తగ్గిందని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. దీనితో వెల్లుల్లి రేటు మరింతగా పెరగొచ్చని అంటున్నాయి. ఉల్లి పంటకు కూడా వర్షాల ఎఫెక్ట్ పడింది. ఇప్పటికే రూ.60 దాటింది. ఇది రూ.100కు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

పప్పులు, కూరగాయల మోత కూడా..

కందిపప్పు, పెసర, మినుములు, శనగ.. ఇలా పప్పుల ధరలన్నీ పెరిగాయి. కందిపప్పు ధర నాణ్యతను బట్టి కిలో రూ. 150 నుంచి రూ.180 వరకు ఉండగా.. పెసర పప్పు రూ. 130 నుంచి రూ.150 వరకు ఉంది. శనగపప్పు ధర గత పదిరోజుల్లోనే రూ.85 నుంచి రూ.105కు పెరిగింది. మినప పప్పు రూ.150పైనే పలుకుతోంది. మరోవైపు కూరగాయల ధరలు కూడా కొండెక్కుతున్నాయి. కిలోకు కాలీఫ్లవర్ రూ. 150కిపైగా, పచ్చిమిర్చి రూ.120కిపైగా ఉంది. టమాటా ధర వారం క్రితం వరకు కిలో రూ.25-30 ఉంటే.. ఇప్పుడు రూ. 60కి చేరింది. బీరకాయ, దోసకాయ, పొట్లకాయ, బెండకాయ, వంకాయ ఏది చూసినా కిలో రూ.50-60 దాటిపోయాయి. చిక్కుడు, బీన్స్ కిలో రూ.120కి తగ్గడం లేదు.

సర్కారులో స్పందనేదీ?

అడ్డగోలుగా ధరలు పెరిగిపోతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కానరావడం లేదని, పెరుగుతున్న ధరలపై కనీస సమీక్ష కూడా లేకపోవడం ఏమిటని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం కాస్త దృష్టిపెడితే.. ధరలను కాస్తయినా నియంత్రించవచ్చని నిపుణులు చెప్తున్నారు. మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖల ద్వారా నిత్యావసరాలను తక్కువ ధరలతో వినియోగదారులకు అందించవచ్చని వివరిస్తున్నారు. గతంలోనూ ఇలా ధరలు పెరిగినప్పుడు రేషన్‌దుకాణాలు, రైతుబజార్ల ద్వారా తక్కువ ధరలో ఉల్లిగడ్డలు, ఉప్పు, పప్పులు విక్రయించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

కూరగాయల రేట్లు పెంచేశారు



కూరగాయల రేట్లు బాగా పెరిగాయి. టమాటా మొన్నటివరకు 20 రూపాయలు ఉంటే ఇప్పుడు 50, 60 రూపాయలకు అమ్ముతున్నారు. కాకర 30 నుంచి 45కు పెంచారు. వారంలోనే అన్ని కూరగాయల రేట్లు పెరిగాయి. రోజువారీగా కూరగాయల ధరలను చూసి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

\- సాంబయ్య, నల్లగొండ

ధరలు పెరిగాయి



ఐదు లీటర్ల సన్‌ఫ్లవర్ ఆయిల్ 15 రోజుల కింద రూ.570 ఉంటే.. ఇప్పుడు రూ.639 తీసుకుంటున్నారు. 15 రోజుల్లోనే 70 రూపాయలు పెరిగింది. దసరా పండుగ ముందు ధరలు పెరిగాయి. ఇంకా పెరుగుతాయని అంటున్నారు.

\- నాయిని రవి
న్యూశాయంపేట, హనుమకొండ

ధరలు మండిపోతున్నాయి



వంట నూనె ఒకటే కాదు.. అన్ని నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. పప్పులు, కూరగాయలు కూడా కొనే పరిస్థితి లేదు.

\- యానం విద్య
కాకాజీ కాలనీ, హనుమకొండ

ప్రజల కన్నీటి గాథలు ప్రభుత్వం పట్టించుకోదా?

రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరద కారణంగా ఎంతోమంది నిరాశ్రయులయ్యారని, సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వరదలతో 33 మంది ప్రాణాలు కోల్పోయారని, రూ.5,438 కోట్ల ఆస్తినష్టం, 4.25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఇంకా లెక్కకు రాని మరణాలు, ఆస్తి, పంట నష్టం జరిగిందన్నారు. ఎవరిని పలకరించినా హృదయాన్ని కదిలించే కన్నీటి గాథలే వినిపిస్తున్నా.. ప్రభుత్వం నుంచి కనీస ఓదార్పు కూడా కరువైందని హరీశ్ ఆరోపించారు. వరద బాధితులకు సహాయం చేయడంలో మీ ప్రభుత్వం అన్ని దశల్లో విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ. 16,500 ఇస్తే అవి ఏ మూలకు సరిపోతాయని, ఇళ్లు కూలిన వారికి రూ. 18 వేలు ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. పంట నష్టం జరిగిన రైతన్నకు ఎకరాకు మీరిచ్చే పదివేల సాయం ఏ మూలకు సరిపోతుందో చెప్పాలన్నారు. మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీ నోటితోనే పంట నష్టానికి ఆర్థిక సాయంగా ఎకరాకు రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిన విషయం మరిచారా అని గుర్తు చేశారు.

సింగరేణి బోనస్ పెద్ద బోగస్..

సింగరేణి కార్మికుల బోనస్‌ను బోగస్‌గా మార్చారని, తీపికబురు అంటూ సీఎం రేవంత్ కార్మికులకు చేదు కబురు చెప్పారని హరీశ్‌రావు మండిపడ్డారు. కార్మికులకు ఇచ్చే లాభాల్లో కోత విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి లాభం రూ. 4,701 కోట్లలో 33 శాతాన్ని కార్మికులకు బోనస్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. లాభాల వాటాలో 50% కోతను విధించి ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. బొగ్గు ఉత్పత్తిలో కార్మికులు అల్‌టైమ్ రికార్డు సాధించినా అదనంగా రూ.20 వేలు ఇవ్వడం దారుణమని హరీశ్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం నుంచి సింగరేణి సంస్థ లాభాల్లోకి దూసుకెళ్లడంతో కేసీఆర్ ప్రతి ఏటా కార్మికుల వాటా పెంచారన్నారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో శనివారం రాత్రి వాన దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులతో ఎడతెగని కుండపోత వర్షం కురిసింది. కేవలం మూడు గంటల వ్యవధిలోనే సుమారు 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం ధాటికి రోడ్లు చెరువులను తలపించగా, లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో వరద రహదారులను ముంచెత్తింది. దీంతో శనివారం అర్ధరాత్రి వరకు పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాబోయే రెండు రోజులు సైతం భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. కాగా, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.



శనివారం భారీ వర్షం కారణంగా పంజగుట్ట వద్ద స్తంభించిన ట్రాఫిక్

పిడుగుపాటుకు రైతు మృతి



రాములు (ఫైల్)

తెలకపల్లి: పొలం పనులకు వెళ్లిన ఓ రైతుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ నరేశ్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బోడ రాములు (47) తన పత్తి చేనులో శనివారం పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3.30 సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసి పొలంలో పిడుగు పడటంతో అక్కడే ఉన్న రాములు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్‌కు తరలించారు. అలాగే తహసీల్దార్ జాకీర్, ఆర్ఐ రామస్వామి బాధిత రైతు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాములు భార్య సంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాములుకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వాయవ్య బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఉత్తర ప్రాంత జిల్లాల్లోని ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వివరించింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్, రంగారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

క్లుప్తంగా...

నేడు సీఎల్పీ భేటీ

- టీపీసీసీ కొత్త అధ్యక్షుడికి అభినందనలు తెలిపేందుకేనం టున్న కాంగ్రెస్ వర్గాలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశం ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. హైటెక్ సమీపంలోని ఓ హోటల్‌లో సీఎల్పీ భేటీ జరుగుతుందని, పీసీసీ కొత్త అధ్యక్షుడికి అభినందనలు తెలిపేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి, సీఎల్పీ నేత రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు దిశానిర్దేశం కూడా చేస్తారని తెలుస్తోంది.

నేడు అన్ని పార్టీలు, కుల సంఘాల సమావేశం

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని, కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్ని పార్టీలు, కుల సంఘాల సమావేశం నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో అశోక హోటల్‌లో నిర్వహించే అన్ని పార్టీల సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, పలువురు రాజకీయ నేతలు, కుల సంఘాల అధ్యక్షులు హాజరవుతారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముస్లింలపై విద్వేషమే బీజేపీ ఎజెండా

- మోదీ ప్రభుత్వంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ధ్వజం



సాక్షి,హైదరాబాద్: నిత్యం ముస్లిం సామాజిక వర్గంపై విద్వేషాన్ని చిమ్మడమే ఆర్‌ఎస్ఎస్, బీజేపీలు ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నాయని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ దారుస్సలాంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన జల్సా-ఎ-రహమతుల్-లిల్-అలమీన్ (మిలాద్) సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళలపై అత్యాచారాలు సహా హింసాత్మక ఘటనలు జరుగుతున్నా మణిపూర్‌కు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. హరియాణా, కశ్మీర్, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమన్నారు. బీజేపీ నేతలకు ఇస్లామోఫోబియా వ్యాధి ఉందని ఆరోపించారు.

వర్షాలు కురిస్తే బీఆర్‌ఎస్ నేతలు బాధపడుతున్నారు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్, రాజ్‌ఠాకూర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాలను బీఆర్ఎస్ పార్టీయే కురిపించినట్టు మాజీ మంత్రి హరీశ్‌రావు చెబుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సి.హెచ్. విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వానలు పడనప్పుడు కాంగ్రెస్ వచ్చింది, కరువొచ్చింది అన్న బీఆర్ఎస్ నేతలు.. వానలు పడేసరికి తెగ బాధపడుతున్నారని, ఎంతసేపు ప్రభుత్వంపై ఏడుపే తప్ప వేరే పనిలేకుండా పోయిందని విమర్శించారు. శనివారం సీఎల్పీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మల్లన్నసాగర్ సందర్శనకు వెళ్లి.. తామే వర్షాలు కురిపించామన్నట్టుగా హరీశ్‌రావు మాట్లాడారన్నారు.

రూ.8,888 కోట్ల 'అమృత్' పనుల్లో అవినీతి

సీఎం బావమరిది కంపెనీకి అనుచిత లబ్ధి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- అర్హత లేకున్నా.. రూ వేల కోట్ల పనులు
- అవినీతి నిరోధక చట్టం సెక్షన్ల మేరకు రేవంత్ అనర్హుడు
- బీజేపీ స్పందించకుంటే కుమ్మక్కు అయినట్టు భావిస్తాం
- రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సకుటుంబ అవినీతి కథా చిత్రం నడుస్తోంది
- దీన్ని ధారావాహికంగా బయటపెడతాం



మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో పల్లా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సకుటుంబ సపరివార అవినీతి కథాచిత్రం నడుస్తోందని..అనేక కుంభకోణాలకు ఆయన కుటుంబసభ్యులే కేంద్రంగా ఉంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మున్సిపాలిటీల్లో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కోసం కేంద్ర ప్రభుత్వం 'అమృత్'పథకం కింద రాష్ట్రానికి మంజూరు చేసిన రూ.8,888 కోట్ల పనుల్లో చోటుచేసుకున్న అవినీతే దీనికి నిదర్శనంగా పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి బావమరిది సూదిని సృజన్‌రెడ్డికి చెందిన శోధ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అర్హత, నైపుణ్యం, అనుభవం, ఆర్థిక వనరులు లేకున్నా టెండర్లు కట్టబెట్టారన్నారు. ఈ అంశంపై సీఎం స్పందించాలని, అమృత్‌లో అవినీతి చోటుచేసుకుంటున్నా, బీజేపీ నాయకులు స్పందించని పక్షంలో కుమ్మక్కు అయినట్టు భావించాల్సి ఉంటుందన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, గోపీనాథ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి తెలంగాణభవన్‌లో శనివారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

మూడు నెలల్లోనే భారీ అవినీతి

'అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే రూ.8,888 కోట్ల భారీ అవినీతికి రేవంత్ తెర లేపారు. సీఎం పదవితోపాటు పురపాలకశాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్ తన పదవిని దుర్వినియోగం చేశారు. ఇది అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 11, 13 కింద సీఎంను ప్రాసిక్యూట్ చేయొచ్చు. గతంలో పదవీ దుర్వినియోగం ఆరోపణలపై ఎంపీగా సోనియాగాంధీ, కర్ణాటకలో యెడియూరప్ప, మహారాష్ట్రలో అశోక్‌చవాన్ ముఖ్యమంత్రి పదవులకు రాజీనామా చేశారు. ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీని బెదిరించి రూ.2 కోట్ల లాభంలో ఉన్న రేవంత్ బావమరిది కంపెనీకి జాయింట్ వెంచర్ పేరిట టెండర్లు కట్టబెట్టారు. రూ.1,137 కోట్ల కాంట్రాక్టు పనుల్లో ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ వాటా కేవలం 20 శాతం మాత్రమే. శిఖండి సంస్థను అడ్డుపెట్టుకొని సీఎం బావమరిది సృజన్‌రెడ్డి ప్రజాధనం కొల్లగొడుతున్నారు. సీఎం స్వయంగా అధికారులపై ఒత్తిడి తెచ్చి కాంట్రాక్టులు కట్టబెట్టారు.

టెండర్లపై పూర్తిగా గోప్యత

ఇండియన్ హ్యూమన్ పైప్ కంపెనీకి టెండర్లు దక్కిన అంశానికి సంబంధించిన జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టలేదు. ఈ టెండర్లలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు లేఖ రాశాం. కేంద్ర నిధులు పక్కదారి పడుతున్నా బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదు. అమృత్‌లో అవినీతిపై విచారణకు ఆదేశించని పక్షంలో ఈ అవినీతిలో బీజేపీ నేతలు సంబంధం ఉందని భావించాల్సి వస్తుంది. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు సీఎం రేవంత్ సుద్దపూస అని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ తన కుటుంబ సభ్యులతో కలిసి చేస్తున్న అవినీతిని ధారావాహికంగా బయట పెడతామని' కేటీఆర్ అన్నారు.

టైమ్ చెప్పు వస్తా...

రూ. 8,888 కోట్ల టెండర్ల గురించి నువ్వు చెప్పింది నిజమైతే అక్కడే రాజీనామా చేస్తా

- లేదంటే నువ్వు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్
- కేటీఆర్‌కు రెవెన్యూ మంత్రి పొంగులేటి సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి, చిత్రంలో కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలు అసత్యం. అమృత్ పథకం కింద రూ. 8,888 కోట్ల టెండర్లలో అవినీతి జరిగిందని బురద జల్లుతున్నారు. ఈ విషయంలో కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే చర్చ జరిపేందుకు టైం చెప్పాలి. నేను వస్తా. కేటీఆర్ చెప్పింది నిరూపిస్తే నేను అక్కడే మంత్రి పదవికి రాజీనామా చేస్తా. లేదంటే కేటీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి'అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ చేశారు. పదేళ్లపాటు అబద్ధాలతో మోసం చేశారని.. ఇప్పుడు కూడా బీఆర్ఎస్ నేతలు ప్రతిపక్ష పార్టీగా ఆధారాలతో మాట్లాడకుండా అబద్ధాలు చెప్పి పిల్లి శాపనార్థాలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. 'కేటీఆర్.. సిద్ధంగా ఉండు. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది'అని శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్చరించారు.

టెండర్లు పిలిచింది మీరు కాదా?

కేటీఆర్ ఆరోపిస్తున్న అమృత్ పనుల టెండర్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పిలిచినవేనని మంత్రి చెప్పారు. 'ఈ పనులకు 2023 సెప్టెంబర్ 20న గత ప్రభుత్వం టెండర్లు పిలిచింది. తెల్లవారితే పోలింగ్ అనగా 2023 నవంబర్ 29న రూ. 3,515 కోట్ల పనులకు ప్రైస్ బిడ్లు ఓపెన్ చేసింది. 3.99 శాతం ఎక్సెస్‌తో మూడు కంపెనీలకు టెండర్లు ఖరారు చేసింది. మేం అధికారంలోకి రాగానే ఆ టెండర్లను రద్దు చేసి పాత స్టాండర్డ్ షెడ్యూల్ రేట్స్ (ఎస్ఎస్ఆర్)తోనే టెండర్లు పిలిచాం. రూ. 54 కోట్లు తక్కువకు ఈ టెండర్లు ఖరారు చేశాం'అని పొంగులేటి వివరించారు.

సృజన్.. సీఎం సొంత బావమరిది కాదు

కేటీఆర్ చెబుతున్న సృజన్ అనే వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డికి సొంత బావమరిది కానేకాదని.. ఆయన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అల్లుడని పొంగులేటి చెప్పారు. ఉపేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లినందుకే ఆయనకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో ప్యాకేజీ-7 కింద రూ. 2,300 కోట్ల పని ఇచ్చారని ఆరోపించారు. అవన్నీ పక్కనపెట్టి రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌పై గుడ్డకాల్చి మీద వేస్తున్నారని.. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడుతున్నారని.. ఆయనపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. మిడిమిడి జ్ఞానంతో మంత్రులు, ప్రభుత్వాన్ని, సీఎంను విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. తాను రాజకీయాల్లోకి రాక ముందు నుంచే కాంట్రాక్టర్‌నని.. తాను ఎవరికీ భయపడేది లేదని.. తన కాంట్రాక్టుల గురించి మాట్లాడేందుకు ఎప్పుడైనా సిద్ధమని పొంగులేటి చెప్పారు.

పీఏసీ భేటీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

- అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు నిరసనగానే..
- ఆనవాయితీ పాటించలేదని ధ్వజం.. అవసరమైతే కోర్టుకెళ్తామన్న సభ్యులు



విలేకరులతో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్, చిత్రంలో రమణ, గంగుల, వేముల

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ నియామకంలో సంప్రదాయాన్ని పాటించలేదని బీఆర్ఎస్ నిరసన తెలిపింది. నిబంధనల మేరకు పీఏసీ చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించకుండా తాము ప్రతిపాదించని ఎమ్మెల్యేకు చైర్మన్ పదవి ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన పీఏసీ తొలి భేటీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర సభ్యులు హాజరయ్యారు. బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎల్.రమణ హాజరయ్యారు. పీఏసీ సభ్యుల ఎన్నికకు వచ్చిన నామినేషన్లు, హరీశ్‌రావు స్థానంలో గాంధీ పేరును చేర్చడం తదితరాలపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత పీఏసీ భేటీ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం వారు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. 'ప్రతిపక్ష పార్టీ ప్రతిపాదించిన వారికే పీఏసీ చైర్మన్ పదవి వస్తుంది. గతంలోనూ ప్రతిపక్ష నేతలే పీఏసీ చైర్మన్లు అయ్యారు. దీనిపై స్పీకర్‌ను ప్రశ్నిస్తే శ్రీధర్‌బాబు బదులిస్తున్నారు'అని వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 'పీఏసీ చైర్మన్ నియామకంపై అవసరమైతే కోర్టుకెక్కుతాం. మాపై ఓడిన నేతలకు నిధులిస్తూ ప్రొటోకాల్ పాటించట్లేదు'అని మాజీ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. పీఏసీ చైర్మన్ నియామకంపై స్పీకర్ స్పందించకపోవడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజని ఎమ్మెల్సీ ఎల్.రమణ వ్యాఖ్యానించారు.

బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ అధ్యయనం

- త్వరలో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పర్యటన
- పార్టీతోపాటు ప్రభుత్వానికి నివేదిక అందించాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు తీరుపై అధ్యయనానికి విపక్ష బీఆర్ఎస్ త్వరలో తమిళనాడు, కేరళలో పర్యటించనుంది. తమిళనాడులో బీసీలకు సమకూరుతున్న రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలపై అధ్యయన నివేదికను పార్టీతోపాటు ప్రభుత్వానికి కూడా అందజేయాలని నిర్ణయించింది. శాసనమండలిలో బీఆర్ఎస్‌పక్ష నేత ఎస్.మధుసూదనాచారి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు పలువురు ముఖ్య బీసీ నేతలు శనివారం తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, సమగ్ర కులగణన విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిపట్ల సమావేశం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట వివిధ వర్గాలకు ఇచ్చిన మోసపూరిత హామీలను సమావేశంలో నేతలు ఎండగట్టారు. ఈ భేటీలో మాజీ ఎంపీ బడుగు లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, కర్నె ప్రభాకర్, పల్లె రవికుమార్ గౌడ్, జూలూరి గౌరీశంకర్, డాక్టర్ ఆంజనేయ గౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్,, రాజేశ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, బొల్లం మల్లయ్య యాదవ్, జాజుల సురేందర్, నోముల భగత్, కిశోర్ గౌడ్, ఉపేంద్రచారి, దాసోజు శ్రవణ్, గట్టు రాంచందర్ రావు, గోసుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా సొమ్ము

ప్రమాదాల్లో మరణించిన 30 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్, మాజీ ఎంపీ రావు చంద్రశేఖర్‌రెడ్డి కార్యకర్తల కుటుంబాలకు బీమా సొమ్ము చెల్లింపు పత్రాలను ఇచ్చారు.

9 నెలలైనా కులగణన ఏదీ?

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పొద్దున లేస్తే కులగణన గురించి మాట్లాడుతుందని, అలాంటిది తెలంగాణలో 9 నెలలుగా అధికారంలో ఉన్నా ఎందుకు గణన చేయడం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా.. శనివారం బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రుణమాఫీ మాయ.. రైతు భరోసా భ్రమ

- విజయ డెయిరీకి నష్టాలు.. హెరిటేజ్‌కు లాభాలు
- మాజీ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాపాలన పడకేసిందని, రుణ మాఫీ మాయ.. రైతు భరోసా భ్రమగా మారిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో రూ.2 లక్షలు రుణమాఫీ అయిన ఒక్క రైతు కూడా లేడని, అప్పులు చేసినా రుణమాఫీ మాత్రం జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లో రూ.80 వేల కోట్లు అప్పు చేసినా ఏ ఒక్క రంగంలోనూ పురోగతి కనిపించడం లేదన్నారు. తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే పి.శశిధర్‌రెడ్డితో కలిసి నిరంజన్‌రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. 'ఫసల్ బీమా యోజన స్థానంలో కొత్త పథకం తేవాలని అనేకమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినా స్పందన లేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా గురించి గొప్పలు చెప్పుకుంటోంది. రైతుబంధును ఎగవేసి ఆ సొమ్మును రుణమాఫీకి మళ్లించారు. ప్రస్తుతం రైతు భరోసాను పది ఎకరాలకే పరిమితం చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. విజయ డెయిరీ పాడి రైతులకు మూడు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదు. గతంలో లాభాల్లో ఉన్న విజయ డెయిరీ ప్రస్తుతం నష్టాల్లోకి వెళ్లగా హెరిటేజ్ సంస్థ లాభాల్లోకి వెళ్లింది. పాడి రైతులను హెరిటేజ్ సంస్థ వైపు మళ్లించేందుకు కుట్ర జరుగుతోంది. రూ.204 కోట్ల పెట్టుబడులకు హెరిటేజ్ సంస్థ సిద్ధమవుతుండటమే దీనికి నిదర్శనం'అని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. హైడ్రా పేరిట హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీస్తూ చట్టాలను గాలికి వదిలేశారు. పేదల ఇండ్లను కూలగొట్టి పెద్దలను లొంగదీసుకుంటున్నారు' అని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు.

'జమిలి'తో దేశాన్ని కబళించే కుట్ర

రాష్ట్రాల హక్కులను కాలరాసేలా కేంద్ర నిర్ణయం

- సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శ
- నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప నేత అన్న సీఎం



సీతారాం ఏచూరిపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మల్లు రవి, బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు

సాక్షి, హైదరాబాద్: జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబళించాలనే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా జమిలి ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించడం దారుణమని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై పోరాడాల్సిన అవసరం ఉత్పన్నమైందని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సీపీఎం రాష్ట్ర శాఖ నిర్వహించిన సీతారాం ఏచూరి సంస్మరణ సభలో సీఎం రేవంత్ పాల్గొని మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని.. ప్రజల సంక్షేమం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఆయన ప్రస్తుతం తరానికి ఎంతో ఆదర్శమని రేవంత్ పేర్కొన్నారు.

ఆధిపత్యం చలాయించే దిశగా..

''దేశంలో ఇప్పుడు అత్యంత కీలక సమయం ఆసన్నమైంది. జమిలి ఎన్నికలు నిర్వహించాలని ఎన్డీఏ ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. జమిలి ఎన్నికల ద్వారా దేశంపై ఆధిపత్యం చలాయించాలనే దిశగా కుట్ర జరుగుతోంది. ఇలాంటి కీలక సమయంలో సీతారాం ఏచూరి మనమధ్య లేకపోవడం తీరని లోటు. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని రగిలించిన ఆయన ఉండి ఉంటే జమిలి ఎన్నికలపై తీవ్ర పోరాటం నడిపేవారు. ఏచూరితో మాట్లాడినప్పుడు కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి గుర్తుకు వచ్చేవారు. దేశ రాజకీయాల్లో ప్రభావం చూపిన అత్యంత తక్కువ మంది తెలుగు వాళ్లలో ఏచూరి, జైపాల్‌రెడ్డి కీలకమైనవారు..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. యూపీఏ పదేళ్ల పాలన సమయంలో సీతారాం ఏచూరి క్రియాశీలకంగా వ్యవహరించారని.. పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్యాహక్కు చట్టం వంటివి ఏచూరి మద్దతుతోనే ముందుకు సాగాయని చెప్పారు.

కనీస విలువలు లేని ఎన్డీయే ప్రభుత్వం

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కనీస విలువలు లేకుండా వ్యవహరిస్తోందని రేవంత్ ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా ఉన్న నేత పట్ల చవకబారు భాషలో మాట్లాడుతున్నా ప్రధాని మోదీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి స్థాయి వ్యక్తి అభ్యంతరకరంగా మాట్లాడటం బీజేపీ ఫాసిస్టు విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. సీతారాం ఏచూరిపై రాసిన పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు.



ఉద్యమ నేత ఏచూరి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి: కేటీఆర్

ప్రజా ఉద్యమాలను నడిపిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని.. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఏర్పాటులో భిన్నాభిప్రాయంతో ఉన్నా, ఉద్యమం నుంచి వచ్చిన బిడ్డగా తమతో రక్త సంబంధం ఉందన్నారు. సీతారాం ఏచూరి నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. ఫిరాయింపుల కాలంలో పదవుల కోసం కాకుండా, ప్రజా సమస్యలపైనే పోరాటం చేసిన గొప్ప నాయకుడని చెప్పారు. తిట్లు, బూతులు చలామణీ అవుతున్న ప్రస్తుత రాజకీయాల్లో ఏచూరి ప్రసంగాలు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అసలు సిసలైన హైదరాబాద్ బిడ్డ ఆయన అని.. ఓట్ల రాజకీయంలో వెనుకబడినా, ప్రజల కోసం పోరాటంలో ముందున్నామని చాటిన గొప్ప వ్యక్తి అని చెప్పారు. ఎమర్జెన్సీ తర్వాత ఇందిరా గాంధీని జేఎన్‌యూ వీసీ పదవి నుంచి రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఏచూరి గుండె ధైర్యం ఏంటో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, మాజీ ఐఏఎస్ అధికారి మోహన్‌కందా, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గోధుమగింజ భూమిలో పడి చావకుండిన యెడల
అది ఒంటిగానే యుండును; అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం,
తిథి: బ.పంచమి రా.9.12 వరకు తదుపరి షష్ఠి,
నక్షత్రం: భరణి ఉ.6.31 వరకు, తదుపరి కృత్తిక తె.5.10 వరకు (తెల్లవారితే సోమవారం),
వర్జ్యం: సా.5.52 నుండి 7.20 వరకు,
దుర్ముహూర్తం: సా.4.21 నుండి 5.09 వరకు,
అమృతఘడియలు: రా.3.05 నుండి 4.36 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

దైవంతో జూదమా?

జనతంత్రం



వర్ధెల్లి మురళి

శ్రీ వేంకటేశ్వర స్వామిని కలియుగ ప్రత్యక్షదైవంగా హిందూ భక్తులు ఆరాధిస్తారు. వారి దృష్టిలో తిరుమల క్షేత్రం సాక్షాత్తూ కలియుగ వైకుంఠమే. ''భావింప సకల సంపదరూప మదివో... పావనములకెల్ల పావనమయము'' అంటూ ఆ శ్రీహరివాసాన్ని అన్నమయ్య కాలం నుంచీ భజిస్తూనే ఉన్నారు. కోరిన కోర్కెలు తీర్చే దేవదేవునిగా కోట్లాదిమంది చేత నిత్య పూజలందుకునే వేంకటనాథుని ఆలయ ప్రసాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. తన పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆయన ప్రతి పక్షంపై బురదజల్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆలయ ప్రతిష్ఠను, ఔన్నత్యాన్ని ఆయన పణంగా పెట్టారు.

కేవలం ప్రభుత్వ వైఫల్యం కారణంగా విజయవాడ వరదల పాలు కావడం, 'సూపర్ సిక్స్' పేరుతో చేసిన ఎన్నికల బాసలను ఒక్కటి కూడా అమలు చేయకపోవడం, కనీసం ఎప్పుడు చేస్తారనే షెడ్యూల్‌ను కూడా విడుదల చేయలేకపోవడం వంటి కారణాలు ఈ తాజా కుట్రకు నేపథ్యం. తమ కూటమి పరిపాలనకు వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసుకున్న శాసనసభా పక్షాల ఉమ్మడి సమావేశంలో ఆ కుట్రను అమలు చేయడం ప్రారంభించారు. తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యి జంతువుల కొవ్వుతో తయారైందని, ఇది వైసీపీ పాలనలో జరిగిందని చంద్రబాబు ఆరోపించారు.

రాజకీయాల్లో ఇక ఇంతకంటే దిగజారుడు సాధ్యం కాదనుకున్న ప్రతిసారీ చంద్రబాబు షాక్ ఇస్తూనే ఉంటారు. ఏడుకొండలవాడి పవిత్ర ప్రసాదంపై అనుమాన పంకిలం చల్లడానికి ఆయన ఏడు పాతాళ లోకాలను దాటి కిందకు దిగజారారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వంద కోట్ల పైచిలుకు హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారు.

లడ్డూ ప్రసాదం తయారీకి, అందులో వినియోగించే సరుకుల కొనుగోలుకు ఒక పటిష్ఠమైన వ్యవస్థ తిరుమలలో గత కొన్ని దశాబ్దాలుగా అమలవుతున్నది. ప్రభుత్వంలో ఎవరు ఉన్నా ఈ వ్యవస్థలో మార్పు ఉండదు. తిరుమలలో గత వంద సంవత్సరాలుగా లడ్డూ ప్రసాదం అమల్లో ఉంది. మహంతుల అజమాయిషీలో నడిచే తిరుమల పాలనా వ్యవహారాలను తొంభయ్యేళ్ల కింద బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకొని టీటీడీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత క్రమంగా తిరుమలకు భక్తుల రద్దీ పెరుగుతూ వస్తున్నది. అందుకు అనుగుణంగానే లడ్డూ ప్రసాదానికీ డిమాండ్ పెరుగుతూ వచ్చింది. ఈ డిమాండ్‌ను అందుకోవడానికి లడ్డూల తయారీ సామర్థ్యాన్ని కూడా పెంచుతూ వస్తున్నారు.

రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యే నాటికి లడ్డూలు తయారుచేసే పోటు సామర్థ్యం రోజుకు 45 వేలు మాత్రమే. పోటు సామర్థ్యాన్ని రెండు మూడు రెట్లు పెంచుతూ ఆయన హయాంలో ఆధునిక వసతులను సమకూర్చారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పోటును అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆగమ సలహా మండలి సంప్రదింపులతో విస్తరించారు. మూడున్నర లక్షల లడ్డూల తయారీ సామర్థ్యం ఇప్పుడున్నది. అవసరమైతే ఆరు లక్షల వరకు తయారు చేసుకోవడానికి అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు కూడా చేశారు.

తయారీ సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా తిరుమల పవిత్రతను కాపాడటానికి లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతను పెంచడం కోసం ల్యాబ్ వ్యవస్థను పటిష్ఠం చేయడం కూడా వైఎస్ జగన్ హయాంలోనే జరిగింది. నవనీత సేవకోసం అవసరమైన స్వచ్ఛమైన వెన్నను తయారు చేయడానికి తిరుమలలోనే ఒక ప్రత్యేక గోశాల కూడా ఆయన హయాంలోనే ఏర్పాటయింది. ఏడుకొండలపై ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియాలన్న సంకల్పంతో మఠాధిపతులతో కూడిన విద్వత్ సభ కూడా అప్పట్లో జరిగింది. చంద్రబాబు నాలుగుసార్లు ముఖ్యమంత్రయినప్పటికీ ఈ తరహా కార్యక్రమాలను అమలు చేసిన దాఖలాలు లేవు.

ఇక చంద్రబాబు ఆరోపణలకు సంబంధించిన నెయ్యి కొనుగోలు వ్యవహారాన్ని ఒకసారి పరిశీలిద్దాం. ఈ వ్యవహారం కొన్ని దశాబ్దాలుగా ఒకే పద్ధతిలో జరుగుతున్నది. టీటీడీ బోర్డులో సభ్యులుగా ఉండేవారిలో కొందరితో కలిసి కొనుగోలుకు సంబంధించిన సబ్-కమిటీ ఉంటుంది. ఆరు నెలలకోసారి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచి ఎల్-వన్‌గా నిలిచిన వారిని ఎంపిక చేస్తారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ఉన్న ప్లాంట్‌ను పరిశీలించి, అందులో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను ఈ సబ్‌కమిటీ బేరీజు వేసుకుంటుంది. అనంతరం కాంట్రాక్టుకు సంబంధించిన అభ్యంతరాలు గానీ, సూచనలు గానీ వుంటే సబ్‌కమిటీ బోర్డుకు నివేదిస్తుంది. టెండర్ ఖరారు చేయడానికీ లేదా రద్దు చేయడానికీ కూడా సబ్ కమిటీకి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కేబినేట్‌లో ఉన్న కొలుసు పార్థసారథి, టీడీపీ శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి, కేంద ప్రభుత్వానికి సన్నిహితుడైన వైద్యనాథన్ కృష్ణమూర్తి కూడా ఈ సబ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.



> ఇక చంద్రబాబు ఆరోపణలకు సంబంధించిన నెయ్యి కొనుగోలు వ్యవహారాన్ని ఒకసారి పరిశీలిద్దాం. ఈ వ్యవహారం కొన్ని దశాబ్దాలుగా ఒకే పద్ధతిలో జరుగుతున్నది. టీటీడీ బోర్డులో సభ్యులుగా ఉండేవారిలో కొందరితో కలిసి కొనుగోలుకు సంబంధించిన సబ్-కమిటీ ఉంటుంది. ఆరు నెలలకోసారి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచి ఎల్-వన్‌గా నిలిచిన వారిని ఎంపిక చేస్తారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ఉన్న ప్లాంట్‌ను పరిశీలించి, అందులో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణా లను ఈ సబ్‌కమిటీ బేరీజు వేసుకుంటుంది. అనంతరం కాంట్రాక్టుకు సంబంధించిన అభ్యంతరాలు గానీ, సూచనలు గానీ వుంటే సబ్‌కమిటీ బోర్డుకు నివేదిస్తుంది. టెండర్ ఖరారు చేయడానికీ లేదా రద్దు చేయడానికీ కూడా సబ్ కమిటీకి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కేబినేట్‌లో ఉన్న కొలుసు పార్థసారథి, టీడీపీ శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి, కేంద ప్రభుత్వానికి సన్నిహితుడైన వైద్యనాథన్ కృష్ణమూర్తి కూడా ఈ సబ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.
>
> నెయ్యి సరఫరా దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రతి ట్యాంకర్‌తో పాటు నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని కూడా వెంట తెచ్చు కోవాలి. ఎన్ఏబీఎల్ గుర్తించిన ల్యాబుల్లో ఈ ధ్రువీకరణ పత్రాన్ని తెచ్చుకోవచ్చు. ట్యాంకర్ తిరుపతికి చేరుకున్న అనంతరం అక్కడ వున్న మార్కెటింగ్ కార్యాలయంలో మూడు శాంపిళ్లను తీసి వేరువేరుగా పరిశీలిస్తారు. ఈ మూడు శాంపిళ్ల పరీక్షలోనూ నాణ్యత నిర్ధారణ అయితేనే ట్యాంకర్ తిరుమలకు చేరుకుంటుంది. లేకుంటే వచ్చిన దారిన వెనక్కు వెళ్తుంది.

నెయ్యి సరఫరా దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రతి ట్యాంకర్‌తో పాటు నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని కూడా వెంట తెచ్చుకోవాలి. ఎన్ఏబీఎల్ గుర్తించిన ల్యాబుల్లో ఈ ధ్రువీకరణ పత్రాన్ని తెచ్చుకోవచ్చు. ట్యాంకర్ తిరుపతికి చేరుకున్న అనంతరం అక్కడ వున్న మార్కెటింగ్ కార్యాలయంలో మూడు శాంపిళ్లను తీసి వేరువేరుగా పరిశీలిస్తారు. ఈ మూడు శాంపిళ్ల పరీక్షలోనూ నాణ్యత నిర్ధారణ అయితేనే ట్యాంకర్ తిరుమలకు చేరుకుంటుంది. లేకుంటే వచ్చిన దారిన వెనక్కు వెళ్తుంది. పరీక్షలో విఫలమై ట్యాంకర్లు వెనక్కు వెళ్లడం ఈ ఇరవై ఏళ్లలో వందలసార్లు జరిగినట్టు సమాచారం. అదేవిధంగా చంద్రబాబు ఆరోపించిన ఏఆర్ డెయిరీ వారి కంటెయినర్ కూడా వెనక్కు వెళ్లింది. అది కొండెక్కిందీ లేదు. ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడిందీ లేదు. ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు ఆరగించిందీ లేదు. తిరుమలలో ఉన్న పటిష్ఠమైన వ్యవస్థ కల్తీ సరుకులను ప్రసాదాల్లోకి అనుమతించదు.

తిరస్కరించిన ఈ ట్యాంకర్‌లోని శాంపిల్‌ను తీసుకున్నది జూలై 12వ తేదీన! అప్పటికి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. ఆ శాంపిల్‌ను జూలై 17న గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ల్యాబ్‌కు పంపించారు. 23న ఆ ల్యాబ్ రిపోర్టు పంపించింది. టీటీడీ ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్స్ కలిశాయని నివేదిక ఆధారంగా చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌డీడీబీతో పాటే మైసూర్‌లోని మరో కేంద్ర ప్రభుత్వ ల్యాబ్‌కు కూడా ఈ శాంపిల్స్ పంపించారట. వారి రిపోర్టు గురించి మాత్రం ఎటువంటి సమాచారాన్ని టీటీడీ ఇవ్వడం లేదు.

ఈ వ్యవహారం పూర్తయి రెండు నెలలు గడిచాయి. కూటమి సర్కార్‌కు వందరోజులు నిండిన నేపథ్యంలో జరిగిన రాజకీయ సమావేశంలో చంద్రబాబు ఎన్‌డీడీబీ నివేదికను విడుదల చేశారు. జంతువుల ఫ్యాట్ కలిసిందనే ఆరోపణ అక్కడే చేశారు. టీటీడీ విడుదల చేయవలసిన నివేదికను పొలిటికల్ మీటింగ్‌లో విడుదల చేయడంపై పలు సందేహాలు ఏర్పడుతున్నాయి. అంతకుముందు వెజిటబుల్ ఫ్యాట్స్ కల్తీ జరిగిందని చెప్పిన ఈఓ ఈ సమావేశం తర్వాత స్క్రిప్టు మార్చి చంద్రబాబు ప్రసంగాన్ని అనుసరించారు.

స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే తిరుమల ప్రసాదానికి అపవిత్రతను ఆపాదిస్తూ మాట్లాడడంతో ఇది జాతీయ స్థాయిలో పెద్ద సమస్యగా మారిపోయింది. తిరుమలకు ఉన్న విశిష్టత అటువంటిది. తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసి, తద్వారా రాష్ట్ర ఇమేజ్‌కు మసిపూసి చంద్రబాబు ఏం సాధించదలుచుకున్నారు? కల్తీ సరుకును కనిపెట్టి వెనక్కు తిప్పి పంపే వ్యవస్థాగత బలం టీటీడీకి ఉన్నది. పలు సందర్భాల్లో అలా జరిగింది. మొన్నటి కల్తీ సరుకు వచ్చింది టీడీపీ సర్కార్ జమానాలోనే. దాన్ని గుర్తించిన టీటీడీ వ్యవస్థ వెనక్కు పంపింది కూడా! మరి ఏ విధంగా ఈ వ్యవహారాన్ని జగన్ సర్కార్ మెడకు చుట్టాలని చంద్రబాబు భావించారు? తనకు అనుకూలంగా ఆరవై నాలుగు నోళ్లు లేస్తాయన్న ధీమాతోనే కదా అభాండాలు వేయడం!

> స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే తిరుమల ప్రసాదానికి అపవిత్రతను ఆపాదిస్తూ మాట్లాడడంతో ఇది జాతీయ స్థాయిలో పెద్ద సమస్యగా మారిపోయింది. తిరుమలకు ఉన్న విశిష్టత అటువంటిది. తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసి, తద్వారా రాష్ట్ర ఇమేజ్‌కు మసిపూసి చంద్రబాబు ఏం సాధించదలుచుకున్నారు? కల్తీ సరుకును కనిపెట్టి వెనక్కుతిప్పి పంపే వ్యవస్థాగత బలం టీటీడీకి ఉన్నది. పలు సందర్భాల్లో అలా జరిగింది. మొన్నటి కల్తీ సరుకు వచ్చింది టీడీపీ సర్కార్ జమానాలోనే. దాన్ని గుర్తించిన టీటీడీ వ్యవస్థ వెనక్కు పంపింది కూడా! మరి ఏ విధంగా ఈ వ్యవహారాన్ని జగన్ సర్కార్ మెడకు చుట్టాలని చంద్రబాబు భావించారు?
>
> తమ జీవితాలను వరదల్లో ముంచేసినందుకు మూడు లక్షల కుటుంబాలు విజయవాడలో బాబు సర్కారు మీద భగ్గుమంటున్నాయి. సర్కార్ బడుల్లో వసతులపై కోత పెట్టడం, సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేయడం, ఇంగ్లీష్ మీడియాన్ని నిరుత్సాహపరచడంతో రెండున్నర లక్షల మంది విద్యార్థులు మళ్లీ ప్రైవేట్ బాట పట్టారు. కేంద్ర సర్కార్‌లో టీడీపీ భాగస్వామిగా ఉండి కూడా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకోవడం లేదని కార్మికులు మండి పడుతున్నారు. వంద రోజుల్లోనే విశ్వరూపం దాల్చిన వ్యతిరేకతను దారి మళ్లించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండవచ్చు. కానీ ఆ దారి మళ్లింపు ఇలా ఉండకూడదు. నిస్సందేహంగా బాబు చేసింది మహాపచారం.

తమ జీవితాలను వరదల్లో ముంచేసినందుకు మూడు లక్షల కుటుంబాలు విజయవాడలో బాబు సర్కారు మీద భగ్గుమంటున్నాయి. సర్కార్ బడుల్లో వసతులపై కోత పెట్టడం, సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేయడం, ఇంగ్లీష్ మీడియాన్ని నిరుత్సాహపరచడంతో రెండున్నర లక్షల మంది విద్యార్థులు మళ్లీ ప్రైవేట్ బాట పట్టారు. కేంద్ర సర్కార్‌లో టీడీపీ భాగస్వామిగా ఉండి కూడా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకోవడం లేదని కార్మికులు మండి పడుతున్నారు. ఉద్యోగాల కల్పన ఊసేలేదు, నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. వంచనకు గురయ్యామని మహిళలు మథనపడుతున్నారు. సర్కార్ మేనిఫెస్టోలపై సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. వీడియోల నిండా వెటకారం ప్రవహిస్తున్నది.

వంద రోజుల్లోనే విశ్వరూపం దాల్చిన వ్యతిరేకతను దారి మళ్లించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండవచ్చు. కానీ ఆ దారి మళ్లింపు ఇలా ఉండకూడదు. నిస్సందేహంగా బాబు చేసింది మహాపచారం. ఆయన చేసిన పనివల్ల తిరుమల ప్రతిష్ఠకు జాతీయ స్థాయిలో భంగం వాటిల్లింది. కూటమి సర్కార్ అందజేసిన సమాచారాన్నే కళ్లకద్దుకొని జాతీయ మీడియా గుడ్డిగా వ్యవహరిస్తున్నది. ఈ మీడియా ప్రచారం వల్ల జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠ దెబ్బతింటుందని చంద్రబాబు భావిస్తుండవచ్చు. కానీ చంద్రబాబు జమానాలోనే కల్తీ సరుకు వచ్చిన విషయం నేడు కాకపోతే రేపైనా జాతీయ మీడియాకు తెలుస్తుంది. అక్కడ అమలవుతున్న కట్టుదిట్టమైన వ్యవస్థపై అవగాహన కలుగుతుంది. కానీ, తిరుమల పవిత్రతకు చంద్రబాబు వల్ల తగిలిన గాయం ఎప్పుడు మానాలి? రాజకీయ జూదం కోసం పుణ్యక్షేత్రాలను పణంగా పెట్టేవారికి ఆ ఏడు కొండలవాడే బుద్ధి చెప్పాలి.

vardhelli1959@gmail.com

నరేంద్ర మోదీ (భారత ప్రధాని)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ట్రంప్ నన్నింత హఠాత్తుగా తన ఆత్మీయమైన బాహువుల్లో బిగించేస్తారని నేనెలా ఊహించగలను? నాతో మాట మాత్రమైనా అనకుండానే, అమెరికాలో తను నన్ను మీట్ అవబోతున్నట్లు ప్రకటించేశారు!

ప్రకటించి ఊరుకోలేదు. 'మోదీ ఫాంటాస్టిక్' అని ప్రశంసించారు. 'ఇండియా టఫ్ బార్గెయినర్' అని విమర్శించారు! నిజానికి మోదీనే టఫ్ బార్గెయినర్ అని, ఇండియా ఫాంటాస్టిక్ అని; మోదీ టఫ్ బార్గెయినర్‌గా ఉన్నందువల్లనే ఇండియా ఫాంటాస్టిక్ అయిందని ట్రంప్ ఇంతవరకు అనుకోకుండా ఉండి ఉంటారా?

"ట్రంప్ మిమ్మల్ని కలవబోతున్నారా, లేక మీరే ట్రంప్‌ని కలవబోతున్నారా మిస్టర్ మోదీ?" అని విల్మింగ్టన్‌లో నిన్న శనివారం 'క్వాడ్' మీటింగ్ ముగిశాక లంచ్ చేస్తున్నప్పుడు చిన్నగా నవ్వుతూ అడిగారు బైడెన్.

నేను, బైడెన్, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల ప్రధానులు నలుగురం 'క్వాడ్' సభ్యులం. ఈ ఏడాది క్వాడ్ సమ్మిట్‌ను అమెరికా హోస్ట్ చేస్తోంది కనుక నేను అమెరికా రావటమే కాని... ట్రంప్‌కి నన్ను కలుసుకోవాలని ఉందని నేను అమెరికా రావటం కాదు.



"మిస్టర్ బైడెన్, ఎవరైనా వచ్చి మనల్ని కలుసుకోవటం అన్నది ఎప్పుడూ కూడా సంతోషకరమైన సంగతే కదా!" అన్నాను.

"కానీ వారొచ్చి మిమ్మల్ని కలవబోతున్నారంటే మీకు తెలియకుండానే వచ్చి మిమ్మల్ని వారు సర్‌ప్రైజ్ చెయ్యబోతున్నారనా!" అన్నారు బైడెన్. 'వారు' అని బైడెన్ అన్నది ట్రంప్ గురించే.

"అప్పుడప్పుడూ అలా జరుగుతుంటుంది కదా మిస్టర్ ప్రెసిడెంట్" అన్నాను, నవ్వుతూ.

"ఎలా జరుగుతుంటుంది?" అన్నారు బైడెన్, విషయాన్ని వదలకుండా. మిగతా ఇద్దరు 'క్వాడ్' మిత్రులు ఏంథోనీ అల్బనీస్, కిషిద ఫ్యూమియో వాళ్ల మాటల్లో వాళ్లున్నారు.

"ఎలా జరుగుతుందంటే మిస్టర్ ప్రెసిడెంట్, మన ప్రమేయం లేకుండా జరిగిన వాటికి కూడా మనం సమాధానం చెబితే వినాలని ప్రపంచం చాలాసార్లు ఆశగా ఎదురు చూస్తూ ఉంటుంది. ఇదెలాంటిదంటే, మాట్లాడకుండా ఉండాల్సిన చోట మాట్లాడకుండా ఉండటం కూడా కొన్నిసార్లు తప్పవటం లాంటిది" అన్నాను నవ్వుతూ.

బైడెన్ నవ్వి, "ట్రంప్ మిమ్మల్ని ఎప్పుడు కలుస్తున్నారు?" అన్నారు మళ్లీ.

"నన్ను కలవబోతున్నానని ట్రంప్ అన్నారు కానీ, ట్రంప్ నన్ను కలవబోతున్నారని నేను అనలేదు కదా" అని నాతో చెప్పించటం డెమోక్రాట్‌లకు ఉపయోగపడుతుందని బహుశా బైడెన్ ఆశ కావచ్చు.

"మిస్టర్ బైడెన్! కమలా హ్యారిస్‌కి నా తరఫున బెస్ట్ విషెస్ చెప్పగలరా?" అన్నాను. అప్పటికి గాని ఆయన ట్రంప్‌ని, నన్ను వదిలిపెట్టలేదు.

శనివారం క్వాడ్ మీటింగ్ అవగానే విల్మింగ్టన్ నుంచి న్యూయార్క్ వచ్చేశాను. ఇవాళ ఎన్నారైలతో మీటింగ్. రేపు ఐక్యరాజ్యసమితిలో ప్రసంగం. తర్వాత ఇండియా తిరుగు ప్రయాణం. మధ్యలో ఎక్కడా ట్రంప్‌తో మీటింగ్ లేదు.

"ట్రంప్ నుంచి సమాచారం ఏమైనా ఉందా?" అని విక్రమ్ మిస్రీని అడిగాను.

"ఏమీ తెలియడం లేదు సర్" అన్నారు మిస్రీ కూడా! మిస్రీ విదేశాంగ కార్యదర్శి.

"ఇంతకీ ట్రంప్ ఏమన్నారు విక్రమ్? నన్ను కలుస్తాననా? నేను తనను కలుస్తాననా?" అని అడిగాను.

"రెండూ అన్నారు సర్! ఒక ఎలక్షన్ ర్యాలీలో మాట్లాడుతూ, మీరు ఆయన్ని కలుస్తారని అన్నారు. ఇంకో ఎలక్షన్ ర్యాలీలో మాట్లాడుతూ, తను మిమ్మల్ని కలుస్తున్నట్లు చెప్పారు" అన్నారు మిస్రీ.

రెండు వైపుల నుంచి నన్ను గట్టిగా బంధించేశారు ట్రంప్. బంధ విముక్తికి కూడా ఆయనే పూనుకోవాలి... 'సారీ నేను కలవలేకపోతున్నా'ననో, 'సరే మరెప్పుడైనా కలుద్దాం' అనో!

గల్ఫ్ దేశాల్లో ఎందుకు మలయాళీలు ఎక్కువ?

విశ్లేషణ



మూర్తి కెవివిఎస్

కేరళ ప్రజలు అత్యధికంగా గల్ఫ్ దేశాల్లో ప్రవాసం ఉండే విషయం తెలిసిందే. కువైట్‌లో ఉండే విదేశీయుల్లో 80 శాతం దాకా మన దేశంలోని కేరళ నుంచి వెళ్ళినవారే. గల్ఫ్ దేశాల్లోని అవకాశాల్ని మొట్టమొదటగా గుర్తించి వాటిని అందిపుచ్చుకోవడం వల్ల వారి ఆధిపత్యం అక్కడ అనేక రంగాల్లో కొనసాగుతోంది. 1972 నుంచి 1983 మధ్య కాలంలో వచ్చిన గల్ఫ్ బూమ్‌ను మలయాళీలు బాగా వినియోగించుకున్నారు. అక్షరాస్యత ఎక్కువగా ఉండటం, సాంకేతిక నైపుణ్యం గల కోర్సులు చేయడం వల్ల చాలామంది క్లర్కులుగా, ఆర్కిటెక్టులుగా, నిర్మాణ రంగంలో సూపర్‌వైజర్లుగా, ఇంజినీర్లుగా మంచి అవకాశాల్ని పొందగలిగారు. మొదటితరం వారు ఆ తర్వాత తమ బంధువుల్ని, స్నేహితుల్ని తీసుకువెళ్లారు.

యూఏఈలో 7,73,624 మంది, కువైట్‌లో 6,34,728 మంది, సౌదీ అరేబియాలో 4,47,440 మంది, ఖతర్‌లో 4,45,000 మంది, ఒమన్‌లో 1,34,019 మంది, బహ్రెయిన్‌లో 1,01,556 మంది మలయాళీలు ఉన్నారు. అక్కడి నుంచి వాళ్ళు పంపించే విదేశీ మారకద్రవ్యం వల్ల కేరళ రాష్ట్రపు ఆర్థిక చిత్రపటం మారిపోయిందని చెప్పాలి. ప్రతి ఏటా రమారమి 60,000 కోట్ల రూపాయలు కేరళకు వస్తుంటాయి. తాము ఆ దేశాల్లో పనిచేసి సంపాదించిన ధనంలో ప్రతి ఒక్కరు కొంత వెనక్కి తమ కుటుంబాలకు పంపిస్తుంటారు.

మిగతా దేశాలతో పోలిస్తే మలయాళీ ప్రజలు గల్ఫ్‌లో ఎక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. ఎన్నో శతాబ్దాల నుంచి అరబ్బు దేశాలతో కేరళకు సముద్ర మార్గాల ద్వారా వ్యాపారం జరగడం ప్రధాన కారణం. కేరళలో పెద్ద పరిశ్రమలు తక్కువ. పర్యావరణంపై ప్రజల చైతన్యం ఎక్కువ. ట్రేడ్ యూనియన్ల ప్రభావం వల్ల పెద్ద పెట్టుబడిదారులు రావడానికి వెనకడుగు వేస్తుంటారు. కాబట్టి మంచి సంపాదన ఎక్కడ ఉన్నా సగటు మలయాళీ ప్రవాసిగా వెళ్ళడానికి సిద్ధంగా ఉంటాడు. యువతులు కూడా దూర ప్రదేశాలు వెళుతుంటారు. కోల్‌కతా, ముంబై, ఢిల్లీ, ఇంకా దేశంలో ఎక్కడ అవకాశాలు ఉన్నా వెళుతుంటారు. ముఖ్యంగా నర్సింగ్ వృత్తి పరంగా చూస్తే దేశ విదేశాల్లో కేరళ నర్సులకు మంచి డిమాండ్ ఉంది. దేశంలో ఏ కార్పొరేట్ ఆసుపత్రిని చూసినా అత్యంత ఎక్కువ సంఖ్యలో కేరళ నర్సులే ఉంటారు.



యూఏఈలో ఓనం పండుగ జరుపుకొంటున్న మలయాళీలు

గల్ఫ్ సంపద కేరళలో ఎంత ప్రధాన పాత్ర కలిగి ఉందంటే చాలామంది మలయాళీ కోటీశ్వరులు ఆ దేశాల్లోనే వ్యాపారం చేసి, తర్వాత మిగతా దేశాలకు తమ వ్యాపారాలను విస్తరించారు. ముథూట్ గోల్డ్ ఫైనాన్స్ గానీ, జాయ్ అలుక్కాస్ గోల్డ్ కంపెనీ గానీ గల్ఫ్ దేశాల సంపదతో విస్తరించినవే. యూసుఫ్ ఆలీ (లూలూ గ్రూప్), షంషేర్ వయలిల్ (వీపీఎస్ హెల్త్ కేర్), సన్నీ వర్కీ (జెమ్స్ ఎడ్యుకేషన్), పి.ఎన్.సి. మీనన్ (శోభ గ్రూప్) లాంటి మలయాళీ కుబేరులంతా వ్యాపారం గల్ఫ్ దేశాల్లో చేసి ఆ తర్వాత మన దేశంలో విస్తరించినవారే. ఇప్పటికీ వారి ప్రధాన కేంద్రాలు అక్కడే ఉన్నాయని చెప్పాలి.

కేరళ ప్రభుత్వానికి రెవెన్యూ ద్వారా ఒక ఏడాదికి ఎంత ధనం వస్తుందో దానికి రమారమి రెండింతలు గల్ఫ్ నుంచి వస్తుంది. గల్ఫ్ నుంచి వచ్చీ పోయే ప్రయాణీకుల కోసం కేరళలో నాలుగు అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్నాయి. వారి బాగోగులు చూడటానికి ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖ ఉంది. కొచ్చి, కోజీకోడ్, మలప్పురం, కన్ననూర్ వంటి ప్రాంతాల్లో గల్ఫ్ నుంచి వచ్చే అనేక వస్తువుల్ని ధారాళంగా అమ్ముతుంటారు.


గల్ఫ్ నుంచి వచ్చే ధనం వల్ల వినిమయతత్వం బాగా పెరిగిందనే ఒక ఆరోపణ ఉన్నది. గల్ఫ్ నుంచి వచ్చిన లేదా అక్కడ పనిచేసే యువకులకు పెళ్ళి విషయంలో మంచి డిమాండ్ ఉన్నది. మరి అక్కడ విషాద గాథలు లేవా అంటే ఉన్నాయి. స్థానికంగా ఉన్న ఆస్తి తాకట్టు పెట్టి గల్ఫ్ వెళ్ళి అనుకున్న పని దొరక్క పడరాని పాట్లు పడేవారూ ఉన్నారు. అక్కడి పత్రికల్లోనూ, టీవీ చానెళ్ళలోనూ అలాంటివారి కోసం ప్రత్యేకంగా కొంత స్పేస్ కేటాయిస్తారు. ఇటీవల వచ్చిన 'ఆడు జీవితం' (గోట్ లైఫ్) సినిమా అలాంటి వారి బాధల్ని చిత్రించిందన్న సంగతి తెలిసిందే. ఏది ఏమైనా కేరళ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచి, లక్షలాది మధ్య తరగతి ప్రజలకు ఉపాధి చూపిన గల్ఫ్ దేశాల చమురు నిల్వలు ఇంకా చాలా కాలం ఉండాలని ఆశిద్దాం.

వ్యాసకర్త రచయిత, అనువాదకుడు
మొబైల్: 78935 41003

భయ స్వరూపం

మనుషులను ఎప్పుడూ ఏదో ఒక భయం నీడలా వెంటాడుతూ ఉంటుంది. పైకి ఇతరులతో తమకెటువంటి భయమూ లేదని గొప్పగా చెప్పుకున్నా అంతర్లీనంగా భయం గుప్పిట్లో చిక్కుకోని వారుండరు. భర్తృహరి తన వైరాగ్య శతకంలో భయం ఎన్ని విధాలుగా ఉంటుందో, ఎవరెవరిని ఏ ఏ రూపాలలో వెంటాడుతుందో, దాని నుంచి ఎలా బైట పడాలో 'భోగే రోగ భయం, కులే చ్యుతి భయం' అనే శ్లోకంలో చక్కగా చెప్పాడు.

మనిషి భోగాలు అనుభవిస్తున్నప్పుడు తనకు వ్యాధులు వస్తాయేమో అనే భయం ఉంటుంది. కీర్తి, ప్రతిష్ఠలతో వెలుగుతున్నప్పుడు అవమానాలు ఏమైనా పొంచి ఉన్నాయేమోననే భయం ఉంటుంది. అధికారంలో శత్రువుల భయం ఉంటుంది. యవ్వనంలో అందంగా వున్నప్పుడు వృద్ధాప్యంలో ఈ అందం ఉండదు కదా అని భయం. పాండిత్యం ఉన్నవారికి ఇతరుల చేతిలో పరాజయం పొందుతామేమో అని భయం. శరీరానికి మృత్యు భయం ఎప్పుడూ వెంటే ఉంటుంది. చిన్న చిన్న విషయాలకు కూడా మనసు ప్రతిక్షణం భయపడుతూనే ఉంటుంది. ఆ క్షణంలో ఉన్న ఆనందాన్ని అనుభూతి చెందలేని స్థితి ఏర్పడుతుంది. భయం ఉంటే శాంతి ఉండదు. సుఖ దుఃఖాలలో భావోద్వేగాలకు లోను కాకుండా వైరాగ్యాన్ని ఆశ్రయిస్తే నిర్భయత్వం అలవడుతుందని భర్తృహరి చెప్పాడు. వైరాగ్యం అంటే కోరికల పట్ల ఉదాసీనత. కష్ట సుఖాల పట్ల సమభావన కలిగి ఉండటం. ఈ భౌతిక విషయాలు శాశ్వతం కాదనే తెలివి కలిగి ఉండటం అని సామాన్యార్థం.



కురుక్షేత్ర యుద్ధం ముగిసి, రాజ్య పాలన చేపట్టే సమయంలో ధర్మరాజు తనకు రాజ్యసుఖాలు అనుభవించాలని లేదనీ, ధర్మ రక్షణ చేయటమనే భారం, ధర్మ రక్షణ చేయలేనేమోననే భయం తన మనసుని వేధిస్తున్నాయంటాడు. అప్పుడు భీష్ముడు పలు కథల రూపంలో ధర్మ గీతను ప్రబోధించి ధర్మ రక్షణ పట్ల, పాలన పట్ల సుముఖుణ్ణి చేస్తాడు. మనిషి జీవితంలో భయం ఒక భాగమైపోయింది. భయ విముక్తికి వైరాగ్యమే అసలైన ఔషధం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

కదులుతున్న బస్సులో మహిళపై లైంగికదాడి

- ఈ నెల 18న ఘటన
- చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహిళ

చౌటుప్పల్: ప్రైవేటు ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న వివాహిత మహిళపై బస్సు క్లీనర్ (హెల్పర్) లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఈ నెల 18న (బుధవారం) చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలను చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ శనివారం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సామర్లకోటకు చెందిన మహిళ (28) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నివాసముంటూ అక్కడే కేర్‌టేకర్‌గా పనిచేస్తుంది. ఈ క్రమంలో స్వగ్రామానికి వెళ్లేందుకు కూకట్‌పల్లిలో ఈ నెల 18న ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు (స్లీపర్ కోచ్) బుక్ చేసుకుంది. అదేరోజు రాత్రి అక్కడి నుంచి బస్సు బయలుదేరింది. కొంతసేపటి తర్వాత బస్సులోని క్లీనర్ (హెల్పర్) ఆమె ఉన్న సీటు వద్దకు చేరుకున్నాడు. బలవంతంగా ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. లైంగికదాడికి పాల్పడే సమయంలో ఆమె కేకలు వేసేందుకు ప్రయత్నించగా అతను బెదిరించాడు. మహిళ మరుసటి రోజు సామర్లకోటలోని ఇంటికి చేరుకుంది. భయంతో బస్సులో జరిగిన ఘటనను కుటుంబ సభ్యులకు చెప్పింది. దాంతో కుటుంబసభ్యులు ఆమెను తీసుకొని శనివారం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. అనంతరం ఆమెకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసును కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశామని సీఐ తెలిపారు.

టూరిజం మాజీ ఎండీపై కేసు నమోదు

కాచిగూడ (హైదరాబాద్): తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ బి.మనోహర్‌రావుపై నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పట్లో దుర్గంచెరువు పరిసరప్రాంతాన్ని లీజుకు ఇచ్చేందుకు నోటిఫికేషన్ జారీ చేసి టెండర్లు ఆహ్వానించారు. అందులో కమల్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యధిక బిడ్డర్‌గా నిలిచింది. అయితే అప్పటి ఎండీ మనోహర్‌రావు కమల్ హోటల్స్‌కు అనుబంధంగా ఉన్న మరో సంస్థతో లోపాయికారీ ఒప్పందం చేసుకొని అక్రమంగా లీజుకు ఇచ్చినట్టు సంస్థ ఉన్నతాధికారులు గుర్తించారు. టెండర్‌లో నిబంధనలను ఉల్లంఘించిన మనోహర్‌రావుపై విచారణ చేయాలని టూరిజం సంస్థ ఏజీఎం రమేష్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నల్లగొండ విద్యుత్ శాఖ ఎస్ఈ సస్పెన్షన్

నల్లగొండ: నల్లగొండ జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పాల్‌రాజు సస్పెండ్ అయ్యారు. శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలతో కలిసి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల పనులు, విద్యుత్ శాఖపై సమీక్షించారు. అయితే ఈ సమావేశానికి విద్యుత్ శాఖ సమాచారంతో ఎస్ఈ పాల్‌రాజు ఒక బుక్‌లెట్‌ను తయారు చేశారు. ఆ బుక్‌లెట్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిల ఫొటోలు ముద్రించారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో లేదంటూ ఫిర్యాదులు అందగా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ఫారూఖీ నల్లగొండ ఎస్ఈ పాల్‌రాజును సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.


కుప్పకూలిన వంతెన



కూలిన వంతెనను పరిశీలిస్తున్న ఎస్సారెస్పీ అధికారులు

జూలపల్లి(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంట వద్ద శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ డి–83పై నిర్మించిన వంతెన శనివారం మధ్యాహ్నం కుప్పకూలింది. ఆ సమయంలో వంతెనపై ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఎస్సారెస్పీ అధికారులు నీటి విడుదల ఉధృతిని కొద్దిగా తగ్గించారు. ఈవంతెనను సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించినట్లు అధికారులు అంచనా వేశారు. ఎస్సారెస్పీ డీఈ రవీందర్, ఈఈ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కూలిన వంతెన వద్ద పరిస్థితిని సమీక్షించారు.

సాగర్ కాల్వ గండి పూడ్చివేత.. కాసేపటికే లీకేజీ



గండి పడిన ప్రాంతంలో దిగువకు వెళ్తున్న నీరు

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని సాగర్ కాల్వ (ఔట్ ఫ్లో)కు పడిన గండ్లను పూడ్చివేసిన కొద్ది సేపటికే మళ్లీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఇటీవల సంభవించిన భారీ వరదల కారణంగా సాగర్ కాల్వకు గండ్లు పడిన విషయం తెలిసిందే. పొట్టకొచ్చిన వరి పొలాలు దెబ్బతింటున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండటంతో అధికారులు గండ్ల పూడ్చివేత పనులు చేపట్టారు. ఈ క్రమంలో పూడ్చివేత పనులు శనివారం నాటికి పూర్తయ్యాయని ప్రకటించిన అధికారులు.. పాలేరు రిజర్వాయర్ నుంచి ఔట్ ఫాల్ కాల్వకు నీరు విడుదల చేశారు. దీంతో ఒకటి, రెండు రోజుల్లో ఆయకట్టు మొత్తానికి నీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. అయితే, నీరు విడుదల చేసిన కొద్ది సేపటికే గండి పడిన ప్రాంతంలో మళ్లీ లీకేజీ ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు అప్రమత్తమై నీటి సరఫరాను నిలిపివేశారు. కాగా, గండి పడిన ప్రాంతంలో గతంలో యూటీ (అండర్ టన్నెల్) ఉండగా.. అక్కడ మట్టి నింపి పూడ్చివేయగా తాజాగా నీరు లీకేజీ అయినట్లు తెలుస్తోంది. ఈ లీకేజీని అరికట్టి కాల్వకు మళ్లీ నీరు విడుదల చేస్తామని సీఈ విద్యాసాగర్ వెల్లడించారు. అయితే, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే తిరిగి గండి పడిందని.. కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రాహుల్ తల తీసుకురావాలనడం గర్హనీయం

- 'హైడ్రా'తో పేదలకు అభద్రతాభావం రాకూడదు: కూనంనేని



సాక్షి, హైదరాబాద్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని, దేశంలో మత పరిస్థితులపై వ్యాఖ్యలు చేసినందుకు ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తల తీసుకురావాలని బీజేపీ నాయకులు పిలుపునివ్వడం గర్హనీయమని సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. హిందూ మతం పేరుతో అరాచకాలు సృష్టిస్తున్న బీజేపీ వారే నిజంగా హిందూ తాలిబాన్లు అని తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. శనివారం పార్టీనేతలు పల్లా వెంకటరెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎన్.బాలమల్లేశ్, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహాలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ...రాహుల్ తప్పు చేసి ఉంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప ఆయన ఉగ్రవాది అని కేంద్రమంత్రే వ్యాఖ్యానించడం సరికాదన్నారు.

పేదలకు అభద్రతాభావం రాకూడదు..: 'హైడ్రా అంటే ఆక్రమణదారులకు భయం ఉండాలని, పేదలలో అభద్రతాభావం రాకూడదని కూనంనేని పేర్కొన్నారు. పేదల పట్ల హైడ్రా మానవీయకోణంలో వ్యవహరించాలి' అని సూచించారు. తెలుగు యూనివర్సిటీకి 'సురవరం ప్రతాపరెడ్డి', కోఠిలోని మహిళా వర్సిటీకి 'వీరనారి చాకలి ఐలమ్మ', ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి 'కొండా లక్ష్మణ్ బాపూజీ' పేరును పెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం ఉన్న చోటే రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి విగ్రహాలు ఏర్పాటుచేసి పోరాట స్ఫూర్తిని పెంపొందించాలన్నారు.

నిర్మాణం పూర్తికాకున్నా సర్టిఫికెట్ల జారీ పొరపాటే

- బరాజ్‌లకు వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ల జారీపై కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్ల అంగీకారం
- 10 మంది ఇంజనీర్లకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- ఇంజనీర్ల వైఖరిపై పలుమార్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో లోపాలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్... క్వాలిటీ కంట్రోల్, కన్‌స్ట్రక్షన్ విభాగాల్లో పనిచేసిన 10 మంది ఇంజనీర్లపై శనివారం ప్రశ్నల వర్షం కురిపించింది. బరాజ్‌ల నిర్మాణం పూర్తికాక ముందే కాంట్రాక్టు సంస్థలకు బ్యాంకు గ్యారంటీల తిరిగి చెల్లింపు, పనులు పూర్తయినట్లు సర్టిఫికెట్లు ఎందుకు ఇచ్చారని క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా నిలదీసింది. పనులు పాక్షికంగా పూర్తయినట్లు సర్టిఫికెట్ జారీ చేశామని గతంలో రామగుండం డివిజన్ ఈఈగా, ఆ తర్వాత ఎస్ఈగా పనిచేసిన బి.వెంకటరమణారెడ్డి కమిషన్‌కు బదులివ్వగా సర్టిఫికెట్‌లో ఆ విషయం ఎందుకు లేదని ప్రశ్నించింది. దీంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్టిఫికెట్ తయారు చేస్తే తాను కౌంటర్ సంతకం చేశానని.. ఈ విషయంలో పొరపాటు (మిస్టేక్) జరిగిందని ఆయన బదులిచ్చారు. ఎవరి ఆదేశాలతో బరాజ్‌లు నిర్మించారని కమిషన్ ప్రశ్నించగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో చేపట్టామని బి.వెంకటరమణారెడ్డి బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అంటే ఎవరని ప్రశ్నించగా ప్రభుత్వ అధినేత అని పేర్కొన్నారు. బరాజ్‌లను నీటి మళ్లింపు కోసమే వాడాల్సి ఉండగా అందుకు భిన్నంగా నిల్వ చేయాలని తమకు ఆదేశించారని మరో ప్రశ్నకు బదులిచ్చారు. మేడిగడ్డ బరాజ్ టెండర్లను 2.7 శాతం ఎక్సెస్ ధరతో రూ. 1,849.3 కోట్లకు పెంచి కాంట్రాక్టర్‌కు అప్పగించడంలో ఎవరిది తప్పని కమిషన్ ప్రశ్నించగా ఆయన మౌనంగా ఉండిపోయారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణ సమయంలోనే 3, 4, 5వ బ్లాకుల్లో లోపాలు బయటపడగా మరమ్మతులు చేశామన్నారు.

బరాజ్‌ల నిర్వహణ, పర్యవేక్షణలో లోపం జరిగిందన్నారు. కరోనా సమయంలో బ్యాంకు గ్యారంటీలను తిరిగి చెల్లించాలని నాటి ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడంతోనే తిరిగి ఇచ్చామని వెంకటరమణారెడ్డితో పాటు మహదేవ్‌పూర్ ఈఈ సీహెచ్ తిరుపతిరావు స్పష్టం చేశారు. బ్యాంకు గ్యారెంటీలను, వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లను తానే నిర్మాణ సంస్థకు ఇచ్చానని తిరుపతిరావు తెలియజేశారు. ఓ అండ్ ఎం విభాగం ఈఎన్‌సీ బి.నాగేందర్‌రావు పర్యవేక్షణలో క్వాలిటీ కంట్రోల్ విభాగం పనిచేస్తుందని ఆ విభాగం డీఈ ఎస్.సంజీవ్ తెలియజేశారు.

బరాజ్‌ల నిర్మాణంలో నాణ్యతా పరీక్షలకు ఈఈలు వెళ్తారని.. ఆ సమాచారం తన వద్ద లేదని క్వాలిటీ కంట్రోల్ సీఈ పీఏ వెంకటకృష్ణ కమిషన్‌కు తెలపగా ఆయనపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. క్రికెట్ జట్టు ఓడితే కెప్టెన్‌ది బాధ్యత కాదా? అని నిలదీసింది.

కమిషన్‌ను 'యూ'అంటారా?

అఫిడవిట్‌లో తప్పుడు అంశాలను పొందుపర్చడంపై కమిషన్ సీరియస్ కావడంతో ఆయన క్షమాపణ కోరారు. బరాజ్‌ల నిర్మాణ సమయంలో ఎన్నిసార్లు సందర్శించారని వరంగల్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ కె.దేవేందర్‌రెడ్డిని కమిషన్ ప్రశ్నించగా ఆ సమయంలో తాను లేనని బదులిచ్చారు. ఈ క్రమంలో ఆయన కమిషన్ చైర్మన్‌ను 'యూ' అని సంబోధించడంతో కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావసాలు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారా? ఎవరి ఆదేశాలతో అఫిడవిట్ దాఖలు చేశారు? అని మందలించింది. రూ. వేల కోట్లతో నిర్మించే బరాజ్‌లకు 2, 3 నెలలకు ఓసారి పరీక్షలు నిర్వహిస్తారా? అని క్వాలిటీ కంట్రోల్ మాజీ సీఈ బి.వెంకటేశ్వర్లుపై కమిషన్ అసహనం వ్యక్తం చేసింది. అన్నారం బ్యారేజీకి వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చామని ఈఈలు మల్లికార్జున ప్రసాద్, యాదగిరి తెలిపారు. బరాజ్‌లలో నీళ్ల నిరంతరం నిల్వ చేయడంతోనే కుంగాయని వారు బదులిచ్చారు. అన్నారం బరాజ్ స్థలం ఎంపికలోనే లోపం జరిగిందని ఈఈ యాదగిరి తెలిపారు. బరాజ్‌లో నీళ్లు ఎత్తిపోసి మళ్లీ వరదలు వచ్చినప్పుడు కిందికి విడుదల చేస్తున్నామని.. ఇది ఎత్తిపోతల కాదు.. తప్పిపోతల అని అన్నారు.

పెన్షన్ సాల్తలేదు.. కొడుకు సాదుతలేడు



పోలీస్‌స్టేషన్‌లో ఎల్లయ్య, పూలమ్మ

శంకరపట్నం (మానకొండూర్): 'సారూ.. కాళ్లు లేత్తలేవు.. కండ్లు కనబడ్తలేవు.. కష్టం చేసేటట్టు లేదు. వచ్చే పింఛన్ సరిపోతలేదు. కొడుకు సాదుతలేడు. మేమెట్ల బతకాలే' అంటూ వృద్ధ దంపతులు శనివారం కరీంనగర్ జిల్లా కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు చల్లూరి బాల ఎల్లయ్య (70), పూలమ్మ (66)కు కొడుకు శ్రీనివాస్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. శ్రీనివాస్ బతుకుదెరువు కోసం కుటుంబంతో సహా జమ్మికుంటలో అద్దెకుంటూ ఓ సిమెంటు దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఎల్లయ్య–పూలమ్మ దంపతులు బతకడం కష్టమవుతోందని గత మార్చిలో పెద్దమనుషులకు చెప్పుకోగా.. శ్రీనివాస్‌ను పిలిచి వారి పోషణకు నెలకు రూ.1000, బియ్యం ఇవ్వాలని తీర్మానించారు. ఎల్లయ్య పేరిట ఉన్న 22 గుంటల పొలం, ఇల్లు వీరి తదనంతరం శ్రీనివాస్‌కే చెందుతుందని నోటరీ రాయించారు. కొద్దిరోజులుగా ప్రభుత్వం నుంచి వచ్చే రూ.2 వేల పెన్షన్ తిండికి, మందులకు సరిపోవడం లేదని, కొడుకు శ్రీనివాస్ తమ పోషణకు భత్యం ఇవ్వడం లేదని, తిండి పెట్టడం లేదని వృద్ధ దంపతులు కేశవపట్నం పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. కొడుకు శ్రీనివాస్, కోడలు స్వరూపను స్టేషన్‌కు పిలిపించి ఎస్సై రవి కౌన్సెలింగ్ ఇచ్చారు. పొలం, ఇల్లు తన పేరిట చేస్తే తల్లిదండ్రులను పోషిస్తానని శ్రీనివాస్ పోలీసులకు చెప్పుకొచ్చాడు.

ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నామా?

- అధికారులు మా మాట వినట్లేదు.. కనీస గౌరవం ఇవ్వట్లేదు
- బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిని వేదికలెక్కిస్తున్నారు
- కాంగ్రెస్ జిల్లాలవారీ సమీక్షల్లో క్షేత్రస్థాయి నేతల అసహనం
- తొలిరోజు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నేతలతో టీపీసీసీ చీఫ్ భేటీ



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో దీపాదాస్ మున్షీ, జూపల్లి, సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, పోచారం, మండవ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'మనం అధికారంలో ఉన్నామో ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నామో అర్థం కావట్లేదు. తొమ్మిది నెలల తర్వాత కూడా అధికారులు మా మాట వినే పరిస్థితి లేదు. కనీస గౌరవం కూడా ఇవ్వట్లేదు. మంత్రులు, ఎమ్మెల్యేల లేఖలు తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదు. ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది' అని క్షేత్రస్థాయిలోని కాంగ్రెస్ నేతలు అసహనం వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చినా తమ ఇబ్బందులు తీరట్లేదని.. రాజకీయంగానూ సమస్యలు వస్తున్నాయని వాపోయారు. టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన శనివారం గాంధీ భవన్‌లో జిల్లాస్థాయి పార్టీ సమీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు సమీక్షల్లో భాగంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నేతలతో భేటీలు జరిగాయి. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావుతోపాటు ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు. సమావేశాల్లో భాగంగా పలువురు మాట్లాడుతూ పదేళ్ల కష్టకాలంలో జెండా మోసిన తమను కాదని బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారిని అధికారులు వేదికలెక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన టీపీసీసీ చీఫ్.. నేతల ఆవేదనను ఇన్‌చార్జి మంత్రి పట్టించుకోవాలని.. పార్టీ నేతలు ప్రజల కోసం అడిగే పనులు తప్పకుండా చేసేలా అధికారులకు దిశానిర్దేశం చేసే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు.

మన వాయిస్ ఎక్కడ?

పాలనా పగ్గాలు చేపట్టిన 9 నెలల్లోనే ప్రజాపయోగ పనులెన్నో చేసినా ప్రజల్లోకి ప్రతిపక్షాల విమర్శలే ఎక్కువగా పోతున్నాయని మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పనిచేసే కార్యకర్తలకే అన్ని పదవులు వచ్చేలా చూడాలని, పార్టీ కోసం కష్టపడుతున్న వారిని గుర్తించాలని మంత్రులను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలిచేలా పార్టీలోని పాత, కొత్త నాయకులు కలిసి పనిచేయాలని.. వారిని సమన్వయం చేసే బాధ్యతను ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు తీసుకోవాలని మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు.

రెండో డిబేట్‌కు నేను రెడీ

సీఎన్ఎన్ ప్రతిపాదనకు హారిస్ ఓకే

వాషింగ్టన్: రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో రెండో అధ్యక్ష చర్చకు డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ సమ్మతించారు. అక్టోబర్ 23న జరిగే డిబేట్‌లో పాల్గొనాలని సీఎన్ఎన్ ఛానల్ పంపిన ఆహ్వానాన్ని శనివారం హారిస్ అంగీకరించారు. ట్రంప్‌తో వేదిక పంచుకోవడానికి ఉపాధ్యక్షురాలు




సిద్ధంగా ఉన్నారని హారిస్ ప్రచార బృందం సారథి ఒమాలీ డిల్లాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో డిబేట్‌కు తాను సంతోషంగా సమ్మతిస్తానని హారిస్ శనివారం ట్వీట్ చేశారు. అక్టోబరు 23న ట్రంప్ తనతో చర్చకు వస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 10న జరిగిన తొలి డిబేట్‌లో ట్రంప్‌పై హారిస్ పైచేయి సాధించడం తెలిసిందే. మరో డిబేట్ ఆహ్వానంపై ఆయన ఎలా స్పందిస్తారో చూడాలి. అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబరు 5న జరగనున్న విషయం తెలిసిందే.

మెమరీ క్రిస్టల్‌లో మన జన్యుక్రమం

- వందల కోట్ల ఏళ్లు చెక్కుచెదరదు
- మానవాళి అంతరిస్తే పునఃసృష్టికి వీలు

లక్షలాది ఏళ్ల క్రితం గ్రహశకలం భూమిని ఢీకొనడంతో అంత పెద్ద డైనోసార్లే నామరూపాల్లేకుండా పోయినట్టు సైన్స్ చెబుతోంది. భవిష్యత్తులో అలాంటి ప్రళయమేదన్నా వచ్చి మానవాళిని అంతం చేస్తే? అలాంటిది జరిగినా మానవ సృష్టి క్రమం కొనసాగేందుకు బ్రిటన్ సైంటిస్టులు ఓ మార్గం ఆలోచించారు. మానవ జన్యుక్రమం మొత్తాన్నీ అత్యాధునిక 5డి మెమరీ క్రిస్టల్‌లో నిక్షిప్తం చేసి పెట్టారు. దాని సాయంతో మనిషిని తిరిగి సృష్టించవచ్చన్నమాట. సౌతాంప్టన్ వర్సిటీ ఆప్టోఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ సెంటర్ పరిశోధకులు ఈ క్రిస్టల్‌ను అభివృద్ధి చేశారు. వందల కోట్ల ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా దీన్ని తీర్చిదిద్దారు. చూసేందుకు చిన్నగా ఉన్నా ఇందులో ఏకంగా 360 టెరాబైట్స్ సమాచారాన్ని నిక్షిప్తం చేయవచ్చట! గడ్డకట్టించే చలి మొదలుకుని కాస్మిక్ రేడియేషన్, వెయ్యి డిగ్రీ సెల్సియస్‌కు మించిన ఉష్ణోగ్రత దాకా అన్ని ప్రతికూల వాతావరణ పరిస్థితులనూ తట్టుకునేలా దీన్ని తయారు చేశారు. ఈ క్రిస్టల్ అత్యంత మన్నికైన డిజిటల్ స్టోరేజ్ మెటీరియల్‌గా 2014లోనే గిన్నిస్ రికార్డులకెక్కింది. అంతరించిపోయే జాబితాలో చేరిన జంతు, వృక్ష జాతుల జన్యుక్రమాన్ని భద్రపరిచి ముందు తరాలకు అందించేందుకు కూడా ఈ క్రిస్టల్స్ ఉపయోగపడతాయని సైంటిస్టులు చెబుతున్నారు.



5డి మెమరీ ఎందుకంటే...

అత్యంత వేగవంతమైన లేజర్ల సాయంతో 5డి పద్ధతిలో మానవ జన్యు డేటాను క్రిస్టల్‌లో భద్రపరిచారు. ''తద్వారా సమాచారం పొడవు, ఎత్తు, వెడల్పుతో పాటు స్థితి, దిగ్విన్యాసం (ఓరియంటేషన్) అనే ఐదు విభిన్న డైమెన్షన్లలో క్రిస్టల్‌లోని సూక్ష్మనిర్మాణాల్లో నిక్షిప్తమై ఉంటుంది. తద్వారా అందులోని జన్యుక్రమాన్ని సుదూర భవిష్యత్తులో కూడా వెలికితీసి పునఃసృష్టి చేసేందుకు వీలైనన్ని ఎక్కువ అవకాశాలుండేలా జాగ్రత్త పడ్డాం'' అని పరిశోధన సారథి ప్రొఫెసర్ పీటర్ కజాన్స్కీ అన్నారు. అయితే కోట్లాది ఏళ్ల తర్వాత ఈ జన్యుక్రమం ఎవరి చేతికి చిక్కుతుందన్నది ప్రస్తుతానికి అనూహ్యమే. కనుక క్రిస్టల్‌లోని సమాచారమంతా వారికి సులువుగా చిక్కేందుకు వీలుగా అందులో ఒక విజువల్ కీని కూడా ఏర్పాటు చేశారు. క్రిస్టల్‌లో ఉన్న డేటా స్వరూపం, దాన్నెలా వాడుకోవాలి వంటివన్నీ ఈ కీ ద్వారా సులువుగా అర్థమైపోతాయని కజాన్స్కీ చెప్పుకొచ్చారు. ఈ క్రిస్టల్‌ను ఆస్ట్రియాలో 'మెమరీ ఆఫ్ మ్యాన్‌కైండ్ ఆర్కైవ్ టైమ్ క్యాప్సూల్‌'లో భద్రపరిచి ఉంచారు. ఇది నిజంగా అద్భుతమేనంటూ ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్‌లో డీఎన్ఏ స్టోరేజ్ విభాగాధిపతి థామస్ హెయ్‌నిస్ ప్రశంసించారు. అయితే, ''అంతా బాగానే ఉంది. కానీ మానవాళే అంతరించిపోతే ఈ క్రిస్టల్‌ను వాడేదెవరు? అందులోని జన్యుక్రమం సాయంతో మనిషిని మళ్లీ సృష్టించేదెవరు?'' అంటూ ఆయన కీలక ప్రశ్నలు సంధించడం విశేషం!

– సాక్షి, నేషనల్ డెస్క్

బీజేపీ అబద్ధాలను వ్యాపింపజేస్తోంది: రాహుల్



న్యూఢిల్లీ: అమెరికాలో ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అబద్ధాలను ప్రచారం చేస్తోందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. తన వ్యాఖ్యల్లో తప్పేమైనా ఉందా అని సిక్కులను ప్రశ్నించారు. ఎలాంటి భయాలు లేకుండా ప్రతీ ఒక్క భారతీయుడు నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛ భారత్‌లో ఉండకూడదా? అని రాహుల్ అన్నారు. నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం లేకే బీజేపీ తన నోరు మూయించేందుకు విఫలయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ మేరకు రాహుల్ శనివారం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'ఎప్పటిలాగే బీజేపీ అబద్ధాలను ఆశ్రయిస్తోంది. నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక నిరాశతో నా నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారు. భారత్‌ను నిర్వచించే విలువలు, భిన్నత్వంలో ఏకత్వం, సమానత్వం, ప్రేమ.. గురించి నేను మాట్లాడుతూనే ఉంటాను' అని రాహుల్ పేర్కొన్నారు. అమెరికాలో సిక్కును ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్‌ను షేర్ చేశారు.

బీజేపీలో చేరాలంటూ సెల్జాకు ఖట్టర్ ఆఫర్



చండీగఢ్: కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కుమారి సెల్జాను బీజేపీలో చేరాల్సిందిగా కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత మనోహర్ లాల్ ఖట్టర్ ఆహ్వానించారు. ప్రముఖ దళిత నేత కూడా అయిన సెల్జా వచ్చే నెలలో జరిగే హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారన్న వార్తల నేపథ్యంలో మంత్రి ఈ ఆఫర్ ఇవ్వడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా సీఎం అభ్యర్థి ఎవరనే విషయమై రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతర్గత పోరు తీవ్రతరమైందని మంత్రి ఖట్టర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఘరువాండాలో జరిగిన ఎన్నికల కార్యక్రమంలో మాట్లాడారు.

ఆతిశి అనే నేను..



ప్రమాణం చేస్తున్న ఆతిశి, సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, ముకేశ్ అహ్లావత్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గహ్లోత్ (ఎడమ నుంచి కుడికి)

సాక్షి, న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత ఆతిశి ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో రాజ్ నివాస్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ఆమెతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే మరో ఐదుగురు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. నిరాడంబరంగా ఈ కార్యక్రమానికి ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు హాజరయ్యారు. ఢిల్లీ మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆతిశి రికార్డు సృష్టించారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన గురువు అరవింద్ కేజ్రీవాల్ కాళ్లకు నమస్కరించి, ఆశీర్వచనాలు స్వీకరించారు. ఆతిశికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు.

ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
- ప్రమాణం చేయించిన లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా
- మరో ఐదుగురు కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం
- హాజరైన మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా

18 నెలల్లో సీఎంగా అవకాశం

ఆతిశి 2020లో కల్కాజీ అసెంబ్లీ స్థానం నుంచి తొలిసారి గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. కేజ్రీవాల్ కేబినెట్‌లో మంచి గుర్తింపు లభించింది. విద్య, పబ్లిక్ వర్క్స్, వాటర్, ఫైనాన్స్, ప్లానింగ్ వంటి కీలక శాఖలకు మంత్రిగా సేవలందించారు. మంత్రి అయిన 18 నెలల్లోనే ఆమె సీఎం అవడం విశేషం. సీఎంగా ఆతిశి పదవీ కాలం వచ్చే ఫిబ్రవరిలో ముగియనుంది. ఆతిశి కేబినెట్‌లో ఐదుగురికి అవకాశం దక్కింది. ఆమెతో పాటు మంత్రులుగా ప్రమాణం చేసిన సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గహ్లోత్, ఇమ్రాన్ హుస్సేన్, ముకేశ్ అహ్లావత్‌కు శాఖలు కేటాయించలేదు. ప్రమాణ స్వీకారానికి ముందు ఆతిశి, నూతన మంత్రులు కేజ్రీవాల్‌తో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, ఢిల్లీ ప్రజలకు ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటన్నింటిని ఆతిశి ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ ఎంపీ రామ్‌వీర్‌సింగ్ బిధూరీ డిమాండ్ చేశారు.


కేజ్రీవాల్‌ను మళ్లీ సీఎంను చేద్దాం

ఢిల్లీ ప్రజలకు సీఎం ఆతిశి పిలుపు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని నూతన సీఎం ఆతిశి ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె శనివారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మీడియా సమావేశంలో మాట్లాడారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా బీజేపీ పెద్ద కుట్ర పన్నిందని ఆరోపించారు. ఆయన సీఎం పదవి నుంచి దిగిపోవడం తనను చాలా ఆవేదనకు గురిచేస్తోందని అన్నారు. పదవిలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం కోసం ఎన్నో చర్యలు చేపట్టారని, అంకితభావంతో పనిచేశారని కేజ్రీవాల్‌ను కొనియాడారు. ప్రజల కష్టనష్టాలు ఆయనకు పూర్తిగా తెలుసని చెప్పారు. ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించినందుకు తన రాజకీయ గురువు, పెద్దన్న కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వెల్లడించారు. ఢిల్లీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కేజ్రీవాల్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని స్పష్టంచేశారు. ఒకవేళ బీజేపీ అధికారంలోకి ఉచిత విద్యుత్, ఉచిత వైద్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగిపోతాయని ఆతిశి ఆందోళన వ్యక్తంచేశారు. కేజ్రీవాల్‌పై బీజేపీ కుట్రలను కచ్చితంగా అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగే దాకా కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో ఢిల్లీ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రకటించారు.

సీఎం పీఠంపై మహిళా శక్తి | ప్రత్యేక కథనం ఈ- పేపర్‌లో...

హేమంత్ అవినీతి సీఎం: రాజ్‌నాథ్



ఇట్‌ఖోరి (జార్ఖండ్): జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అత్యంత అవినీతిపరుడైన సీఎంగా రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. ఉన్నతమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలతో ఆడుకున్నారని విమర్శించారు. సోరెన్‌ను గద్దెదింపే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. జార్ఖండ్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ చేపట్టిన పరివర్తన్ యాత్రను ఇట్‌ఖోరిలో శనివారం రాజ్‌నాథ్ ప్రారంభించారు. హేమంత్ సోరెన్ అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. అవినీతి మరకలున్న వారిని భారత్ ఎప్పటికీ ఆమోదించబోదన్నారు. బీజేపీ సీఎంలు బాబూలాల్ మరాండి, అర్జున్ ముండా, రఘుబర్ దాస్‌లు ఎలాంటి అవినీతి ఆరోపణలు ఎదుర్కొనలేదన్నారు. అధికారిక కూటమిలోని జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీలను జార్ఖండ్ ప్రగతిని అడ్డుకుంటున్న స్పీడ్‌బ్రేకర్లుగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బంగ్లాదేశ్, రోహింగ్యా చొరబాటుదారులకు కొమ్ముకాస్తోందని రాజ్‌నాథ్ ఆరోపించారు.

రత్న భండార్‌లో రెండో సర్వే ప్రారంభం



పూరీ: భారత పురావస్తు సర్వే విభాగం(ఏఎస్ఐ) ఒడిశా పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భండార్‌లో శనివారం మధ్యాహ్నం రెండో దఫా టెక్నికల్ సర్వే ప్రారంభించింది. మూడు రోజులపాటు ఈ సర్వే కొనసాగుతుందని, మధ్యాహ్నం ఒంటి నుంచి సాయంత్రం 6 గంటల ద్వారా భక్తులను ఆలయంలోకి అనుతించబోమని శ్రీజగన్నాథ్ ఆలయ పరిపాలనా విభాగం అధికారులు వెల్లడించారు. సర్వే జరుగుతున్న సమయంలో ఆలయ ప్రధాన ద్వారాలను మూసివేస్తున్నట్లు తెలిపారు. భక్తులు సహకరించాలని కోరారు. రత్న భండార్‌లో రహస్య గది గానీ, సొరంగం గానీ ఉన్నాయా? అనేది తేల్చబోతున్నామని రత్న భండార్ ఇన్వెంటరీ కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు. ఈ సర్వే కోసం అత్యాధునిక రాడార్‌ను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. రత్న భండార్‌లో మొదటి దఫా సర్వే ఇప్పటికే పూర్తయ్యింది.

ఓటీటీల్లో పొగాకు హెచ్చరికలు తప్పనిసరి



న్యూఢిల్లీ: పొగాకు వాడకంతో కలిగే దుష్పరిణామాలపై హెచ్చరికల ప్రసారాన్ని ఓటీటీ(ఓవర్ ది టాప్) వేదికల్లో తప్పనిసరి చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఇందుకు సంబంధించి సవరించిన ప్రతిపాదనలను కేంద్ర ఆరోగ్య శాఖ ఇటీవల విడుదల చేసింది. దీని ప్రకారం..సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ స్టేటస్‌తో సంబంధం లేకుండా ఓటీటీల్లో ప్రసారమయ్యే అన్ని దేశ, విదేశీ సినిమాలకు ప్రారంభంలో, తిరిగి మధ్యలో కనీసం 30 సెకన్ల నిడివి కలిగిన పొగాకు వ్యతిరేక ప్రకటనలను ప్రసారం చేయాల్సి ఉంటుంది. సంబంధిత సినిమాలో పొగాకు ఉత్పత్తులను వాడే సమయంలో స్క్రీన్ దిగువన ఆరోగ్య హెచ్చరికలను సైతం ప్రదర్శించాల్సి ఉంటుంది.

ఉక్రెయిన్‌పై ఏం చేద్దాం?

బైడెన్‌తో మోదీ చర్చలు
- మూడు రోజుల పర్యటన నిమిత్తం అమెరికాకు
- విల్మింగ్టన్‌లోని తన నివాసంలో ఘనస్వాగతం పలికిన బైడెన్
- క్వాడ్, ఐరాస సదస్సుల్లో పాల్గొననున్న ప్రధాని

వాషింగ్టన్/న్యూఢిల్లీ: రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ చర్చలు జరిపారు. యుద్ధానికి తెర దించే మార్గాలపై లోతుగా చర్చించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం శనివారం రాత్రి ప్రధాని అమెరికా చేరుకున్నారు. అనంతరం నేరుగా డెలావెర్‌లో విల్మింగ్టన్‌లోని బైడెన్ నివాసానికి వెళ్లారు. మోదీకి అధ్యక్షుడు ఘనస్వాగతం పలికారు. వారిద్దరూ ఆత్మీయంగా కౌగిలించుకున్నారు. అనంతరం మోదీ చేయి పట్టుకుని బైడెన్ లోనికి తీసుకెళ్లారు. పలు అంశాలపై నేతలిద్దరూ చాలాసేపు చర్చలు జరిపారు. ఉక్రెయిన్ సంక్షోభానికి ఈ భేటీలో పరిష్కార మార్గం లభించవచ్చని భావిస్తున్నారు. ఇజ్రాయెల్–గాజా ఘర్షణతో పాటు అమెరికా–భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడం తదితర అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. అంతకుముందు పెన్సిల్వేనియాలోని ఫిలడెల్ఫియా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మోదీకి ఘనస్వాగతం లభించింది. ఆయన్ను చూసేందుకు ప్రవాస భారతీయులు భారీగా తరలివచ్చారు. వారితో ఆయన కరచాలనం చేస్తూ ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ సందడి చేశారు.




శనివారం రాత్రి విల్మింగ్టన్‌లోని తన నివాసంలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికిన అనంతరం ఆప్యాయంగా చేయి పట్టుకొని లోనికి తోడ్కొని వెళ్తున్న అధ్యక్షుడు జో బైడెన్

అమెరికాతో బంధం బలోపేతం

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతికి కృషి చేయడానికి భావసారూప్య దేశాలకు 'క్వాడ్' అత్యంత కీలకమైన వేదిక అని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు అమెరికా బయల్దేరే ముందు ప్రకటన విడుదల చేశారు. ''బైడెన్, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, జపాన్ ప్రధాని ఫుమియో కిషిదాతో భేటీ అయ్యేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. అమెరికాలోని ప్రవాస భారతీయులను కలుసుకోబోతుండడం ఆనందంగా ఉంది'' అన్నారు. మోదీ అమెరికాలో కీలక సదస్సులు, సమావేశాల్లో పాల్గొంటారు. బైడెన్‌తో పాటు పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. విల్మింగ్టన్‌లో క్వాడ్ సదస్సులో, న్యూయార్క్‌లో ఐరాస సాధారణ సభలో 'సమ్మిట్ ఆఫ్ ఫ్యూచర్'లో ప్రసంగిస్తారు. లాంగ్ ఐలండ్‌లో ప్రవాస భారతీయుల భేటీలో పాల్గొంటారు. ప్రఖ్యాత అమెరికా కంపెనీల సీఈఓలతో సమావేశమై ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ వంటి అధునాతన సాంకేతికతపై చర్చిస్తారు.

పాక్‌కు మోదీ అంటే భయం..

- అందుకే సరిహద్దులు ప్రశాంతం
- ఆ మూడు కుటుంబాల పాలనకు ముగింపు పలకండి
- కశ్మీర్ ఎన్నికల ర్యాలీలో ప్రజలకు హోం మంత్రి అమిత్ షా పిలుపు



మెంధర్: ''ప్రధాని నరేంద్ర మోదీ అంటే పాకిస్తాన్ భయపడుతోంది. అందుకే జమ్మూ కశ్మీర్‌లో సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయి'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. సరిహద్దుల్లో ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా భారత్ సమాధానం ఎంత తీవ్రంగా ఉంటుందో పాక్‌కు తెలుసన్నారు. సరిహద్దుల్లోని పూంఛ్ జిల్లాలో శనివారం ఎన్నికల ప్రచార ర్యాలీల్లో మంత్రి మాట్లాడారు. కేంద్ర పాలిత ప్రాంతంలోని యువకులకు తుపాకులు, రాళ్ల స్థానంలో ల్యాప్‌టాప్‌లను అందించడం ద్వారా ఇక్కడ తీవ్రవాదాన్ని తుడిచిపెట్టామన్నారు. 1990ల్లో తరచూ చోటుచేసుకున్న సీమాంతర ఉగ్రవాదం నేడు కనిపిస్తోందా అని ప్రజలను ప్రశ్నించారు. ''గతంలో ఇక్కడి పాలకులు పాకిస్తాన్‌ను చూసి భయపడేవారు. ఇప్పుడు మోదీని చూసి పాక్‌కు భయం పట్టుకుంది. కాల్పులకు దిగేందుకు సాహసించడం లేదు. జమ్మూకశ్మీర్‌లో 1990ల్లో మొదలైన ఉగ్రవాదానికి 2014 నాటికి 40 వేల మంది బలయ్యారు. దాన్ని ఆపడంలో ఆ మూడు (అబ్దుల్లా, ముఫ్తీ, నెహ్రూ) కుటుంబాలు విఫలమయ్యాయి. పైపెచ్చు, ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టాయి. జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం వేళ్లూనడానికి వాళ్లు ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఆ మూడు కుటుంబాల పాలనకు ముగింపు పలికేలా అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పివ్వండి'' అని అమిత్ షా పిలుపునిచ్చారు.

ఉగ్రవాదంతో ఎవరికీ లాభం లేదు

'ఉగ్రవాదం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదు. తుపాకులను మన పిల్లలకు అందజేద్దాం. మన యువతను ఆర్మీ, పోలీసు విభాగాల్లోకి పంపేందుకు ప్రయత్నిద్దాం. ఇందు కోసం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లను ఏర్పాటు చేస్తాం'' అని అమిత్ షా ప్రకటించారు. ''కేంద్రంలో 2014లో బీజేపీ ప్రభుత్వమే ఏర్పడకుంటే ఇక్కడ పంచాయతీరాజ్ ఎన్నికలు జరిగేవే కావు, 30 వేల మంది పంచాయతీ సభ్యుల ఎన్నికయ్యే వారే కాదు. ప్రజలపై ఎన్‌సీ, పీడీపీ, కాంగ్రెస్ పార్టీల మూడు కుటుంబాల పెత్తనం మరింత పెరిగి ఉండేది'' అని అమిత్ షా దుయ్యబట్టారు. గుజరాత్‌కు చెందిన ఒక నేత నియంత్రణ రేఖకు అతి సమీపంలోని మెంధర్‌కు వచ్చి ఉండేవారే కాదని తన పర్యటనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 1947లో సరిహద్దులను కాపాడిన పహాడీలు, బకర్‌వాలాలు, గుజ్జర్లను చూసి జాతి గర్విస్తోందన్నారు.

వైమానిక దళ చీఫ్‌గా అమర్‌ప్రీత్ సింగ్



న్యూఢిల్లీ: భారత వైమానిక దళం(ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ నియమితులయ్యారు. ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ వీర్ చౌధరి ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈయన స్థానంలో అమర్ ప్రీత్ సింగ్ పదవీ బాధ్యతలు చేపడతారు. సెప్టెంబర్ 30వ తేదీ మధ్యాహ్నం నుంచి ఈయన నియామకం అమల్లోకి వస్తుందని రక్షణ శాఖ శనివారం తెలిపింది. 1964లో జన్మించిన అమర్ ప్రీత్ సింగ్ 1984లో ఎయిర్ ఫోర్స్‌లో చేరారు. యుద్ధ విమానం పైలట్‌గా 5 వేల గంటలకుపైగా అనుభవం సంపాదించారు. పరమ విశిష్ట సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు.

విధుల్లో చేరిన బెంగాల్ జూడాలు



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లు 42 రోజుల సమ్మెను విరమించి.. శనివారం విధుల్లో చేరారు. పాక్షికంగా విధులు నిర్వర్తించనున్నారు. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో పీజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ఆగస్టు 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే. మమత సర్కారు తమ ప్రధాన డిమాండ్లను ఆమోదించి.. అమలు చేయడంతో జూడాలు సమ్మె విరమించారు. ఎమర్జెన్సీ, అత్యవసర విధులకు మాత్రమే హాజరవుతామని, ఔట్ పేషెంట్ విభాగాల్లో (ఓపీ)లో పనిచేయబోమని జూనియర్ డాక్టర్ అనికేత్ మహతో తెలిపారు. ''ఏడు రోజులు వేచిచూస్తాం. ఆరోగ్యశాఖ కార్యదర్శిని తొలగించకుంటే మళ్లీ విధుల బహిష్కరణకు దిగుతాం'' అని జూడాలు చెప్పారు.

శ్రీలంకలో పోలింగ్ ప్రశాంతం



కొలంబో: శ్రీలంకలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి హింసాత్మక ఘటనలూ నమోదు కాలేదు. చివరి సమాచారం అందేసరికి 75 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఎన్నికల ప్రక్రియను ఈయూ, కామన్వెల్త్ తదితర దేశాల నుంచి 100 మందికి పైగా అంతర్జాతీయ పరిశీలకులు పర్యవేక్షిస్తున్నారు. 38 మంది బరిలో దిగినా ప్రధాన పోటీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, విపక్ష నేత సజిత్ ప్రేమదాసతో పాటు జనాదరణతో దూసుకుపోతున్న జనతా విముక్తి పెరమున (జేవీపీ) చీఫ్ అనూర కుమార దిస్సనాయకె మధ్యే నెలకొనడం తెలిసిందే. రేసులో దిస్సనాయకె ముందున్నట్టు ముందస్తు సర్వేలన్నీ తేల్చాయి. ఈ నేపథ్యంలో ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఓటర్లు ముగ్గురు అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో ఓటేస్తారు. పూర్తి మెజారిటీ సాధించే అభ్యర్థి విజేత అవుతాడు.

గాజాలో 22 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: గాజాలోని జైటూన్ ప్రాంతంలో శరణార్థులు తలదాచుకుంటున్న పాఠశాల భవనంపై ఇజ్రాయెల్ ఆర్మీ శనివారం జరిపిన దాడిలో కనీసం 22 మంది చనిపోగా మరో 30 మంది గాయపడ్డారు. వీరిలో 13 మంది చిన్నారులు, ఆరుగురు మహిళలున్నారని గాజా ఆరోగ్య శాఖ పేర్కొంది. ఈ స్కూల్‌లో హమాస్ కమాండ్ సెంటర్ నడుస్తోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. రఫాపై దాడిలో మరో నలుగురు చనిపోయారని హమాస్ పేర్కొంది.


అమెరికాలో కాల్పులు.. ఇద్దరు మృతి

మిన్నెపొలిస్: అమెరికాలోని మిన్నెపొలిస్‌లో శనివారం తెల్లవారు జామున జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ముగ్గురు గాయపడ్డారు. డౌన్‌టౌన్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. క్షతగాత్రుల్లో ముగ్గురు యువతులున్నారని, వీరెవరికీ ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఘటన నేపథ్యంలో హెన్నెపిన్ కౌంటీ, మెట్రో ట్రాన్సిట్ పోలీసులతో కలిసి గస్తీ పెంచినట్లు చెప్పారు.

ఇద్దరు టాప్ కమాండర్ల మృతి

- ధ్రువీకరించిన లెబనాన్
- మృతులు 37కు చేరినట్టు వెల్లడి

బీరుట్: బీరుట్‌పై శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన భీకర క్షిపణి దాడిలో హెజ్బొల్లా విభాగం ఎలైట్ రద్వాన్ ఫోర్స్ చీఫ్ ఇబ్రహీం అకీల్ మృతి చెందినట్లు లెబనాన్ ప్రభుత్వం ధ్రువీకరించింది. మరో సీనియర్ కమాండర్ అహ్మద్ వహబీ కూడా చనిపోయినట్లు ప్రకటించింది. ఘటనలో మృతుల సంఖ్య 37కి చేరుకుందని తెలిపింది. వీరిలో ఏడుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులున్నట్లు వివరించింది. క్షతగాత్రులైన 68 మందిలో 15 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆరోగ్య మంత్రి ఫిరాస్ అబియడ్ శనివారం చెప్పారు. మరో 23 మంది జాడ తెలియడం లేదన్నారు. నేలమట్టమైన అపార్టుమెంట్ శిథిలాల తొలగింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. కాగా, శుక్రవారం తమ దాడిలో హెజ్బొల్లాకు చెందిన 16 మంది హతమైనట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. హెజ్బొల్లా కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది.శనివారం హెజ్బొల్లా మీడియా విభాగం జర్నలిస్టులను ఘటనాస్థలికి తీసుకెళ్లింది. మొత్తం 16 అపార్టుమెంట్లున్న ఆ సముదాయంలో క్షిపణి దాడి తీవ్రతకు మిలిటెంట్ల సమావేశం జరిగిన పక్క అపార్టుమెంట్ కూడా దెబ్బతింది. క్షిపణి భవనాన్ని చీల్చుకుంటూ నేరుగా బేస్‌మెంట్‌లోకి దూసుకుపోయిందని ఏఎఫ్‌పీ తెలిపింది. ఆ సమీపంలోని పలు దుకాణాలు కూడా ధ్వంసమయ్యాయి. పేజర్లు, వాకీటాకీలు, రేడియోలు పేలిన ఘటనల్లో గాయపడిన వారితో దేశంలోని ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయని ఆరోగ్య మంత్రి ఫిరాస్ చెప్పారు.



ఇబ్రహీం అకీల్



అహ్మద్ వహబీ

అకీల్‌పైనే ఎందుకు గురి?

ఇబ్రహీం అకీల్ ప్రధాన లక్ష్యంగా శుక్రవారం బీరుట్‌పై ఇజ్రాయెల్ భారీ దాడికి పాల్పడింది. బీరుట్‌లోని తమ ఎంబసీపై 1983లో జరిగిన దాడికి అకీలే సూత్రధారి అని అమెరికా అనుమానం. అప్పటి నుంచి అతడిని హిట్‌లిస్టులో ఉంచింది. పట్టిచ్చిన/జాడ తెలిపిన వారికి 70 లక్షల డాలర్ల రివార్డును కూడా ప్రకటించింది. బీరుట్‌లోని జనసమ్మర్దం ఉండే ప్రాంతంలోని ఆ అపార్టుమెంట్ సముదాయం బేస్‌మెంట్‌లో అకీల్ మిలిటెంట్లతో సమావేశమైనట్లు తమకు ముందుగానే సమాచారం అందిందని శుక్రవారం ఆర్మీ ప్రకటించింది. ఈ మేరకు దాడి చేపట్టామని వెల్లడించింది. కాగా, హెజ్బొల్లా కార్యకలాపాల్లో దశాబ్దాలుగా మహ్మద్ వహబీ కీలకంగా ఉన్నాడు. ఇతడిని ఇజ్రాయెల్ 1984లో బంధించి జైలులో ఉంచింది. 1997లో దక్షిణ లెబనాన్‌లో 12 మంది ఇజ్రాయెల్ సైనికులను చంపిన ఫీల్డ్ కమాండర్లలో వహబీ ఒకరని చెబుతారు.

లెబనాన్‌పై మరిన్ని దాడులు

లెబనాన్ దక్షిణ ప్రాంతంపై శనివారం కూడా ఇజ్రాయెల్ వైమానిక దాడులను కొనసాగించింది. హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు జరిపామని తెలిపింది. హెజ్బొల్లా కూడా ఇజ్రాయెల్‌పైకి పెద్ద సంఖ్యలో రాకెట్లు ప్రయోగించింది. వాటితో వాటిల్లిన నష్టమెంతో తెలియాల్సి ఉంది.


బంజారాహిల్స్‌లో భారీగా ట్రాఫిక్ జామ్


నాంపల్లిలో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

గరిష్టం/కనిష్టం
30.0/22.0

వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేడి వాతావరణం ...సాయంత్రం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.


అమీర్‌పేటలో నీట మునిగిన రహదారి

జడివాన!

మూడు గంటల్లో 9 సెంటీమీటర్ల వర్షం


పంజగుట్ట మోడల్ హౌస్ వద్ద..


ఓల్డ్ సిటీలో వానలో చిక్కుకున్న ఆటో

- చెరువులను తలపించిన రోడ్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో శనివారం సాయంత్రం జడివాన కురిసింది. కేవలం మూడు గంటల్లో 9 సెంటీమీటర్ల వర్షం కురవడంతో నగరం అతలాకుతలం అయింది. రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో ట్రాఫిక్ స్తంభించింది. రోడ్లు చెరువులను తలపించగా లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఖైరతాబాద్, బంజారాహిల్స్, లంగర్‌హౌస్, విజయనగర్ కాలనీ, కార్వాన్, ఆసిఫ్‌నగర్, ఫస్టలాన్సర్, పాటిగడ్డ, గన్‌ఫౌండ్రి, కుషాయిగూడ, కాప్రా, అత్తాపూర్, జియాగూడ, నాంపల్లి, షేక్‌పేట, బహదూర్‌పురా, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాలో భారీ వర్షం కురిసింది. ఉద్యోగులు, పనుల మీద బయటకు వచ్చిన వారు ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో వాహనాలు నీటిలో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి 11 గంటలకు కూడా కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ క్లియర్ కాలేదు. గంటల తరబడి రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. ప్రధానంగా సచివాలయం, ట్యాంక్‌బండ్, అబిడ్స్, బంజారాహిల్స్, నాంపల్లి, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. బేగంపేటలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆకస్మికంగా పర్యటించారు. రాబోయే రెండు రోజుల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం
భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపు ఇబ్బందులు లేకుండా ఉండడంతో పాటు, ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని అధికారులకు తెలిపారు. మరోవైపు అత్యవసర పని ఉంటేనే బయటకు రావాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నగరవాసులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 04-2111 1111, 9000113667 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రాత్రి 9 గంటల వరకు వర్షపాతం ఇలా... (సెం.మీటర్లు)	లంగర్‌హౌస్	ఖైరతాబాద్	విజయ్‌నగర్ కాలనీ	కార్వాన్	ఆసిఫ్‌నగర్	మెహిదీపట్నం	ఎల్‌బీ స్టేడియం	అత్తాపూర్
	9.1	8.6	8.0	7.3	7.2	6.7	6.7	6.6


ఎల్బీనగర్ కూరగాయల మార్కెట్‌లోకి వచ్చిన వరద నీరు


సోమాజిగూడ యశోద ఆస్పత్రి ముందు వరద నీటి ప్రవాహం


పంజగుట్టలో...


ధూల్‌పేటలో వరద నీటిలో వాహనదారుల కష్టాలు

25లోపు నివేదిక ఇవ్వండి

- రాచకొండ సీపీ, కలెక్టర్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు
- ఎల్మినేడు అసైన్డ్ భూ బాధితుల ఫిర్యాదుకు స్పందన

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు భూ బాధితుల విషయంలో ఈ నెల 25లోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశించింది. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అసైన్డ్ భూములను సేకరించింది. బాధితులకు సరైన పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని, కొంతమందికి ఇప్పటికీ పరిహారం అందలేదని, గత జూన్ 26న ఎల్మినేడు అసైన్డ్ భూ బాధితుల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌రెడ్డి జాతీయ ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై సదరు రైతులు హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయినప్పటికీ న్యాయం జరగడం లేదంటూ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఎస్టీ కమిషన్ పూర్తి స్థాయి విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ శశాంకతో పాటు రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు ఈ నెల 10న నోటీసులు జారీ చేసింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్టుకు మరో గుర్తింపు



శంషాబాద్: న్యూస్‌వీక్ నిర్వహించిన 'ప్రపంచ అత్యంత విశ్వసనీయ కంపెనీలు– 2024' సర్వేలో ట్రాన్స్‌పోర్టు, లాజిస్టిక్, ప్యాకేజింగ్ కేటగిరీలో ప్రపంచ వ్యాప్తంగా ఐదో స్థానంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ కంపెనీ నిలిచిందని జీఎంఆర్ వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి. ప్రపంచ అత్యంత విశ్వసనీయ సంస్థల్లో గుర్తింపు పొందిన జాబితాలో భారతదేశం నుంచి విమానాశ్రయ అభివృద్ధి సంస్థ ఆపరేటర్‌గా ఉన్న జీఎంఆర్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ స్థానాన్ని దక్కించుకోవడం హర్షణీయమని చైర్మన్ జీబీఎస్ రాజు అన్నారు. విమానాశ్రయాల మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల సౌలభ్యం, పర్యావరణ హితమైన చర్యలతో తమ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా టాప్ 5 స్థానంలో గుర్తింపు పొందిందన్నారు. వివిధ కేటగిరీల్లో 1000 కంపెనీలపై నిర్వహించిన సర్వేల్లో జీఎంఆర్ సంస్థ టాప్ ర్యాంకింగ్‌లో ఉండడం తమ సంస్థ బాధ్యతాయుతమైన పనితీరుకు నిదర్శనంగా ఉందన్నారు.

రియల్.. కుదేల్!

డోలాయమానంలో స్థిరాస్తి కొనుగోలుదారులు



రంగారెడ్డి జిల్లాలో రిజిస్ట్రేషన్ గణాంకాలివీ..

నెల	డాక్యుమెంట్లు	ఆదాయం
ఆగస్టు	19,929	రూ.326.16 కోట్లు
సెప్టెంబర్ (ఈ నెల 20 వరకు)	9,654	రూ.151.19 కోట్లు

మేడ్చల్ జిల్లాలో..

నెల	డాక్యుమెంట్లు	ఆదాయం
ఆగస్టు	11.659	రూ.227.19 కోట్లు
సెప్టెంబర్ (ఈ నెల 20 వరకు)	5,587	రూ.81.09 కోట్లు

- ఎక్కడ చెరువుందో, ఏది నాలానో తేల్చుకోలేని సందిగ్ధం
- ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లకు కస్టమర్ల నిరాసక్తత
- దీంతో సగానికి పైగా పడిపోయిన రిజిస్ట్రేషన్లు
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భారీగా తగ్గిన ఆదాయం
- గృహ రుణాలకూ బ్యాంకర్ల వెనుకంజ

సాక్షి, సిటీబ్యూరో: 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డ' చందంగా ఉంది గ్రేటర్ రియల్ ఎస్టేట్ పరిస్థితి. ఇప్పటికే వరుస ఎన్నికలతో అంతంత మాత్రంగా సాగుతున్న స్థిరాస్తి లావాదేవీలపై తాజాగా హైడ్రా 'బుల్డోజర్' దెబ్బ పడింది. అక్రమ నిర్మాణాలే కాదు హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ వంటి ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు తీసుకొని నిర్మించిన భవనాలను సైతం హైడ్రా కూల్చివేయడంతో కొనుగోలుదారుల్లో భయం నెలకొంది. ఎక్కడ చెరువుందో, ఏది నాలానో తేల్చేకోలేక సందిగ్ధంలో పడిపోతున్నారు. దీంతో గ్రేటర్‌లో రిజిస్ట్రేషన్లు తగ్గిపోతున్నాయి.

సగానికి పైగా పడిపోయిన ఆదాయం..
సాధారణంగా గ్రేటర్‌లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే రిజిస్ట్రేషన్ల ఆదాయం గణనీయంగా ఉంటుంది. కానీ, గత రెండు నెలల్లో ఈ రెండు జిల్లాలలో ఆదాయం సగానికి పైగా తగ్గిపోయింది. రంగారెడ్డిలో ఆగస్టులో 19,929 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా..రూ.326.16 కోట్ల ఆదాయం సమకూరింది. అదే ఈ నెలకు వచ్చేసరికి 9,654 డాక్యుమెంట్లు, రూ.151.19 కోట్లకు రాబడి పడిపోయింది. అలాగే మేడ్చల్‌లో గత నెలలో 11,659 డాక్యుమెంట్లకు గాను..రూ.227.19 కోట్ల ఆదాయం వచ్చింది. సెప్టెంబర్‌లో 5,587 డాక్యుమెంట్లు, రూ.81.09 కోట్లకు తగ్గింది.

కిటకిట నుంచి వెలవెల..
సాధారణంగా ఉప్పల్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, శామీర్‌పేట, ఘట్‌కేసర్, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నిత్యం కిటకిటలాడుతుంటాయి. అయితే గత రెండు నెలలుగా ప్రాపర్టీ కొనుగోళ్లు లేక ఆఫీసులన్నీ వెలవెలబోతున్నాయి. ఉదాహరణకు ఉప్పల్ ఎస్‌ఆర్‌ఓలో గత నెలలో 1,682 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. రూ.31.30 కోట్ల ఆదాయం సమకూరింది. కానీ, ఈ నెలకు వచ్చే సరికి కేవలం 806 డాక్యుమెంట్లకు గాను రూ.11.32 కోట్లకు ఆదాయం తగ్గింది. అలాగే కూకట్‌పల్లిలో గత నెల్లో 835 డాక్యుమెంట్లు, రూ.21.15 కోట్ల ఆదాయం వచ్చింది. సెప్టెంబర్‌లో కేవలం 398 డాక్యుమెంట్లు, రూ.8.16 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. శేరిలింగంపల్లిలో ఆగస్టులో 1,024 డాక్యుమెంట్లకు గాను రూ.రూ.35.86 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ నెలలో కేవలం 461 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. ఆదాయం రూ.రూ.17.48 కోట్లకు పడిపోయింది.

లేక్ వ్యూ అంటే హడల్..
గతంలో లేక్ వ్యూ ప్రాజెక్టలంటే డెవలపర్లు చాలా గొప్పగా చెప్పుకునేవారు. మా ప్రాజెక్ట్‌లో బాల్కనీ నుంచి చూస్తే చెరువు, పచ్చని చెట్లు కనిపిస్తుంటాయని ప్రచారం చేసేవాళ్లు. కొనుగోలుదారులు కూడా ఈ తరహా ప్రాజెక్టలకు ఎగబడిపోయేవారు. కానీ, హైడ్రా రంగంలోకి దిగాక లేక్ వ్యూ అంటే డెవలపర్లే కాదు కస్టమర్లు కూడా హడలెత్తిపోతున్నారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలు చేపట్టిన బిల్డర్లు.. విక్రయాల్లేక తలలుపట్టుకుంటున్నారు. పటాన్‌చెరులో లేక్‌కు సమీపంలో నిర్మించిన ఓ భారీ అపార్ట్‌మెంట్‌లో ధరలు తగ్గించినా కొనుగోళ్లు జరగడం లేదని ఓ యజమాని వాపోయారు. పిల్ల పెళ్లికి ఉపయోగపడుతుందని స్థలం కొనుగోలు చేస్తే ఇప్పుడది అమ్ముడుపోవడం లేదని తెలిపారు.

గృహ రుణాలకు బ్యాంకర్ల వెనుకంజ..
ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో గృహ రుణాలు ఇచ్చేందుకూ బ్యాంకర్లు వెనకడుగేస్తున్నాయి. తీరా కస్టమర్‌కు రుణం మంజూరు చేశాక హైడ్రా అధికారులు సంబంధిత ప్రాజెక్ట్‌ను కూలదోస్తే కస్టమర్ నెలవారీ వాయిదా (ఈఎంఐ) చెల్లింపుల్లో తిరకాసు పెడితే బ్యాంకులు ఆర్థికంగా కుదేలవుతాయని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ఇప్పటికే బ్యాంకులకు అంతర్గతంగా మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

కస్టమర్లలో వేచిచూసే ధోరణి



అకాల వర్షాలు, హైడ్రా చర్యల నేపథ్యంలో కస్టమర్లు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. మరోవైపు మార్కెట్‌లో నగదు లభ్యత తక్కువగా ఉంది. దీంతో గత 2–3 నెలలుగా గృహాల విక్రయాలు తక్కువగా ఉన్నాయి. దసరా, దీపావళి నాటికి మార్కెట్ పుంజుకుంటుందని ఆశిస్తున్నాం.
– డాక్టర్ కిరణ్, సీఈఓ, సుచిరిండియా

ఇంటికో ఇంకుడు గుంత

- అక్టోబర్ 2 నుంచి స్పెషల్ డ్రైవ్
- ప్రతి నల్లా వినియోగదారుడి ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత తవ్వాలి
- జియాలజిస్టులతో అవసరమైన సాంకేతిక సహకారం
- ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోని క్యాన్ నంబర్లపై దృష్టి
- భూగర్భ జలాలు పెంపొందించే దిశగా జలమండలి అడుగులు

తప్పనిసరి చేస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: అత్యంత వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతుండగా..వాన చినుకు నేలలో ఇంకే పరిస్థితి లేకుండా పోతోంది. దీంతో ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలను పెంపొందించే దిశగా జలమండలి అడుగులేస్తోంది. ఇటీవల వేసవిలో మహానగరానికి తాగునీరు అందించే నాగార్జునసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల్లో నీటి మట్టం అడుగంటడంతో అత్యవసర పంపింగ్‌తో డెడ్‌స్టోరేజీ నుంచి జలాలను తరలించి తాగునీటి అవసరాలు తీర్చారు. మరోవైపు నగరంలో భూగర్భ జలాలు పడిపోవడంతో గృహ అవసరాలకు సైతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి సరికొత్త ప్రణాళికతో కార్యాచరణకు సిద్ధమయ్యారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత
మహానగరంలో నీటి సంరక్షణ చర్యల ద్వారా ప్రతి ఇంటా భూగర్భ జలాలను రిస్టోర్ చేసుకునే దిశగా ఇప్పటికే నల్లా కనెక్షన్ ఉన్న వారితో పాటు కొత్తగా కనెక్షన్ తీసుకోవాలనుకునే వారి ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు తప్పనిసరి చేసేందుకు జలమండలి దృష్టి సారించింది. అక్టోబర్ 2న రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పథకంలో భాగంగా 'ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత' అనే పేరుతో స్పెషల్ డ్రైవ్ ప్రారంభించాలని నిర్ణయించింది. ఇంకుడు గుంత నిర్మించుకోవడానికి అర్హత కలిగిన జియాలజిస్టులతో అవసరమైన సాంకేతిక సహకారాలను జలమండలి అందించనుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి. నల్లా కనెక్షన్‌కు సంబంధించిన అనుమతి లేఖలో సైతం ఇంకుడు గుంతల ఏర్పాటు షరతు ఉంటుంది. అయితే భవన నిర్మాణం సమయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నా.. కాలక్రమేణా దాన్ని పునరుద్ధరించుకోవడంలో ఆసక్తి చూపని వాళ్లను, అసలు ఇంకుడు గుంతల నిర్మాణమే చేపట్టకుండానే ఇళ్లు నిర్మించుకున్న నల్లా కనెక్షన్‌దారులను జలమండలి గుర్తించింది.

కొనసాగుతున్న సర్వే..
ఈ ఏడాది వరల్డ్ వాటర్ డే సందర్భంగా ఇంకుడు గుంతల సర్వే కోసం జలమండలి ఒక అప్లికేషన్ రూపొందించి అందుబాటులోకి తీసుకొచ్చింది. 300 చదరపు మీటర్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రాంగణాలు గల వినియోగదారుల క్యాన్ నంబర్ల ఆధారంగా ఇంకుడు గుంతల స్థితిగతులపై సర్వే నిర్వహిస్తోంది. మొదటి విడతలో సుమారు 42,784 గృహ సముదాయాల ప్రాంగణాలను తనిఖీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఈ ఏడాది జూన్ 14 నుంచి ఈ నెల 18 నాటికి దాదాపు 25,578 ప్రాంగణాలు తనిఖీ చేయగా వాటిలో 12,446 ప్రాంగణాలు మాత్రమే ఇంకుడు గుంతలు కలిగి ఉన్నట్లు తేలింది. మిగిలిన 13,132 ప్రాంగణాలు ఇంకుడు గుంతలు లేనివిగా గుర్తించి నివేదిక సమర్పించారు. తాజాగా స్పెషల్ డ్రైవ్ ముమ్మరం చేసేందుకు జలమండలి సిద్ధమైంది. ఇక డివిజన్‌ను ఒక యూనిట్‌గా పరిగణించి తనిఖీలు ముమ్మరం చేయనుంది. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 300 చదరపు మీటర్లు, అంతకంటే అధిక విస్తీర్ణంలో ఉన్న బహుళ గృహ సముదాయాలతోపాటు వ్యక్తిగత గృహాల డేటా సేకరించి..ఆ వివరాల్ని ప్రత్యేక యాప్‌లో పొందుపర్చాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లో భూగర్భ జలాల క్షీణత లేకుండా ఉండేందుకు శాస్త్రీయ పద్ధతిలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టే విధంగా జలమండలి తమ వినియోగదారులకు అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం 18 ఎన్జీవోల ప్రతినిధుల్ని రంగంలోకి దింపుతున్నారు.

వినియోగదారులకు లేఖలు
సర్వే నివేదికల ప్రకారం ప్రత్యేక యాప్‌లో పొందుపర్చిన డేటా ఆధారంగా డివిజన్ స్థాయి అధికారులు తమ పరిధిలోని వినియోగదారులకు అడ్వైజరీ లేఖలు జారీ చేసే విధంగా జలమండలి చర్యలు చేపట్టనుంది. ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించడం, ఒకవేళ పాడైతే వాటికి మరమ్మతు చేయడం, వాటిని మెయింటెన్ చేయాలని లేఖ ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వనుంది. ఒకవేళ వినియోగదారులు పైన పేర్కొన్న సూచనలను పాటించడంలో విఫలమైతే.. వచ్చే ఏడాది నుంచి ట్యాంకర్ల బుకింగ్ సందర్భంగా రెట్టింపు ఛార్జీల భారం మోపే అవకాశాల కనిపిస్తున్నాయి.



రెట్టింపు చార్జీలు తప్పవు

ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించకుండా వచ్చే ఏడాది 2025 జనవరి నుంచి వాటర్ ట్యాంకర్ బుక్ చేసుకునే వినియోగదారుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేయాలని జలమండలి నిర్ణయించింది. కేవలం వినియోగదారుల ప్రాంగణాల్లో గల బోర్లలో గర్భ జలాలు పెంచేందుకు ఇలాంటి కఠిన నిర్ణయం అమలు పర్చేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మే నెల వరకు అత్యధికంగా ట్యాంకర్లు బుక్ చేసిన వినియోగదారులను ఇప్పటికే జలమండలి గుర్తించింది. మొదటగా వారి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రోత్సహించనుంది.



ప్రయాణికుడికి గుండెపోటు.. | సీపీఆర్ చేసిన కండక్టర్, డ్రైవర్


ఎండీ సజ్జనార్‌తో కండక్టర్, డ్రైవర్

జీడిమెట్ల: బస్సులో గుండెపోటు వచ్చిన ప్రయాణికుడికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించిన కండక్టర్, డ్రైవర్‌ను టీఎస్‌ఆర్‌టీసీ యాజమాన్యం అభినందించింది. వివరాల్లోకెళితే.. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జీడిమెట్ల డిపోకు చెందిన బస్సు బాలానగర్ నుండి జీడిమెట్ల వైపు వెళ్తోంది. ఐడీపీఎల్ వద్ద రామకృష్ణ(67) అనే ప్రయాణికుడు రన్నింగ్ బస్సు ఎక్కాడు. బస్సు గణేష్‌నగర్ బస్టాప్ దాటగానే ఆయనకు గుండెపోటు రావడంతో బస్సులోనే కుప్పకూలిపోయాడు. వెంటనే కండక్టర్ అంజలి డ్రైవర్ సైదులుకు విషయం చెప్పగానే బస్సు పక్కకు నిలిపాడు. ప్రయాణికుడిని మిగతా ప్రయాణికుల సహాయంతో కిందకు దింపి కండక్టర్ ప్రయాణికుడికి సీపీఆర్ చేశారు. మరో ప్రయాణికుడు కూడా ఇందుకు సహకరించాడు. దీంతో రామకృష్ణ కోలుకోగా..అతడిని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికుడు సేఫ్‌గానే ఉన్నాడని డాక్టర్లు తెలిపారు. సమయస్ఫూర్తితో ప్రయాణికుడి ప్రాణం కాపాడిన కండక్టర్ అంజలి, డ్రైవర్ సైదులును ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. డిపో మేనేజర్ ఆంజనేయులుతో సహా వారిని శనివారం బస్‌భవన్‌కు పిలిపించి శాలువాతో సత్కరించారు.

ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ కంపెనీపై చీటింగ్ కేసు

సాక్షి, సిటీబ్యూరో: ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కంపెనీపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) చీటింగ్ కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అపార్ట్‌మెంట్లను డెవలప్ చేసి ఇస్తానని ఇవ్వకుండా రూ.28 కోట్లు మోసం చేసిందని బాధితుడు ఆరోపించారు. ఈమేరకు ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు తోట సత్యనారాయణ, తోట అనిరుద్, తోట చంద్రశేఖర్, తోట మణిబాబు, అజయ్, శివలపై ఐపీసీ 406, 420, 506 రెడ్‌విత్ 120–బీ సెక్షన్ల కింద పోలీసులు ఏప్రిల్ 24న కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. 2021 మార్చిలో మియాపూర్‌కు చెందిన శ్రీసాయి తిరుమల కన్‌స్ట్రక్షన్ ఎండీ వాకాడ తిరుమల రావు, ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ కంపెనీతో పలు ఫ్లాట్ల అభివృద్ధికి ఒప్పందం చేసుకున్నారు. రూ.50 కోట్ల పెట్టుబడులతో 90 శాతం నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. అయితే ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ సకాలంలో నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకుండా జాప్యం చేసింది. చెల్లింపుల కోసం పలుమార్లు తిరుమల రావు ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కార్యాలయానికి వెళితే బౌన్సర్లతో దాడులు చేయించారు. సుమారు రూ.29 కోట్ల బకాయిలు చెల్లించకుండా మోసం చేశారని బాధితుడు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్టీసీ డ్రైవర్‌పై దుండగుల దాడి


డ్రైవర్ గణేష్‌ను పరామర్శిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

కాప్రా: కుషాయిగూడ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ దరావత్ గణేష్‌పై కొందరు దుండగులు విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గణేష్‌ను తార్నకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ అధికారులు తెలిపిన మేరకు.. కుషాయిగూడ ఆర్టీసీ డిపోకు చెందిన 3కె–281 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు అఫ్జల్‌గంజ్ నుంచి ఈసీఐఎల్ మీదుగా ఘట్‌కేసర్ కు వెళుతోంది. శుక్రవారం ఓయూ వై జంక్షన్ వద్దకు చేరుకోగానే కొందరు దుండగులు అకస్మాత్తుగా బస్సుకు అడ్డువచ్చి ఆపి, బస్సులో ఉన్న డ్రైవర్‌పై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఆరుగు దుండగులు ఇష్టానుసారంగా దూషిస్తూ, దాడికి పాల్పడటంతో డ్రైవర్ గణేష్ తీవ్రంగా గాయాలపాలయ్యాడు, తలకు తీవ్రంగా గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. హుటాహుటిన తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి గణేష్‌ను తరలించారు.

దాడులకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం: వీసీ సజ్జనార్

ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్. దాడికి పాల్పడిన వ్యక్తులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. కుషాయిగుడా డిపో డ్రైవర్ గణేష్‌పై జరిగిన దాడి ఘటన తెలుసుకున్న సజ్జనార్ శనివారం తార్నాక ఆర్టీసీ ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

హష్ ఆయిల్ విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

రూ.21 లక్షల ఆయిల్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, పోలీసుల అదుపులో నిందితులు

నాగోలు: విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి హష్ ఆయిల్ తీసుకువచ్చి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టుచేసి వారి వద్దనుంచి రూ. 21 లక్షల హష్ ఆయిల్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎల్‌బీనగర్ రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. సైదాబాద్ కాలనీ చెందిన పూటాల రంజిత్‌కుమార్ అలియాస్ నిఖిల్ అలియాస్ చోటు (29) మీర్‌పేటలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తునాడు. ఇతనికి వరంగల్ జిల్లాకు చెందిన బొల్లం సాయినితిన్ అలియాస్ సిద్ధు(23) విద్యార్థి పరిచయమయ్యాడు.వీరు మీర్‌పేట్, బాలాపూర్, తిరుమల ఎన్‌క్లేవ్ చెందిన బచ్చు నరేంద్ర(23), ఎల్‌బీనగర్ పిండి నారాయణరెడ్డి కాలనీ చెందిన బోయినపల్లి సాయికృష్ణ(28)లతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రంజిత్‌కుమార్ గతంలో హష్ ఆయిల్ విక్రయించిన కేసులో జైలులకు వెళ్లివచ్చాడు. జైలు నుండి విడుదలయ్యాక స్నేహితులతో కలిసి కారులో ఏపీలోని అన్నవరానికి వెళ్లారు. అక్కడ సాయి వద్ద 2700 గ్రాములు హష్ ఆయిల్ కొనుగోలు చేసి హైదరాబాద్ తీసుకువచ్చారు. సాయి నితిన్ ఇంట్లో నిల్వ చేసి చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి విక్రయిస్తున్నారు. ఈ నెల 21 వ తేదీన ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు వచ్చిన సమాచారం మేరకు మీర్‌పేట పోలీసులతో కలిసి రంజిత్ కుమార్, సాయినితిన్, నరేంద్ర, బోయిన్‌పల్లి సాయి కృష్ణలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి (2.3) కిలోల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నుంచి స్వాధీనం చేసుకున్న హష్ ఆయిల్ ధర రూ. 21 లక్షలు ఉంటుందని తెలిపారు. 2.8 కేజీల హష్ అయిల్ తయారు కావడానికి సుమారు 100 కేజీల గంజాయిని ఆకులను వినియోగిస్తారని సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు...

బిహార్‌కు చెందిన సంతోష్‌కుమార్ అలియాస్ సంతోష్ ప్రసాద్ (26) మహేశ్వరం, రావిరాల గ్రామంలో నివాసం ఉంటూ కూలిపని చేసు కుంటున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన బీరేందర్‌సింగ్(52)కూడా నగరంలోనే ఉంటున్నాడు. సంతోష్ ఆగస్టు నెలలో తన స్వగ్రామానికి వెళ్లి అక్కడ గంజాయి చాక్లెట్‌లను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తిరిగి వచ్చి నగరంలో విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ నెల 20న పోలీసులు గమనించి వారి వద్ద నుంచి 19 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. అలాగే ఈ నెల 16న ఇద్దరు అంతరాష్ట్ర మాదక ద్రవ్యాల వ్యాపారులను పట్టుకొని వారి వద్ద నుంచి 199 గ్రాముల నల్లమందు, 632 గ్రాముల హష్ ఆయిల్, ద్విచక్ర వాహనం, మొత్తం రూ. 7.8 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

కోకాపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


ప్రహరీలను తొలగించిన రెవెన్యూ సిబ్బంది

మణికొండ: గతంలో ఇచ్చిన 60 గజాల పట్టాల స్థలం పోను మిగిలిన అర ఎకరంపైగా ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలపై శనివారం గండిపేట రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. ఏకంగా 10 వరకు నిర్మాణాలను నేలమట్టం చేశారు. కోకాపేట రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 147లో 190 మందికి 60 గజాల ఇంటి పట్టాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కేటాయించారు. అవి కాకుండా మరింత స్థలం మిగిలి ఉంది. దానిపై కన్నేసిన కొందరు ప్రబుద్ధులు నకిలీ పట్టాలను సృష్టించి మున్సిపల్ కార్యాలయంలో ఇంటి నెంబర్లను ఇప్పించి ఒక్కో పట్టాను రూ. 30 లక్షల నుంచి రూ. 50లక్షల వరకు అమ్మకాలు జరిపారనే ఫిర్యాదులు వచ్చాయి. అలా కొనుగోలు చేసిన వారు ఇటీవల అందులో నిర్మాణాలు చేపట్టారు. వాటిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు రావటంతో శనివారం వాటిని నేలమట్టం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దాంతో ఉదయం నుంచే నార్సింగి పోలీసుల భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలను చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కూల్చివేతలను అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. కూల్చివేతలకు అడ్డుతగిలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పటంతో వెనుదిరిగారు. దాంతో వెలసిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. విషయం తెలుసుకుని రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్ బి.జ్ఞానేశ్వర్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ విజయ్‌బాబుల ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్‌లు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని పేదల గృహాలు ఎందుకు కూల్చారని వాదనకు దిగారు.

వీడిన హత్యకేసు మిస్టరీ

నాంపల్లి: అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఓ వ్యక్తి కేసు మిస్టరీని హబీబ్‌నగర్ పోలీసులు చేధించారు. అక్కా, తమ్ముడు కలిసి ఆ వ్యక్తిని హత్య చేసినట్లుగా నిర్ధారించారు. దీంతో హత్యకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో 17వ తేదీ అర్ధరాత్రి కురుమబస్తీలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఏ బ్యాట్రీలేన్‌కు చెందిన ఖాజా నిజాముద్దీన్ అలియాస్ ఖాలేద్(60) కురుమ బస్తీలోని తనకు పరిచయం ఉన్న రేణుకా అనే మహిళ ఇంటికి తరచుగా వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17న అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆమె ఇంటికి వచ్చాడు. తన కోరిక తీర్చాలని కోరగా ఆమె ఒప్పుకోలేదు. అనంతరం అతని నోటికి టవాల్‌ను చుట్టి మీద కూర్చుని చంపేసింది. అంతటితో ఆగకుండా ఆమె తమ్ముడు ఎం.వెంకటేష్‌ను పిలిచి మృతదేహాన్ని ఇంటి ముందు అరుగుపై పారేశారు. దీంతో పోలీసులు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటనగా కేసును నమోదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారించగా అతడు హత్యకు గురైనట్లుగా తేల్చారు. పోలీసుల విచారణలో రేణుక, ఆమె తమ్ముడు ఎం.వెంకటేష్ చంపినట్లుగా ఒప్పుకోవడంతో ఇరువురిని అరెస్టు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఐఐటీ విద్యార్థి, మరో యువకుడి అరెస్ట్

అమీర్‌పేట: గంజాయి విక్రయిస్తున్న ఐఐటీ విద్యార్థి, మరో యువకుడిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి కిలో 28 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌పేట ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ పటేల్ భానోతు తెలిపిన మేరకు.. గుంటూరు జిల్లా కారెంపూడికి చెందిన వేముల పవన్‌కుమార్ ఐఐటీ చదువుతున్నాడు. ఎస్ఆర్‌నగర్ మెట్రోపిల్లర్ నెం.1016 సమీపంలో ఉన్న పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. గంజాయికి అలవాటు పడ్డ పవన్ అదే హాస్టల్‌లో ఉంటూ స్విగ్గిబాయ్‌గా పనిచేసే గుంటూరు జిల్లా కనిరెకల్లుకు చెందిన కొల్లి మణికంఠతో కలిసి గంజాయి సేవించడమే కాకుండగా తెలిసిన వ్యక్తులకు గంజాయి విక్రయిస్తున్నాడు. గుంటూరు జిల్లా కారెంపుడికి చెందిన బత్తుల రమేష్ ద్వారా గంజాయి తెచ్చి విక్రయిస్తున్నారు. రమేష్ ఒరిస్సాకు చెందిన కమలేష్‌కు పవన్, మణికంఠలను పరిచయం చేయగా అతడి ద్వారా ఒరిస్సాకు వెళ్లి అక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు పవన్,మణికంఠను హాస్టల్‌లో అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.గంజాయి సరఫరా చేసిన కమలేష్,రమేష్‌లు పరారీలో ఉన్నారు.మొత్తం 21 మందికి గంజాయి విక్రయించినట్లు గుర్తించి వారు గంజాయి విక్రయించినట్లు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రొటెక్ట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు. వార్డెన్‌పై విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రొటెక్ట్ ప్రొటెక్షన్ సభ్యులు విద్యార్థినులను విచారించారు. వారి నుంచి పూర్తి నివేదికను స్వీకరించిన అనంతరం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రొటెక్షన్ అధికారి వెంకటేశ్ శనివారం మధ్యాహ్నం బుద్వేల్ ప్రభుత్వ పాఠశాల వద్దకు వెళ్లి ఉపాధ్యాయుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. హాస్టల్‌లో ఉంటున్న 43 మంది విద్యార్థినులను నగరంలోని బాలికల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మేడ్చల్ రూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం మేడ్చల్ బస్ డిపో సమీపంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన మేరకు.. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన రాగటి జ్యోతి(30) మేడ్చల్‌లోని హాస్టల్‌లో నివాసం ఉంటూ కొంపల్లిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. శనివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా పట్టణంలోని బస్‌డిపో సమీపంలో డిపో వద్దకు వెళ్లేందుకు 44వ జాతీయ రహదారి దాటుతుండగా అదే సమయంలో నగరం వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ప్రమాదంలో జ్యోతి అక్కడికక్కడే మరణించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

కత్తితో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

మూసాపేట: రోడ్డుపై ఉన్న ద్విచక్రవాహనాలను అడ్డు తియ్యమన్నందుకు జరిగిన గొడవలో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు.. నవీన్‌రావు, అవినాష్ రావులు కారులో వస్తున్నారు. అమీర్‌పేట్‌కు చెందిన జగ్‌జ్యోతి సింగ్ బాలాజీనగర్, కూకట్‌పల్లిలో వినాయక నిమజ్జనానికి వచ్చారు. వినాయక నిమజ్జనం వాహనం వెళుతుండగా జగ్‌జ్యోతి సింగ్ రోడ్డుపై స్నేహితులతో కలిసి బైక్స్ అడ్డుపెట్టుకొని ఉన్నారు. బైక్‌లు అడ్డు తీయాలని కోరడటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వెంటనే జగ్‌జ్యోతి సింగ్ తనతో ఉన్న కత్తితో నవీన్‌కు పొట్టలో, అవినాష్‌కు తొడలో పొడిచాడు. నవీన్‌కు ఐదు కుట్లు పడ్డాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే జగ్‌జ్యోతి సింగ్‌పై గతంలో రెండు కేసులు ఉన్నాయని, అటెంప్ట్ మర్డర్, దొంగతనం కేసు నమోదు అయ్యాయని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన చిలుక మధుసూదన్‌రెడ్డి


గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ నూతన చైర్మన్‌గా నియమితులైన చిలుక మధుసూదన్‌రెడ్డి శనివారం బాటసింగారంలోని మార్కెట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మార్కెట్ సిబ్బంది మధుసూదన్‌రెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని వారివారి కార్యాలయాల్లో కలిసి, కృతజ్ఞతలు తెలియజేశారు.

వానొచ్చిన ప్రతీసారి..!

వరదనీరు మ్యాన్‌హోళ్లలోకి..

ఫిలింనగర్: వర్షం కురిసిన ప్రతీసారి కొంతమంది భవన యజమానులు, నిర్మాణంలో ఉన్న సెల్లార్ యజమానులు యథేచ్ఛగా వరద నీటిని మ్యాన్‌హోళ్లలోకి పంపింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఓవర్ లోడ్‌తో మ్యాన్‌హోళ్లు ఎక్కడికక్కడ పొంగుతున్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ ముందు పెద్ద ఎత్తున బురద నీరు మ్యాన్‌హోళ్ల నుంచి పొంగడంతో ఫిలించాంబర్ పరిసర ప్రాంతాలన్నీ మురుగు, బురదమయంగా మారాయి. పలుమార్లు ఇక్కడ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని సంబంధిత అధికారులకు చెప్పినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. మ్యాన్‌హోళ్లలోకి వరద నీటిని పంపింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


ఫిలించాంబర్ ముందు పారుతున్న బురద నీరు

అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన అవసరం


వరల్డ్ అల్జీమర్స్ డే వేడుకల్లో పాల్గొన్న డాక్టర్లు

శ్రీనగర్‌కాలనీ: అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన అవసరమని, రోగి తీవ్రమైన మతిమరుపుతో బాధపడుతున్నపుడు వారికి సహాయంగా ఉండాలని మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ కమిటీ–ఐపీఎస్, టీఎస్‌బీ డాక్టర్ జార్జిరెడ్డి అన్నారు. శనివారం ఎర్రగడ్డలోని మానసిక ఆసుపత్రిలో వరల్డ్ అల్జీమర్స్ డే వేడుకలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఉస్మానియా మెడికల్ కాలేజ్, హైదరాబాద్ సైకియాట్రిక్, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వయసు పెరిగిన తర్వాత వృద్ధాప్య దశలో వచ్చే ఈ అల్జీమర్స్ వ్యాధి తీవ్రత, రోగుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పలు అంశాలపై ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల, డాక్టర్ సుధారాణి సైకియాట్రిక్ హెచ్‌ఓడీ, హైదరాబాద్ సైకియాట్రిక్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ హృశికేష్ గిరి ప్రసాద్‌లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణికాంత్, డాక్టర్ వివాశ్వన్, డాక్టర్ ఓమేష్, డాక్టర్ వెంకట సుబ్బయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమమే ఊపిరి, పోరాటమే ధ్యేయంగా..

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

లిబర్టీ: ఉద్యమమే ఊపిరిగా పోరాటమే ధ్యేయంగా జీవితాంతం కొండా లక్ష్మణ్ బాపూజీ పని చేశారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వి.సదానందు అన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని లిబర్టీ సమీపాన ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మణ్‌బాపూజీ తొలి తరం తెలంగాణ నాయకుడని తెలిపారు. తొలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో బాపూజీ ప్రధాన భూమిక పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారుడిగా స్వాతంత్ర్య ఉద్యమకారుడుగా గొప్ప పేరు సంపాదించి, బడుగు, బలహీన వర్గాల పక్షాన పని చేశారన్నారు.

ఈవో, డీపీఓలపై చర్యలు తీసుకోవాలి

కాచిగూడ: అన్యాయంగా తన ప్లాట్‌లోని గోడలను కూల్చిన స్థానిక ఈవో, డీపీఓలపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సాజిద్‌బిన్ ముబారక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం, ముత్తంగి గ్రామం రామరాజు నగర్‌లో 30 ఏండ్ల క్రితం సర్వే నెంబర్ 55, 56, 82, 85లలో తమ కుటుంబం కొనుగోలు చేసిన 100 గజాల ప్లాట్‌లో నిర్మించుకొన్న గోడలను ఇటీవల స్థానిక ఈవో, డీపీఓలు కూలగొట్టారని తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద గజాల ప్లాట్‌లో తన తమ్ముడికి 50 గజాలు పోను తనకు వచ్చిన స్థలంలో ఇంటి గోడలు నిర్మించుకొన్నానని, ఈ ఏడాది ఆగస్టు 25న తన ప్లాట్‌లో నిర్మితమైన గోడలను స్థానిక ఈవో జేసీబీతో అన్యాయంగా కూలగొట్టారని ఆరోపించారు. అంతే కాకుండా కొంతమంది ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ స్పష్టం చేశారు. బోరబండ డివిజన్ పలు బస్తీలో శనివారం ఆయన పర్యటించి అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీల్లోని మౌలిక సమస్యల సాధనకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. అంటు రోగాలు ప్రబలకుండా ఇప్పటికే జీహెచ్‌ఎంసీ అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు తాను బోరబండ సైట్–2 లో కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ భరత్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్ కుమార్‌గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలను అడిగితెలుసుకుంటున్న బాబాఫసియుద్దీన్

శ్రీజా నారాయణన్‌కు 'ఇన్‌స్పైరింగ్' అవార్డు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఇంగ్లిష్ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీజా నారాయణన్ ఇన్‌స్పైరింగ్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ సహోదయ స్కూల్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో సెలబ్రిటీచర్–2024లో భాగంగా ఇటీవల బహదూర్‌పల్లిలోని ది క్రీక్ ప్లానెట్ స్కూల్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకెంతో సహకారం అందించి అవార్డు రావడానికి పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి, డైరెక్టర్ వరలక్ష్మీల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు.


ఇన్‌స్పైరింగ్ టీచర్ అవార్డును అందుకుంటున్న శ్రీజా నారాయణన్

'మహిళా శక్తి' సంపద సృష్టి..!

- ఆర్థికంగా ఎదిగేందుకు 14 యూనిట్లు అందుబాటులోకి
- వ్యాపారాల వైపు అతివల అడుగులు
- నూతన పథకం అమలుతో ఎంతో మందికి లబ్ధి
- ముందుకు వస్తున్న మహిళలు

బంజారాహిల్స్: వివిధ వ్యాపారాలతో మహిళలు ఉపాధి పొందేలా ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి శ్రీకారం చుట్టింది. స్వయం ఉపాధి పొంది మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా తమ కాళ్లపై తాము నిలబడుతూ మరింత మందికి ఉపాధి కల్పించే దిశలో అడుగులు వేసింది. ఆధునిక మార్కెట్‌కు తగినట్లుగా లాభాలను ఆర్జించే వ్యాపారాలను ప్రోత్సహించి మహిళలచే సంపద సృష్టించడమే ఈ పథకం లక్ష్యం. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో 14 రకాల యూనిట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పటికే పలు యూనిట్లు కొనసాగుతూ మరింత మంది మహిళలకు ఉద్యోగాలు కూడా కల్పించాయి.

ఆర్థికబలోపేతమే లక్ష్యం..

- మహిళల జీవనోపాధిని మెరుగుపరిచి వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ పథకాన్ని వ్యక్తిగతంగా, సామూహికంగా అమలు చేస్తున్నారు.
- యూనిట్లకు అనుగుణంగా రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణసాయం అందిస్తున్నారు. బ్యాంక్ లింకేజీతో పాటు స్త్రీ నిధిలో సైతం రుణాలను కేటాయిస్తున్నారు.
- క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ల నిర్వహణపై 10 రోజుల నైపుణ్య శిక్షణతోపాటు మరో 12 రకాల యూనిట్లను పంపిణీ చేస్తున్నారు.


అవగాహన కలిగిస్తున్న సర్కిల్–18 యూసీడీ అధికారులు


మహిళాశక్తి ద్వారా ఏర్పాటు చేసుకున్న కుట్టు కేంద్రంలో అష్రఫ్ ఉన్నీసాబేగం

నైపుణ్యాభివృద్ధి లేకపోతే కష్టం..

ఏ రంగంలోనైనా వ్యాపార మెళకువలు, నైపుణ్యాభివృద్ధి లేకపోతే నిర్వహణ కష్టంగామారి నష్టాలు వచ్చే ప్రమాదం ఉంది. వ్యాపారం ప్రారంభించే ముందు ఆర్థికపరమైన లాభ, నష్టాలను అంచనా వేసుకోవాలి. లక్ష్యాల కోసం ఏర్పాటు చేస్తే మార్కెట్ తీరు అందుకు భిన్నంగా ఉంటుంది. ఈ మేరకు నైపుణ్యాలను పెంచేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు ఆయా లోటుపాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ రంగంలో రాణించవచ్చు.

సర్కిల్–18 పరిధిలో యూనిట్లు..

కిరాణా షాపులు–9, చికెన్ సెంటర్–1, క్యాటరింగ్–1, టిఫిన్ సెంటర్లు–5, కూరగాయల వ్యాపారాలు–4, టైలరింగ్–8, చీరల వ్యాపారం–5, డ్రై క్లీనింగ్ సెంటర్లు–1, బియ్యం దుకాణం–1, బ్యూటీ పార్లర్‌లు–3, వన్ గ్రాము గోల్డ్ షాపు–1, పేపర్ షాపు–1, జిరాక్స్ మిషన్–1, ఫ్యాన్సీ స్టోర్–1.

42 మందికి యూనిట్ల పంపిణీ

– ఆశావిరోనిక, యూసీడీ డీపీఓ, సర్కిల్–18

జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలో మహిళా గ్రూపులకు ఇందిరా మహిళా శక్తి యూనిట్లను కేటాయిస్తున్నాం. ప్రస్తుతం వీటిని ఆన్‌లైన్ చేస్తున్నాం. ఇటీవలే బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని భోలానగర్ బస్తీలో సహారా గ్రూపులో ఉన్న అష్రఫ్ ఉన్నీసాబేగం కుట్టుమిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంది. దీని ద్వారా కుట్టు శిక్షణ ఇవ్వడమే కాకుండా మరింత మందికి ఉపాధి కూడా కల్పించడం జరుగుతుంది. ఇలా మరిన్ని యూనిట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. వ్యాపారం ఎలా చేసుకోవాలో అవగాహన కూడా కల్పిస్తున్నాం. ఈ వ్యాపారాలకు అర్హులు ఎవరో గుర్తించడం జరుగుతుంది. బ్యాంక్ లింకేజీని కూడా ఏర్పాటుచేస్తున్నాం. రుణాలు సిద్ధంగా ఉన్నాయి. ఎవరు ఎలాంటి వ్యాపారం చేస్తుందో గ్రౌండింగ్ చేస్తున్నాం.

స్థలాలు పరిశీలిస్తున్నాం

– శ్రీనివాస్, యూసీడీ డీపీఓ, సర్కిల్–17

సర్కిల్–17 పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, సోమాజీగూడ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం 900 మహిళా సంఘాలు ఉండగా 600 గ్రూపులు యాక్టివ్‌గా ఉన్నాయి. 17 సమాఖ్యలు పని చేస్తున్నాయి. ఇందిరా మహిళా శక్తి స్కీం ద్వారా వారిని ఆర్థిక శక్తివంతంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నాం. మహిళల స్వయం ఉపాధికి క్యాంటీన్లు, ఇతర యూనిట్లపై దృష్టిపెట్టాం. స్థలాల పరిశీలన జరుగుతున్నది. ఎక్కడ ఏర్పాటు చేస్తే వ్యాపారాలు బాగుంటాయో సర్వేలు చేస్తున్నాం. ఈ వ్యాపారాల పట్ల ఎవరెవరు ఆసక్తి ఉన్నారో డేటా కలెక్ట్ చేస్తున్నాం. ఇప్పటికే ప్రజాభవన్‌లో క్యాంటీన్ కొనసాగుతుంది. మహిళలు కూడా ముందుకువచ్చి తాము ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టాలి.

మెర్సిడెస్-బెంజ్ సిల్వర్ స్టార్ షోరూం ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో : మెర్సిడెస్–బెంజ్ సిల్వర్ స్టార్ మోడరన్ ఆర్కిటెక్చర్ ఆఫ్ రిటైల్ కాన్సెప్ట్ కింద రూపొందించబడిన అత్యాధునిక సౌకర్యం గల షోరూంను సంస్థ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిల్వర్ స్టార్ ఆటోమోటివ్ పరిశ్రమలో లగ్జరీ కస్టమర్ కోసం కొత్త బెంచ్ మార్క్‌లను సెట్ చేస్తూ కొత్తగా పునరుద్ధరించిన కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను తిరిగి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. లగ్జరీ సెగ్మెంట్‌లోని అతిపెద్ద వర్క్‌షాప్‌లలో ఒకటైన సిల్వర్ స్టార్ కస్టమర్ సర్వీస్ సెంటర్ ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచబడింది, ఇది లగ్జరీ ఆటోమొబైల్స్ కోసం హైదరాబాద్‌లోని అత్యంత అధునాతన సౌకర్యాలలో ఒకటిగా మారిందని తెలిపారు.

'మెక్సరోసా' ప్రారంభం



బంజారాహిల్స్: విభిన్న రుచుల సమాహారం మెక్సరోసా శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మెక్సరోసా ప్రతినిధి ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ మెక్సరోసాను హైదరాబాద్ నగరానికి పరిచయం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేవలం రుచులకే పరిమితం కాకుండా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఆహారం నుంచి ఆహార్యం వరకు సూక్ష్మ విషయాల పట్ల కూడా అధిక శ్రద్ధ వహించి అతిథులు శాశ్వత జ్ఞాపకాలను సొంతం చేసుకునేవిధంగా మెక్సరోసాను రూపొందించడం జరిగిందన్నారు.

తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

పంజగుట్ట: 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆత్మబలిదానం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి తొలగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం బాధాకరమని ప్రభుత్వం ఆలోచించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ఆర్య వైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) విజ్ఞప్తి చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా, పొట్టి శ్రీరాములు మనవరాళ్లు రేవతి, దేవకి, మునిమనవరాలు కుంద ప్రతిభలు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు అంటే ఒక ప్రాంతానికో, ఒక రాష్ట్రానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన దేశం గర్వించదగ్గ మహా నాయకుడన్నారు. తమకు సురవరం ప్రతాప్‌రెడ్డి అంటే ఎంతో గౌరవమని కొత్తగా ఏర్పాటు చెయ్యబోయే ఏదైనా యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టుకోవచ్చునని పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా కొనసాగించేలా కేబినెట్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేశ్, ప్రేమ్ గాంధీ, కట్ట రవి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా 'ఎఫ్ఎన్‌సీసీ' సెక్రటరీ ఎన్నిక

బంజారాహిల్స్: ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) ఎన్నికలు ఈనెల 29న జరగనుండగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శనివారం ముగిసింది. సెక్రటరీ పదవికి పోటీలో ఉన్న కొలిశెట్టి కృష్ణారావు తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో పోటీలో ఉన్న మరో సభ్యుడు తుమ్మల రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీగా కె.సదాశివ రెడ్డి, ప్రమోటీ కమిటీ సభ్యులుగా జె.బాలరాజు, భాస్కర్ నాయుడు, కె. మురళీమోహన్‌రావు, ఎస్. నవకాంత్, ఖాజా సునయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక అధ్యక్ష పదవికి డాక్టర్ జ్యోతిప్రసాద్ కోసరాజు, కె.ఎస్.రామారావు, వైస్ ప్రసిడెంట్ పదవికి కె.అశోక్ కుమార్, ఎఫ్.ఎస్.రెడ్డి పోటీలో ఉన్నారు. అలాగే పర్మనెంట్ కమిటీ సభ్యులుగా నాలుగు పోస్టులకు గాను ఐదుగురు బరిలో నిలిచారు. వీరిని కూడా ఎన్నుకోనున్నారు. ఇదిలా ఉండగా 29న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదేరోజు సాయంత్రానికి ఫలితాలు వెల్లడౌతాయి.

విద్యాసంస్థలది కీలక బాధ్యత


డేకేర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

బంజారాహిల్స్: చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యాసంస్థలదే కీలక బాధ్యత అని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. అంతర్జాతీయ బ్రాండ్‌గా పేరొందిన సఫారీ కిడ్ ప్రీ స్కూల్ అండ్ డేకేర్‌ను బంజారాహిల్స్‌లో శనివారం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు చిన్ననాటి నుంచే మంచి మార్గాలను బోధించాలని సూచించారు. సఫారీ కిడ్ ఇండియా చైర్మన్ జితేంద్ర కర్సన్ చిన్నారులకు మెరుగైన విద్యను అందించే క్రమంలో సురక్షిత మార్గాలను పాటించడం జరుగుతుందన్నారు.

యాదవులు లేని మంత్రివర్గం బాధాకరం

పంజగుట్ట: ఇప్పటి వరకు యాదవులు లేని మంత్రివర్గం లేదని మొదటిసారి యాదవులు లేకుండా మంత్రివర్గం కొనసాగడం బాధాకరమని రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షులు ఎల్లావుల చక్రధర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాదవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ యాదవులకు కేవలం 2 సీట్లు మాత్రమే ఇచ్చిందని అది కూడా హైదరాబాద్ నగరంలో ఇచ్చిందని, నగరంలో 29 సీట్లల్లో ఒక్కటి కూడా కాంగ్రెస్ గెలవలేదని, ఇది కేవలం కాంగ్రెస్ తప్పిదమే అన్నారు. ప్రభుత్వం ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్న అంజన్‌కుమార్ యాదవ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, మహేష్, శంకర్, బి. శ్రీనివాస్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొడితే..దడదడే..!

- రహదారులన్నీ జలదిగ్బంధం
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్

బంజారాహిల్స్: ఆగకుండా గంటపాటు దంచికొట్టిన వానకు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల గుండెల్లో దడ పుట్టగా, ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. ఈ మధ్య కాలంలో కురిసిన భారీ వానల్లో శనివారం సాయంత్రం కురిసిన వానే అత్యధికం కావడం విశేషం. ఖైరతాబాద్ గణాంక భవన్‌తో పాటు సెస్ వద్ద అత్యధికంగా 7 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ఇక ఖైరతాబాద్‌తో పాటు చింతల్ బస్తీ, బంజారాహిల్స్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, అమీర్‌పేటలలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఖైరతాబాద్‌లోని బీజేఆర్ నగర్ బస్తీలోకి పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో ఇళ్లలోకి నీరు చేరింది. బంజారాహిల్స్ ప్రధాన రహదారితో పాటు పంజగుట్ట, అమీర్‌పేట్ ప్రధాన రహదారుల్లో గంటలకొద్ది ట్రాఫిక్‌జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


సోమాజిగూడలో


సోమాజిగూడ ప్రజాభవన్ రోడ్డులో


అమీర్‌పేట ప్రధాన రోడ్డులో నిలిచిన వరద నీరు


ఖైరతాబాద్ బీజేఆర్‌నగర్ బస్తీలో

యువతి అదృశ్యం


సాయి కుమారి

ఖైరతాబాద్: యువతి కనిపించకుండా పోయిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం .....గత రెండు సంవత్సరాలుగా దొడ్డి నూకరత్నం చింతలబస్తీ ప్రేమ్‌నగర్‌లో నివాసముంటోంది. ఈమె కూతురు దొడ్డి లీలా సాయికుమారి (19) ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం కాలేజీకని వెళ్లిన సాయికుమారి సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో తల్లి నూకరత్నం శనివారం ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కనిపించకుండా పోయిన సాయి కుమారి తెలుగు, ఇంగ్లిష్ మాట్లాడుతుందని, 5.3 అడుగుల ఎత్తు ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిస్తే ఖైరతాబాద్ పీఎస్ 8712661531 నెంబర్‌లో సమాచారం అందజేయాలని తెలిపారు.

విధ్వంసకర ఆలోచనలను వ్యతిరేకించాలి

– డాక్టర్ డి.సుధాకర్



ప్రపంచ శాంతి దినోత్సవంలో ఏఐపీఎస్‌వో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: విధ్వంసకర ఆలోచనలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం(ఏఐపీఎస్‌వో) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ డి.సుధాకర్ పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఐపీఎస్‌వో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని కవి సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ మతోన్మాద, సామ్రాజ్యవాద, హింసావాద చర్యలను ప్రతిఘటించి పౌర స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీలకతీతంగా కృషి చేయాలని కోరారు. ఇందుకోసం విద్యార్థులు, మేధావులు, మహిళలు, రచయితలు, ఉద్యమకారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు తమ కవితలను చదివారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌వో జాతీయ కార్యదర్శి యాదగిరిరెడ్డి, రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, రఘుపాల్, డాక్టర్ సమత, వెంకట్రామిరెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు.

షాదన్ ఛైర్మన్‌కు డాక్టరేట్



సాక్షి, సిటీబ్యూరో: షాదన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ మహమ్మద్ షా ఆలం రసూల్‌కు డాక్టరేట్ దక్కింది. కర్పగం అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ 15వ స్నాతకోత్సవం సందర్భంగా ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్‌లో ఆయన చేసిన పరిశోధనలకు ఈ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.వసంతకుమార్, చాన్స్‌లర్ డాక్టర్ రామస్వామి, సీఈవో కె.మురుగయ్య, వీసీ ప్రొ.వెంకటచలపతి పాల్గొన్నారు.

తెలుగు యూనివర్సిటీకి 'సురవరం' పేరు హర్షణీయం

– సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు కృష్ణవర్ధన్



మాట్లాడుతున్న కృష్ణవర్ధన్, పి.బడేసాబ్ తదితరులు

కాచిగూడ: తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం పట్ల సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు కృష్ణవర్ధన్ హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.బడేసాబ్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పరిశోధన చేసి 355 మంది కవులు ఉన్నారని, వారిని గుర్తించి ఎలుగెత్తి చాటిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి అని కొనియాడారు. సమావేశంలో కార్యదర్శి సంపండి నర్సింహ, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్రకాష్‌రెడ్డి, గంటా మనోహర్‌రెడ్డి, మేక రవీంద్ర, రామకృష్ణ, చంద్రమౌళి, రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సిరెడ్డి



ట్రస్మా అధ్యక్షుడు ఎస్.నర్సిరెడ్డి



ట్రస్మా ప్రధాన కార్యదర్శి కె.అనిల్

కవాడిగూడ: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) స్టేట్ బాడీ జనరల్ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ట్రస్మా వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, కన్వీనర్ సీహెచ్ రాంచందర్, కో కన్వీనర్ అనంతరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో 25 జిల్లాల నుంచి ట్రస్మా ప్రతినిధులు హాజరై రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు నర్సిరెడ్డి, అనిల్ కుమార్ మాట్లాడుతూ బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. బడ్జెట్ పాఠశాలలను చిన్న పరిశ్రమల కింద గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర ట్రస్మా ప్రతినిధులకు, వ్యవస్థాపకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

– స్వామి లక్ష్మి శంకరాచార్య



సాక్షి, సిటీబ్యూరో: మహ్మద్ ప్రవక్త బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని స్వామి లక్ష్మీ శంకరచార్య అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ముహమ్మద్ ప్రవక్త మానవ మహోపకారి అంశంపై శనివారం ఆయన మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త దాతృత్వం, కరుణ ధార్మిక చింతన, సర్వమానవాళి ఐకమత్యాన్ని ఆకాంక్షించారని పేర్కొన్నారు. ఇస్లాం కత్తితో కాదు కరుణతో విస్తరించిందన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని, ఆయన కేవలం ముస్లింల కోసమే ప్రభవించలేదని, ప్రపంచ మానవులందరికీ ఆదర్శణీయం అన్నారు. మహమ్మద్ ప్రవక్త తన జీవితాంతం సత్ సమాజ నిర్మాణానికి పాటుపడ్డారని, ఆయన దయ, క్షమ గుణాలు తననెంతో ప్రభావితం చేశాయని తెలిపారు. ఇస్లాం ఉగ్రవాద మతమనే అపోహతో ఇస్లాంకు వ్యతిరేకంగా పుస్తకం రచించానని, తప్పు తెలుసుకుని ఇస్లాం ఆదర్శవాద ధర్మమని వివరించేలా పుస్తకాన్ని రాశానని ఆయన చెప్పారు. ఆయన బోధనలు ప్రచారంలో పెట్టాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. జమాతె ఇస్లామీ హింద్ స్టేట్ ప్రెసిడెంట్ ఖాలిద్ ముబాషిర్ మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ముహమ్మద్ ప్రవక్త బోధనలు చక్కని పరిష్కారం చూపుతాయన్నారు. సమావేశంలో తెలుగు కాథలిక్ బిషప్ కౌన్సిల్ సెక్రటరీ కొండవీటి అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నో బ్యాగ్ డే



ఐస్‌క్రీమ్ స్టిక్స్‌తో తయారు చేసిన బ్రిడ్జిలు, టవర్ల నిర్మాణాలు

బంజారాహిల్స్: నైపుణ్యాలు పెంచుకోవడం.. ఆసక్తికర విషయాలపై దృష్టిపెట్టడం.. సహచరులతో ఆనందాన్ని పంచుకోవడం.. సరికొత్త విషయాలపై చర్చించడం.. అనే అంశాలతో జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్ ఏడో తరగతి విద్యార్థులు ప్రతి శుక్రవారం 'నో స్కూల్ బ్యాగ్ డే' (బ్యాగ్‌లెస్ డేస్)ని ఎంజాయ్ చేస్తున్నారు. శుక్రవారం పుస్తకాల మోతను పక్కనబెట్టి నైపుణ్యాలను పెంచుకునే దిశగా సరికొత్త ఆలోచనలతో ఈ విద్యార్థులు ముందుకెళ్తున్నారు. సీబీఎస్ఈ పాఠశాలల్లో ప్రతి శుక్రవారం బ్యాగ్ లెస్ డే నిర్వహించాలని ఆదేశాలు రావడంతో ఆ మేరకు ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ప్రతి శుక్రవారం ఏడో తరగతి విద్యార్థులు బ్యాగ్ లేకుండా స్కూల్‌కు వస్తూ ఇక్కడ సరికొత్త ఆలోచనలపై దృష్టిపెడుతున్నారు.

నంచుల మోతకు సెలవు | కొత్త ఆలోచనలతో ముందుకు.. | ఆత్మకూరి రామారావు స్కూల్‌లో అమలు

- 'పేపర్ క్రాఫ్ట్స్' అనే అంశంపై ఇదే పాఠశాలకు చెందిన హన్సిక అనే విద్యార్థిని తల్లి శ్రేయా అగర్వాల్ రీసోర్స్‌పర్సన్‌గా వచ్చి 6, 7, 8 తరగతుల విద్యార్థులకు రంగురంగుల కాగితాలతో సరికొత్త ఆకృతులను నేర్పించారు.
- జియో మ్యాప్‌లో మ్యాపింగ్ ఆర్గనైజర్‌గా పనిచేసిన ఓ విద్యార్థి తండ్రి శివకిరణ్ మ్యాప్స్ అండ్ డైరెక్షన్స్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కొలతలు ఎలా తీసుకుంటారో తెలియజేశారు.
- నిర్మాణంలో ఉన్న భవనాల వద్దకు విద్యార్థులను తీసుకువెళ్లి భవన నిర్మాణం ఎలా చేపడతారు.. సివిల్ ఇంజినీర్లుగా చేరితే పనులు ఎలా చేయాలి అన్న దానిపై ఇదే స్కూల్‌లో చదువుతున్న ఓ విద్యార్థి తండ్రి సివిల్ ఇంజినీర్ అవగాహన కలిగించారు. ఐస్‌క్రీమ్ స్టిక్స్‌ను తీసుకుని టవర్లు, బ్రిడ్జిలు, ఇళ్ల నమూనాలను తయారుచేసి కొత్త ఆవిష్కరణలకు తెరతీశారు.
- తమ పాఠశాలల్లో బ్యాగ్‌లెస్ డేని విద్యార్థులకు కొత్త ఆలోచనలు రేకెత్తించేలా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తెలిపారు. ఈ రోజును విద్యార్థులు కేవలం చదువులతోనే కాకుండా ఇతర పనికొచ్చే వ్యాపకాలపై దృష్టిపెడుతూ ఆనందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బ్యాగ్‌లెస్ డేను విద్యార్థుల భవిష్యత్తును మరింత తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగా కొత్త అంశాలపై దృష్టి పెడతామన్నారు.



జియో మ్యాపింగ్‌పై అవగాహన కలిగిస్తున్న శశికిరణ్



పేపర్ క్రాఫ్టస్‌తో విద్యార్థులు



నగరంలో నేడు

- అన్నమయ్య కళాసమితి మూడో వార్షికోత్సవం సందర్భంగా అన్నమయ్య పద సమార్చనం చిక్కడపల్లి త్యాగరాజ గానసభలోని ప్రధాన వేదికలో ఉంటుంది.
- ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో మాంగళ్య షాపింగ్ మాల్‌ను ఉదయం 11 గంటలకు కీర్తి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారు.
- జూబ్లీహిల్స్ అపోలో మెడికల్ కళాశాలలో ఆర్థో ప్లాస్టీ ఆర్థోస్కోపి 8వ సమ్మిట్–2024 మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమవుతుంది.
- ఉప్పల్‌లో విశ్వకర్మ ఆత్మగౌరవ భవనంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నేడు బొటానికల్ గార్డెన్‌లో 'బర్డ్ వాక్'

గచ్చిబౌలి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బర్డ్‌వాక్ అనంతరం గార్డెన్‌లో కొత్తగా తీర్చిదిద్దన బొటానికల్ గార్డెన్ థీమ్ పార్కును గోల్ఫ్‌కార్ట్ వెహికల్స్‌లో తీసుకెళ్లి ప్రతీ థీమ్ ప్రాముఖ్యత, అందులో నాటిన మొక్కలు, చెట్ల గురించి వివరిస్తారు.

ఆధునిక వైద్య విధానాలతో కేన్సర్ బాధితులకు సాంత్వన

– నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప



సదస్సు ప్రారంభోత్సవంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు

బంజారాహిల్స్: అధునాతన కీమో థెరపీ, రేడియేషన్ థెరపీ వంటి చికిత్స పద్ధతులు అందుబాటులోకి రావడం ద్వారా అత్యంత పిన్న వయస్సులో కేన్సర్ బారిన పడిన యువతీ యువకులు దీర్ఘకాలం సాంత్వనతో జీవించే పరిస్థితులు ఉన్నాయని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప అన్నారు. మెడికల్ ఆంకాలజీ, టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ కేన్సర్ ఫౌండేషన్, నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లు సంయుక్తంగా బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే 'టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ కేన్సర్' జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. దేశం నలుమూలల నుంచి కేన్సర్ నిపుణులు, కేన్సర్ సర్వైవర్స్‌లతో పాటు వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ ఒకప్పుడు కేన్సర్ అంటే ఎంతో భయం ఉండేదని, ముఖ్యంగా టీనేజ్‌లోకి అడుగుపెడుతున్న యువతీ యువకుల్లో కేన్సర్ వచ్చిందంటే జీవితాంతం వారు బాధపడాల్సి రావడం లేదా ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగేదని వివరించారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. మెడికల్ ఆంకాలజీ ఫోరం పాట్రన్ డాక్టర్ రఘునందన్‌రావు మాట్లాడుతూ పిన్న వయస్సులో కేన్సర్ వచ్చినప్పుడు ఏర్పడే సమస్యలను పరిష్కరించేటప్పుడు పలు అంశాలను గుర్తుపెట్టుకుని చికిత్స అందించాల్సి వస్తుందని చెప్పారు. టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ కేన్సర్ ఫౌండేషన్ పాట్రన్ డాక్టర్ హేమంత్ మల్హోత్రా మాట్లాడుతూ యవ్వనంలో అప్పుడప్పుడే జీవితంపై ఎన్నో ఆశలతో జీవితాన్ని ఉత్సాహంగా ముందుకు తీసుకువెళ్తున్న తరుణంలో కేన్సర్ బారిన పడితే వారిలో ఏర్పడే మానసిక సంక్షోభాన్ని తాను చూసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఇలాంటి వారి కోసం ప్రత్యేకంగా చికిత్సా విధానాలు అవసరమని గుర్తించి తాము టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ కేన్సర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ రాజశేఖర్, వైద్య నిపుణులు డాక్టర్ కల్నల్ చితాల్కర్, డాక్టర్ సదాశివుడు గుండేటి, డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

- 19 ఫీడర్ల బ్రేక్‌డౌన్
- 2 గంటలల్లో పునరుద్ధరణ
- 24 గంటలు విద్యుత్ శాఖ అప్రమత్తం
- సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సాక్షి, సిటీబ్యూరో: శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అక్కడక్కడా కొన్ని చోట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై, స్తంభాలపై పడటంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉన్న సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ స్వయంగా రాత్రి క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించారు.

19 ఫీడర్లు బ్రేక్‌డౌన్..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బంజారాహిల్స్, బైరామల్‌గూడ, మణికొండ, బండ్లగూడ, కిస్మత్‌పూర్, శంకర్‌మఠ్, తార్నాక, లంగర్‌హౌజ్ ఇతర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై చెట్ల కొమ్మలు కూలడంతో పోల్స్ విరగడం, గాలికి ఇతర వస్తువులు లైన్ల మీద పడటం వంటి కారణాలతో 19 ఫీడర్లు బ్రేక్‌డౌన్ అయ్యాయి. విద్యుత్ సిబ్బంది అధికారులు చీకటిని సైతం లెక్కచేయకుండా దెబ్బతిన్న స్తంభాలు, లైన్లను సరిచేసి కేవలం 2 గంటల వ్యవధిలోనే సరఫరా పునరుద్ధరించారు.

నిరంతరం అందుబాటులో..

ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొని నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సరిపడా సిబ్బందిని ఎఫ్ఓసీ, సీబీడీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. వినియోగదారులు ఎలక్ట్రిసిటీ కంట్రోల్ రూమ్ నెంబర్ 1912కు గానీ, ఏరియా ఎఫ్ఓసీ, విద్యుత్ అధికారులకు ఫిర్యాదులను నమోదు చేయించవచ్చని ఆయన సూచించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతల డిమాండ్

కవాడిగూడ: రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే దశలవారీగా పోరాటాలు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్షను నిర్వహించారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ ఈ.వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్లు కె.యాదయ్య, ఎస్.సురేష్, బి.యాదగిరితో పాటు జేఏసీ నేతలు ఇందిరాపార్కు వద్ద జరిగిన సామూహిక నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని వెల్ఫేర్ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడే ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు, మహిళా కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం ప్రక్రియను పూర్తి చేయాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. దీక్షలో ఆర్టీసీ కార్మికులు, జేఏసీ నేతలు పాల్గొన్నారు.



సామూహిక నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఎం.థామస్‌రెడ్డి

23, 27 తేదీల్లో 'షరటాన్'లో కశ్మీరీ రుచులు

రాయదుర్గం: నగరవాసులకు కశ్మీరీ రుచులను అందించేందుకు నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని షరటాన్ హోటల్‌లో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఈ కశ్మీరీ రుచులు అందుబాటులో ఉంటాయి. ప్రముఖ చెఫ్ అపరిమిత సప్రూ ఆధ్వర్యంలో కశ్మీరీ నద్రు యఖ్నీ, క్లాసిక్ గోష్ట్ రోగంజోష్, సంపూర్ణ మసాలాలతో కూడిన మటన్ యాఖ్నీ పులావ్, సుగంధ రుచులు, కేబర్గాహ వంటి అరుదైన రుచులను ఆస్వాదించేందుకు ఏర్పాట్లు చేశారు. 23 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 12.30 నుంచి 3.30గంటల వరకు, రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

ఈఎల్ఐ పథకంతో యువ ఉద్యోగులకు లబ్ధి

– కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయంలో కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ ఏడాది తీసుకువచ్చిన ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ యువ ఉద్యోగుల భవిష్యత్‌కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా అన్నారు. బర్కత్‌పురలోని ఈపీఎఫ్ కార్యాలయంలో తెలంగాణలో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పనితీరుపై కేంద్రమంత్రి అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈపీఎఫ్ సభ్యుల సేవల విషయంలో జోన్ ప్రాంతీయ కార్యాలయాల సమష్టి కృషిని ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏడున్నర కోట్ల మంది ఈపీఎఫ్ లబ్ధిదారులు ఉన్నారని, 77 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈపీఎఫ్ కట్ అవుతోందని, వారికి పెన్షన్ కూడా వస్తుందన్నారు. వీటివల్ల సభ్యుల భవిష్యత్‌కు భరోసా లభిస్తుందన్నారు. 47.96 లక్షల మంది సభ్యులు 36,018 సంస్థల్లో పనిచేస్తున్నారని తెలిపారు. 4.54 లక్షల మంది పీఎఫ్ పెన్షన్ పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. 2023–24 సంవత్సరంలో 16.58శాతం ఉద్యోగుల భాగస్వామ్యం పెరిగిందన్నారు. సభ్యుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా భవిష్యనిధి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణారావు నేతృత్వంలో ప్రతినిధులు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

భాగ్యలక్ష్మీ అమ్మవారి సేవలో గవర్నర్ దంపతులు



చార్మినార్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దంపతులు చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి ఓ వైపు వర్షం కురుస్తుండగా గవర్నర్ దంపతులు ఆలయానికి చేరుకొని మహా హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయం ట్రస్టీ శశికళ వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి ప్రసాదంతో పాటు జ్ఞాపికను అందజేశారు. చార్మినార్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: రాజ్యాధికార సాధన కోసం బీసీలు సంఘటితంగా ఉద్యమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రాజ్యాధికార సాధన కోసం తెలంగాణలో బీసీ పార్టీ ఏర్పాటు, బీసీ ముఖ్యమంత్రే లక్ష్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలతో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీకి ఇప్పటి వరకు ముఖ్యమంత్రి పీఠం దక్కలేదని, అగ్రకులాల వారే అత్యధికంగా దక్కించుకున్నారని పేర్కొన్నారు. బీసీలకు రాజ్యాధికారంలో వాటా కల్పించడం ఇష్టం లేకనే రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుల గణనను చేపట్టడం లేదని ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ పార్టీలు అగ్రకులాల నేతల కనుసన్నల్లో నడుస్తున్నాయని విమర్శించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత సామాజిక పరిస్థితులు అందుకు భిన్నంగా కొనసాగుతున్నాయని తెలిపారు. బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, మట్ట జయంతి, చౌటుపల్లి సురేష్, జిల్లాపెల్లి అంజి, మురళీకృష్ణ, సతీష్, పండరినాథ్, ఎల్లయ్య, జానయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం ఆశ్చర్యపోయేలా మూసీనది ప్రక్షాళన



వనస్థలిపురం డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో మొక్కలు నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- మంత్రి పొన్నం ప్రభాకర్

వనస్థలిపురం/చంచల్‌గూడ: మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. నగరానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మూసీ సమగ్ర ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మలక్‌పేట చావణీ పిల్లిగుడిసెలు, వనస్థలిపురంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన శనివారం పరిశీలించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో లబ్ధిదారులకు కేటాయించగా మిగిలిన ఇళ్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. అంతకుముందు ఖాళీ స్థలంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారు బాధపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ప్రత్యామ్నాయం చూపిస్తుందన్నారు. మూసీనది అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి దృఢ నిశ్చయంతో ఉన్నట్లు చెప్పారు. ప్రపంచం ఆశ్చర్యపోయేలా మూసీనది ప్రక్షాళన జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా మురుగునీరు మూసీలో కలవకుండా చర్యలు తీసుకుంటామని, శుద్ధి చేసిన నీటినే మూసీలో వదిలేలా చూస్తామని తెలిపారు. అర్బన్, రూరల్‌లో నియోజకవర్గాలవారీగా అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో ఆయన మొక్కలను నాటారు. అనంతరం చంచల్‌గూడలోని నూతన ప్రభుత్వ డిగ్రీ కాలేజీని సందర్శించారు. కార్యక్రమంలో అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాల, ఆర్టీసీ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ ప్రతిమాసింగ్, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీసీలు యాదయ్య, సేవా ఇస్లావత్, సుజాత, మూసీ ప్రక్షాళన అధికారి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ, సంగీత నృత్యరీతులు జాతీయ సమైక్యతకు ప్రతిరూపాలు



నాంపల్లి: ప్రతిభకు పట్టం కడుతూ, భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల్లో యువ కళాకారులను ప్రోత్సహిస్తూ ఆరున్నర దశాబ్దాలుగా సాంస్కృతిక రంగానికి సేవలందిస్తూ నవ్య నాటక సమితి తన ప్రత్యేకతను చాటుకుంటోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమి సౌజన్యంతో నిర్వహిస్తున్న 49వ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీలు శనివారం రాత్రి మూడవ రోజు జరిగాయి. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ పారిశ్రామికవేత్త రజిత్ కుమార్ ఆకుల మాట్లాడుతూ.. దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి యువ కళాకారులను ఒకే వేదికపై చేర్చడం ద్వారా జాతీయ సమైక్యతకు, సమగ్రతకు తోడ్పడటం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర మాట్లాడుతూ.. నృత్య నాటక సమితి నిర్వహించే కార్యక్రమాలు నవ్యతతో కూడి వైవిధ్యభరితంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నృత్య గురువులు పట్నం శివ ప్రసాద్(అనంతపురం), నాగసాయి, గంటి ఇందుమతిలను ఘనంగా సత్కరించారు. పట్నం శివ ప్రసాద్ ప్రతిస్పందన ప్రసంగం చేస్తూ.. గత 35 సంవత్సరాలుగా నవ్య నాటక సమితి నిర్వహించే పోటీలలో పాల్గొనడం ద్వారా అనేక విషయాలను నేర్చుకునే అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో నృత్య గురువులు వి.వాణీరమణ, ఆర్.చంద్రశేఖర్ పాల్గొన్నారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.విజయ్‌కుమార్, ఆర్.ఎన్.సుధారాణి సమన్వయకర్తలుగా వ్యవహరించారు.



తెలుగు ఇండియన్‌ ఐడల్‌-3 విజేతగా నజీరుద్దీన్‌ షేక్‌..

ఇప్పటికే రెండు సినిమాల్లో పాటలు పాడే అవకాశం

10 లక్షల నగదు బహుమతి..

ఆహా వేదికను షేక్‌ చేశాడు..

సాక్షి, సిటీబ్యూరో: అతి సాధారణ కుటుంబానికి చెందిన మోటర్‌ మెకానిక్‌ షేక్‌ బాజీ కొడుకు నజీరుద్దీన్‌ షేక్‌ ఆహా తెలుగు ఇండియన్‌ ఐడల్‌ 3 విజేతగా నిలిచి కళకు సామాజిక, ఆర్థిక ఇబ్బందులు అడ్డంకులు కావని నిరూపించాడు. ఆహా ఓటీటీ వేదికగా దాదాపు 26 వారాల పాటు భారత్‌తో పాటు విదేశాల్లో మన్ననలు పొందుతున్న ఈ కార్యక్రమం గ్రాండ్‌ ఫినాలే శనివారం పూర్తి చేసుకుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడేనికి చెందిన నజీరుద్దీన్‌ తన ప్రతిభకు గానూ ఇప్పటికే ఓజీ సినిమాలో పాట పాడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. అంతేకాకుండా విజేతగా 10 లక్షల నగదు బహుమతిని అందుకున్నాడు. ఈ సందర్భంగా నజీరుద్దీన్‌ మాట్లాడుతూ.. ఆహా వంటి వేదికపై పాటలు పాడితే చాలు అనుకున్న తను విజేతగా నిలువడం సంతోషంగా ఉందన్నాడు. ఈ ప్రయాణంలో సంగీతానికి సంబంధించి పలు మెళకువలు నేర్చుకున్నానని, ప్రముఖ సంగీత దర్శకులు తమన్‌, ప్రముఖ సింగర్లు కార్తీక్‌, గీతామాధురి సమక్షంలో పాటకు సంబంధించి ఎన్నో అద్భుత విషయాలు నేర్చుకున్నానని అన్నారు. తన తాత కాసిం దగ్గర ఈ సంగీత ప్రయాణం మొదలైందని, నాన్న వాళ్ల చెల్లి వహిదా రెహమాన్‌ నుంచి సంగీతంలో ప్రావీణ్యం పొందానని గుర్తు చేసుకున్నాడు. ప్రస్తుతం సీఏ ఇంటర్మీడియట్‌ పూర్తి చేసిన తను అటు చదువులోనూ ఇటు పాటలోనూ రాణించాలని ఆశిస్తున్నాడు. భవిష్యత్తులో ఏఆర్‌ రెహ్మాన్‌ వంటి ప్రముఖ సంగీత దర్శకులకు పాటలు పాడడం తన లక్ష్యమని పేర్కొన్నాడు. ఇప్పటికే రెండు సినిమాల్లో పాటలు పాడే అవకాశం వచ్చిందని, ప్రస్తుతం కళతో ప్రయాణించే వారికి అద్భుత భవిష్యత్తు ఉందని, అయితే దానికి అంకితభావంతో నిరంతర కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపాడు. ఈసారి సింగింగ్‌ పోటీల్లో ఎలిమినేషన్‌ ప్రక్రియ కఠినంగా ఉందని, అందరూ నైపుణ్యం ఉన్న కళాకారులే కావడంతో విజేతలను ఎంపిక చేయడం సవాలుగా మారిందని జడ్జిగా వ్యవహరించిన గీతామాధురి తెలిపారు. ఈ గ్రాండ్‌ ఫినాలే లో అనిరుధ్‌ సుస్వరం రెండో స్థానం సాధించి రూ.3 లక్షలు, జీవీ శ్రీ కీర్తి తృతీయ స్థానంలో రూ.2 లక్షలు బహుమతిగా గెలుచుకున్నారు. కార్యక్రమంలో మ్యూజిక్‌ డైరెక్టర్‌ తమన్‌, ప్రముఖ సింగర్‌ కార్తీక్‌ తదితరులు పాల్గొన్నారు.



- ఆధునిక కల్చర్‌కు అసలైన చిరునామాగా..
- ఈవెంట్స్‌కూ, వెరైటీ మీట్స్‌కూ వేదికలు..
- అత్యాధునిక నగరానికి అద్దం పడుతున్న కార్యక్రమాలు
- వర్క్‌ప్లేస్‌లకూ.. వర్క్‌షాప్స్‌కూ అవే..

సరదాగా కాఫీనో, టీనో తాగడానికి కేఫ్స్‌కి వెళ్తున్నారా? ఇష్టమైన వంటకాలు రుచి చూడడానికి వెళ్తున్నారా? అయితే నగరంలో లేటెస్ట్‌ కేఫ్‌ కల్చర్‌ని మీరింకా టేస్ట్‌ చేయలేదన్నట్టే. ఇప్పుడు కేఫ్స్‌ అంటే ఆఫీస్‌.. కేఫ్స్‌ అంటే వెరైటీ ఈవెంట్లకు కేరాఫ్‌గా మారుతున్నాయి.. ఆధునిక కల్చర్‌కు అసలైన చిరునామాగా నిలుస్తున్నాయి నగరంలోని పలు కేఫ్‌లు. ఈవెంట్స్‌ నుంచి వెరైటీ మీట్స్‌ వరకూ కేఫ్‌లు వేదికలవుతున్నాయి. వర్క్‌ప్లేస్‌ల నుంచి వర్క్‌షాపుల వరకూ కేఫ్‌లు కేరాఫ్‌ అడ్రస్‌ అవుతున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో





హైదరాబాద్‌ వైబ్స్‌

సమ్‌థింగ్‌.. డిఫరెంట్‌

నయా ట్రెండ్స్‌కి కేరాఫ్‌గా.. సిటీ కేఫ్స్‌

టాప్‌ క్లాస్‌ చిత్రకారుని చిత్రాలను వీక్షించడానికో.. ఓ బెస్ట్‌ సాక్సాఫోన్‌ ఆర్టిస్ట్‌ సంగీతాన్ని వినడానికో.. స్టోరీటెల్లర్‌ కథల విందుకో, సెలబ్రిటీల సక్సెస్‌ సీక్రెట్స్‌ వినేందుకో.. ఒకప్పుడైతే ఏదైనా కల్చరల్‌ సెంటర్‌కో లేదా వాటికి ప్రత్యేకించిన మరో చోటుకో వెళ్లేవారు. అయితే ఇప్పుడు వాటితో పాటు అవీ ఇవీ అనే తేడా లేకుండా అన్నీ ఒకే వేదికపై అందుకోడానికి ఒక్క కేఫ్‌కి వెళితే చాలు. ఫుడ్‌కీ, డ్రింక్స్‌కి మాత్రమే పరిమితమైతే కాదు.. రోజుకో ఈవెంట్‌తో తన వెంట తిప్పుకుంటేనే అది కేఫ్‌ అని పునర్‌ నిర్వచిస్తున్నాయి నగరంలోని నయా ట్రెండ్స్‌.

మ్యూజిక్‌ ఈవెంట్ల.. పంట..

పేరొందిన రాక్‌ బ్యాండ్‌ సంగీత ప్రదర్శనలతో కేఫ్స్‌ హోరెత్తుతున్నాయి. బంజారాహిల్స్‌లోని హార్డ్‌రాక్‌ కేఫ్‌ లాంటివి అచ్చంగా వీటికే పేరొందాయి. డ్రమ్స్‌, ఫ్లూట్స్‌, సాక్సాఫోన్‌, వయోలిన్‌.. తదితర విభిన్న రకాల పరికరాలను పలికించడంలో నైపుణ్యం కలిగిన మ్యూజీషియన్స్‌ తరచూ కేఫ్‌ సందర్శకులకు వీనుల విందును పంచుతుంటారు. ఇక గజల్‌ గానామృతాలు, సినీ గాయకుల స్వరమధురిమల సంగతి సరేసరి. ఓ వైపు రుచికరమైన విందును, మరోవైపు పాటలతో వీనుల విందును సైతం అతిథులు ఆస్వాదిస్తున్నారు.



వర్క్‌ ప్లేస్‌లోనూ..

ఒకప్పుడు సాయంత్రాల్లో, వారాంతాల్లో మాత్రమే కేఫ్స్‌ కళకళలాడేవి అయితే ఆ తర్వాత పగటి పూట, అలాగే అన్ని రోజుల్లోనూ చెప్పుకోదగిన సంఖ్యలోనే కస్టమర్స్‌ కనిపిస్తున్నారు. దీనికి ప్రధానంగా రెండు కారణాలను చెప్పొచ్చు. ఆఫీస్‌ స్పేస్‌ను కూడా కేఫ్స్‌ ఆఫర్‌ చేస్తుండడం ఇందులో ఒకటి. వర్క్‌ ఫ్రమ్‌ హోమ్‌, హైబ్రిడ్‌ తదితర కరోనా నేపథ్యంలో పుట్టుకొచ్చిన వర్క్‌ కల్చర్స్‌ వల్ల ఇప్పుడు కేఫ్స్‌లో కూర్చునే ఆఫీస్‌ వర్క్‌ చేసుకోవడం నగరవాసులకు అలవాటైంది. కేవలం ఐటీ నిపుణులు మాత్రమే కాకుండా విభిన్న రకాల వృత్తి వ్యాపకాల్లో ఉన్నవారు కూడా కేఫ్స్‌ను వర్క్‌ప్లేస్‌లుగా వినియోగిస్తున్నారు.



నవ్వుల నజరానా..

కేఫ్స్‌లో నిర్వహించే ఈవెంట్స్‌లో మ్యూజిక్‌ తర్వాత కామెడీ షోస్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యంగా స్టాండప్‌ కామెడీకి అతిథుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. సిటీలో ఇప్పుడు పదుల సంఖ్యలో స్టాండప్‌ కమెడియన్స్‌ ఉన్నారంటే దానికి కారణం కేఫ్స్‌ యజమానులు వారికి కల్పిస్తున్న అవకాశాలే అని చెప్పొచ్చు. ఇతర నగరాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పేరొందిన కమెడియన్స్‌, థియేటర్‌ ఆర్టిస్ట్స్‌, టీవీ షోస్‌ ద్వారా పాపులర్‌ అయినవారు, సోషల్‌ మీడియా సెలబ్రిటీలు కూడా సిటీ కేఫ్స్‌కు తరలివస్తున్నారు.



వర్క్‌షాప్స్‌..

విందు వినోదాలకు మాత్రమే కాకుండా విభిన్న రకాల అంశాల్లో శిక్షణా తరగతులకు కూడా కేఫ్స్‌ నిలయంగా మారుతుండడం విశేషం. గత రెండేళ్లుగా ఈ ట్రెండ్‌ కేఫ్స్‌లో బాగా పెరిగిందని నగరానికి చెందిన ఫుడీస్‌ క్లబ్‌ నిర్వాహకులు సంకల్ప్‌ చెబుతున్నారు. పోటరీ వర్క్‌షాప్‌, పెయింటింగ్‌ వర్క్‌షాప్‌, కేక్‌ డెకరేటింగ్‌, రెసిన్‌ ఆర్ట్‌, క్యాండిల్‌ మేకింగ్‌, బేకింగ్‌ తదితర కళలకు సంబంధించిన వర్క్‌షాప్‌లతో నగరవాసులను ఆకర్షిస్తున్నాయి.

డేటింగ్స్‌.. మీటప్స్‌..

పలు సంస్థలు, క్లబ్స్‌ తమ మీటప్‌ పాయింట్లుగా కేఫ్స్‌ను ఎంచుకుంటున్నాయి. నిర్వాహకులు వారి కార్యకలాపాలకు తగ్గట్టుగా థీమ్స్‌ను సిద్ధం చేసి మరీ ఆతిథ్యం అందిస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో నగరంలో ఊపందుకున్న డేటింగ్స్‌కు కూడా పలు కేఫ్స్‌ వారధిగా నిలుస్తున్నాయి. కొన్ని కేఫ్స్‌ ప్రత్యేకంగా ఒంటరి వ్యక్తుల కోసం ఒక రోజును కేటాయిస్తూ ఫ్రెండ్‌షిప్‌ ఈవెంట్స్‌, పెయిరింగ్‌ ఈవెంట్స్‌ తరహా థీమ్స్‌తో ఆకర్షిస్తున్నాయి. సహజంగానే ఇవి సోలో లైఫ్‌లో ఉన్నవారిని ఆకట్టుకుంటున్నాయి.



3 నుంచి కంట్రీ క్లబ్‌ దాండియా నైట్స్‌

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కంట్రీ క్లబ్‌ ఆధ్వర్యంలో అక్టోబర్‌ 3 నుంచి ఆసియాలోనే అతిపెద్ద దాండియా నైట్స్‌ 2024 వేడుకను నిర్వహించనున్నారు. హైదరాబాద్‌ తో పాటు దేశంలోని అన్ని క్లబ్స్‌లో జరగనున్న ఈ దాండియా నైట్స్‌ పోస్టర్‌ను సంస్థ సీఎండీ వై.రాజీవ్‌ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు డీజేలు, గర్బా కొరియోగ్రాఫర్లు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌ రెడ్డి మాట్లాడుతూ బేగంపేటలోని పోలీస్‌ హాకీ స్టేడియంలో అక్టోబర్‌ 3 నుంచి 12వ వరకూ దాండియా నైట్స్‌ జరుగుతాయని వివరించారు. పది రోజుల వేడుకలో సుమారు 70 నుంచి 80 వేలకు పైగా హాజరుకానున్నారని తెలిపారు. సంప్రదాయ దాండియా రిథమ్‌ల నుంచి సరికొత్త డీజే మిక్స్‌ల వరకూ ఈ దాండియా వేడుకల్లో భాగస్వామ్యం అవుతాయని తెలిపారు. ప్రతి రోజూ నాన్‌స్టాప్‌ ఫన్‌, దాండియా నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. అంతేకాకుండా కంట్రీ క్లబ్‌ ఫ్రాంచైజీ విస్తరణ చేపట్టామని, వచ్చే ఏడాదికి 100 ఫ్రాంచైజీలకు చేరే లక్ష్యంతో ఉన్నామని వివరించారు. రిలవెంట్‌ ఈవెంట్స్‌ ఎండీ సందీప్‌ కుమార్‌ చందా మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన ప్రసిద్ధ మ్యూజికల్‌ లైవ్‌ బ్యాండ్‌ రాజా బీట్స్‌, ప్రముఖ గుజరాతీ గాయకుడు భవిన్‌ హస్ముక్‌ రాజా పాటలు, నగరంలోని టాప్‌ 12 డీజేల సంప్రదాయ, ఆధునిక మ్యూజిక్‌తో అలరించనున్నారని వివరించారు.

12 రోజుల పాటు పోలీస్‌ హాకీ గ్రౌండ్స్‌లో ప్రదర్శనలు



టిక్‌ టాక్‌ బామ్మ..

వయసు 78.. ఫాలోవర్లు 23 వేలు

- ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోస్‌ ట్రెండింగ్‌
- డ్యాన్స్‌ ఇరగదీస్తున్న విజయలక్ష్మి

బంజారాహిల్స్‌: ఆమె భామ కాదు.. బామ్మ.. స్టేజీ ఎక్కి డ్యాన్స్‌ మొదలెట్టిందంటే చాలు.. కుర్రకారు ఈలలు, గోలలు.. ఆమె డ్యాన్స్‌ చూస్తే పెద్దవాళ్లు ఐనా సరే ముక్కున వేలు వేసుకోవాల్సిందే.. ఆమె వేసే స్టెప్పులకు కుర్చీల్లో నుంచి అమాంతం లేసి చప్పట్లు చరవాల్సిందే.. ఇంతకూ ఆ బామ్మ వయసు ఎంతో తెలుసా..! సరిగ్గా 78 ఏళ్లు.. ఆమెకు ఇన్‌స్టాలో దాదాపు 23 వేల మంది ఫాలోవర్లు ఉన్నారంటే ఆమె క్రేజ్‌ అర్థం చేసుకోవచ్చు. టిక్‌ టాక్‌ భామ్మగా పిలుచుకునే ఆమె పేరు విజయలక్ష్మి.

పదేళ్ల పాటు హోంగార్డుగా..

బాలానగర్‌కు చెందిన విజయలక్ష్మి పదేళ్లపాటు హోంగార్డుగా పనిచేసింది. బాలనగర్‌, కూకట్‌పల్లి, చందానగర్‌, జీడిమెట్ల, రామచంద్రాపురం పోలీస్‌ స్టేషన్ల పరిధిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసింది. మనువడు ఫోన్‌ చూసే క్రమంలో ఆమె టిక్‌ టాక్‌లో తనకు ఒక ఖాతాను ఏర్పాటు చేసుకుంది. డ్యాన్స్‌ చేయడం, నటులను అనుకరించడం, డైలాగ్‌లకు అనుగుణంగా నటించడం ప్రారంభించింది. ఇంకేముంది ఆమెను ఫాలో చేసే వారి సంఖ్య 12 లక్షలకు చేరింది. దీంతో టిక్‌ టాక్‌ బామ్మగా ఆమెకు ఎక్కడలేని గుర్తింపు వచ్చింది. అదే సమయంలో టిక్‌టాక్‌ నిషేధించడంతో టికి అనే మరో యాప్‌లోకి వెళ్లింది. అందులోనూ దాదాపు 2.5 లక్షల మంది ఫాలోవర్లు వచ్చి చేరారు. అది కూడా బ్యాన్‌ కావడంతో బామ్మ తాజాగా ఇన్‌స్టా వైపు మళ్లింది.



యూత్‌ ఫిదా..

తన ఇద్దరు కుమారులకు దూరమై ఒంటరిగా ఉన్న విజయలక్ష్మి అక్కడక్కడ నృత్య కార్యక్రమాలకు హాజరయ్యేది. ఈ క్రమంలోనే సినీనటి కరాటే కళ్యాణితో పరిచయం ఏర్పడి నాలుగేళ్లుగా ఆమెతోనే ఉంటోంది. బామ్మ నృత్యాలకు నెటిజన్లు అంతా ఫిదా అవుతున్నారు. ఇన్‌స్టాలో ఇప్పటికే దాదాపు 3300 డ్యాన్స్‌ వీడియోలను పోస్టు చేసింది. ఇటీవల ఆమె వినాయకుడి మండపం వద్ద వేసిన డ్యాన్స్‌ వీడియోలు ప్రస్తుతం వైరల్‌ అయ్యాయి. క్లాస్‌ అయినా, మాస్‌ అయినా పాట ఏది వచ్చినా ఆమె స్టెప్పులను ఎవరూ ఆపలేరు. యువతతో కలిసి డ్యాన్స్‌ చేయడానికి బామ్మనే పోటీపడుతుంది. ఈ వయసులోనూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా డ్యాన్స్‌ చేసే ఆ బామ్మ ప్రతిరోజు యోగ చేస్తుంది. మితమైన, పోషకాహారం తీసుకుంటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెబుతోంది.

సినిమాల్లోకి..

ప్రస్తుతం బామ్మ సినిమాల వైపు అడుగులు వేసింది. విడుదలకు సిద్ధమైన 'ఉప్పు కప్పురంబు' చిత్రంలో ఆమె బామ్మ పాత్రలో నటించింది. ఇదే కాకుండా కొన్ని ఛానెళ్లలో బామ్మ మాట పేరుతో సుభాషితాలు, విలువలు, మానవ సంబంధాల గురించి వివరిస్తుంది. ఈ బామ్మకు సినీ పరిశ్రమలోనూ పలువురు ఇన్‌స్టా అభిమానులు ఉన్నారు.



ఇదో లెర్నింగ్‌ ఎక్స్‌పీరియన్స్‌

విన్న ప్రతి వాయిస్‌ ఫ్రెష్‌గా ఉంది

3వ ఎడిషన్‌ ముగింపులో 'సాక్షి'తో తమన్‌

'ఓ 13 ఏళ్ల అమ్మాయి అద్భుతంగా పాడుతుంటే వినడం కాదు నేర్చుకోవడం కూడా మా వంతు అవుతోంది. ఇలా కూడా పాడవచ్చు అని కొందరు సింగర్స్‌ మాకు తెలియజెబుతున్నారు. ఇదో గొప్ప లెర్నింగ్‌ ఎక్స్‌పీరియన్స్‌' అంటున్నారు ప్రముఖ సంగీత దర్శకుడు తమన్‌. తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో తెలుగు ఇండియన్‌ ఐడల్‌ కార్యక్రమానికి న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్న తమన్‌.. 3వ ఎడిషన్‌ పూర్తయిన సందర్భంగా సాక్షితో ముచ్చటిస్తూ తన అనుభవాలను పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే... - సాక్షి, సిటీబ్యూరో

ఈ సీజన్‌ కంటెస్టెంట్స్‌ బ్లాక్‌ బస్టర్స్‌. మా షోకి వైవిధ్యాన్ని తీసుకొచ్చారని చెప్పాలి. విన్న ప్రతి వాయిస్‌ ఫ్రెష్‌గా ఉంది. ప్రపంచవ్యాప్తంగా మంచి ఫీడ్‌ బ్యాక్‌ వచ్చింది. ఈ తెలుగు షోని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళతామని ఆహా నిర్వాహకులు అల్లు అరవింద్‌ గారు తదితర పెద్దలకు చేసిన ప్రామిస్‌ను నిలబెట్టుకున్నాననే ఆనందం కలిగింది.

పాట వింటున్నా.. ప్రోత్సహిస్తున్నా..

పాటల పోటీల్లో ప్రతిభావంతుల్ని విభిన్న రకాలుగా ప్రోత్సహిస్తున్నాం. ఆ క్రమంలోనే ఓజీ సినిమాలో భరత్‌, నజీరుద్దీన్‌లతో కలిసి పనిచేశాను. గేమ్‌ ఛేంజర్‌లో కూడా అవకాశం ఇవ్వబోతున్నాం. బహుశా కీర్తి, కీర్తన కూడా నా సినిమాలో పాడవచ్చు.. నేను ఇవ్వడం మాత్రమే కాకుండా తెలిసిన రచయితలు, సంగీత దర్శకులకు కూడా న్యూ టాలెంట్‌ని పరిచయం చేస్తున్నాం.

నొప్పింపక తానొవ్వక..

గత 3 సీజన్స్‌గా కొత్త గాత్రాలను జడ్జి చేస్తున్నాను. ఇది కొంచెం సంక్లిష్టమైన పనే అయితే.. 9 ఏళ్ల వయసులో అడుగుపెట్టి పాతికేళ్లుగా సినిమా పరిశ్రమలో ఉన్నాను. ఔత్సాహికుల గురించి తెలుసు కాబట్టి ఎవరి మనోభావాలనూ దెబ్బతీయకుండా జడ్జి చేయగలుగుతున్నాను.

విదేశాల నుంచి.. పల్లెల వరకూ..

ఆస్ట్రేలియా, అమెరికా లాంటి విదేశాల నుంచి మాత్రమే కాదు తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల పల్లెటూర్ల నుంచి కూడా గాయకులు రావడం, ఎంతో టాలెంట్‌ చూపిస్తుండడం చూస్తుంటే ఇక భవిష్యత్తులో గాయకుల కొరత అనే మాటే వినపడదనే నమ్మకం బలపడింది.

ఒత్తిడికి చెక్‌..

'సంగీతం ఒత్తిడి నుంచి విముక్తం చేయడంలో సహాయపడుతుంది. అందుకే సంగీత కళాకారులు ఎక్కువ కాలం జీవిస్తారనుకుంటున్నాను. నా జీవితంలోనూ సంగీతం చాలా ముఖ్యమైన భాగమైపోయింది. అది లేని జీవితాన్ని నేనూ హించుకోలేను.



దురుద్దేశంతో మహాపచారం

వాడని నెయ్యి.. తయారు కాని లడ్డూతో సీఎం చంద్రబాబు దుర్మార్గ రాజకీయం

జరగనిది జరిగినట్లుగా దుష్ప్రచారం చేస్తూ ఆ దేవదేవుడిని అప్రతిష్ట పాలు చేసే కుతంత్రం

సాక్షి, అమరావతి: జరగనిది జరిగినట్లుగా దుష్ప్రచారం చేస్తూ ఆ దేవదేవుడికి మహాపచారం తలపెట్టే దుస్సాహసానికి సీఎం చంద్రబాబు తెగించారు. భక్తకోటి ప్రీతిపాత్రంగా స్వీకరించే శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నారు. లడ్డూల తయారీలో అసలు ఆ నెయ్యిని వాడకుండా ట్యాంకర్లను సైతం తిరుపతి నుంచే వెనక్కి తిప్పి పంపినప్పుడు ఇంకెక్కడ అపవిత్రం అయింది? వాడని నెయ్యితో లడ్డూలు తయారు చేసినట్లు ఏ రకంగా చెబుతారు? ఇంత మహాపచారాన్ని చంద్రబాబు రాజకీయ దురుద్దేశంతోనే చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. నెయ్యి సరఫరాకు సంబంధించి టీటీడీలో దశాబ్దాలుగా నిర్దిష్ట విధానం, ప్రక్రియ ఉంది. ఇప్పుడూ అదే ఆనవాయితీ ఉంది. మరి నాసిరకంగా తయారైందని ఎలా అంటారు? నెయ్యి ట్యాంకర్లలో నాణ్యతను మూడు దశల్లో ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షిస్తారు. ఒక్క పరీక్షలోనైనా సరే నాణ్యత లేదని తేలితే ఆ ట్యాంకర్లను తిరుపతి నుంచే వెనక్కి తిప్పి పంపిస్తారు. 2013–19 మధ్య 15 నెయ్యి ట్యాంకర్లను, 2019–24 మధ్య 18 ట్యాంకర్లను ఇలాగే తిప్పి పంపేశారు. అంటే దానర్థం నాణ్యతలో ఏమాత్రం తేడా ఉన్నా కనీసం గోడౌన్‌లోకి కూడా సరుకుల వాహనాలను అనుమతించరనే! అయినా సరే వెనక్కి పంపేసిన నెయ్యిని లడ్డూ తయారీలో వాడినట్లు చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారు. అది కూడా రిపోర్టు వచ్చిన రెండు నెలల తరువాత ఓ పకడ్బందీ పథకం ప్రకారం చంద్రబాబు వంద రోజుల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ఏకంగా టీడీపీ కార్యాలయంలో విడుదల చేయడం వెనుక ఎంత కుట్ర దాగి ఉందో బహిర్గతమవుతోంది. అసలు ఏమాత్రం వాడని నెయ్యి.. తయారు కాని లడ్డూ గురించి దేవుడే తనతో మాట్లాడించాడేమో.. నిజాలు చెప్పించాడేమోనంటూ చంద్రబాబు మహాపచారానికి ఒడిగట్టడం శ్రీవారి భక్తకోటిని నివ్వెరపరుస్తోంది!!



- అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు వైకుంఠం నుంచి భూమిపై అడుగుపెట్టి నడయాడిన దివ్యక్షేత్రం తిరుమల.
- ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హిందువులకు పరమపవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల.
- కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామివారి లడ్డూ ప్రసాదం భక్తులకు అమృతం.
- అలాంటి పరమ పవిత్రమైన దివ్యధామాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ దురుద్దేశంతో అపవిత్రం చేస్తున్నారు. రాజకీయ స్వార్థంతో పచ్చి అబద్ధాలు వల్లిస్తూ.. శ్రీవారికి మహాపచారం చేస్తూ.. భక్తుల మనోభావాలతో చెలగాటమాడుతున్నారు.

వాడని నెయ్యి.. తయారు కాని లడ్డూ!

టీటీడీకి ఈ ఏడాది జూలై 6, జూలై 12వ తేదీల్లో ఓ సరఫరా సంస్థ రెండేసి ట్యాంకర్ల చొప్పున ఆవు నెయ్యిని సరఫరా చేసింది. టీటీడీ మార్కెటింగ్ అధికారి, సంస్థ ప్రతినిధి సమక్షంలో ట్యాంకర్ సీల్ తొలగించి నెయ్యిని కలియతిప్పి.. ఒక్కో ట్యాంకర్ నుంచి మూడు శాంపిళ్ల చొప్పున సేకరించి అదే రోజు తిరుమలలో టీటీడీ ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్‌లో వేర్వేరుగా పరీక్షలు చేసిన ముగ్గురు టెక్నీషియన్లు టెండర్‌లో పేర్కొన్న ప్రమాణాల మేరకు నెయ్యి నాణ్యత లేదని తేల్చుతూ జూలై 8న నివేదిక ఇచ్చారు. దాంతో తిరుపతిలో టీటీడీ గోడౌన్ బయట నుంచే ఆ రెండు ట్యాంకర్ల నెయ్యిని టీటీడీ అధికారులు వెనక్కి పంపేశారు. కల్తీ నెయ్యిని శ్రీవారి లడ్డులో వినియోగించడం కాదు కదా కనీసం టీటీడీ గోడౌన్‌లోకి కూడా అనుమతించడం లేదన్నది దీనిద్వారా స్పష్టమవుతోంది.

పచ్చి అబద్ధాలాడుతూ...

ఆవు నెయ్యి కల్తీ అయ్యిందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ల్యాబొరేటరీలో నిర్వహించిన మూడు పరీక్షలలో తేలడంతో తిరుపతిలోని టీటీడీ గోడౌన్ బయట నుంచే నెయ్యి ట్యాంకర్లను అధికారులు సరఫరా సంస్థకు వెనక్కి పంపేశారు. శ్రీవారికి సమర్పించే నైవేద్యాలు, లడ్డూ ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యిని వాడలేదన్నది దీన్నిబట్టి స్పష్టమవుతోంది. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా తెలుసు. కానీ.. సరఫరా సంస్థకు వెనక్కి తప్పి పంపేసిన కల్తీ నెయ్యితో శ్రీవారికి సమర్పించే నైవేద్యాలు, లడ్డూ ప్రసాదాలను తయారు చేసినట్లు.. వాటిని భక్తులకు పంపిణీ చేసినట్లు.. భక్తులు వాటిని స్వీకరించినట్లు పచ్చి అబద్ధాలాడుతూ ప్రపంచవ్యాప్తంగా హిందువులకు పరమ పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలను.. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవారిని ముఖ్యమంత్రి చంద్రబాబు అపవిత్రం చేస్తున్నారని భక్తులు, అధ్యాత్మికవేత్తలు, టీటీడీ అధికారవర్గాలు మండిపడుతున్నాయి. పవిత్రమైన శ్రీవారి లడ్డూని సీఎం చంద్రబాబు అపవిత్రం చేస్తూ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. వైఎస్సార్‌సీపీని రాజకీయంగా దెబ్బతీయాలనే దురుద్దేశంతో సీఎం చంద్రబాబు శ్రీవారిని వాడుకుంటున్నారన్నది స్పష్టమవుతోంది.

నెయ్యి, ముడిసరుకుల సేకరణకు గొప్ప వ్యవస్థ..

టీటీడీ బోర్డు స్వతంత్ర సంస్థ. శ్రీవారికి సమర్పించే నైవేద్యాలు, లడ్డూల తయారీ, అన్నప్రసాదంలో ఉపయోగించే ఆవు నెయ్యి, ముడిసరుకుల సేకరణకు ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో టీటీడీలో గొప్ప వ్యవస్థ ఉంది. నాణ్యతా ప్రమాణాలను నిర్దేశించి ఆవు నెయ్యి, ముడిసరుకుల సేకరణకు ఈ–ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో టీటీడీ టెండర్లు పిలుస్తుంది. తక్కువ ధరకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన సంస్థకు సరుకుల సరఫరా బాధ్యతలను అప్పగిస్తుంది. టీటీడీకి సరుకుల సరఫరా చేసే సమయంలో.. అవి టెండర్ నిర్దేశించిన ప్రమాణాల మేరకు నాణ్యంగా ఉన్నట్లుగా సంబంధిత సంస్థ ఎన్‌ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ ల్యాబ్స్) ధ్రువీకరించిన ల్యాబ్ నుంచి సర్టిఫికెట్ పొందాలి. తిరుపతిలోని టీటీడీ గోడౌన్ వద్దకు ఆవు నెయ్యి ట్యాంకర్ లేదా సరుకులు తెచ్చిన వాహనం చేరుకున్నాక.. మార్కెటింగ్ అధికారి, సరఫరా సంస్థ ప్రతినిధి సమక్షంలో ఒక్కో నెయ్యి ట్యాంకర్ నుంచి మూడు శాంపిళ్లను సేకరించి తిరుమలలోని టీటీడీ ల్యాబ్‌కు పంపుతారు. ఆ మూడు శాంపిళ్లను ముగ్గురు టెక్నీషియన్లతో వేర్వేరుగా పరీక్ష చేయిస్తారు. ఆ మూడు పరీక్షల్లో టెండర్‌లో నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఉన్నట్లుగా తేలితేనే ఆ నెయ్యి ట్యాంకర్‌ను గోడౌన్‌లోకి అనుమతించి అన్‌లోడ్‌కు అవకాశం కల్పిస్తారు. నాణ్యంగా లేదని ఒక్క పరీక్షలో తేలినా ఆ నెయ్యి ట్యాంకర్‌ను గోడౌన్‌లోకి అనుమతించరు. సరఫరా సంస్థకు వెనక్కి తిప్పి పంపేస్తారు. 2014–19 మధ్య నాణ్యత లేదని 14–15 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపగా.. 2019–24 మధ్య 18 ట్యాంకర్లను నాణ్యత లేదని సరఫరా సంస్థలకు తిప్పి పంపారు. అసలు నాసిరకం ముడిసరుకులు.. కల్తీ నెయ్యిని శ్రీవారికి సమర్పించే నైవేద్యాలు, లడ్డూ, అన్నప్రసాదాల తయారీలో వినియోగించే అవకాశమే లేదు. టీటీడీ చరిత్రలో ఇప్పటిదాకా ఎన్నడూ కల్తీ నెయ్యి, నాసిరకం ముడి సరుకులను శ్రీవారికి సమర్పించే నైవేద్యాలు, లడ్డూ, అన్నప్రసాదాల తయారీలో ఉపయోగించలేదని మార్కెటింగ్ విభాగంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు.

ల్యాబొరేటరీ ఉన్నా.. లేదంటారా?

తిరుమలలో గోశాలకు సమీపంలో అధునాతనమైన ల్యాబొరేటరీని టీటీడీ ఏర్పాటు చేసింది. టెండర్ల ద్వారా కొనుగోలు చేసిన సరుకుల శాంపిళ్లను మార్కెటింగ్ అధికారులు టీటీడీ ల్యాబ్‌కు పంపుతారు. నాణ్యతను ల్యాబ్ ధ్రువీకరిస్తేనే ఆ సరుకులను గోడౌన్‌లోకి అనుమతిస్తారు. లేదంటే సరఫరా సంస్థకు వెనక్కి పంపేస్తారు. కానీ.. ఈవో శ్యామలరావు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ టీటీడీకి ల్యాబ్ లేదని చెప్పడంపై టీటీడీ వర్గాలు విస్తుపోతున్నాయి.

ముందస్తు ప్రణాళిక మేరకే..

- ముఖ్యమంత్రిగా చంద్రబాబు జూన్ 12న ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ ఈవోగా జె.శ్యామలరావును జూన్ 14న ప్రభుత్వం నియమించింది. ఈవోగా బాధ్యతలు స్వీకరించక ముందే సీఎం చంద్రబాబును తాను కలిశానని తిరుమలలో శుక్రవారం మీడియా సమావేశంలో శ్యామలరావు వెల్లడించారు. తిరుమలలో ప్రసాదాల తయారీలో వినియోగించే ముడిసరుకుల్లో నాణ్యత లేదని.. జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి లడ్డూల తయారీలో వాడుతున్నారని చెప్పారన్నారు. దీన్ని బట్టి వైఎస్సార్‌సీపీని రాజకీయంగా దెబ్బతీయడానికి అప్పుడే చంద్రబాబు కుట్ర చేసినట్లు స్పష్టమవుతోంది.
- ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్ల నెయ్యి కల్తీ అయ్యిందని జూలై 23న ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చింది. అదే రోజు ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. వెజిటబుల్ ఫ్యాట్స్ ఆవు నెయ్యిలో కలిసినట్లు పరీక్షల్లో వెల్లడవడంతో నాలుగు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపామని ప్రకటించారు.
- ఈనెల 18న మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్‌లో కూటమి శాసనసభాపక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని వాడారని.. తిరుమలను అపవిత్రం చేశారంటూ ముందస్తుగా రచించిన కుట్ర అమలుకు తెరతీశారు. అదే రోజు ఎన్‌డీడీబీ జూలై 23న ఇచ్చిన పరీక్ష నివేదికను టీడీపీ కార్యాలయంలో విడుదల చేయించారు.
- ఆ నివేదిక సాక్షిగా కల్తీ అయిన నెయ్యి సరఫరా జరిగింది టీడీపీ ప్రభుత్వంలోనే కావడంతో తాను తీసుకున్న గోతిలోనే చంద్రబాబు పడ్డారు. అయినా సరే అబద్ధాలు వల్లె వేస్తూ శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడటం మానుకోలేదు.
- టీటీడీ ఈవో శ్యామలరావు తాజాగా ఎన్‌డీడీబీ నివేదికపై జూలై 23న వెల్లడించిన అంశాలకు భిన్నంగా మీడియాతో మాట్లాడారు. వెజిటబుల్ ఫ్యాట్‌తోపాటు జంతువుల కొవ్వు కూడా ఆవు నెయ్యిలో కలిసినట్లు చెప్పడం గమనార్హం.

బురుగులా మారుతుంది..



నెయ్యిలో జంతువుల కొవ్వు, చేప నూనె ఉన్నట్లు కొందరు చెప్పడం ఆశ్చర్యమేస్తోంది. నెయ్యి ఔషధంతో సమానమైంది. అందులో వేరే ద్రవాలు ఎంత మోతాదులో కలిపినా వెంటనే దుర్వాసనతో పాటు నెయ్యి పొరలు పొరలుగా విడిపోయి బురుగులా తయారవుతుంది. మైసూరు ల్యాబోరేటరీ నివేదిక ఎందుకు బహిర్గతం చేయడం లేదు? ప్రజా ప్రతినిధులు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తే తిరుమల ప్రసాదానికి మచ్చతెచ్చిన వ్యక్తులవుతారు.

–శ్రీకరన్, ప్రముఖ ఫుడ్ టెస్టింగ్ ల్యాబరేటరీ విశ్రాంత అధికారి, తమిళనాడు

స్పెసిఫైడ్ అథారిటీ ఏది?



కొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడుస్తున్నా ఇంతవరకు టీటీడీ పాలకమండలి నియామకం ఊసే లేదు. టీటీడీ బోర్డు రద్దు అయిన వెంటనే స్పెసిఫైడ్ అథారిటీని నియమించకుండా ప్రభుత్వం పెద్ద తప్పు చేసింది.

–టీ.రాధాక్రిష్ణయ్య, ప్రముఖ టెంపుల్ రిటైర్డ్ అధికారి, తెలంగాణ

నోటికి వచ్చినట్లు నిందలా?



నిజానిజాలు తెలుసుకోకుండా ఎన్‌డీడీబీ రిపోర్టు అంటూ అధికారులే రాజకీయ నాయకుల అవతారమెత్తి చెప్పడం టీటీడీ చరిత్రలో ఎన్నడూ చూడలేదు. ఇటువంటి ప్రచారం చేసే ముందు ఒకటికి పదిమార్లు ఆలోచించాలి. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపి పూర్తి స్థాయిలో పరిశీలన జరపాలి. నోటికి వచ్చినట్టు శ్రీవారి ప్రసాదంపై నిందలు వేయడం అజ్ఞానానికి నిదర్శనం.

–సోమశేఖరన్, టీటీడీకి విరాళం అందించిన దాత, ఎన్ఆర్ఐ

అలా కలిపితే వెంటనే పాడవుతుంది..



శ్రీవారి ప్రసాదంలో వాడే నెయ్యి విషయంలో అసత్య ప్రచారాలు బాధాకరం. ఆవు పాలలో కొవ్వు అధిక శాతం ఉంటుంది. నెయ్యి తయారీ ప్రక్రియలో ఎంతో కొంత శాతం కొవ్వుకు సంబంధించిన ఆనవాళ్లు ఉంటాయి. నెయ్యిలో వేరే జాతి కొవ్వు కలిపేందుకు వీలుకాదు. అలా కలిపితే వెంటనే నెయ్యి పాడవుతుంది. చిన్న లాజిక్ కూడా తెలియకుండా అసత్య ప్రచారాలు చేయడం దారుణం.

–ప్రకాష్ కుమార్, కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రంలో క్వాలిటీ కంట్రోలర్

ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యి అస్సలు వాడలేదు

ఏఆర్ డెయిరీకి తిప్పి పంపించాం

ప్రఖ్యాత ఆంగ్ల వెబ్‌సైట్ 'ది ప్రింట్'తో టీటీడీ ఈవో శ్యామలరావు ఒప్పుకోలు

అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని, టీటీడీకి అపవిత్రం జరిగిపోయిందని చంద్రబాబు చేస్తున్న ప్రచారం అంతా బోగస్ అని తేలిపోయింది. చంద్రబాబు చేస్తున్న దుర్మార్గపు దుష్ప్రచారం వల్లే టీటీడీ పవిత్రత మంటగలుస్తోందని మరోమారు స్పష్టమైపోయింది. బాబు నియమించిన టీటీడీ ఈవో శ్యామలరావు మాటల్లో ఈ విషయం బట్టబయలయ్యింది. శనివారం ప్రఖ్యాత ఆంగ్ల వెబ్‌సైట్ 'ది ప్రింట్'తో శ్యామలరావు మాట్లాడుతూ ''తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ నుంచి వచ్చిన 10 ఆవునెయ్యి ట్యాంకర్లలో నాలుగింటిలో నాణ్యత తగ్గినట్లు టీటీడీ నిపుణులు నిర్ధారించారు. జులై 6న వచ్చిన రెండు ట్యాంకర్లలో, జులై 12న వచ్చిన మిగిలిన ట్యాంకర్లలోని శ్యాంపుల్స్‌ను సేకరించి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ సెంటర్‌కు పంపించాం. ఆ నెయ్యిని 100శాతం ఉపయోగించలేదు.''అని చెప్పారు. ఎన్‌డీడీబీ రిపోర్ట్‌లో జంతుసంబంధమైన, వెజిటబుల్ ఫ్యాట్‌లకు సంబంధించిన కల్తీ జరిగినట్లు తేలడంతో ఆ నాలుగు ట్యాంకర్లను పక్కన పెట్టి ఏఆర్‌డైరీకి తిప్పి పంపించామని శ్యామలరావు చెప్పారు. అసమయంలో టీటీడీకి ఐదు ఏజెన్సీలు నెయ్యి సరఫరా చేస్తున్నాయని, అందులో ఏఆర్ డైరీ ట్యాంకర్లలోనే నెయ్యి తక్కువ నాణ్యత ఉన్నట్లు తేలిందని ఆయన తెలిపారు. కాగా చంద్రబాబు చేసిన ఆరోపణలకు ఆధారం ఏమిటి అన్నది తెలుసుకునేందుకు ది ప్రింట్ ప్రతినిధి మంత్రి నారా లోకేశ్‌ను వాట్సాప్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదని వెబ్‌సైట్ పేర్కొంది.



ThePrint
POLITICS GOVERNANCE ECONOMY DEFENCE INDIA GROUND REPORTS OPINION EVENTS

Naidu's Tirupati laddu claim under scrutiny. 'Adulterated ghee arrived in July, never used,' says TTD

Tirupati temple trust's executive officer says tankers of contaminated ghee were turned away after samples were tested.

"That ghee was never used, 100 percent," Syamala told ThePrint Saturday.

The four tankers were kept aside and sent back to AR Dairy after the NDDB CALF report reflected animal and vegetable fat contamination.

ప్రమాణాలు పాటించని నెయ్యిని లడ్డూ తయారీకి అస్సలు వాడలేదంటూ శ్యామలరావు చెప్పినట్లు ది ప్రింట్‌లో వచ్చిన కథనం

లడ్డూలలో కల్తీ ఎక్కడుంది?: ఐవైఆర్ కృష్ణారావు

ఎన్‌డీడీబీ రిపోర్ట్ ప్రకారం తిరస్కరించిన కల్తీనెయ్యి గురించే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఆరోపణలు చేస్తుంటే ఇక తిరుపతి లడ్డూలలో కల్తీ ఎక్కడుంది? ''అని మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు ప్రశ్నించారు. ఆయన ది ప్రింట్ ప్రతినిధితో మాట్లాడుతూ చంద్రబాబు చేస్తున్న ఆరోపణలకు దన్నుగా మరేదైనా గట్టి ఆధారం లేకపోతే ఇది కచ్చితంగా చంద్రబాబుకు, టీడీపీకి బూమరాంగ్ వంటిదేనని వ్యాఖ్యానించారు.

చర్యతీసుకోవడం మానేసి రాజకీయమా?

''టీటీడీలో ఒక సిస్టమ్‌ను అనుసరిస్తాం. సాంకేతిక, ఆర్థిక అర్హతల ఆధారంగానే సరఫరాదారును ఎంపిక చేస్తారు. ఎంపికైన ఏజెన్సీ కల్తీ వంటి ఏదైనా తప్పు చేస్తే దానిని గుర్తించి చర్య తీసుకోవడం ప్రస్తుత ప్రభుత్వ బాధ్యత. అది మానేసి దీనిని రాజకీయంచేయడం ఎంత వరకు సబబు?''అని పేరు చెప్పడానికి ఇష్టపడని టీటీడీ అధికారి ఒకరు ది ప్రింట్ ప్రతినిధికి చెప్పారు.

మంత్రి పదవుల్లోనూ న్యాయం చేయాలి

- మర్యాదపూర్వకంగా పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను కలిసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: కేబినెట్ విస్తరణలో బీసీలకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బీసీ నేత మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కృష్ణయ్య శనివారం గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ...బీసీకి అధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరారు. కేంద్రంలో ఇండియా కూటమి బలంగా ఉందని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

లడ్డూ ప్రసాదం 'కల్తీ'ని సంచలనంగా మార్చొద్దు

- రాజకీయ పార్టీలు, ధార్మిక సంస్థలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి
- హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్రలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఏపీ సర్కారుకు సూచన



సాక్షి, హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న అంశాన్ని సంచలనాత్మకంగా మార్చొద్దని రాజకీయ పార్టీలు, ధార్మిక సంస్థలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మాన్ని, హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్రలు గతంలోనూ జరిగిన నేపథ్యంలో వాటన్నింటిపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైందన్న వార్తలతో భక్తుల నమ్మకం, విశ్వాసం సడలే ప్రమాదం ఉందని కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్టీలు, ధార్మిక సంస్థలు బాధ్యతతో వ్యవహరించి సంయమనం పాటించాలని ఓ ప్రకటనలో సూచించారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నిత్యం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే లక్షలాది మంది భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు.. వారి మనోభావాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని కోరారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న వార్తలు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించాయన్నారు. హిందువులు ముఖ్యంగా శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం క్షమార్హం కాదని పేర్కొన్నారు. కోట్లాదిమంది మనోభావాలను దెబ్బతీసిన నేరస్తులకు తగిన శిక్ష పడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దిశగా పోలీసు యంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ముందుకు వెళ్తున్నాయని ఆశిస్తున్నామన్నారు. ఇలాంటి దురాగతానికి బాధ్యులైన వారందరినీ గుర్తించి తగిన శిక్ష పడేలా చేయాలని కోరారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటనలేవీ పునరావృతం కాకుండా కఠినచర్యలు చేపట్టాలని కిషన్‌రెడ్డి సూచించారు.

తిరుపతి లడ్డూ కథ హెరిటేజ్ లాభాల కోసమా!

- టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే అనుమానం
- 'ప్రైవేట్ ల్యాబ్ రిపోర్ట్' ఆధారంగా అల్లిన కట్టు కథా?



సాక్షి, అమరావతి: తిరుపతి శ్రీవారి లడ్డూ తయారీపై చెలరేగిన వివాదంపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే స్పందించారు. ఇది నిజమా.. లేక రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ఆరోపణా.. అని 'ఎక్స్'లో అనుమానం వ్యక్తం చేశారు. 'తిరుపతి లడ్డూల కథ వాస్తవమా లేక చంద్రబాబు హెరిటేజ్ సంస్థ లాభాలను పెంచుకోవడానికి, రాజకీయ లబ్ధి కోసం బీజేపీ సహాయంతో అల్లిన కట్టుకథా? జంతువుల కొవ్వు, పంది కొవ్వుతో తిరుపతి ప్రసాద లడ్డూలు చేశారని ఆరోపిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ల్యాబ్ రిపోర్టు చూపించారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించారని ఆయన పార్టీ పేర్కొంది. ఇందులో ఆసక్తి ఏంటంటే చంద్రబాబు నాయుడు, అతని భార్య నెయ్యి తయారు చేసే హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ నడుపుతున్నారు. లోక్‌సభ ఫలితాలప్పుడు బీజేపీ అవకతవకలకు పాల్పడిందన్న ఆరోణలున్నాయి. అదే సమయంలో చంద్రబాబు నాయుడికి చెందిన కంపెనీ షేర్లు గాలివాటంగా అమాంతం పెరిగిపోయి ఆయన కుటుంబానికి రూ.1200 కోట్లు లాభాలు తెచ్చిపెట్టాయి. ఇప్పుడు తిరుపతి లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిపై ఆరోపణలు రావడం.. గుజరాత్‌నుంచి వచ్చిన 'ప్రైవేట్ ల్యాబ్ రిపోర్ట్'ఆధారంగా నెయ్యి, పాల సామ్రాజ్యాన్ని నియంత్రించే ఓ కుటుంబం ఆరోపణలు చేయడం యాదృచ్ఛికం' అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు చంద్రబాబును ట్యాగ్ చేయడంతో పాటు హెరిటేజ్ సంస్థ ఉత్పత్తుల చిత్రాలను సైతం జత చేశారు. పోస్ట్ ప్రారంభంలో 'ఇంపార్టెంట్''అని మొదలుపెట్టారు.

తిరుమల లడ్డూను రాజకీయం చేయొద్దు

- టీటీడీ కొనుగోలు కమిటీలో ప్రధాని మోదీ, అమిత్ షా ప్రతిపాదించిన కృష్ణమూర్తి సభ్యుడు
- ప్రస్తుత ఏపీ మంత్రి పార్థసారథి, టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కూడా..
- వీరందరి సూచనల మేరకే నెయ్యి కొనుగోలు
- యుగతులసి ఫౌండేషన్ చైర్మన్ కొలిశెట్టి శివకుమార్



పంజగుట్ట: తిరుమల లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేయడం సరికాదని యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు కొలిశెట్టి శివకుమార్ అన్నారు. 2019 తిరుమల కొనుగోలు కమిటీలో ప్రధాని మోదీ, అమిత్ షా సూచించిన కృష్ణమూర్తి వైద్యనాథన్, రాజ్‌నాథ్ సింగ్ సూచించిన సంపత్ రవి నారాయణ్, నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన డి.పి.అనంత్‌తో పాటు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ మంత్రి పార్థసారథి, టీడీపీ ఎమ్మెల్యే వేంరెడ్డి ప్రశాంతి రెడ్డి కూడా ఉన్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. నెయ్యి కొనుగోలు చేశారంటే అది కొనుగోలు కమిటీ సూచనల మేరకే జరిగిందని ఆయన పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని ప్రతిపాదించిన కృష్ణమూర్తి చెన్నైకి చెందిన వ్యక్తే అని, చెన్నైకి చెందిన సంస్థకే నెయ్యి కాంట్రాక్ట్ ఇచ్చినప్పుడు.. అది సరఫరా చేస్తున్న నెయ్యి నాణ్యత గురించి ఎందుకు తెలుసుకోలేకపోయారని ప్రశ్నించారు.

గుడికో గోమాత.. నవనీత సేవ

గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, గోసేవే గోవిందుని సేవ అని భావించి ప్రతి దేవాలయానికి ఒక గోమాత కార్యక్రమం రూపొందించామని శివకుమార్ తెలిపారు. గో ఆధారిత సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటలతో గో ఆధారిత నైవేద్యం కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. వేణు గోపాలుడికి ఎంతో ప్రీతిపాత్రమైన వెన్నను సంప్రదాయ పద్ధతిలో కవ్వంతో చిలికి అందించాలని నూతన సేవగా నవనీత సేవను ప్రారంభించామన్నారు. స్వచ్ఛమైన నెయ్యిని స్వామి వారికి అందించాలంటే తిరుమలలో గో మహాధామం నిర్మాణం ఒక్కటే పరిష్కారమని, అందులో లక్షా ఇరవై వేల దేశీ గోవులను పెంచాలని సూచించారు. టీటీడీ పాలకవర్గం ఒక్క ప్రకటన చేస్తే భక్తులే ఆ మేరకు దేశీ ఆవులకు కావాల్సిన వనరులు సమకూరుస్తారని చెప్పారు. టీటీడీ ముందుకు వస్తే ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు యుగ తులసి సిద్ధంగా ఉందన్నారు.

ఏ చరిత్ర లేని వారే వక్రీకరిస్తున్నారు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపుసభలో వక్తలు



రావి విగ్రహం వద్ద పల్లా, చాడ, హరగోపాల్ తదితరులు

బంజారాహిల్స్(హైదరాబాద్): తమకంటూ ఏ చరిత్ర లేని పార్టీలు.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తమ చరిత్రగా చెప్పుకునేందుకు కుట్రలు పన్నుతున్నాయని పలువురు వక్తలు ధ్వజమెత్తారు. ఈ కుట్రలను తిప్పికొడుతూ అసలు చరిత్రను భావితరాలకు అందించే బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల ముగింపు సభ శనివారం బంజారాహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ బీజేపీ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ చరిత్రను పూర్తిగా వక్రీకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్ర అనేది మానవ సమాజ ప్రయోగశాల అని, తద్వారానే భవిష్యత్ కోసం పునాదులు వేసుకునేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న సీఎం కేసీఆర్ తెలంగాణ సాయుధ పోరాటాన్ని 'సమైక్య దినోత్సవం'పేరుతో ఎందుకు నిర్వహించారో ఆయనకే తెలియాలన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను వ్యక్తిగతంగా గుర్తిస్తూ సముచిత గౌరవం కల్పిస్తున్నా, ఈ పోరాటానికి మార్గదర్శి అయిన కమ్యూనిస్టు పార్టీ పేరును ఉచ్చరించడానికే భయపడుతోందన్నారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ పేరు ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విలీనం దినోత్సవం రోజున అధికారికంగా ఉత్సవాలు నిర్వహించడం స్వాగతిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆట పాట'కార్యక్రమంలో నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరిస్తూ ఆలపించిన గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ సభలో సంపాదకుడు కె.శ్రీనివాస్, అమరవీరుల ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, సభ్యులు ఉజ్జిని రత్నాకర్‌రావు, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకటరెడ్డి, సీపీఐ సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్.బాలమల్లేష్, పశ్య పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 22-9-2024

మన దేశంలో కొత్తగా పెళ్లయిన దంపతులను 'సుపుత్ర ప్రాప్తిరస్తు' అని ఆశీర్వదించడం ఆనవాయితీ. అయితే ఇప్పుడు 'సుపుత్రికా ప్రాప్తిరస్తు' అంటున్నారు. ఎందుకంటే ఇప్పటి కాలంలో కూతురు పుట్టడమే పెద్ద అదృష్టం అనే విధంగా ఆలోచనలు మారుతున్నాయి. అన్ని రంగాల్లో ఆడపిల్లలు సాధిస్తున్న విజయాలు అందుకు సహకరిస్తున్న తల్లిదండ్రులను చూస్తూనే ఉన్నాం.

ఇంట కూతురు ఉంటే ఆ ఇంటికి వచ్చే కళ వేరు. కూతురి సామర్థ్యాలు ఇంటికి వెలుగు. భ్రూణ హత్యల వల్ల స్త్రీల జనాభా కురచగా ఉన్న రోజులు ఇకపై చెల్లిపోవాలి. ప్రతి కూతురూ ఒక వరంలా వర్ధిల్లాలి.

అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం సందర్భంగా కూతురుగా, కూతురికి తల్లిగా ఉన్న కొంతమంది రచయిత్రుల అభిప్రాయాలు.

మన కంటిపాపకు కలలే కాదు... రెక్కలిద్దాం

నేడు అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం



మీ కూతుళ్లకేం ఇస్తున్నారు?



'మీకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉండి, ఒకరిని మాత్రమే చదివించే స్తోమత ఉన్నట్లయితే అమ్మాయినే చదివించండి' అంటారు పెరియార్. ఆడపిల్లల చదువు ప్రాధాన్యతను గుర్తించడం వల్లే కావచ్చు నన్ను, మా చెల్లిని బాగా చదివించారు మా తల్లిదండ్రులు. ఆడపిల్లలకేం కావాలి అంటే మంచి బట్టలు, నగలు అని కాకుండా ఆర్థికంగా స్వావలంబన కలిగివుండాలనే వారి ఆలోచన కారణంగానే మా జీవితాల్లో మేము నిలదొక్కుకున్నాం. ఈ కారణం చేతనే కొడుకులకు మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత అనుకోకుండా వాళ్ల చివరి రోజుల్లో వారి ఆలనా పాలనా నేను చూసుకోగలిగాను. ఇప్పుడు అమ్మాయిలకి కేవలం ఆర్థిక స్వావలంబన మాత్రమే సరిపోదు. సమాజంలో భద్రత, ఆత్మరక్షణ విద్యలు కూడా అవసరం. ఇంట్లో నేను ఇద్దరు ఆడపిల్లలకు తల్లిని. కాలేజీలో నాకు ఎనిమిది వందల మంది కూతుళ్లు. వారంతా రెక్కలు తొడిగిన ఉత్సాహంతో స్వేచ్ఛగా ఎగరగలిగే వాతావరణం ఉండాలని నా ఆకాంక్ష. అమ్మాయిలు ఆర్థిక స్వావలంబనతో పాటు, ఆత్మవిశ్వాసంతో ఎదగటానికి తల్లిదండ్రులు సమాజం చేయగలిగినదంతా చేయాలి. నేటితరం కూతుళ్లందరికీ నా శుభాకాంక్షలు.

- ఎం. ప్రగతి, రచయిత్రి, అనంతపురం

కూతురి ప్రపంచంలోకి వెళతాను



ఏలూరు దగ్గర, కొక్కిరపాడు అనే పల్లెటూరులో ఆర్థికంగా చితికిపోతూ ఉన్న పెద్దరైతు కుటుంబంలో పుట్టాను. నలుగురాడపిల్లల్లో కడసారిదాన్ని. కూతురుగా ఎట్లా ఉన్నానో, ఉంటున్నానో తరచి చూసుకుంటుంటే కొత్తగా ఉంది. చిన్నప్పుడు మా అవసరాలకి డబ్బులు సరిగ్గా ఇవ్వనందుకు అమ్మానాన్నల మీద అరిచే దాన్నని అమ్మ చెపుతూ ఉంటుంది. కాని బుద్ధి పెరిగాక ఎపుడూ విసిగించింది లేదు. 'మగపిల్లలు లేరు, అంతా ఆడమంద' అని లోకం వెక్కిరించే రోజుల నుంచి 'మా బిడ్డలు రత్నాలు' అని అమ్మానాన్నలు గర్వంగా చెప్పుకునే రోజు వరకూ కూతురుగా నా ప్రయాణంలో అనేక ఎగుడు దిగుళ్లు. కులాన్ని వదిలి నా పెళ్లి నేనే చేసుకున్నందుకు, డబ్బు సంపాదన వదిలి నచ్చిన మార్గంలో వెళ్ళినపుడూ వారు రక్షకులై వెన్ను తట్టారు. చుట్టూ ప్రకృతిని, ప్రేమని ఆస్తులుగా పంచారు. ఇవ్వడం తప్ప తిరిగి అడగడం తెలీని ప్రేమమూర్తుల కూతురిని. స్త్రీలకి అన్నిరంగాలలో స్వేచ్ఛ ఉండాలని నమ్మే నాకు స్నిగ్ధ ఒక్కతే కూతురు. నేను నమ్మే వాటికి, పెంపకానికి మధ్య కొన్ని విషయాలలో పేచీలు వచ్చేవి, దుస్తులు, షికార్లు, ప్రేమలు వంటివి. 'స్వేచ్ఛ అంటే నీ నిద్ర నువ్వే లేవడం కూడా' అంటూ కొటేషన్లు చెప్పిన నాకు ఏ మాత్రం లొంగకుండా తన వ్యక్తిత్వాన్ని చక్కగా కాపాడుకున్న స్నిగ్ధని కొన్ని విషయాల్లో గురువుగా భావించే అమ్మనిపుడు. తనతో గడపడం కోసం నేను ఎదురు చూడడం కాదు, 'అమ్మా... ముచ్చట్లు చెప్పుకుందామా?' అని తను తరచూ అడిగే ఆకర్షణ నాలో ఉండడం కోసం ఆ వయసు వారి ప్రపంచంలోకి చొచ్చుకుపోతాను, నేర్చుకుంటాను. 'నా విలువలకి అనుగుణంగా పెళ్లి చేసుకోకపోతే నేను రాను' అని బెదిరించబోయానా! 'నేను నీ ద్వారా వచ్చాను తప్ప నీ కోసం రాలేదు' అని గట్టిగానే చెప్పింది. కూతురుగా, కూతురి తల్లిగా నా బొమ్మ వారికి సూపర్ హిట్.

- కె.ఎన్. మల్లీశ్వరి, రచయిత్రి, విశాఖపట్నం

ఏ దేశ కరెన్సీ సరిపోదు

ఫలానా అమ్మాయికి మేము తల్లితండ్రులం అనే స్థాయికి ఎదిగిన ఆడపిల్లలు ఎందరో. అటువంటి అమ్మాయిలను ఆదర్శంగా తీసుకొని గొప్పగా ఎదగాలని ఇండియన్ ఆర్మీకి, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధం అయ్యాను. అనేక కారణాల చేత గమ్యం చేరుకోలేక నిస్సహాయతతో నలిగిపోయాను. ఇంట్లో పెళ్లి చేస్తాను అన్న ప్రతిసారి 'అమ్మా! నీలాగా నా జీవితం ఇంటికి, పెళ్లి, పిల్లలకు అంకితం అవ్వకూడదు' అని మా అమ్మను నిందించేదాన్ని. అమ్మ మౌనంగా బాధపడేది. వంటింట్లో ఉల్లిపాయలు తరుగుతూ కన్నీటిని దాచిపెట్టేది. అపుడు అర్థం అయ్యేది కాదు... నాకు పెళ్ళి అయ్యి ఒక కూతురు పుట్టే వరకు ఆమె మౌనానికి అర్థం నిస్సహాయత కాదు అది అంతర్మథనం అని నాకు తెలియలేదు.

మా అమ్మ ఇద్దరు చెల్లెళ్లకు అక్కగా పుట్టింది. కొడుకులు లేని కుటుంబం. ఇద్దరూ పిన్నులు చిన్న ఉద్యోగాలు చేయడం మొదలుపెట్టారు. కానీ మా అమ్మ పరిస్థితుల రీత్యా టాలెంట్ ఉన్నా ఇంటికే పరిమితం ఐపోయింది. కానీ ఇంట్లో, ఇంటి చుట్టుపక్కల ఎవరికి ఆపరేషన్ ఐనా, ఒంట్లో బాగోలేకపోయినా, ఊరెళ్తున్నా ఇలా కారణం ఏదైనా ఆ కుటుంబానికి వండి పెట్టే బాధ్యత కూడా మా అమ్మ నిస్వార్థంగా తీసుకునేది. మా పిన్నులు జీతం సంపాదించే వారు కానీ ఇతరుల కోసం ఖర్చు చేసే సమయం సంపాదించలేక పోయారు. మా అమ్మను చూస్తూ మా తాత అనుకునేవారు..' ఇది నాకు కూతురు కాదు... మా అమ్మ అక్కలను కలిపి మళ్లీ పుట్టించాడు దేవుడు' అని..



మా అమ్మ కథ విన్నాక నాకు అర్థమైంది ఏమిటంటే ఆడపిల్లగా కుటుంబానికి సహాయం చేయాలి అనుకుంటే ఉద్యోగాలే చెయ్యక్కర్లేదు.. అందరినీ నా వారు అనుకుంటూ కలుపుకుని పోతే డబ్బు సంపాదించే ఉద్యోగం చేయకపోయినా మనసులను సంపాదించొచ్చు. ఇది అర్థమయ్యాక మా అమ్మ జీవితాన్ని గమనించి ఆమె చెప్పినవి, చెప్పనివి అక్షరాలుగా రాయడం మొదలుపెట్టాను. రాయడం మొదలు పెట్టిన తరువాత తెలిసింది ఇది మా అమ్మ కథ కాదు. కొన్ని వందల వేల అమ్మల కథ. ఇంటిపట్టున మిగిలిపోయాము అని బాధపడే ఆడపిల్లల, ఆడతల్లుల మనోవ్యథ. మన దేశంలో ఆడపిల్లలు కొన్ని కోట్ల మంది ఇంటి పట్టున ఉండిపోయాము అని బాధ పడుతూ వుంటారు. మీరు ఓడిపోలేదు. మీరు కూతుర్లుగా మీ అమ్మ నాన్నల ప్రేమను, పేరును, పెంపకాన్ని నిస్వార్థంగా ప్రపంచానికి పంచుతున్నారు, కుటుంబాలను, కలలను పెంచుతున్నారు. మీరు చేస్తున్న సేవకు వెల కట్టి డబ్బు ఇవ్వాలని ఆలోచన వచ్చినా అది ఏ దేశ కరెన్సీలో ఇచ్చినా మీకు సరిపోదు. మీకు కుమార్తెల దినోత్సవ శుభాకాంక్షలు. ఇదంతా రాస్తుంటే నా 17 నెలల కూతురు 'అమ్మ జూచు జూచు' అనుకుంటూ ఒక గ్లాస్ ను వంకర టింకరగా పట్టుకుని నా టేబుల్ దగ్గరకు వచ్చింది. నాలో ఉన్న ఆడపిల్ల నాకు పుట్టిన ఆడపిల్లను చూసి మురిసిపోయింది.

- ప్రవల్లిక, రచయిత్రి, సికింద్రాబాద్

కూతుళ్లు మేజిక్ చేస్తారు



ఇంటికి ఆడపిల్ల వుండటం గొప్ప వైభవం. నేను ఒక కూతుర్ని, ఒక కూతురికి తల్లిని. అయితే నేను మరీ అంత గొప్ప లేదా మంచి కూతుర్ని కాదు. బహూశా ఇంకొంచం బాగా వుండాల్సింది. జీవితపు ప్రతి దశలో మా అమ్మతో/కుటుంబంతో అనేక విషయాల్లో విభేదిస్తూ, గొడవ పడుతూ, అప్పుడప్పుడూ సర్దుకుపోతూ, నా స్వాతంత్ర కాంక్షను, అభిప్రాయాలను కాపాడుకుంటూ నడిపాను. మా అమ్మ కాస్త మొండిమనిషి కాబట్టి చిన్నతనంలో అలవికాని నా అల్లరిని, ఇప్పటికీ నా స్వభావంలో వుండే లోపాల్ని భరిస్తోంది. సున్నితమైన అమ్మైతే చాలా కష్టం అయేది. కూతురిగా నాకై నేనైతే జస్ట్ పాస్ మార్క్ వేసుకుంటాను. నా కూతురి దగ్గరకొస్తే తన వల్ల నేను టెన్షన్ పడిన సందర్భాల కన్నా గర్వపడిన సందర్భాలే ఎక్కువ. కూతుళ్లు, తల్లులకన్నా, తండ్రులకు సన్నిహితంగా వుంటారు అనే లోకోక్తి నేను నమ్మను. నా కూతురు నాకు దగ్గరగా వుంటుంది. నాకు కొత్త కొత్త విషయాలు నేర్పిస్తుంది. నాతో వాదిస్తుంది. నాది తప్పైతే మన్నిస్తుంది. మంచి కూతురిగా, మా అమ్మాయికి డిస్టింక్షన్ శాంక్షన్ చేస్తాను. ఇవాళ మా అమ్మ దగ్గరకువెళ్ళి అడిగితే కూడా తనకు తక్కువ మార్కులు వేసుకొని, తన కూతురికి ఎక్కువ మార్కులు ఇస్తుంది. కూతుర్లు అంతే. మురిపిస్తారు. మాజిక్ చేస్తారు.

- ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి, రచయిత్రి, విజయవాడ

బ్యూటిప్స్

పాలతో మృదుత్వం



పావు కప్పు ఓట్స్‌ని తీసుకుని అందులో కప్పుడు పాలు పోసి ఉడకపెట్టుకోవాలి. చల్లారాక దానిలో టీ స్పూను తేనె కలిపి, మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. చేతివేళ్ళతో నెమ్మదిగా రబ్ చేయాలి. మిశ్రమంలో పసుపు లేదా గంధం పొడిని కూడా కలుపుకోవచ్చు. ప్యాక్‌ను పావు గంట ఉంచుకుని నీటితో కడిగేయాలి. ఈ మిశ్రమాన్ని మెడకు, చేతులకు కూడా అప్లై చేసుకోవచ్చు. ఇలా వారానికొకసారి చేయడం వల్ల చర్మం ఎంతో మృదువుగా తయారవుతుంది.

పొడిబారిన చర్మం కోసం ..



టీ స్పూన్ తేనెలో అర టీ స్పూన్ క్యారట్ జ్యూస్ లేదా నారింజ జ్యూస్ కలపాలి. ఈ మూడింటినీ బాగా కలిపిన తరవాత పేస్ట్ చేసుకోవడానికి సరిపడా శనగ పిండి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 20 నిమిషాల తరవాత గోరువెచ్చటి నీటితో కడిగేస్తే చర్మం పట్టుకుచ్చులా మృదువుగా తయారవుతుంది. పొడి చర్మం గలవారు వారానికి ఒక్కసారి ఈ ప్యాక్‌ని వాడడం వల్ల ఉపయోగకరంగా ఉంటుంది.



హెల్త్



కాళ్లవాపులు సాధారణ సమస్య. అదేపనిగా చాలాసేపు కూర్చున్నా లేదా చాలాసేపు కూర్చుని ప్రయాణం చేసినా కాళ్లవాపులు రావచ్చు. ఇది ఏమాత్రం ప్రమాదకరం కాని వాపు. అయితే కొన్ని సమయాల్లో కాళ్లవాపులు కొన్ని రకాల ఆరోగ్య సమస్యలకు సూచిక కావచ్చు. వాటిని కాస్త సీరియస్‌గా తీసుకుని డాక్టర్‌ను సంప్రదించి, వైద్యపరీక్షలు చేయించుకుంటే కొన్ని జబ్బుల నుంచి మొదటి దశల్లోనే వాటి నుంచి విముక్తి పొందే అవకాశముంది. అలా సరైన సమయానికి సరైన చికిత్స అందితే చాలా రకాల జబ్బుల్ని మొదట్లోనే తుంచివేయవచ్చు. కాళ్లవాపులతో బయటపడే జబ్బులేమిటో, వాటిని మొగ్గదశలోనే తుంచివేయడమెలాగో చూద్దాం.



ఈ వాపు ఏ టైపు?

పాదాల వాపు ఒక్కోసారి గుండెజబ్బును సూచించవచ్చు. అయితే పాదాలు వాచినప్పుడు రెండు పాదాలూ వాచాయా, కేవలం వాపేనా లేదా నొప్పి కూడా ఉందా అని పరిశీలించాలి. మొదట కాలి ముందు భాగం, మడమ దగ్గర వాపు ఉండి, తర్వాత పాదం పైకి పాకుతూ నొప్పి లేనిదైతే అది గుండె జబ్బును సూచించవచ్చు. మామూలుగా గుండెదడ, ఆయాసం వంటి లక్షణాలుంటే గుండెజబ్బుగా అనుమానిస్తారు. కానీ పైన పేర్కొన్న వాపు లక్షణాలు చూశాక వాటితో పాటు ఆయాసం, గుండెదడ, ఛాతీ నొప్పి వంటి లక్షణాలు ఉన్నా లేకపోయినా ఒకసారి గుండెజబ్బుల నిపుణులను కలవడం మేలు.

గుండెజబ్బులకూ, పాదాలవాపునకూ సంబంధమేమిటి?

గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గినప్పుడూ, అలాగే గుండె సంకోచించే శక్తి లేదా వ్యాకోచించే సామర్థ్యం లోపించినప్పుడు కాళ్ల వాపు కనిపించవచ్చు. రక్తపోటు పెరిగినప్పుడూ పాదాల్లో వాపు రావచ్చు. గుండెజబ్బు కారణంగా ఇలా కాళ్ల వాపు వచ్చిందా అనే విషయం తెలుసుకోడానికి 'ప్రో బీ-టైప్ నేట్రీయూరేటిక్ పెప్టైడ్ (ప్రో - బీఎన్‌పీ) అనే రక్తపరీక్ష చేయించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో ప్రో బీఎన్‌పీ విలువ 75 ఏళ్ల లోపు ఉన్న వారికి 125 కంటే తక్కువ లేదా 75 ఏళ్లకు పైబడినవారిలో 450 కంటే ఎక్కువ ఉంటే అది గుండె వైఫల్యం (హార్ట్ ఫెయిల్యూర్) కావచ్చేమోనని డాక్టర్లు అనుమానిస్తారు. అప్పుడు గుండెకు సంబంధించిన ఈసీజీ, ఎకోకార్డియోగ్రఫీ వంటి పరీక్షలు చేయించి గుండెజబ్బును నిర్ధారణ చేస్తారు.



సిరల సామర్థ్యం తగ్గినా పాదాల వాపు...

కొన్ని సందర్భాల్లో కాళ్లలోని సిరల సామర్థ్యం తగ్గడం వల్ల రక్తంలోని నీరు అక్కడే ఉండిపోతుంది. అది పాదాలవాపులా కనిపిస్తుంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఎక్కువసేపు నిల్చుని పనిచేసేవారిలో లేదా ఊబకాయం ఉన్నప్పుడు ఈ సమస్య మరీ ఎక్కువ. ఇలా కాలివాపు కనిపించినప్పుడు ఈ సమస్యనూ అనుమానించాల్సి ఉంటుంది. తొలి దశలో ఎక్కువసేపు ప్రయాణం చేసినప్పుడు సాయంత్రానికి కాళ్ల వాపు కనిపిస్తుంది. అయితే చాలామందిలో ఇది సాధారణంగా కనిపించేది కాబట్టి సహజంగా ఈ సమస్యను పెద్దగా సీరియస్‌గా తీసుకోరు.

ఈ సమస్య ఉన్నవారిలో పిక్కల్లో నొప్పి, కాళ్లు బరువుగా ఉన్నట్లు అనిపించడం కూడా ఉంటాయి. క్రమేణా కాళ్లపైనా, మడమ లోపలి వైపున నల్లటి మచ్చలు ఏర్పడతాయి. కాలి సిరలు ఉబ్బి మెలికలు తిరిగినట్లుగా పచ్చగా లేక నల్లగా చర్మంలోంచి ఉబ్బినట్లు బయటకు కనిపిస్తుంటాయి. తొలి దశలో సాయంత్రం మాత్రమే కనిపించే ఈ సమస్య తర్వాత్తర్వాత రోజంతా ఉంటుంది.

సిరల సామర్థ్య లోపంవల్ల కాళ్లవాపు సమస్య వస్తే...

● ఎక్కువసేపు నిలబడకుండా చూసుకోవడం. ● ఎలాస్టిక్ స్టాకింగ్స్ వేసుకుని ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. స్టాకింగ్స్ వల్ల కాలిపై ఒత్తిడి పడి, అవి సిరలకు మంచి పటుత్వాన్ని ఇస్తాయి. ఈ దశలో నిర్లక్ష్యం చేయడం వల్ల అది ముదిరి వేరికోస్ వెయిన్స్ అనే వ్యాధిగా పరిణమించే అవకాశముంది. ఈ వ్యాధిని తొలిదశలోనే తెలుసుకోవడం కోసం కాలి సిరలకు వీనస్ డాప్లర్ టెస్ట్ అనే పరీక్ష చేయించాలి. వ్యాధి బాగా ముదిరితే కాళ్లకు పుండ్లు కూడా పడవచ్చు. అందుకే ముందే కనుగొని చికిత్స తీసుకోవడం మేలు.

ఊపిరితిత్తుల్లో రక్తపోటు - పాదాల వాపు

ఊపిరితిత్తుల్లో రక్తపోటు పెరగడం వల్ల కూడా పాదాలకు నీరు పట్టి వాపు కనిపించవచ్చు. ఇటీవల ఊబకాయం వల్ల స్లీప్ ఆప్నియా అనే కండిషన్ చాలా మందిలో కనిపిస్తోంది. దీనితో ఊపిరితిత్తుల్లో రక్తపోటు కూడా పెరగవచ్చు.

స్లీప్ ఆప్నియాలో లక్షణాలివి:

● గురకపెట్టడం ● నిద్రలోంచి అకస్మాత్తుగా మెలకువ రావడం ● దగ్గుతో పొలమారి నిద్రనుంచి మేల్కొనడం ● నిద్రలో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారడం ● రోజంతా అలసట.

వైద్యపరీక్షలు: లంగ్స్‌లో రక్తపోటు పెరుగుదలను నిర్ధారణ చేయడానికి ఎకో పరీక్ష చేయించాలి. కాళ్ల వాపులు వచ్చేవారిలో 45 ఏళ్లు దాటితే... వారికి ఎకో పరీక్ష తప్పనిసరి.

చికిత్స: లంగ్స్‌లో రక్తపోటు కారణంగా వచ్చే స్లీప్ ఆప్నియా (గురక) ఒక్కోసారి ప్రాణాంతకమూ కావచ్చు కాబట్టి వారు తప్పనిసరిగా చికిత్స తీసుకోవాలి. చికిత్సతో కాళ్లు వాపులూ తగ్గుతాయి.

కొన్ని మందుల వల్ల...

కొన్ని మందులు వాడుతున్నప్పుడు కూడా కాళ్ల వాపు రావచ్చు. రక్తపోటు, నొప్పి నివారణ కోసం వాడే ఇబుప్రోఫెన్, డయాబెటిస్ అదుపు కోసం వాడే పయోగ్లిటజోన్, ఇతరత్రా సమస్యలకు వాడే కార్టికోస్టెరాయిడ్స్, మానసిక సమస్యలకు వాడే మందులతోనూ కాళ్లవాపులు వస్తాయి. అందుకే కాళ్ల వాపుల బాధితులు మందులేమైనా వాడుతున్నారా అని డాక్టర్లు అడిగి తెలుసుకుని, మందుల వల్లనే అని తేలితే ఆపివేస్తారు లేదా మారుస్తారు.

కారణాలు తెలియని కాళ్ల వాపులు...

మహిళల్లో ముఖ్యంగా 30- 40 ఏళ్లు దాటిన వారిలో కాళ్ల వాపుతో పాటు కొందరిలో ముఖం, చేతుల్లోనూ ఉబ్బు కనిపించవచ్చు. వాళ్లకు అన్ని పరీక్షలూ చేసి ఎలాంటి కారణం లేదని నిర్ధారణ చేసుకుని, అప్పుడు వాపు తగ్గడానికి డైయూరెటిక్స్ వాడతారు. ఏ కారణంతో పాదాల వాపు కనిపిస్తున్నా వాళ్ల ఆహారంలో ఉప్పు తక్కువగా వాడటం మేలు.



డా. టీ.ఎస్.జే. రాజేశ్
సీనియర్ ఫిజీషియన్

ఇతర వ్యాధులు... కాళ్ల వాపు..

కిడ్నీ జబ్బులు,కొన్ని క్రానిక్ లివర్ డీసీస్ లాంటి కాలేయవ్యాధులు, కటి సంబంధిత (పెల్విస్ రిలేటెడ్) క్యాన్సర్‌లలో కూడా కాళ్ల వాపులు కనిపిస్తాయి. కాలు బాగా నునుపుగా ఎర్రగా కనిపించే సెల్యులైటిస్, బోదకాలు (ఫైలేరియాసిస్) వంటి ఇన్ఫెక్షన్లలో, రియాక్టివ్ ఆర్థరైటిస్ వంటి ఇన్‌ఫ్లమేటరీ కండీషన్లలోనూ కాళ్లవాపులు రావచ్చు. ఇవి కనిపించినప్పుడు తొలుత అవి గుండె సంబంధిత కారణాలతోనా అని మొదట అనుమానించాలి. ఆ అంశాన్ని రూల్ అవుట్ చేసుకున్న తర్వాత ఇతర కారణాలను అన్వేషించాలి. అవన్నీ కాకుండా అవి కేవలం నిరపాయకరమైన (బినైన్) వాపు మాత్రమే అని గుర్తిస్తే దాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరముండదు.

కొత్త రక్త చరిత్ర

50 ఏళ్ల తర్వాత కొత్త బ్లడ్ గ్రూపు రహస్యం!!



అప్పట్లో అంటే 1972లో ఓ గర్భవతి తన బ్లడ్ శాంపిల్ పరీక్షకు ఇచ్చింది. కానీ పరీక్ష సమయంలో తీరా చూస్తే ఆ శాంపిల్ తాలూకు ఎర్ర రక్తకణాల్లో పై ఉండాల్సిన ఓ పొరలో ఉండాల్సిన రసాయన పదార్థం (మాలెక్యూల్) కనిపించలేదు. ఈ అంశం దాదాపు 50 ఏళ్ల పాటు (సరిగ్గా చెప్పాలంటే 52 ఏళ్ల పాటు) పరిశోధకులను చాలా తికమక పెట్టింది. ఎట్టకేలకు ఇప్పుడా గుట్టు ఓ కొత్త రకం బ్లడ్ గ్రూపు రూపంలో బయటకు వచ్చింది. ఆ గుట్టుమట్లను విప్పినవారు ఇంగ్లాండు, ఇజ్రాయెల్ సైంటిస్టులు. ఈ సరికొత్త బ్లడ్ గ్రూపునకు 'ఎమ్ఏఎల్' గ్రూపుగా పేరు పెట్టారు. ''జట్టుగా కలసికట్టుగా పనిచేసిన సైంటిస్టుల తాలూకు ఓ గొప్ప ఆవిష్కరణ ఇది. ఈ కొత్త గ్రూపు చాలా చాలా అరుదైనదైనప్పటికీ చాలా ప్రధానమైనదని చెప్పవచ్చు. అరుదైన చాలామంది పేషెంట్లకు ఉపకరించేదం''టూ చెబుతున్నారు ఈ రహస్యాన్ని ఛేదించడానికి దాదాపు 20 ఏళ్ల పాటు వ్యక్తిగత శ్రమ తీసుకున్న యూకే నేషనల్ హెల్త్ సర్వీస్ హెమటాలజిస్ట్ లూయిస్ టిల్లీ.

ఈ పరిశోధన వివరాలన్నీ 'బ్లడ్' అనే ప్రతిష్ఠాత్మకమైన జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

పెయిన్ కీల్లర్స్ వద్దు



కొందరికి కీళ్ల దగ్గర తీవ్రమైన నొప్పులు వస్తుంటాయి. మోకాళ్లు, మోచేతులు, కాలి వేళ్లు, మణికట్టు. భుజాలు, నడుము, వెన్నెముక భాగాల్లో వాపుతో నొప్పితో పాటు అప్పుడప్పుడూ జ్వరం రావడం, కదల్లేకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇలాంటి కీళ్ల సమస్యను వైద్యపరిభాషలో 'రుమటాయిడ్ ఆర్థరైటిస్' అంటారు. అలాగే ఎముకల మధ్య కుషన్‌లా ఉండే 'కార్టిలేజ్' పొర అరిగిపోవడం లేదా చాలా ఎక్కువగా దెబ్బతినడం, కీళ్ల ఎముకలు ఒకదానితో ఒకటి ఒరుసుకుపోవడం వల్ల కీళ్లనొప్పులు వస్తాయి. ఈ కండిషన్‌ను 'ఆస్టియో ఆర్థరైటిస్' అంటారు.

పెయిన్‌కిల్లర్స్ వద్దు!

పైన పేర్కొన్న కీళ్ల నొప్పులు కనిపించగానే కొందరు అదేపనిగా పెయిన్‌కిల్లర్స్ వాడుతుంటారు. అది సరికాదు. అవి వాడినంత సేపు బాగానే ఉంటుంది. వాటి ప్రభావం తగ్గగానే మళ్లీ నొప్పులు మొదలవుతాయి. పైగా అవి కిడ్నీలాంటి కీలక అవయవాలను దెబ్బతీస్తాయి. అందుకే డాక్టర్ సలహా లేకుండా చాలాకాలం పాటు పెయిన్‌కిల్లర్స్ వాడితే అసలు జబ్బు తగ్గకపోగా ఇతరత్రా సమస్యలూ రావచ్చు.

ఈ నొప్పులు వస్తున్నప్పుడు నొప్పి నివారణ మందులు తీసుకోడానికి బదులు ముందుగా ఆర్థోపెడిక్ సర్జన్‌ను కలిసి, ఆయన సలహా మేరకు ఈఎస్ఆర్, ఆర్‌ఏ ఫ్యాక్టర్, సీరమ్ యూరిక్ యాసిడ్, సీబీసీ, ఆర్థరైటిస్ ప్రొఫైల్, ఎక్స్‌రేలాంటి పరీక్షలు వీలైనంత త్వరగా చేయించుకుని, చికిత్స తీసుకోవాలి. కొన్నిసార్లు మందులతో పాటు ఫిజియోథెరపీ కూడా అవసరం కావచ్చు. అరుదుగా కొందరిలో సర్జరీ కూడా చేయించాల్సి రావచ్చు. అంతే తప్ప అదేపనిగా పెయిన్‌కిల్లర్స్ వాడటం పై సమస్యలకు పరిష్కారం కాదు.

ఈ జాగ్రత్తలూ పాటించాలి...

● స్థూలకాయం రాకుండా బరువు అదుపులో పెట్టుకోవడం. ● బరువు అదుపునకు వ్యాయామం చేయడం ● క్యాల్షియం ఉన్న ఆహార పదార్థాలు అంటే తాజా కూరగాయలు, పాలు, గుడ్లు వంటివి తీసుకోవడం ● నీళ్లు ఎక్కువగా తాగుతుండటం ● వంటలలో చాలా పరిమితంగా ఉప్పు, నూనె వాడటం ● డయాబెటిస్ ఉన్నవారు చక్కెరను అదుపులో పెట్టుకోవడం.

డీసెంటే బెటర్

చవకైన పెర్‌ఫ్యూమ్స్ / సెంట్స్ వల్ల అలర్జీలు కలిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయనీ, వీటివల్ల కొన్ని రకాల అలర్జీలు, కాంటాక్ట్ డర్మటైటిస్, ఎగ్జిమా అనే చర్మ వ్యాధులు, మైగ్రేన్ వంటి తలనొప్పులు పెరుగుతున్నాయని ఇంగ్లాండ్‌లోని క్యాంటర్‌బరీ కెంట్ ఛాసర్ హాస్పిటల్‌కు చెందిన చర్మవైద్య నిపుణులు డాక్టర్ సుసానా బ్యారన్ హెచ్చరిస్తున్నారు. వాసనల వల్ల అలర్జీలతో పాటు అవి చర్మానికి తగలడం వల్ల కూడా అనేక రకాల చర్మవ్యాధులూ వస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. కొంతకాలం కిందట యూరోపియన్ యూనియన్ సైంటిఫిక్ కమిటీ ఒక సర్వే చేసి, తక్షణం అలర్జీకి కారణమయ్యే అలర్జెన్‌ల జాబితాను రూపొందించే కార్యక్రమానికి పూనుకుంటుంది. ఈ క్రమంలో రకరకాల సబ్బులు, షాంపూలు, సెంట్లు సైతం అలర్జీలకు కారణమవుతున్నట్లు ఆ సర్వేలో తేలింది. చవక రకం సెంట్ల వాసనలతో మైగ్రేన్ వంటి తలనొప్పుల కేసులూ విపరీతంగా పెరుగుతున్నాయంటూ యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటీ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ విన్సెంట్ మార్టిన్ అనే న్యూరాలజిస్ట్ సైతం పేర్కొంటున్నారు. వాటితో చాలా అప్రమత్తంగా ఉండాలంటూ దర్మటాలజిస్టులు, న్యూరాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్స్ జాగ్రత్తలు చెబుతున్నారు.





ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో ఆస్ట్రేలియా విజయం

లీడ్స్: ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 69 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాకు వన్డేల్లో ఇది వరుసగా 14వ విజయం కావడం విశేషం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 44.4 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలెక్స్ క్యారీ (67 బంతుల్లో 74 ; 8 ఫోర్లు, 3 సిక్సర్లు), కెప్టెన్ మిషెల్ మార్ష్ (59 బంతుల్లో 60 ; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలు సాధించారు. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (29 ; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), మాథ్యూ షార్ట్ (29 ; 4 ఫోర్లు, ఒక సిక్సర్) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. స్టీవ్ స్మిత్ (4), మ్యాక్స్‌వెల్ (7), లబుషేన్ (19) విఫలమయ్యారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ జేమీ స్మిత్ (61 బంతుల్లో 49 ; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), బెన్ డకెట్ (32) పోరాడినా ఫలితం లేకపోయింది. ఇప్పటికే తొలి వన్డేలో గెలిచిన ఆస్ట్రేలియా ఈ ఫలితంతో సిరీస్‌లో 2-0తో ముందంజ వేసింది. ఇరు జట్ల మధ్య మంగళవారం మూడో వన్డే జరగనుంది.

చదరంగంలో స్వర్ణ చరిత్రకు చేరువలో...

- ఒలింపియాడ్ అగ్రస్థానం దిశగా భారత పురుషుల జట్టు
- పదో రౌండ్‌లో అమెరికాపై ఘనవిజయం




ఇరిగేశి అర్జున్, విదిత్ గుజరాతి, పెంటేల హరికృష్ణ, దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద

ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత్ స్వర్ణ చరిత్ర లిఖించేందుకు సిద్ధమైంది. మన గ్రాండ్ మాస్టర్లు ఏళ్ల తరబడి పోటీ పడుతున్నా అందని ద్రాక్షగానే ఉన్న బంగారు పతకం ఎట్టకేలకు దక్కే అవకాశం వచ్చింది. టోర్నీ చరిత్రలో తొలిసారి భారత పురుషుల జట్టు విజేతగా నిలవడం దాదాపుగా ఖాయమైంది. అడుగడుగునా హేమాహేమీ గ్రాండ్‌మాస్టర్లు, క్లిష్టమైన ప్రత్యర్థులు ఎదురైన ఈ మెగా టోర్నీలో మన ఆటగాళ్లు చిరస్మరణీయ విజయం సాధించారు. పది రౌండ్ల తర్వాత 19 పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో నిలవగా చైనా ప్రస్తుతం 17 పాయింట్లతో ఉంది. చివరి రౌండ్‌లో భారత్ ఓడి చైనా గెలిస్తేనే ఇరు జట్ల సమమై టై బ్రేక్‌కు దారి తీస్తుంది. అయితే మన టీమ్ ప్రస్తుత ఫామ్ చూస్తే ఓటమి అవకాశాలు దాదాపుగా లేవు. కాబట్టి స్వర్ణం లాంఛనమే కావచ్చు.

బుడాపెస్ట్: ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో ఆరంభం నుంచి అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న భారత పురుషుల జట్టు పది రౌండ్ల తర్వాత అజేయంగా అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణకు చెందిన గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ కీలకమైన ఆఖరి పోరులో విజయం సాధించడంతో భారత్‌కు పసిడి దిశగా మరో అడుగు ముందుకు వేసింది. అర్జున్, దొమ్మరాజు గుకేశ్, ఆర్.ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతి, పెంటేల హరికృష్ణలతో కూడిన భారత్ బృందం మరో రౌండ్ మిగిలుండగానే విజేతగా మారే స్థితిలో నిలిచింది. ఇప్పటిదాకా ఆడిన పది రౌండ్లలో ఏకంగా తొమ్మిదింట విజేతగా నిలిచింది. ఒక్క 9వ రౌండ్‌లో మాత్రం ఉజ్బెకిస్తాన్ భారత్‌ను డ్రాలతో నిలువరించింది. దీంతో ఈ మ్యాచ్ 2-2తో 'టై'గా ముగిసింది. శనివారం జరిగిన పదో రౌండ్లో భారత ఆటగాళ్లు 2.5-1.5తో అమెరికాను ఓడించారు. దీంతో భారత్ 19 పాయింట్ల స్కోరుతో అగ్రస్థానంలో నిలిచింది. ఇంకా ఆఖరిరౌండ్ ఉన్నప్పటికీ భారత్‌ను చేరుకునే జట్టే లేకపోవడంతో పసిడి పతకం వశమైంది. దొమ్మరాజు గుకేశ్...ఫాబియానో కరువానాపై గెలిచి మంచి ఆరంభమిచ్చాడు. కానీ తర్వాతి మ్యాచ్‌లో ఆర్.ప్రజ్ఞానంద... వెస్లి సో చేతిలో ఓడిపోవడంతో స్కోరు సమమైంది. ఈ దశలో విదిత్ గుజరాతి... లెవాన్ అరోనియన్‌తో గేమ్ డ్రా చేసుకోవడంతో మరోసారి 1.5-1.5 వద్ద మళ్లీ స్కోరు టై అయ్యింది. కీలకమైన నాలుగో మ్యాచ్‌లో బరిలోకి దిగిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, భారత నంబర్‌వన్ ఇరిగేశి అర్జున్... లినియార్ పెరెజ్‌పై గెలుపొందడంతో భారత్ ఈ టోర్నీలో తొమ్మిదో విజయాన్ని సాధించింది. మహిళల విభాగంలో భారత బృందం చెప్పుకోదగ్గ విజయం సాధించింది. చదరంగ క్రీడలో గట్టి ప్రత్యర్థి అయిన చైనాకు భారత మహిళల బృందం ఊహించని షాకిచ్చింది. భారత్ 2.5-1.5తో చైనాను కంగుతినిపించింది. సీనియర్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక... జూ జినర్‌తో, వంతిక అగర్వాల్... ల్యూ మియోయితో డ్రా చేసుకున్నారు. దివ్య దేశ్‌ముఖ్... నిషిన్‌ను ఓడించడంతో భారత్ విజయానికి బాట పడింది. ఆఖరి మ్యాచ్‌లో వైశాలి... గ్యూ కి గేమ్ డ్రా కావడంతో చైనా కంగుతింది. చివరిదైన 11వ రౌండ్ తర్వాతే మహిళల జట్టు స్థానం ఖరారవుతుంది.

పంత్, గిల్ సెంచరీల మోత



గిల్

దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడిన రిషభ్ పంత్ అంచనాలను అందుకుంటూ తనదైన శైలిలో సాధించిన శతకం... శుబ్‌మన్ గిల్ ఎప్పటిలాగే ప్రశాంతంగా ఆడుతూ పూర్తి చేసుకున్న సెంచరీ...ఆపై చెపాక్ బాయ్ అశ్విన్ మూడు కీలక వికెట్లతో ప్రత్యర్థి పని పట్టిన తీరు... చెన్నై టెస్టులో మూడో రోజు భారత్ హవానే కొనసాగింది. ముందుగా పంత్, గిల్ సెంచరీల తర్వాత తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి భారీ లక్ష్యంతో బంగ్లాదేశ్‌కు భారత్ సవాల్ విసరగా... తడబడుతూ ఆడిన బంగ్లా కుప్పకూలిపోకుండా కాస్త నిలవగలిగింది. వెలుతురులేమితో బంగ్లా ఓటమి ఆలస్యమైనట్లు కనిపించినా... ఆదివారం మిగిలిన ఆరు వికెట్లు తీయడం భారత్‌కు కష్టం కాకపోవచ్చు.

భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 287/4 డిక్లేర్డ్
- బంగ్లాదేశ్ విజయలక్ష్యం 515
- ప్రస్తుతం 158/4

చెన్నై: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు విజయంపై గురి పెట్టింది. భారత్ విధించిన 515 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా శనివారం ఆట ముగిసే సమయానికి 37.2 ఓవర్లలో 158 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హసన్ (60 బంతుల్లో 51; 4 ఫోర్లు, 3 సిక్సలు), షకీబ్ అల్ హసన్ (5 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. భారత బౌలర్లలో అశ్విన్‌కు మూడు వికెట్లు దక్కాయి. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండగా బంగ్లా మరో 357 పరుగులు చేయాల్సి ఉంది. వెలుతురులేమి కారణంగా ఆటను అంపైర్లు కాస్త ముందుగా నిలిపివేశారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 81/3తో మూడో రోజు ఆట కొనసాగించిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌ను 64 ఓవర్లలో 4 వికెట్లకు 287 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. శుబ్‌మన్ గిల్ (176 బంతుల్లో 119 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) కెరీర్‌లో ఐదో సెంచరీ... రిషభ్ పంత్ (128 బంతుల్లో 109; 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) కెరీర్‌లో ఆరో సెంచరీ సాధించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 167 పరుగులు జోడించారు. శనివారం భారత్ మొత్తం 41 ఓవర్లు ఆడి 206 పరుగులు జత చేసింది.

శతకాల జోరు...

మూడో రోజు ఆటలో పంత్, గిల్‌ను బంగ్లా బౌలర్లు ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. ప్రత్యర్థి పేలవ బౌలింగ్‌ను సొమ్ము చేసుకున్న భారత బ్యాటర్లిద్దరూ దూకుడుగా ఆడారు. మిరాజ్ ఓవర్లో రెండు సిక్స్‌లు బాది గిల్ ముందుగా అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, ఆ తర్వాత పంత్ కూడా హాఫ్ సెంచరీని అందుకున్నాడు. 72 పరుగుల వద్ద పంత్ ఇచ్చిన క్యాచ్‌ను కెప్టెన్ నజ్ముల్ వదిలేశాడు. షకీబ్ ఓవర్లో పంత్ రెండు వరుస ఫోర్లు కొట్టడంతో తొలి సెషన్ ముగిసింది. లంచ్ తర్వాత కూడా షకీబ్ ఓవర్లో సిక్స్, ఫోర్ బాది పంత్ దూసుకుపోయాడు. ఎట్టకేలకు అభిమానులు ఎదురు చూసిన క్షణం వచ్చింది. షకీబ్ ఓవర్లో లాంగాఫ్ దిశగా దిశగా ఆడి రెండు పరుగులు తీయడంతో 124 బంతుల్లో పంత్ సెంచరీ పూర్తి కాగా...భారత శిబిరం మొత్తం తమ సహచరుడిని చప్పట్లతో అభినందించింది. తర్వాతి ఓవర్లోనే అతను వెనుదిరిగాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే గిల్ కూడా 161 బంతుల్లో శతకాన్ని అందుకున్నాడు. మరో నాలుగు ఓవర్లకు రోహిత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.

నజ్ముల్ హాఫ్ సెంచరీ...

భారీ లక్ష్యం ముందుండగా బంగ్లా ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు జాకీర్ హసన్ (47 బంతుల్లో 33; 5 ఫోర్లు, 1 సిక్స్), షాద్‌మన్ ఇస్లామ్ (68 బంతుల్లో 35; 3 ఫోర్లు) దూకుడుగా ఆరంభించారు. సిరాజ్ ఓవర్లో జాకీర్ 2 ఫోర్లు, సిక్స్‌తో 14 పరుగులు రాబట్టాడు. దాంతో స్కోరు 62/0కు చేరింది. అయితే టీ విరామం తర్వాత బుమ్రా చక్కటి బంతితో జాకీర్‌ను అవుట్ చేసి తొలి దెబ్బ కొట్టాడు. షాద్‌మన్ వికెట్ అశ్విన్ ఖాతాలో చేరింది. మరో వైపు నజ్ముల్ ధాటిగా ఆడాడు. ఈ క్రమంలో అశ్విన్ కూడా నాలుగు సిక్స్‌లు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత అశ్విన్ మరో రెండు వికెట్లు తీయడంతో స్కోరు 86/1 నుంచి 146/4కు చేరింది.



పంత్

519 టెస్టుల్లో అశ్విన్ వికెట్ల సంఖ్య. విండీస్ దిగ్గజం కోట్నీ వాల్ష్ రికార్డును అతను సమం చేశాడు. ఓవరాల్‌గా ప్రస్తుతం 8వ స్థానంలో నిలిచాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 376; బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 149; భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (సి) దాస్ (బి) నాహిద్ 10; రోహిత్ (సి) జాకీర్ (బి) తస్కీన్ 5; గిల్ (నాటౌట్) 119; కోహ్లి (ఎల్బీ) (బి) మిరాజ్ 17; పంత్ (సి) అండ్ (బి) మిరాజ్ 109; రాహుల్ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (64 ఓవర్లలో 4 వికెట్లకు డిక్లేర్డ్) 287. వికెట్ల పతనం : 1-15, 2-28, 3-67, 4-234. బౌలింగ్: తస్కీన్ 7-1-22-1, హసన్ మహమూద్ 11-1-43-0, నాహిద్ రాణా 6-0-21-1, షకీబ్ 13-0-79-0, మెహదీ హసన్ మిరాజ్ 25-3-10-3-2, మోమినుల్ 2-0-15-0.

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: జాకీర్ (సి) యశస్వి (బి) బుమ్రా 33; షాద్‌మన్ (సి) గిల్ (బి) అశ్విన్ 35; నజ్ముల్ (బ్యాటింగ్) 51; మోమినుల్ (బి) అశ్విన్ 13; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 13; షకీబ్ (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (37.2 ఓవర్లలో 4 వికెట్లకు) 158. వికెట్ల పతనం: 1-62, 2-86, 3-124, 4-146.బౌలింగ్: బుమ్రా 7-2-18-1, సిరాజ్ 3.2-1-20-0, ఆకాశ్ దీప్ 6-0-20-0, అశ్విన్ 15-0-63-3, జడేజా 6-0-29-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా



అక్షయ్ కుమార్
మమ్ముట్టీ
మోహన్‌లాల్
విజయ్ దేవరకొండ

శ్రీలంకవైపు ఇండియన్ సినిమా చూపు

శ్రీలంక పిలుస్తోంది.... రారమ్మంటోంది.... అందుకే ఈ మధ్య కాలంలో ఇండియన్ ఫిల్మ్స్ శ్రీలంకకు క్యూ కడుతున్నాయి. టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్, బాలీవుడ్... ఇలా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ శ్రీలంక వైపు చూస్తోంది. సినిమా షూటింగ్స్ కోసం ఏకంగా శ్రీలంక ప్రధానమంత్రితో కూడా భారతీయ సినీ నిర్మాతలు చర్చలు జరుపుతున్నారు. ఒకప్పుడు విదేశాల్లో షూటింగ్స్ అంటే అమెరికాతో పాటు యూరప్ దేశాల పేర్లు ఎక్కువగా వినిపించేవి. కానీ ఇప్పుడు ఇండియన్ సినిమా రూటు మార్చింది. ఆ విశేషాల్లోకి...

శ్రీలంక అడవుల్లో రిస్కీ ఫైట్స్

తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి విజయ్ దేవరకొండ ఇటీవల శ్రీలంక వెళ్లొచ్చారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఆ మధ్య శ్రీలంకలో జరిగింది. అక్కడ ఓ భారీ రిస్కీ ఫైట్‌ని చిత్రీకరించారని సమాచారం. అటు బాలీవుడ్ వైపు వెళితే... అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో ప్రియదర్శన్ దర్శకత్వంలో రానున్న హారర్ కామెడీ చిత్రంలోని కీలక సన్నివేశాలను శ్రీలంకలో చిత్రీకరిస్తున్నారు. ఇవి కాకుండా కొన్ని దక్షిణాసియా చిత్రాలు కూడా లంకలో షూటింగ్స్ జరుపుకుంటున్నాయి.



శ్రీలంకలో విజయ్ దేవరకొండ టీమ్

లంకలో ప్యారడైజ్

మద్రాస్ టాకీస్ బ్యానర్‌పై ప్రముఖ దర్శకుడు మణిరత్నం సమర్పణలో తెరకెక్కిన మలయాళ చిత్రం 'ప్యారడైజ్'ను పూర్తిగా శ్రీలంకలోనే చిత్రీకరించారు. మలయాళ నటుడు రోషన్ మ్యాథ్యూ ఇందులో హీరోగా నటిస్తే ప్రముఖ శ్రీలంక దర్శకుడు ప్రసన్న వితనకే డైరెక్ట్ చేశారు. ఇక మమ్ముట్టి, మోహన్ లాల్ కాంబినేషన్‌లో త్వరలో సెట్స్ పైకి వెళ్లనున్న మలయాళం మూవీని 30 రోజుల పాటు శ్రీలంకలోనే షూట్ చేయనున్నారు. ఈ చిత్రానికి లంక ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇచ్చిందంటే నిర్మాత, దర్శకుడితో ఆ దేశ ప్రధానమంత్రి దినేష్ గుణవర్దెన నేరుగా చర్చలు జరిపారు. ఇక ఫ్యూచర్ ప్రాజెక్ట్స్‌కు షూటింగ్ లొకేషన్‌గా శ్రీలంకను ఎంచుకోవాలని మలయాళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ భావిస్తోంది.



'ప్యారడైజ్'లో...

ఇండియన్ సినిమాకి రెడ్ కార్పెట్

ఒకప్పుడు శ్రీలంకలో సినిమా షూటింగ్స్ వ్యవహారం ఓ ప్రహసనంలా సాగేది. దేశ, విదేశీ సినిమాల షూటింగ్స్ అనుమతుల కోసం 41 ప్రభుత్వ విభాగాలను సంప్రదించాల్సి వచ్చేది. దీంతో భారత్‌తో పాటు ఇతర దేశాల చిత్ర నిర్మాతలు లంక లొకేషన్స్‌కు దూరమవుతూ వచ్చారు. దీనికి తోడు 2022 నాటి ఆర్థిక సంక్షోభం ఆ దేశాన్ని రోడ్డున పడేసింది. అన్ని వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. అలాంటి పరిస్థితుల్లో దేశాన్ని పునర్నిర్మించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. అప్పటివరకు టూరిస్ట్ డెస్టినేషన్‌గా ఉన్న శ్రీలంకకు పర్యాటకులు రావడం కూడా తగ్గిపోయింది. దేశాన్ని గాడిలో పెట్టేందుకు ఎన్నో మార్గాలు అన్వేషించిన లంక పాలకులకు భారతీయ సినీ రంగుల ప్రపంచం జీవనాడిలా కనిపించింది. మళ్లీ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు సినిమా షూటింగ్స్‌తో దేశాన్ని కళకళలాడేలా చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. సినిమా షూటింగ్స్ కోసం తమ దేశంలో అడుగుపెట్టే ఎవరికైనా సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని ప్రారంభించింది. ముఖ్యంగా తెలుగు, తమిళ, మలయాళ, హిందీ చిత్రాలకు సంబంధించిన షూటింగ్స్ కోసం అనుమతులను వేగవంతం చేసింది. భారతీయ సినీ ప్రముఖులకు అక్కడి టూరిజం ప్రమోషన్ బ్యూరో రెడ్ కార్పెట్ పరిచింది. దీంతో ఇండియన్ మూవీ షూటింగ్స్‌కు శ్రీలంక కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది

ఆర్థిక అస్త్రంగా...

ఫిల్మ్ టూరిజాన్ని లంక ప్రభుత్వం ఆర్థిక అస్త్రంగా ఎంచుకోవడం వెనక మరో కారణం కూడా ఉంది. ఇండియన్ మూవీస్ అంటే సింహళీయుల్లో విపరీతమైన క్రేజ్. బాలీవుడ్‌తో పాటు ఇతర భారతీయ చిత్రాలు లంక థియేటర్స్‌లో నిత్యం స్క్రీనింగ్ అవుతాయి. షూటింగ్స్ కోసం భారతీయ సినీ ప్రముఖులు లంక బాటపడితే దేశ పర్యాటక రంగానికి కూడా కొత్త ఊపు వస్తుంది. విదేశీ మారక ద్రవ్యం కూడా పెరుగుతుంది. లంక ప్రభుత్వం వేసుకున్న ప్రణాళికకు తగ్గట్టుగానే షూటింగ్స్ కోసం ఇండియన్ డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ లంక వైపు చూస్తున్నారు. ఆ దేశం కల్పించే ప్రత్యేక సదుపాయాలను ఉపయోగించుకుంటూ అందమైన లంక లొకేషన్స్‌ను షూటింగ్ స్పాట్స్‌గా మార్చేశారు. ఒక రకంగా లంక ఎకానమీకి భారతీయ చిత్ర పరిశ్రమ వెన్నెముకగా మారిపోయింది.

– ఫణికుమార్ అనంతోజు

పచ్చందనమే...

పచ్చందమనే పచ్చదనమే అన్నట్లు... శ్రీలంక గ్రీనరీతో అందంగా ఉంటుంది. పాటల చిత్రీకరణకు బెస్ట్ ప్లేస్. ఫైట్లు తీయడానికి దట్టమైన అడవులు ఉండనే ఉన్నాయి. అలాగే అబ్బురపరిచే చారిత్రక కట్టడాలూ, కనువిందు చేసే సముద్ర తీరం ఉన్నాయి. వీటికి తోడు భారతీయులకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుబంధం ఉండటంతో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్‌ను తమ దేశంవైపు తిప్పుకుంటోంది లంక సర్కార్. శ్రీలంకలో గతంలోనూ షూటింగ్స్ జరిగాయి. అక్కడ షూట్ చేయడం కొత్త కాకపోయినా ఆ దేశం భారతీయ చిత్ర నిర్మాణాలకు ఇప్పుడు సింగిల్ డెస్టినేషన్‌గా మారిపోయిందని అనొచ్చు. 2022 నాటి ఆర్థిక సంక్షోభం నుంచి ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేకపోతున్న శ్రీలంక గతంలో ఎప్పుడూ లేని విధంగా ఫిల్మ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ తమ దేశ ఎకానమీకి ఊతమిచ్చే ప్రయత్నాలు చేస్తోంది.

అతిథి ఆన్ సెట్



బాలకృష్ణ, అనిల్ రావిపూడి, వెంకటేశ్

వెంకటేశ్ సినిమా సెట్స్‌లో సందడి చేశారు బాలకృష్ణ. హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్). మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా చిత్రాన్ని 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఇటీవలే పొల్లాచ్చిలో ఈ సినిమాకు చెందిన ఓ కీలక షెడ్యూల్ చిత్రీకరణ ముగిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు బాలకృష్ణ. ఈ అతిథి తమ సెట్‌కి రావడంతో యూనిట్ సంబరపడిపోయింది. ఈ సందర్భంగా క్లిక్‌మనిపించిన ఫొటోలను షేర్ చేసింది చిత్రబృందం. ఇక 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయడానికి చిత్రయూనిట్ రెడీ అవుతోంది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

అమెరికాలో రొమాంటిక్ కామెడీ



నమ్రత, అశోక్ గల్లా, గౌరీప్రియ

అశోక్ గల్లా హీరోగా, రాహుల్ విజయ్, శివాత్మిక, శ్రీ గౌరీప్రియ ఇతర ప్రధాన పాత్రధారులుగా, ఓ రొమాంటిక్ కామెడీ డ్రామా తెరకెక్కనుంది. అమెరికా నేపథ్యంలో ఈ చిత్రాన్ని యువ దర్శకుడు ఉద్భవ్ తెరకెక్కించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి నమ్రత ఘట్టమనేని క్లాప్ ఇవ్వగా, పద్మ గల్లా – మంజులా స్వరూప్‌లు స్క్రిప్ట్‌ని చిత్ర యూనిట్‌కి అందించి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. "ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే హాస్యంతో పాటు హృదయాన్ని హత్తుకునే డ్రామాగా ఈ చిత్రం అలరిస్తుంది. త్వరలోనే మరిన్ని వివరాలను వెల్లడిస్తాం" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: భరద్వాజ్ .ఆర్.

ఓటీటీ ఇది చూడొచ్చు

కిడ్నాపర్‌ని పట్టించే సోషల్ మీడియా

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'లైన్ ఆఫ్ డ్యూటీ' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఇప్పుడు అందరూ దాదాపు తలదించుకునే ఉంటున్నారు... ఎందుకంటే సెల్‌ఫోన్ చూడ్డానికి. అప్పుల కన్నా, కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువ అయిపోయింది సెల్ ఫోన్. ఈ సెల్‌ఫోన్ ఓ అగ్గి అయితే, సోషల్ మీడియా దానికి తోడవుతున్న గాలి. అగ్నికి ఆజ్యమన్నట్టు ఈ సోషల్ మీడియా ముఖ్యంగా నేటి యువతను పూర్తిగా వశపరుచుకుంటోంది. సోషల్ మీడియా చెడు అన్న అంశం ఎంత నిజమో మంచి అన్నదానికి నిదర్శనమే ఈ 'లైన్ ఆఫ్ డ్యూటీ' సినిమా. దర్శకులు స్టీవెన్ సి. మిల్లర్ రూపొందించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ప్రముఖ నటుడు ఆరన్ యఖార్ట్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించారు. 'లైన్ ఆఫ్ డ్యూటీ' కథాంశానికొస్తే... ఫ్రాంక్ పెన్నీ ఓ నిజాయితీపరుడైన పోలీస్ ఆఫీసర్. కానీ అతని కెరీర్‌లో మాయని మచ్చ ఓ షూటవుట్‌లో అనుకోకుండా ఓ చిన్నపిల్లవాడిని తన చేతులతో కాల్చి చంపడం. దాని గురించి బాధ పడుతున్న తరుణంలోనే ఓ కిడ్నాపర్ తన సహోద్యోగి కుమార్తెను కిడ్నాప్ చేసి, పోలీసులకు సవాలు విసురుతాడు. ఈ తరుణంలో అవా బ్రూక్స్ అనే యంగ్ సోషల్ మీడియా రిపోర్టర్ ఫ్రాంక్ పెన్నీకి తారసపడుతుంది. సమాజంలో జరిగే వాస్తవ దారుణాలను అవా బ్రూక్స్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా లైవ్ స్ట్రీమింగ్ చేస్తుంటుంది. ఫ్రాంక్ పెన్నీతో కలిసి అవా బ్రూక్స్ సోషల్ మీడియా ద్వారా ఈ కిడ్నాపింగ్ ఆపరేషన్ ఎలా చేసింది? అన్నది లయన్స్ గేట్ ఓటీటీలో స్ట్రీమ్ అవుతున్న 'లైన్ ఆఫ్ డ్యూటీ'లోనే చూడాలి. ఆద్యంతం యాక్షన్ సన్నివేశాలతో థ్రిల్లింగ్ స్క్రీన్‌ప్లేతో ఈ సినిమా సోషల్ మీడియా విలువలను నేటి యువతరానికి అర్థమయ్యేలా చెబుతుంది. వర్త్ టు వాచ్ ది 'లైన్ ఆఫ్ డ్యూటీ'.

– ఇంటూరు హరికృష్ణ

ఫ్లాష్‌బ్యాక్... లేనిది ఎవరికి?



ఏఎస్ రవికుమార్

'యజ్ఞం, పిల్లా నువ్వు లేని జీవితం' వంటి హిట్ చిత్రాలను అందించిన ఏఎస్ రవికుమార్ చౌదరి కొత్త చిత్రం ఖరారైంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ఫ్లాష్‌బ్యాక్: లేనిది ఎవరికి?' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఏఎస్ రిగ్వేదా చౌదరి సమర్పణలో ఆద్య ఆర్ట్ ప్రొడక్షన్ బ్యానర్ పై కార్తీక్ రెడ్డి రాకాసి నిర్మిస్తున్న న్యూ ఏజ్ స్టోరీ ఇది. ఈ చిత్రానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంగీతం: జేబీ, కెమెరా: ప్రభాకర్ రెడ్డి.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కమ్మ/విడో/Eluruలో సొంత ఫ్లాట్లు/Hydలో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-796690]

ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు/B.Tech, CBIT/ C.Govt.Asst. ఇంజినీర్/ రైల్వేస్/ 89000/-PM/ 5'11"ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-15233]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. ట్యాక్స్ ఆఫీసర్/ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept/ 80,000/-PM/5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15233]

రజక/కట్నం ప్రసక్తి లేదు/ME/C.Govt.ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్/GST & కస్టమ్స్ Dept/11 Lakhs PA/5'10" ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15232]

క్రిస్టియన్ మాదిగ/ M.Tech, NIT / C. Govt. సెక్షన్ ఇంజినీర్ / రైల్వే/80,000/- PM / 5'10" ఎత్తు / 29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-15232]

క్రిస్టియన్ మాల/B.Tech, IIT/ C.Govt. గ్రూప్-A/గెజిటెడ్ ఆఫీసర్/DRDO/20 Lakhs PA/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9550572571 [HA-15232]

వెలమ/కట్నప్రసక్తి లేదు/ B.Tech/ Govt. Asst. ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/70,000/- PM/ 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15232]

SC మాల/B.Tech / C.Govt. కస్టమ్స్ ఆఫీసర్ / 90,000/-PM / 5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15232]

కాపు నాయుడు/30/5'9"/B.Tech/ IIT/ SWE /Job / 25L P/A/13 Crors Property/ Well Settled in Hyd వరుడికి వధువు కావలెను. 9642845018 [HA-15239]

క్రిస్టియన్/30/ 5'8"/ B.Tech/ MBA/ SWE /Job / Sal. 20L/PA (MS in USA) Well Settled Family వరుడికి వధువు కావలెను. 9391646037 [HA-15239]

మాల/29/5'8"/M.Tech (MS in USA) Job / SWE/ TCS 30-L PA/Well Settled in Hyd వరుడికి తగిన వధువు కావలెను. 7702195227 [HA-15239]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy / IIT/B.Tech/94/5'11"/1Cr/yr/10 Cr *94/5'9"/1Cr/yr/30 Cr *94/5'11"/70L/yr/25 Cr *92/5'7"/50L/yr/25Cr * Cont : K.C. Reddy-Hyd. Ph : 9347807015/ 9849321309

Reddy/IIT/USA/B.Tech/MS/H1/*1996/6"/ 25Cr *95/5'7"/300K/10Cr *1993/5'9"/200K/ 20Cr *1991/5'10"/200K * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS / MD/1993/ 5'10"/50Cr *1994/5'10"/70Cr *1996/6'/50Cr *1995/ 5'10"/400Cr *1993/5'10"/20Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/USA-doctors *1992/6' *1989/5'9" *92/5'11" *91/5'10" *90/6'/50Cr *83/ 5'6"/ 50Cr *75/6'/600K/ * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech/MS/H1 / USA *1998/6'/ 300 Cr *1997/5'9"/70Cr *94/5'9"/200Cr * 95/5'10"/75Cr *1997/6'/400Cr * Cont: K.C. Reddy-Hyd.Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS / H1/ USA *1998/6'/ 80Cr *1995/5'9"/50Cr *88/ 5'10"/ 100Cr * 90/5'7'/ 50Cr *91/5'11"/200Cr * Cont: K.C. Reddy- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/RICH / Business *B.Tech/MBA/ 1995/5'11"/100Cr *1995/5'10"/300Cr *95/ 6'/150Cr *94/5'10"/100Cr *97/ 5'11"/100Cr * Cont: K.C.Reddy- Hyd- Ph: 9347807015

Reddy/Business *MBA/1995/5'9"/ 500 Cr *94/5'11"/300Cr *95/6'/100Cr *90/ 6'/ 1000Cr *89/5'11"/400Cr *Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Divorcee *B.Tech/Business *1981/ 5'8"/500Cr *94/5'11"/300Cr *79/5'9"/300Cr *86/5'11"/70L/yr/15Cr *75/5'11'/1Cr/yr/50Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/ MS/ H1/USA *1990/ 5'9"/300K/40Cr *92/ 6'/100K/ 30Cr *95/ 5'9"/ 200K/25Cr *86/5'11"/300K/40Cr. * Cont. K.C. Reddy- Hyd-Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/B.Tech / Most Beautiful / Rich *1999/5'7"/100Cr *95/5'5"/70Cr *97/5'4"/ 150Cr *95/5'8"/100Cr *94/5'3"/400Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Rich *1996/5'7"/50Cr *99/ 5'8"/25Cr *1998/5'5"/100Cr *95/5'3"/75Cr *90/5'4"/50Cr *93/5'7"/100Cr * Cont : K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/MBBS / PG *2000/5'6"/100Cr *94/5'6"/100Cr *95/5'5"/100Cr *98/ 5'7"/ 50Cr *97/5'6"/300Cr *93/5'4"/50Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1997/5'4"/100Cr *96/5'3"/30Cr *97/5'5"/60Cr *98/5'4"/10Cr *99/ 5'6"/100Cr *97/5'5"/10Cr * Cont : K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1996/5'8"/15Cr *96/5'7"/50Cr/*96/5'5" / 15Cr *96/5'6"/30Cr *96/5'5"/10Cr *88/5'4"/50Cr *86/5'5"/50Cr * Cont : K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/IIT/BITS/2000/5'7"/45L/yr/10Cr *97/5'4"/25L/yr *98/5'3"/70L/yr *94/5'4"/ 150K *96/5'7" 90/5'8" /30Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful *1995/ 5'5"/100Cr *1994/5'4"/20Cr *94/5'5"/15Cr *2001/5'3"/20Cr *93/5'3"/500Cr * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/ USA - Citizen *BBA / 1994/5'2" *96/5'3"/115K/30Cr *99/ 5'6"/100Cr *Aus-Citizen/97/5'4"/10Cr *2000/ 5'3"/ 30Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Divorcee/MBBS/MD/1994/5'5"/50 Cr *86/5'6"/50Cr *92/5'3"/9Cr *91/5'4"/10Cr *B.Tech/93/5'4"/10Cr *88/5'6"/30Cr * Cont : K.C. Reddy -Hyd-Ph: 9347807015

Reddy/Divorcee*B.Tech/1991/5'4"/10Cr *85/5'5"/400Cr *USA -MS/95/5'5"/10Cr *93/5'7/15Cr *85/5'6"/10Cr *86/5'6"/30Cr *Cont: K.C. Reddy-Hyd.Ph: 9849321309 [D-554]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు / 29/ 5'10"/B.Tech/C.Govt. Asst. ఇంజినీర్/ HPCL/1 Lakh PM అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-15241]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/ 28/ 5'9"/ B.Tech / Govt. AE/ ఇరిగేషన్ Dept/90,000/-PM అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-15241]

కుల పట్టింపు లేదు. వికలాంగ వధువుల కి మంచి ఉన్నత స్వభావం కలిగిన విద్యావంతులైన వరుల కొరకు డైరెక్ట్ Call: 93907 45538 [G-801092]

Muslim, Healthy and Rich, Retired Principal, Seeks Educated Employee & Beautiful Bride CNB, No Broker's. Ph: 9391143795 [H-796638]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 6' 1", Engineer, 100 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), MBA (ISB), 30, 5' 11", 36 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 11", SWE, 200 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 5' 8", Lead Analyst, 61 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 24, 5' 5", SWE, USA, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 27, 5' 8", SWE, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24 5' 4", 100 Crores, USA, Fair &Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", Business Analyst, 90 K, 4 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి MS, 30, 5' 7", SWE, 200 K, 7 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 9", SWE, 175 K, 8 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), MBA (IIM), 35, 5' 10", 34 L P/A, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE MS, 30, 5' 6", Project Manager, 33 L P/A, 10 Crores Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 5", Rich Family, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 3", PG Doctor, 10 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 34, 5' 5", SWE, 250 K, 25 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. [LETTER]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/1L PM ఆదాయం/Hydలో సొంత ఇల్లు, విలేజ్‌లో 5 ఎకరాల వ్యవసాయ భూమి గల హైదరాబాద్ వరుడికి ఒట్టి తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK కుల, కట్నం ప్రసక్తి లేదు. డైరెక్ట్ Ph: 7989079290 [H-782713]

★★

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య 46Yrs/5'.5"/ బిజినెస్,జాబ్, 30Cr. స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్). 7995585722, 9848817137. [T-2304]

CNB / Valmiki / 30Yrs/ Software/ 1.50 LPA / 10Cr Properties / M.Tech / వరుడుకు వధువు కావలెను. సంప్రదించండి సెల్: 9346219661. [T-778744]

కుల, కట్నం ప్రసక్తి లేదు. Fair/ 36 సం॥ / రికార్డ్ అసిస్టెంట్‌గా జాబ్ చేస్తూ, అనంతపురము టౌన్ లో స్థిరపడిన, అంగవైకల్యం కల్గిన అబ్బాయికి వధువు కావలెను. 79819 22022 (డైరెక్ట్). [A-1345]

SC మాల హిందూ, వయస్సు 29 సం॥లు, 5.8H, B.Tech, Govt. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వైజాగ్, వరుడుకి వధువు కావలెను. ✆ 77949 11019 [R-1260811]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపులేదు, జాబ్, వ్యాపారం, ఫ్లాట్స్, 5L/PM, కోట్ల ప్రాపర్టీ గల, అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం, ఓకె ముఖాముఖి కల్పించి త్వరగా కుదుర్చబడును. Ph: 8309968531 [H-796343]

రెడ్డి/విడో/కుల, ఆస్తి పట్టింపు లేదు/డిగ్రీ/ 30Y/ సొంత బిజినెస్లు గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని కులాల వారికి 1/2 వ సంబంధాలు చూడబడును. Ph: 9032596676 [H-796638]

కాపు/ 34 / Govt.Emp / 40,000/-PM/ Partial Blind తల్లిదండ్రులు లేరు, కన్వర్టెడ్ క్రిస్టియన్, no caste bar, క్రిస్టియన్ వరుడు కావలెను. Ph: 9347634070, 9290746424 [H-796638]

కుల పట్టింపు లేదు/44yrs/Govt. టీచర్ / జీతం 70K (PM)/Hyd లో సొంత ఇల్లు /విడో 1 బాబు కలిగిన వధువుకి ఎటువంటి బాదరబందీలేని వరుడు కావలెను. జాబ్ & బిజినెస్ ఓకే, (ఇల్లరికం & పిల్లలు ఉన్నా OK) 7286031653 [H-796690]

కాపు/48yrs/కుల పట్టింపు లేదు/ఫెయిర్/Govt. ఎంప్లాయ్ /3,00,000/- (PM), వెల్ సెటిల్డ్ & 3 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర: 8374802603 [H-796690]

37 సం. గల/బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరీ. Ph: 9866724586, 9652012478 [H-796690]

2వ పెళ్లి/3,00,000 PM/బాగా స్థిరపడిన, కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన అమ్మాయికి అందమైన వరుడు కావలెను. ఆస్తితో సంబంధం లేదు, కుల భేదాలు లేవు. మంచి గుణం కల్గిన వారై ఉండాలి. పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK. Cell: 9381696641 [H-796690]

యాదవ/ఏకైక కుమార్తె/BE/C.Govt. ప్రివెంట్యూ ఆఫీసర్/కస్టమ్ Dept/85000/-PM/5'4" ఎత్తు/26 సం॥ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15233]

వడ్డెర/ B.Sc / Govt.AEO / అగ్రికల్చర్ Dept./40,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-15233]

కుల పట్టింపు లేదు/50Yrs/ఫ్యామిలీ పెన్షన్/60,000/-PM & సొంత ఇల్లు గల వధువుకి వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK. Ph: 8142579433 [HA-15233]

SC హిందూ మాల/B.Tech, IIST / C. Govt. సైంటిస్ట్/ ఇస్రో/1 Lakh PM/ 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550572571 [HA-15233]

పద్మశాలి/50 లక్షల ఆస్తి/M.Sc/Govt. Jr. Asst./ రెవెన్యూ Dept/40,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15233]

రజక /B.Tech/ C.Govt.Asst. మేనేజర్ / ఆంధ్రాబ్యాంక్ / 55000/-PM / 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15233]

గౌడ/B.Tech, IIT/C.Govt.Jr.ASSt./ పోస్టల్ Dept / 40,000/-PM / 5'5" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15233]

హిందూ మాదిగ/M.Tech/Govt.AEE/ పంచాయతీరాజ్ Dept/52000/-PM/ 5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15233]

కాపు నాయుడు/25/5'4"/B.Tech/MS in USA/SWE/Job/ Sal 20-L PA/ అందమైన Fair Well Settled వధువుకు వరుడు కావలెను. 9642845018 [HA-15239]

ఆర్యవైశ్య/27/5'4"/B.Tech/MBA/SWE/Job/ 12-L PA/ Well Settled Family (అమ్మాయి పేరుపై సొంత Flat కలదు) అందమైన వధువుకు ఆర్యవైశ్య వరుడు కావలెను. Ph: 8897091964 [HA-15239]

రెడ్డి/2nd(కుల/ఆస్తి) ప్రసక్తి లేదు/30Y/Degree/ సొంత ఇల్లు/Land & షాపు రెంట్స్ వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము OK) అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9100147176 [H-796638]

రెడ్డి/విడో/కుల, ఆస్తి, ప్రసక్తి లేదు/AGE: 35, Qly: B.Com/Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) All Cast marriages available. Ph : 8121347478 [H-796638]

కుల పట్టింపు లేదు/విడో/కమ్మ/రెడ్డి/48/ సొంత బిజినెస్/Own House/60,000/PM/6 ఎకరాల పొలం కలిగిన అందమైన సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. Ph: 9059106860 [H-796343]

రెడ్డి/వైశ్య/50y/5'5"/V.Fair/Govt Rtd (HM)/పెన్షన్/ సొంత ఇల్లు/26 ఎకరాల కొబ్బరితోట/3L/PM ఏ బాదర బందీలేని వధువుకు వరుడు కావలెను. అన్ని కులాల వయసుల వారికి సంబంధములు చూడబడును. Ph: 7287079096 [H-796343]

కాపు/50Y/విడో/B.Ed/ Pvt Job/ సొంత ఇల్లు/7 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9705499686 [H-796343]

SC మాల & క్రిస్టియన్/B.Tech (సివిల్)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/65000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15241]

★★

కుల, ఆస్తి పట్టింపు లేదు/ విడో/ 47y/ DARPG Dept/1 L PM/సొంత ఇల్లు/20 ఎ॥ ల్యాండ్స్/కోట్ల కమర్షియల్ ప్రాపర్టీస్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9704986426 [H-782778]

రెండోపెళ్ళి/ విడో/ 50y / Fair / Guntur/Own Complex (Rents)/Lands/ కోట్ల ప్రాపర్టీ (1) పాప U.S.A లో సెటిల్డ్ /ఏ బాదరబందీలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. (పవర్ ఉండును) Ph: 8519803423 [H-782778]

రెండోపెళ్ళి/డైవర్సీ / 37y/ Govt.Job/HRD ఆఫీసర్ /1 L PM/సొంత విల్లా/21 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ఆస్తులు గల అందమైన వెలిసెటిల్ వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9573960642 [H-782778]

వేదికలు



జాహేదా మ్యారేజెస్ (Only for Muslims) 2 వైపులా విచారించి సంబంధం కుదుర్చబడును. ఒకవేళ మీకు ఏ సంబంధం నచ్చకపోతే 70% మనీ వాపస్. Ph: 6301956609 [HA-15241]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st 2nd పేర్/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-796343]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15241]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1088]

మాదిగ, మాల, పెళ్ళి సంబంధాలకై సంప్ర॥ Govt. సాఫ్ట్‌వేర్, USA, IIT, Doctors, AEE, Pvt. 1వ, 2వ, లేట్. సంప్ర : 9381160075 [WA-6525]

★★

కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. ఫోన్: 7702526428 [H-782778]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : 9885144375, 8555980066 [H-782778]



సామాన్యుడు సంతోషపడేలా పనిచేయండి

- ప్రభుత్వ భూములను రక్షించండి.. రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం
- గ్రామానికో రెవెన్యూ అధికారిని నియమిస్తాం
- రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో భేటీలో మంత్రి పొంగులేటి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లచ్చిరెడ్డి. చిత్రంలో నవీన్‌మిత్తల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ ఉద్యోగులు సామాన్యుడు సంతోషపడేలా పనిచేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రజాపాలనలో ప్రజలు కేంద్రబిందువుగానే తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమష్టిగా చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. శనివారం సచివాలయంలో రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెవెన్యూ యంత్రాంగం సానుకూల దృక్పథంతో పనిచేసి ప్రజల్లో నమ్మకం కల్పించాలని.. ప్రభుత్వానికి పేరుతేవాలని సూచించారు.

ఒక్క గజం కూడా కబ్జా కాకూడదు..

'మీ పనితీరు మెరుగుపడాలి. పాత వాసనలేమైనా ఉంటే పక్కన పెట్టండి. మాది ఉద్యోగ స్నేహపూర్వక ప్రభుత్వం. పేదలకు మేలు చేయాలన్నదే మా తపన. రాబోయే రోజుల్లో రెవెన్యూ వ్యవస్థలో స్పష్టమైన మార్పు కనిపించాలి. నిజాయతీ, నిబద్ధతతో పారదర్శకంగా పనిచేయండి. ప్రభుత్వ భూములు కాపాడే విషయంలో రాజీపడొద్దు. ఒక్క గజం కూడా ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ ఉద్యోగులదే. భూములపై సరైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో ప్రత్యేకంగా లీగల్ సెల్ ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం తగిన ప్రత్యామ్నాయం లేకుండానే వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం. ప్రతి గ్రామానికీ ఒక రెవెన్యూ అధికారి ఉండేలా చర్యలు తీసుకుంటాం'అని పొంగులేటి భరోసా ఇచ్చారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, వివిధ రెవెన్యూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వి.లచ్చిరెడ్డి, వంగ రవీందర్‌రెడ్డి, కె. గౌతమ్‌కుమార్, కె. రామకృష్ణ, కె. చంద్రమోహన్, రాములు, వింజమూరి ఈశ్వర్, గరికె ఉపేందర్‌రావు, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ ఉద్యోగులు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ నెల 29న ఎమ్మార్వోలు, అక్టోబర్ 6న ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఉద్యోగ సంఘాల ముఖ్యమైన విజ్ఞప్తులు..

- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జీవో 317 ద్వారా బదిలీ చేసిన తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులను తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలి.
- ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్వోలు, వీఆర్ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి.
- సీసీఎల్ఏ కార్యాలయంతోపాటు రెవెన్యూ శాఖలోని ఖాళీలను భర్తీ చేయాలి. అన్ని స్థాయిలోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి.
- తహసీల్దార్ల అద్దె వాహనాల బిల్లులను రూ. 33 వేల నుంచి రూ. 50 వేలకు పెంచాలి. పెండింగ్ బిల్లులన్నీ త్వరగా మంజూరు చేయాలి.
- రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలి. వీఆర్వోలు, వీఆర్ఏల కారుణ్య నియామకాలు చేపట్టాలి. వీఆర్వోలకు సర్వీస్, పే ప్రొటెక్షన్ కల్పించాలి. కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించాలి.
- జీవో 81 ప్రకారం బెనిఫిట్స్ లేకుండా తక్కువ సమయంలోనే రిటైరవుతున్న వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలిచ్చి 2,500 దళిత కుటుంబాలను ఆదుకోవాలి.

తల్లి పేరుతో ఓ మొక్క నాటేలా..

సమాజ సంక్షేమంలో ముందుంటాం: ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

సాక్షి, హైదరాబాద్: సమాజ సంక్షేమంలో మేము సైతం అంటూ కదిలి, కార్యక్రమాల నిర్వహణలో ముందుంటామని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. తల్లిని, తల్లి లాంటి ప్రకృతిని గౌరవిస్తూ మొక్కలు నాటాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. 'ఏక్ పేడ్ మాకే నామ్ (తల్లి పేరుతో ఓ చెట్టు)'కార్యక్రమాన్ని ఆయన శనివారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. అట్టడుగు వర్గాలకు బ్యాంక్ అండగా నిలుస్తోందని ఆయన చెప్పారు. అంధుల సంక్షేమానికి పనిచేస్తున్న ఎన్‌జీవో దేవ్‌నార్ ఫౌండేషన్‌కు రూ.51 లక్షలు సాయం అందించారు. అనంతరం సీఎస్ శెట్టి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ఎస్‌బీఐ నిబద్ధతతో పనిచేస్తోందని, దీనిలో భాగంగా చెట్ల పెంపకానికి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. ఈ సంవత్సరంలో బ్యాంక్ తరపున 18 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రూఫ్‌టాప్ సోలార్‌కు విరాళం ఇచ్చిన దేవ్‌నార్ ఫౌండేషన్‌కు చెందిన ఎ.సాయిబాబా గౌడ్ ఎస్‌బీఐకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తదితరులు

కొండా లక్ష్మణ్‌కు ఘన నివాళి

కవాడిగూడ (హైదరాబాద్): స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా శనివారం జలదృశ్యంలోని ఆయన విగ్రహానికి బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ ఆధ్వర్యంలో పలువురు నేతలు ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల చైతన్యం, ఆత్మగౌరవానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి మరువలేనిదని టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 1969లో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం బాపూజీ ఉద్యమించారని చెప్పారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను జీవితకాలం బలంగా వినిపించిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేష్ మాట్లాడుతూ... జలదృశ్యం వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆరేళ్లుగా పోరాటం చేసి సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీలు ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బడుగుల లింగయ్య యాదవ్, సిరిసిల్ల రాజయ్య, రాపోలు ఆనందభాస్కర్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ కమిషన్ సభ్యుడు ప్రకాశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న దాసు సురేష్, ఆర్ కృష్ణయ్య, వీహెచ్, రాపోలు, జాజుల తదితరులు

ప్రపంచ శాంతికి ప్రతిఒక్కరూ తోడ్పడాలి

కన్హా శాంతివనంలో 'రైజింగ్ విత్ కైండ్‌నెస్ సమ్మిట్'లో మంత్రి ఉత్తమ్



కన్హాలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

నందిగామ: శాంతిసామరస్యాలతో జీవించేందుకు ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనలను అలవర్చుకోవడంతో పాటు ధ్యానం చేయాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కన్హాశాంతివనంలో కొనసాగుతున్న 'రైజింగ్ విత్ కైండ్‌నెస్ యూత్ సమ్మిట్'కు శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏ మూలన చూసినా ఘర్షణ వాతావరణం అలుముకుందని తెలిపారు. ప్రపంచశాంతికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని కోరారు. యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ (యూఎన్‌సీసీడీ) సహకారంతో శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమ్లేశ్ డి.పటేల్ అధ్యక్షతన నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని మంత్రి అభినందించారు. ప్రపంచ శాంతి దినోత్సవం రోజున ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. శ్రీరామచంద్ర మిషన్‌కు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రపంచ బ్యాంకు వైస్ చైర్మన్ మార్టిన్ రైసర్, జాయేద్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్ డిప్యూటీ చైర్మన్ డాక్టర్ హమ్దాన్ అల్ షార్, కామన్‌వెల్త్ సెక్రటేరియట్ సలహాదారు సుశీల్‌రామ్, యూఎన్‌సీసీడీ ప్రతినిధి పౌలా పాడ్రినో విలేలా, పలువురు విద్యార్థులు, యువకులు, అభ్యాసీలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళల వాటాకోసం ఉద్యమిస్తాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నేతలు, ప్రతినిధులు

పంజగుట్ట (హైదరాబాద్): మెజార్టీ మహిళలకు రాజకీయ ప్రాధాన్యం లేని మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఎవరి లబ్ధి కోసం తీసుకువచ్చారని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ ప్రశ్నించారు. బీసీలకే తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేనప్పుడు బీసీ మహిళలకు ఎక్కడ నుంచి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ చట్టంలో బీసీ మహిళలకు సబ్‌కోటా- భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై అఖిలపక్ష నాయకులు, బీసీ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బండ ప్రకాశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, కాంగ్రెస్ నాయకురాలు ఇందిరా శోభన్, విశారదన్ మహారాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండ ప్రకాశ్ మాట్లాడుతూ మహిళా చట్టంలో బీసీ మహిళల వాటాకోసం జరిగే ఉద్యమానికి తాను అండగా ఉంటానని, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి అయినా సాధించుకుందామన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ .. దేశ జనాభాలో 60 శాతంపైగా ఉన్న బీసీలకు 18 శాతమే రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందని, ఇందులో బీసీ మహిళలకు రెండు శాతం మాత్రమే ప్రాధాన్యముందన్నారు. మహిళా చట్టంలో బీసీ మహిళలకు వాటాకోసం దసరా తరువాత రాష్ట్రంలో వెయ్యి మంది మహిళా ప్రజా ప్రతినిధులతో ప్లీనరీ ఏర్పాటు చేస్తామని, డిసెంబర్‌లో వేలాది మంది మహిళలతో మహిళా గర్జన సభను ఏర్పాటు చేస్తామని, ఫిబ్రవరిలో లక్షమంది మహిళలతో పార్లమెంట్‌ను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మనిమంజరి, సంఘం ప్రతినిధులు సంధ్యారాణి, తారకేశ్వరి, సమత, శ్యామల, లావణ్య పాల్గొన్నారు.

ఉపాధి కల్పనను ప్రోత్సహించేందుకే ఈఎల్ఐ

కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ



సాక్షి, హైదరాబాద్: ఉపాధి కల్పన కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయ్ మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఈఎల్ఐ) పథకాన్ని ప్రవేశపెట్టినట్లు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ వెల్లడించారు. ఈ పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీగా నిధులు కేటాయించినట్లు వివరించారు. రెండు రోజుల పర్యటనకోసం హైదరాబాద్ వచ్చిన ఆయన ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయాలను సందర్శించారు. శనివారం బర్కత్‌పురాలోని ఈపీఎఫ్ఓ కార్యాలయంలో అధికారులతో ఈఎల్ఐ పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. చందాదారులకు అందిస్తున్న సేవల విషయంలో జోన్‌లోని ప్రాంతీయ కార్యాలయాల సమష్టి కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా చందాదారులకు అందిస్తున్న సేవల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా ఈఎల్ఐ పథకాన్ని విజయవంతం చేసేందుకు జోన్‌లోని సిబ్బంది, అధికారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో 36,018 సంస్థల్లో 47.96 లక్షల మంది చందాదారులు ఈపీఎఫ్ఓ సేవలు పొందుతున్నారని అధికారులు మంత్రికి వివరించారు. సమీక్ష అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. రెండేళ్లలో రెండు కోట్ల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈఎల్ఐ పథకాన్ని అమల్లోకి తెచ్చినట్లు వివరించారు. ఈ పథకంతో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని విశ్వసిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

పాస్‌పోర్టు సేవలకు ఆటంకం

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): సాంకేతిక మరమ్మతుల కారణంగా 20వ తేదీ సాయంత్రం 8 గంటల నుంచి ఈ నెల 23వ తేదీ ఉదయం 6 గంటల వరకు పాస్‌పోర్ట్ సేవా పోర్టల్ పనిచేయడం లేదని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. పోర్టల్ పనిచేయకపోవడంతో ఎంఈఏ, ఆర్పీవో, డీపీవో, పోలీసు సేవలకు అంతరాయం కలుగుతుందని పేర్కొంది.

అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో కోలిండియా సత్తా

గోదావరిఖని/ఖమ్మంఅర్బన్: అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో కో లిండియా జట్టు సత్తా చాటింది. ఈనెల 15 నుంచి 20వ తేదీ వర కు కొలంబియా దేశంలో జరిగిన అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో కోలిండియాకు చెందిన వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ (డబ్ల్యూసీఎల్) జట్టు ఓవరాల్ రెండోస్థానం సాధించింది. పోటీల్లో ఏడు దేశాలకు చెందిన 18 పురుషుల జట్లు, మూడు మహిళా జట్లు తలపడ్డాయి. ఓవరాల్ మొదటిస్థానంలో కెనడా దేశం నిలవగా, రెండో స్థానంలో మనదేశానికి చెందిన వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్, మూడో స్థానంలో కొలంబియా దేశం నిలిచాయి. అలాగే మహిళా జట్టు విభాగంలో మన దేశం నుంచి పాల్గొన్న హిందుస్తాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్) జట్టు ఓవరాల్ రెండో స్థానం సాధించింది. డబ్ల్యూసీఎల్ జట్టుకు గతంలో సింగరేణి సంస్థ శిక్షణ ఇవ్వడం విశేషం.


ఖమ్మం యువతికి ద్వితీయ బహుమతి



ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన కట్టికోల యోజిత కొలంబియాలో జరిగిన ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ కాంపిటీషన్‌లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించింది. ఆమె రాజస్తాన్ ఉదయ్‌పూర్‌లోని వేదాంత మైనింగ్ కంపెనీలో అండర్‌గ్రౌండ్ రెస్క్యూ టీం మేనేజర్‌గా పనిచేస్తున్నారు. భూగర్భ గనుల్లో పనిచేయడం పురుషులకే సవాల్‌గా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఓ యువతి గనిలో అండర్‌గ్రౌండ్ రెస్క్యూ టీం మేనేజర్‌గా పనిచేస్తుండటమే కాక అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటడం విశేషం.

ఫార్మాసిటీని రద్దు చేయలేదు!

- జీవో 31కు కట్టుబడి ఉన్నామని హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఫార్మాసిటీ రద్దు కథనాలు పత్రికలకే పరిమితం.. భూసేకరణ ప్రక్రియ చట్టబద్ధంగానే జరిగింది
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున కౌంటర్‌లో వెల్లడించిన నవీన్ మిత్తల్



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో 'హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ' ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేసినట్టు వస్తున్న వార్తలు సరికాదని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. ప్రతిపాదిత ఫార్మాసిటీని రద్దు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ, ఇకపై భూమిని సేకరించే ఉద్దేశం లేదంటూ చెబుతున్నవి ఆరోపణ లేనని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ వివరించారు. వినికిడి సాక్ష్యంగా రాసిన పత్రికా కథనాలను కోర్టులు పరిగణనలోకి తీసుకోలేవని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఫార్మా సిటీ ఏర్పాటుకు 2016 జూన్ 10న జారీ చేసిన జీవో 31కు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ధ్రువీకరించారు.

ఫార్మాసిటీ ఉందా లేదా అంటూ..

యాచారం మండలంలో ఫార్మాసిటీకి భూసేకరణ కోసం జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ నేపథ్యంలో.. ఆయా ప్రాంతాల్లో అధికారులు రెవెన్యూ రికార్డుల్లో మార్పుచేర్పులను, పట్టాదారు పాస్‌బుక్‌ల జారీని నిలిపివేశారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలోని సర్వే నంబర్ 124లోని 10 ఎకరాల భూమికి సంబంధించి తన పట్టాదార్ పాస్‌బుక్‌ను పునరుద్ధరించాలని కోరుతూ గచ్చిబౌలికి చెందిన దాసరి వీర వెంకట సత్య కొండలరాయ చౌదరి హైకోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు యాచారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు భూయజమానులు, రైతులు కూడా ఫార్మాసిటీపై కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు తన ఎన్నికల మేనిఫెస్టోకు కట్టుబడి ఫార్మాసిటీ ప్రతిపాదనను రద్దు చేయాలని నిర్ణయించిందని అందులో వివరించారు. దీంతో అసలు ఫార్మాసిటీ ఉందా? లేదా? అనే దానిపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

కౌంటర్‌లోని వివరాలివీ..

కొండలరాయచౌదరి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శనివారం విచారణ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున నవీన్ మిత్తల్ కౌంటర్ దాఖలు చేశారు. ''ఫార్మాసిటీపై ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను పక్కనపెట్టిన సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ప్రభుత్వం ఇప్పటికే అప్పీలు దాఖలు చేసింది. జీఓ 31ను రద్దు చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఇప్పటికీ ప్రాజెక్టు అమలు కోసం ప్రభుత్వం చురుకుగా పనిచేస్తోంది. పిటిషనర్ వద్ద సేకరించిన భూమికి సంబంధించి 2013 భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11(4) ప్రకారం ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదు. 10 ఎకరాల భూమి కోసం ఫార్మాసిటీ ప్రాజెక్టును ప్రమాదంలోని నెట్టడం సరికాదు. పిటిషనర్ నుంచి సేకరించిన భూమికి పరిహారం కూడా మంజూరు చేశాం. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి, కుర్మిద్దలో భూసేకరణకు 2017లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను సింగిల్ జడ్జి గత ఆగస్టులో కొట్టివేశారు. భూసేకరణ పరిహార ఉత్తర్వులనూ రద్దు చేశారు. నాడు పిటిషన్ దాఖలు చేసిన వారిలో ఈ పిటిషనర్ లేరు. పరిహారాన్ని ఎకరాకు తొలుత రూ.12,50,000గా నిర్ధారించినా తర్వాత ఆ మొత్తాన్ని రూ.16 లక్షలకు పెంచాం. అలాగే ఎకరా భూమి కోల్పోయిన వారికి 121 చదరపు గజాల భూమి ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. పరిహారం పొందేందుకు పిటిషనర్ నిరాకరించడంతో కాంపిటెంట్ అథారిటీ వద్ద డిపాజిట్ చేసింది. చట్టంలోని సెక్షన్ 37(2) కింద నోటీసులు కూడా జారీ చేసింది. గ్రీన్ ఫార్మాసిటీ కోసం ఇప్పటికే మెజారిటీ భూసేకరణ జరిగింది. అందులో మామిడిపల్లి గ్రామంలో 1,700.23 ఎకరాలను సేకరించాం. అంతా చట్టపరంగా జరిగింది. ఈ పిటిషన్‌ను కొట్టివేయాలి''అని నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

టుడేస్ గ్రాఫిక్

మార్కెట్లో ఐఫోన్ 16 హడావుడి మొదలైపోయింది. ఐఫోన్ ఫ్యాన్స్ షాపుల దగ్గర ఉదయాన్నే బారులు తీరిన దృశ్యాలనూ చూశాం. మన దగ్గర ఐఫోన్ 16(128 జీబీ) ధర రూ.79,990గా ఉంది. ఈ నేపథ్యంలో ఐఫోన్ ధర మన కన్నా తక్కువున్న దేశాల టాప్-10 జాబితా చూద్దామా



ఫిజియోథెరపిస్ట్‌గా ఎమ్మెల్యే!



రాములుకు ఫిజియోథెరపీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేట: మారుమూల గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పీఈటీగా అశ్వారావుపేట మండలం సున్నంబట్టి ఆశ్రమ పాఠశాలలో కొన్నాళ్లు పనిచేశారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచినా సామాన్యుడిలాగే అందరితో కలిసిపోతుంటారు. శనివారం అశ్వారావుపేట మండలంలోని రామన్నగూడెంలో పర్యటించిన సందర్భంగా గడ్డం రాములు అనే వ్యక్తికి కాలు, చేయి సరిగా పనిచేయడం లేదని ఆయనకు తెలిసింది. ఎమ్మెల్యేకు గతంలో ఫిజియోథెరపీ చేసిన అనుభవం ఉండటంతో కాసేపు రాములుకు ఫిజియోథెరపీ చేయడమే కాక ఎలా చేసుకోవాలో నేర్పించారు.

'టీజీఎస్పీడీసీఎల్'లో రికార్డుస్థాయిలో విద్యుత్ డిమాండ్

శుక్రవారం 9,910 మెగావాట్లకు చేరిన వైనం

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) పరిధిలో శుక్రవారం ఉదయం 10.35 గంటలకు రికార్డు స్థాయిలో 9,910 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఇటీవల కురిసిన వర్షాలతో భూగర్భ జలమట్టం పెరిగింది. దీనికితోడూ ఎండల తీవ్రత కారణంగా వ్యవసాయ విద్యుత్‌కు డిమాండ్ భారీగా పెరిగిపోయింది. ఈ సీజన్‌లో 10వేల మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నెలకొనే అవకాశం ఉందని, ఆ మేరకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతన్న బెయిల్‌పై తీర్పు రిజర్వు

- అంతకు ముందు కొనసాగిన సుదీర్ఘ వాదనలు
- 15 రోజుల్లో 4,200 ఫోన్లు ట్యాప్ చేశారన్న పీపీ
- ప్రణీత్‌రావు ఆదేశాల మేరకే వ్యవహరించారన్న తిరుపతన్న న్యాయవాది
- తీర్పు వాయిదా వేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లో వాదనలు పూర్తి కావడంతో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ప్రభుత్వం, పిటిషనర్ తరఫున న్యాయవాదులు సుదీర్ఘ వాదనలు వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ నగర భద్రతా విభాగం అదనపు డీసీపీగా పనిచేస్తున్న మేకల తిరుపతన్నను మార్చిలో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో బెయిల్ కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శనివారం జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'ప్రస్తుత ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులే కాకుండా కొందరు బీఆర్ఎస్ లీడర్ల ఫోన్ల అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడిన ఆరుగురు పోలీస్ అధికారులలో పిటిషనర్ ఒకరు. సాక్ష్యాధారాలు మాయం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. అలాంటి నిందితుడికి బెయిల్ ఇవ్వడం సరికాదన్నారు. పిటిషనర్ సెల్‌ఫోన్ నుంచి 348 జీబీ డేటాను ఎఫ్ఎస్ఎల్ తిరిగి రాబట్టింది. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, పలువురు గన్‌మెన్ల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్టు తేలింది. ట్యాపింగ్‌తోనే బీఆర్ఎస్ హుజూరాబాద్‌లో విజయం సాధించింది. గత సంవత్సరం నవంబర్ 15 నుంచి 30 వ తేదీ.. అంటే 15 రోజుల్లోనే 4,200 ఫోన్లు ట్యాప్ చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేసి నిందితుడు(ఏ-1) ప్రభాకర్‌రావు దేశం విడిచి పారిపోయారు. ఏ-6 శ్రవణ్‌కుమార్ కూడా పరారీలో ఉన్నారు. పిటిషన్‌ను కొట్టివేయాలి' అని విజ్ఞప్తి చేశారు.

సాక్ష్యాలన్నీ భద్రంగా ఉన్నాయి..: పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సురేందర్‌రావు వాదనలు వినిపిస్తూ..ఎస్ఐబీ ఏర్పాటు చేసిన 'యునైటెడ్ ఫ్రంట్ టీమ్స్'అనే బృందంలో పిటిషనర్ ఒక సభ్యుడు. పిటిషనర్ నేరం చేసినట్టు చార్జిషీట్‌లో పేర్కొనలేదు. ఫోన్‌కాల్స్‌ను మాత్రమే పర్యవేక్షించారు. దర్యాప్తు అధికారి చార్జిషీట్‌ను దాఖలు చేసి, కోర్టులో అనుబంధ చార్జిషీట్‌ను దాఖలు చేయాలనుకుంటున్నారు. అంటే దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని తెలుస్తోంది. ప్రణీత్‌రావు ఆదేశాల మేరకే పిటిషనర్ వ్యవహరించారు. ఉన్నతాధికారులు చెప్పిన పనిచేయడం పిటిషనర్ విధి. ఎఫ్ఎస్ఎల్ ద్వారా లభించిన మెటీరియల్‌లో సాక్ష్యాలు భద్రంగా ఉన్నాయి. ఇక సాక్ష్యాలను తారుమారు చేశారనడానికి అవకాశం లేదు. పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేసేలా ఆదేశాలు ఇవ్వాలి'అని కోరారు.

జాతీయ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అమిత్ గార్గ్

పూర్తిస్థాయి బాధ్యతల అప్పగింత



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి అమిత్ గార్గ్‌కు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. 1993 ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన అమిత్ గార్గ్ ప్రస్తుతం జాతీయ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2023 ఫిబ్రవరి 28న 1987 బిహార్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ఎ.సీమ్ రాజన్ జాతీయ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసినప్పటి నుంచి.. అమిత్ గార్గ్ ఇప్పటివరకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా శనివారం కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ డైరెక్టర్ సాక్షి మిత్తల్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 2027 అక్టోబర్ 31 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అమిత్ గార్గ్ జాతీయ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించనున్నారు.

నారీ శక్తికి తిరుగులేదు

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. ఓయూలో ఆలిండియా మహిళా టీచర్ల కాన్ఫరెన్స్



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

ఉస్మానియా యూనివర్సిటీ: మహిళలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, పట్టుదల విషయంలో నారీ శక్తికి తిరుగులేదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆధ్వర్యంలో ఆలిండియా మహిళా టీచర్ల కాన్ఫరెన్స్ జరిగింది. ఎన్విజనింగ్ న్యూభారత్ అనే అంశంపై ఈ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సదస్సు కన్వీనర్ ప్రొ.కిషన్ అధ్యక్షత వహించగా, గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్పు కోసం మహిళలు పోరాడాలని, పోరాటంలో స్వయంగా పాత్రధారులు కావాలని సూచించారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, రాజ్యసభ ఎంపీ సుధా నారాయణమూర్తి మాట్లాడుతూ, వృత్తి ఎంత ముఖ్యమో కుటుంబం కూడా అంతే ముఖ్యమన్నారు. లక్ష్యం పెట్టుకొని సాధన చేస్తే తప్పక విజయం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో మహిళ పాత్ర తరగతి గదికి పరిమితం కాకూడదని ఏబీఆర్ఎస్ఎం నేషనల్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ అన్నారు. జేఎన్‌యూ వీసీ ప్రొ.శాంతి శ్రీ పండిత్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతి మాట్లాడుతూ మహిళల కోసం అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐఏఎస్ అధికారి దేవసేన మాట్లాడుతూ, మహిళల పట్ల పురుషుల దృక్పథంలో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 1,060 మంది మహిళా విద్యావేత్తలు హాజరుకాగా, ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి సర్టిఫికెట్స్ అందజేశారు.



కరెంటు కాటుకు 644 మంది బలి!

2023-24లో రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో 'విద్యుత్' మరణాలు

మరో 168 మందికి తీవ్రగాయాలు

ఈఆర్సీకి సమర్పించిన నివేదికలో డిస్కంల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుదాఘాతంతో 2023-24లో ఏకంగా 644 మంది చనిపోగా.. మరో 168 మంది తీవ్రగాయాల పాలయ్యారు. ఇక 1,646 పశువులు సైతం విద్యుదాఘాతంతో మృతి చెందాయి. దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్) రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి సమర్పించిన తమ వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)లో ఈ వివరాలు వెల్లడించాయి. 2020-21లో విద్యుత్ ప్రమాదాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడంతో.. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని 2023-24 వార్షిక టారిఫ్ ఉత్తర్వుల్లో ఈఆర్సీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు, ప్రమాదాల వివరాలను డిస్కంలు ఈఆర్సీకి నివేదించాయి.

ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికం..

ఎస్పీడీసీఎల్ పరిధిలో 288 మంది మృతి చెందగా.. అందులో 276 మంది సాధారణ ప్రజలు, ఏడుగురు విద్యుత్ శాఖ సిబ్బంది, ఐదుగురు కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా నారాయణపేట జిల్లాలో 39 మంది, సిద్దిపేటలో 36 మంది, మెదక్‌లో 34 మంది, సంగారెడ్డి జిల్లాలో 26 మంది చనిపోయారు. ఒక్క ఉమ్మడి మెదక్ జిల్లాలోనే 96 మంది మృత్యువాతపడ్డారు. 2023-24లో సంస్థ 286 మంది మృతుల కుటుంబాలకు రూ.13.96 కోట్లను, 1,221 పశువుల మరణాలకు రూ.4.62 కోట్లను పరిహారంగా చెల్లించింది.

- ఎన్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 356 మంది విద్యుదాఘాతంతో మృతి చెందారు. అత్యధికంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 38, ఆదిలాబాద్‌లో 31, మంచిర్యాలలో 30, నిర్మల్‌లో 29, నిజామాబాద్‌లో 27, కరీంనగర్‌లో 26, వరంగల్‌లో 23, మహబూబాబాద్ జిల్లాలో 20 మంది చనిపోయారు. సంస్థ 238 మంది మృతుల కుటుంబాలకు రూ.11.94 కోట్లు, 472 పశువుల మరణాలకు రూ.2.36 కోట్ల పరిహారాన్ని చెల్లించింది.

మృతుల్లో 52 మంది రైతులు!

ఎన్పీడీసీఎల్ నివేదిక ప్రకారం.. వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయాలు జరిగితే మరమ్మతులు నిర్వహిస్తూ 52 మంది మరణించగా, ఒకరు తీవ్రగాయాల పాలయ్యారు. వారిలో అత్యధికంగా రైతులే ఉండే అవకాశముందంటున్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు ఫ్యూజులు కాలిపోతే రైతులు, ప్రైవేటు వ్యక్తులే సరిచేసుకోవాల్సిన పరిస్థితి ఉంటోందని, ఈ క్రమంలో విద్యుదాఘాతానికి లోనై మరణిస్తున్నారని పేర్కొంటున్నారు.

- ఇక చేపల వేట కోసం విద్యుత్ లైన్లకు తీగలు తగిలించిన సందర్భాల్లో 23 మంది మృతిచెందారు. వారు చెరువుల్లోని నీళ్లకు కరెంట్ సరఫరా చేసి చేపలను చంపే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురయ్యారు.
- ఇళ్లకు విద్యుత్ సరఫరా అయ్యే సర్వీసు వైర్లు, లోపల హౌజ్ వైరింగ్/ విద్యుత్ ఉపకరణాల్లో లోపాలతో షాక్‌కు గురై 120 మంది చనిపోగా.. నలుగురు గాయపడ్డారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటం, స్టే వైర్/ ఇనుప విద్యుత్ స్తంభం/డీపీ స్ట్రక్చర్‌కు విద్యుత్ సరఫరా కావడం, గాలివానకు తెగిపడిన/ వదులుగా కిందికి వచ్చిన తీగలను తాకడం, ఎర్త్ వైరింగ్, విద్యుత్ కంచెలు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేస్తూ, ఫ్యూజ్‌ను వేస్తూ, లైన్ల మరమ్మతులు వంటి ఇతర సమయాల్లో మరికొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

● ప్రకృతి సోయగం..



ఆదిలాబాద్ జిల్లా కేంద్రం గుండా వెళ్లే 44వ జాతీయ రహదారిని ఆనుకున్న పచ్చని అటవీ ప్రాంతం ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు కనువిందు చేస్తోంది. ఇరువైపులా పచ్చదనపు సోయగాలతో ఒంపుల రహదారి ఆహ్లాదం పంచుతోంది. గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామ సమీపంలోని జాతీయ రహదారి టర్నింగ్ వద్ద అందమైన దృశ్యమిది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నక్సల్బరీ నుంచి కగార్ వరకు..

వర్గశత్రు నిర్మూలనే ధ్యేయమన్న చారుమజుందార్

● తెలుగు రాష్ట్రాల్లో నక్సలైట్ల ప్రభావం
● రెడ్ కారిడార్ లక్ష్యంగా విప్లవ గ్రూపుల ఏకం
● ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో ఉక్కిరిబిక్కిరి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్రం చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో చివరి అంకమైన ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్)ను 2024 జనవరిలో కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు మావోయిస్టులపై నిర్బంధం నానాటికీ పెరుగుతుండగా.. ఎదురుకాల్పుల్లో మృతి చెందుతున్న వారి సంఖ్య సైతం రెట్టింపవుతోంది. ఈ క్రమంలోనే తీవ్ర నిర్బంధం మధ్య ఈనెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు 20వ వార్షికోత్సవాలను భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నిర్వహిస్తోంది. ఈ నేపథ్యాన నక్సల్బరీ ఉద్యమం నుంచి ఆపరేషన్ కగార్ వరకు జరిగిన ఘటనల సమాహారమిది.


దండకారణ్యంలో మావోయిస్టులు (ఫైల్)

విలీనం వెనుక కారణాలు..

నక్సల్బరీ ఉద్యమం నుంచి వచ్చిన కన్హాయ్ చటర్జీ 1969లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్(ఎంసీసీ) పేరుతో బెంగాల్, బిహార్ కేంద్రంగా విప్లవ ఉద్యమాన్ని నడిపారు. ఈ గ్రూపులో చీలికలు, కొత్త వర్గాలు పుట్టుకొచ్చినా.. ఉత్తర భారతదేశంలో సాయుధ పోరాటాలకు కేంద్ర బిందువుగా ఎంసీసీ ఉంటూ వచ్చింది. మరోవైపు బిహార్ సరిహద్దు నేపాల్‌లో అప్పటి కమ్యూనిస్టు పోరాట యోధుడు ప్రచండ, ఆయన దళాలు ఆ దేశంలో 60 శాతం భూభాగంపై పట్టు సాధించాయి. అప్పటికే దక్షిణాన లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) తోనూ అప్పటి ఏపీకి చెందిన అప్పటి పీపుల్స్‌వార్ గ్రూప్‌తో సంబంధాలున్నాయి. విదేశీ మార్గాల్లో విప్లవ శక్తులకు ఆయుధాల సరఫరాకు అవకాశం కలగడంతో.. నేపాల్ నుంచి శ్రీలంక వరకు రెడ్ కారిడార్ (పశుపతి టూ తిరుపతి) ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి అప్పటి సాయుధ కమ్యూనిస్టు గ్రూపులు వచ్చాయి. ఇరవై ఏళ్ల కిందట ఉమ్మడి ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో ఉన్న అనేక విప్లవ సంస్థలు పీపుల్స్‌వార్ గొడుగు కిందకు రాగా.. ఉత్తర భారతదేశంలో ఉన్న విప్లవ శక్తులు మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్(ఎంసీసీ) వెనుక నిలిచాయి. ఈ రెండు విప్లవ శక్తులు 2004 సెప్టెంబర్ 20న ఒక్కటిగా విలీనమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పేరుతో ఏర్పడ్డాయి. అప్పటి నుంచి పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యుడు గణపతి మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శిగా ఇప్పటివరకు కొనసాగుతున్నారు. కేంద్ర కమిటీలో రెండు తెలుగు రాష్ట్రాల వ్యక్తులే కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

'చారు' నుంచి చర్చల వరకు..

పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీ కేంద్రంగా 1967లో చారు మజుందార్ నాయకత్వాన కామ్రేడ్లు జరిపిన పోరాటం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. వర్గశత్రు నిర్మూలన పేరుతో చారు మజుందార్ ఎత్తుకున్న జెండాతో.. కమ్యూనిస్టు పోరాటం బెంగాల్ నుంచి శ్రీకాకుళం మీదుగా ఉత్తర తెలంగాణకు దావానలంలా వ్యాపించింది. ఈ క్రమంలో అనేక చీలికలు రాగా.. సత్యమూర్తి, కొండపల్లి సీతారామయ్య, చంద్ర పుల్లారెడ్డి వంటి నేతల ఆధ్వర్యాన కొత్త గ్రూపులు ఏర్పడ్డాయి. దోపిడీకి గురైన పల్లె ప్రజలు.. అన్నల వెన్నంటే నడిచేందుకు కదం తొక్కారు. దీంతో నక్సలైట్ల పోరాటాలపై బహుముఖంగా ప్రభుత్వం విరుచుకుపడింది. ఫలితంగా ఇరువర్గాల మధ్య ఘర్షణలతో హింస చెలరేగింది. కానీ 2004 నాటికే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మావోయిస్టుల బలం గణనీయంగా తగ్గిందని చెబుతారు.

రెడ్ కారిడార్ దిశగా..

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పాటైన తర్వాత రెడ్ కారిడార్ దిశగా చకచకా అడుగులు పడ్డాయి. నేపాల్ విప్లవ పోరాట యోధుడు ప్రచండ అక్కడి ప్రభుత్వాన్ని కూలదోసి 2008లో నేపాల్‌లో కమ్యూనిస్టుల నేతృత్వాన ప్రభుత్వం ఏర్పాటు చేశాడు. మావోయిస్టు అగ్రనేత కిషన్‌జీ అలియాస్ మల్లోజుల కోటేశ్వరరావు 2009, 2010లో బెంగాల్‌లో ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించి, అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేశారు. బెంగాల్, ఒడిశాల దిగువన ఛత్తీస్‌గఢ్‌లో అప్పటికే జనతన సర్కార్ ఉండడంతో రెడ్ కారిడార్ ఏర్పాటు సాధ్యమనే నమ్మకం విప్లవ శక్తుల్లో కలిగింది.

గెరిల్లా జోన్ - జనతన్ సర్కార్

1980, 1990లో ఉత్తర తెలంగాణ జిల్లాలను నక్సలైట్ల ఉద్యమం ప్రభంజనమై చుట్టేసింది. అప్పటి భూస్వామ్య శక్తుల కింద నలిగిపోతున్న గ్రామీణ ప్రజానీకం అన్నల వెంట నడిచేందుకు బారులు తీరారు. కానీ మైదాన ప్రాంతమైన ఉత్తర తెలంగాణలో భారీ దళాలు, ప్లాటూన్లు ఏర్పాటు చేసే పరిస్థితి లేక అప్పటి నాయకత్వం 'ఉత్తర తెలంగాణ పర్స్పెక్టివ్', 'దండకారణ్య పర్స్పెక్టివ్' పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో పార్టీ విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసింది. దీర్ఘకాలిక విప్లవ పోరాటంలో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం, అబూజ్‌మడ్, ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతాలను గెరిల్లా జోన్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయానికి వచ్చింది. అలా 1982లో వరంగల్ మీదుగా దండకారణ్యానికి వెళ్లిన నక్సలైట్లు అక్కడి ప్రజలతో కలిసిపోయారు. వారి తరఫున పోరాడి.. ఇరవై ఏళ్లు తిరిగే సరికి జనతన్ సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వం నడిపే స్థాయికి చేరుకున్నారు.

అణచివేతలు

రెడ్‌కారిడార్ నినాదంతో అప్రమత్తమైన శ్రీలంక ప్రభుత్వం ఎల్‌టీటీఈ మీద ఏకంగా యుద్ధాన్నే ప్రకటించి, పెద్ద ఎత్తున రక్తపాతం పారించింది. ప్రత్యేక తమిళ దేశం నినాదాన్ని తొక్కి పెట్టింది. బెంగాల్‌లో కిషన్‌జీని ఎన్‌కౌంటర్ చేయడం ద్వారా ఉత్తర, తూర్పు భారతంలో విప్లవ ఉద్యమాన్ని మమతా బెనర్జీ అణచివేశారు.

గ్రీన్‌హంట్ టూ కగార్

అటు రెడ్ కారిడార్ ప్రమాదం, ఇటు జనతన సర్కార్ విస్తరణలతో అప్రమత్తమైన భారత ప్రభుత్వం 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను దండకారణ్యంలో ప్రారంభించింది. అందులో భాగంగా సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ వంటి పారా మిలిటరీ బలగాలతో పాటు డీఆర్‌జీ, కోబ్రా వంటి ప్రత్యేక దళాలతో అడవుల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తూ ముందుకు సాగుతోంది. దీనికి ప్రతిగా మావోయిస్టులు అంబుష్ దాడులతో విరుచుకుపడ్డారు. ఆరంభంలో పోలీసులు, పారా మిలిటరీ దళాలపై మావోయిస్టులు పైచేయి సాధించారు. కానీ తీవ్ర నిర్బంధం వల్ల కావలసిన సామగ్రి సరఫరాలో అంతరాయాలు, నియామకాలు తగ్గిపోవడం, కోవర్టు ఆపరేషన్లు, వయోభారం, అనారోగ్య కారణాల రీత్యా అగ్రనేతలు చనిపోవడంతో.. మూడేళ్లుగా మావోయిస్టు ఉద్యమం వెనక్కి తగ్గిందనే భావన నెలకొంది. కాగా, అసమానత్వం, అణచివేత, దోపిడీ ఉన్నంతకాలం పోరాటం తన రూపం మార్చుకుంటూ కొనసాగుతూనే ఉంటుందని విప్లవకారుల నమ్మకం.



రక్తంతో తడిసిన ఉద్యమం

1967 నుంచి 2004 వరకు ఉమ్మడి ఏపీలో పోలీసులు, నక్సలైట్ల మధ్య 2,671 సార్లు ఎదురుకాల్పులు జరిగాయి. వీరిలో 2,565 మంది నక్సలైట్లు, 518 మంది పోలీసులు, 2,772 మంది సాధారణ పౌరులు చనిపోయినట్టు తేలింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో చెలరేగిన హింస కారణంగా ఏకంగా ఇరువర్గాల మధ్య 1,500 మంది చనిపోయినట్టు సమాచారం.

కరెంట్ చౌర్యం కేసుల్లో

న్యూ సిటీ టాప్

అత్యధికంగా హబ్సిగూడ సర్కిల్‌లో 1,08,978 కేసులు నమోదు

● హైదరాబాద్ సెంట్రల్, సైబర్‌సిటీ, బంజారాహిల్స్‌తో కలిపి న్యూ సిటీలో 3.01 లక్షల కేసులు
● ఓల్డ్ సిటీ పరిధిలో 52,230 కేసులు
● సైబర్ సిటీలోనే విద్యుత్ చౌర్యంతో అత్యధిక నష్టం
● ఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికలో టీజీఎస్పీడీసీఎల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఓల్డ్ సిటీతో పోల్చితే హైదరాబాద్‌న్యూసిటీలోనే అత్యధికంగా విద్యుత్ చౌర్యం కేసులు నమోదయ్యాయి. హబ్సిగూడ సర్కిల్‌లో 1,08,978, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో 79,416 కేసులు, సైబర్ సిటీ సర్కిల్‌లో 65,387 కేసులు, బంజారాహిల్స్ సర్కిల్‌లో 47,612 కేసులు కలిపి న్యూసిటీ పరిధిలోని సర్కిళ్లలో మొత్తం 3,01,393 కేసులు నమోదు కాగా, హైదరాబాద్ సౌత్(పాతబస్తీ) సర్కిల్ పరిధిలో 52,230 కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) తాజాగా సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక 2024-25లో ఈ విషయాన్ని వెల్లడించింది. సంస్థ పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో 2023-24లో మొత్తం 8,26,955 విద్యుత్ చౌర్యం కేసులు నమోదు కాగా, రూ.138.65 కోట్ల నష్టం జరిగినట్టు అంచనా వేశారు. అందులో రూ.107.07 కోట్లు సంబంధిత వ్యక్తుల నుంచి వసూలు చేశారు. ఐటీ కంపెనీలకు నిలయమైన సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో విద్యుత్ చౌర్యంతో అత్యధికంగా రూ.16.76 కోట్ల నష్టం జరగగా, ఆ తర్వాతి ఓల్డ్ సిటీలో రూ.12.43 కోట్లు, మేడ్చల్ సర్కిల్‌లో రూ.12.18 కోట్ల నష్టం జరగడం గమనార్హం. హైటెన్షన్ విద్యుత్ వినియోగించే భారీ పరిశ్రమలు, వాణిజ్య సంస్థలపై సైతం 3,544 విద్యుత్ చౌర్యం కేసులు నమోదు కాగా, వాటితో జరిగిన నష్టంపై సంస్థ ఎలాంటి అంచనాలను తెలపలేదు. అత్యల్పంగా గద్వాల సర్కిల్‌లో 6,650 విద్యుత్ చౌర్యం కేసులు నమోదు కాగా, రూ.2.58 కోట్ల నష్టం జరిగింది.

2023-24లో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో నమోదైన విద్యుత్ చౌర్యం కేసులు, వాటితో జరిగిన నష్టం అంచనాలు, వసూలైన జరిమానాలను పట్టికలో చూడవచ్చు.

సర్కిల్	విద్యుత్ చౌర్యం కేసులు	నష్టం అంచనా (రూ.కోట్లు)	వసూలైన జరిమానా (రూ.కోట్లు)
బంజారాహిల్స్	47,612	5.61	5.28
సైబర్‌సిటీ	65,387	16.76	12.16
గద్వాల	6,650	2.58	1.03
హబ్సిగూడ	1,08,978	8.59	9.15
హైదరాబాద్ సెంట్రల్	79,416	9.89	7.89
హైదరాబాద్ సౌత్	52,230	12.43	7.26
మహబూబ్‌నగర్	28,161	3.24	2.40
మెదక్	20,772	6.05	4.09
మేడ్చల్	52,097	12.18	12.19
నాగర్‌కర్నూల్	12,290	4.44	2.70
నల్లగొండ	29,268	5.02	3.47
నారాయణపేట	14,879	2.51	1.16
రాజేంద్రనగర్	49,385	7.31	6.17
సంగారెడ్డి	55,517	7.14	7.05
సరూర్‌నగర్	56,145	6.50	6.39
సికింద్రాబాద్	49,278	5.12	5.19
సిద్దిపేట	29,042	5.54	3.65
సూర్యాపేట	22,293	5.01	2.69
వికారాబాద్	12,284	3.43.	1.66
వనపర్తి	8,726	3.59	1.37
యాదాద్రి	23,001	5.60	4.01
హెచ్‌టీ-డీపీఈ	3,544	-	-
మొత్తం	8,26,955	138.65	107.07

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట బందోబస్తు


అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 28న రాష్ట్ర పర్యటనకు వస్తున్న సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని విభాగాల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఒక రోజు పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ఈ నెల 28న ఉదయం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి హాజరవుతారని సీఎస్ తెలిపారు. అనంతరం సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళామహోత్సవ్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ శాఖల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతి భద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. రాష్ట్రపతి కాన్వాయ్ వెళ్లే ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులను కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో చేపట్టాలని ఆర్‌అండ్‌బీ శాఖను ఆదేశించారు. సమీక్షలో డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ నీళ్లు ఎల్లంపల్లివే..

మంత్రి పొన్నం స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా బిడ్డగా తనకు పూర్తి అవగాహన ఉందని.. ఇప్పుడున్న ఏ ప్రాజెక్టులోని నీళ్లు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వచ్చినవి కావని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క నీటిని కూడా ఎత్తిపోయకుండా.. ఎల్లంపల్లి ద్వారా కింద ఉన్న నీటి వనరులన్నింటినీ నింపుతున్నామని తెలిపారు. ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోయకుండా.. అవి కాళేశ్వరం నీళ్లు ఎలా అవుతాయో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని పొన్నం కోరారు. మిడ్‌మానేరు, లోయర్ మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్‌లకు వచ్చిన నీరంతా ఎల్లంపల్లి నుంచి తీసుకున్నవేనని వివరించారు. విడతల వారీగా వర్షాలు కురవడం వల్లే.. ఈ ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుకోగలిగామని తెలిపారు. మల్లన్నసాగర్ నీళ్లు కాళేశ్వరం నుంచి వచ్చాయా? ఎల్లంపల్లి నుంచి వచ్చాయా? అన్న ప్రశ్నకు హరీశ్‌రావు జవాబివ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క కూడా నీటిని వాడుకునే పరిస్థితి లేదన్నారు.

మల్లన్నసాగర్‌పై చర్చకు సిద్ధమా?

సాక్షి, హైదరాబాద్: మల్లన్నసాగర్‌కు వచ్చిన నీళ్లు కాళేశ్వరానివి కావా? అని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్ చర్చకు సిద్ధమా? అని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సవాల్ విసిరారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మల్లన్నసాగర్‌కు వచ్చినవి కాళేశ్వరం నీళ్లని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల నుంచి చుక్క నీరు కూడా ఎత్తిపోసే పరిస్థితి లేదని చెప్పారు.

కమీషన్ల కక్కుర్తిలో పడి బీఆర్‌ఎస్ నేతలు తెలంగాణను నిండా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులతోనే ప్రస్తుతం వ్యవసాయానికి నీళ్లు వస్తున్నాయని మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.


శనివారం గాంధీభవన్‌లో కొండా లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తదితరులు

కొండా లక్ష్మణ్ బాపూజీకి సముచిత గౌరవం ఇస్తాం: మంత్రి పొన్నం

గాంధీభవన్‌లోకొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి సముచిత గౌరవం ఇస్తామని, ఈ నెల 27న ఆయన జయంతి వేడుకలు ప్రభుత్వం తరఫున ఘనంగా నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి వేడుకలు ఘనం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ...గత పదేళ్లలో కొండా లక్ష్మణ్ బాపూజీకి సముచిత గౌరవం ఇవ్వక నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు కేబినెట్ ఆమోదించినప్పుడు బలహీనవర్గాల మంత్రిగా ఆనందం వేసిందని పొన్నం అన్నారు.

సీబీఐ విచారణ కోరగలరా?

కాంగ్రెస్ నేతలకు మాజీమంత్రి వేముల సవాల్

సాక్షి, హైదరాబాద్: అలైన్‌మెంట్ మార్పులో కాంగ్రెస్ నేతలు సుద్దపూసలే అయితే సీబీఐ విచారణ కోరాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సవాల్ చేశారు. రీజినల్ రింగు రోడ్డు దక్షిణభాగం అలైన్‌మెంట్ మార్పులో కాంగ్రెస్ బాగోతం బయటపెట్టగానే ఆ పార్టీ నేతలు ఆత్మరక్షణలో పడి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అలైన్‌మెంట్ మార్పులపై తాను వేసిన ప్రశ్నలకు సూటిగా సమాధానాలు చెప్పలేక ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ మేరకు శనివారం వేముల ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ట్రిపుల్ ఆర్‌పై కనీస అవగాహన లేకుండా మాట్లాడారన్నారు. కేసీఆర్ కృషితో ట్రిపుల్ ఆర్ అనుమతులు 2021 డిసెంబర్ 6న వచ్చాయని కేవలం 22 నెలల్లోనే భూసేకరణను 76% పూర్తి చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతల భూములకు లబ్ధి జరిగేలా అలైన్‌మెంట్ జరుగుతోందని ఆరోపించారు. అలైన్‌మెంట్ మార్పులో జరుగుతున్న బాగోతాన్ని ఎప్పటికప్పుడు బయటపెడతామన్నారు.

బీజేపీలో ఎక్కువమంది అవినీతిపరులే..

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో ఎక్కువమంది అవినీతిపరులున్నారని నిరూపిస్తానని మాజీ ఎంపీ వి.హనుమంతరావు చెప్పారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 150 ఏళ్ల కాంగ్రెస్ తుకుడే తుకుడే అన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. తెలంగాణకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ప్రశ్నించిన మోదీ.. ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన హామీలు, 2 కోట్ల ఉద్యోగాలు, కుల గణన చేశారా? అని ప్రశ్నించారు. అంబేడ్కర్ రాజ్యాంగం అమలుకు కృషి చేస్తున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

క్లుప్తంగా...

అక్టోబర్‌లో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో



ఎక్స్‌పో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్వామి తదితరులు

గుణదల(విజయవాడ తూర్పు): అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో–2024 నిర్వహించనున్నట్లు ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌వీ స్వామి తెలిపారు. విజయవాడ గుణదలలోని హోటల్ హయాత్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎక్స్‌పోను ఏపీ హోటల్స్ అసోసియేషన్, కేటరర్స్ అసోసియేషన్, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, విజయవాడ హోటల్స్ అసోసియేషన్, విజయవాడ చాంబర్స్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో 120 స్టాల్స్ వరకు కొలువుతీరాతాయన్నారు. కారు ఎక్స్‌పో, లైవ్ ఫుడ్ స్టాల్స్, ఫన్ యాక్టివిటీస్, ఇంటరాక్టివ్ యాక్టివిటీస్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఏడాదిన్నరలో బందరు పోర్టుకు షిప్‌లు

మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



మచిలీపట్నం టౌన్: రానున్న ఏడాదిన్నరలో బందరు పోర్టు పనులు పూర్తి చేసి షిప్‌ల రాకపోకలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. శనివారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని 24, 50 డివిజన్లలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం 'కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడారు. బీపీసీఎల్ కంపెనీ రూ.60 వేల కోట్ల పెట్టుబడులు మచిలీపట్నంకు తీసుకువచ్చేందుకు ఎంపీ బాలశౌరితో కలిసి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ పెట్టుబడులు వస్తే బందరు ముఖచిత్రం మారిపోతుందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇంటి ప్రహరీగోడ కూల్చివేత



టీడీపీ నేతలు కూల్చివేసిన కార్తిక్ నిర్మించుకున్న ప్రహరీగోడ

బైరెడ్డిపల్లె: చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలంలోని దేవదొడ్డిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కార్తిక్ ప్రహరీగోడను శనివారం టీడీపీ నేతలు కూల్చివేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దేవదొడ్డి సర్పంచ్ భర్త తన అనుచరులతో వచ్చి తమ ఇంటి చుట్టూ ఏర్పాటు చేసుకున్న ప్రహరీ గోడను కూల్చివేశాడని ఈ ఘటనతో రూ.లక్ష నష్టం కలిగినట్లు పేర్కొన్నాడు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరాడు.

100 రోజుల్లో ప్రజలకు మేలు చేశాం

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



గొలుగొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు ఎన్నో చేపట్టామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆయన అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం 'అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని తెలిపారు. గ్రామాల్లో మంచి పాలన కోసం పంచాయతీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు.

రాజముద్రతో పాస్ పుస్తకాలు జారీ


మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



నందిగాం: దీపావళి రోజున ఉచిత గ్యాస్ పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలంలోని మెండ్రాయివలసలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తన శాఖ పరిధిలో రూ.45వేల కోట్లు అప్పులున్నాయని తెలిపారు. అధికారం వచ్చిందని ఆనందం ఉన్నా ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకరించడం వల్ల వందరోజుల్లో కొంత సంక్షేమం సాధించినట్లు చెప్పారు. త్వరలో రాజముద్రతో పాసు పుస్తకాలు అందజేస్తామని, తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామని అన్నారు.

మా అడ్డా.. కదలం బిడ్డా..!

- విద్యుత్ సంస్థల్లో ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి తిష్ట
- యూనియన్ నేతలైనా 9 ఏళ్ల తర్వాత వేరే ప్రాంతానికి వెళ్లాలి
- మిగతా ఉద్యోగులను ఐదేళ్లు దాటితే కచ్చితంగా కదపాలి
- కానీ 36 ఏళ్లు దాటినా బదిలీ కాని పలువురు ఉద్యోగులు
- రకరకాల ప్రయత్నాలతో బదిలీ నుంచి ఎస్కేప్
- కింది స్థాయి ఉద్యోగులకూ వేధింపులు
- వీరి కారణంగా అర్హులకు అన్యాయం





బదిలీల కోసం తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం ఇచ్చిన సిఫారసు లేఖ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) పరిధిలో రాజమండ్రి ఆపరేషన్ సర్కిల్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏఓ)గా ఓ అధికారిణి పనిచేస్తున్నారు. ఇక్కడ ఆమె ఎన్నేళ్లుగా పని చేస్తున్నారో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి ఆమె ఇక్కడే 30 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నారు. కాకినాడలో ఓ సీనియర్ అసిస్టెంట్ 24 ఏళ్లుగా అదే స్థానంలో పనిచేస్తున్నారు. ఇలా ఈ ఒక్క సర్కిల్ పరిధిలోనే 169 మంది ఉద్యోగులు 5 నుంచి 36 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నట్లు డిస్కం అధికారులు తేల్చారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో వందకుపైగా ఉద్యోగులు ఒకే చోట తిష్ట వేసుకుని కూర్చున్నారు. వాస్తవానికి యూనియన్ నాయకులకైనా 9 ఏళ్ల వరకే 'ప్రొటెక్షన్' ఉంటుంది. ఆ తర్వాత వారు బదిలీ అవ్వాల్సిందే. మిగతా ఉద్యోగులకు 5 సంవత్సరాలకు బదిలీ జరగాల్సిందే. ఇవేవీ ఈ ఉద్యోగులకు పట్టవు. ఈ వ్యవహారంపై గతంలో పెద్ద దుమారమే రేగింది. అయినా ఎవరూ వీరిని మరో ప్రాంతానికి పంపించలేకపోతున్నారు.

తిష్ట వేసి రచ్చ చేసి

విద్యుత్ శాఖలో ముఖ్యంగా డిస్కంలలో కొన్ని పోస్టులకు, కొన్ని ప్రాంతాలకు డిమాండ్ ఎక్కువ. ఆదాయం వచ్చే ఈ పోస్టుల కోసం ప్రతి ఉద్యోగి, అధికారి తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. ఒకసారి ఆ సీట్లో కూర్చొంటే అది వారి అడ్డానే. దానిని వదలడానికి ఇష్టపడరు. అక్కడే ఉండిపోవడానికి ఎటువంటి ప్రయత్నమైనా చేస్తారు. బదిలీ నిబంధనల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకొంటారు. భార్య, భర్త పనిచేస్తుంటే స్పౌజ్ కోటాను ఉపయోగించుకుంటున్నారు. మహిళల కోటాలో చాలా మంది సర్వీసు మొత్తం ఒకే చోట గడిపేస్తున్నారు. కొందరు బదిలీ నిబంధనలను కూడా మార్పించుకుంటారు. వారికి రాజకీయ నేతలు, ఉన్నతాధికారుల అండదండలు ఉంటున్నాయి. రాజకీయ నేతల సిఫారసు లేఖలు తెచ్చుకోవడంతో పాటు ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడంలోనూ వీరు దిట్టలు. కొందరు ఉన్నతాధికారులకు, ఉద్యోగ సంఘాలకు వీరే ఆర్థిక వనరులుగా మారుతున్నారు. దీంతో వీరిని కదిపేందుకు కూడా ఎవరూ సాహసించరు. ఇలా ఏళ్ల తరబడి తిష్ట వేసిన అధికారులు కింది స్థాయి ఉద్యోగులను వేధింపులకు గురి చేయడంతో పాటు తీవ్ర అవినీతికి పాల్పడుతున్నారని రాష్ట్ర స్థాయిలో విజిలెన్స్ అధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. సర్కిళ్లలో గ్రూపులు కట్టడం, నచ్చని అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేయడం, సామాజిక భేదాలు తీసుకువచ్చి వర్గ వైషమ్యాలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఏలూరు సర్కిల్‌లో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శంగా చెబుతున్నారు. ఇలాంటి వారి వల్ల అర్హులైన వారికి పదోన్నతులు రావడంలేదని, ఎంతో మందికి దగ్గర్లో పోస్టింగ్ రాకుండా అన్యాయం జరుగుతోందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంఘాలూ సిఫార్సులు చేస్తున్నాయి

ఇలా ఒకే సీట్లో పాతుకుపోయిన వారిని కదల్చడానికి గతంలో కొందరు సీఎండీలు కఠిన నిబంధనలు తెచ్చారు. ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ స్థాన చలనం కలిగించాలని చూశారు. కొందరిని కదిపారు కూడా. కానీ ఆ తర్వాత వివిధ కారణాలతో వారంతా తిరిగి పాత స్థానాలకు వచ్చేశారు. ముఖ్యంగా రాజకీయ నేతలు, విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు ఈ విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. వారి అండతోనే ఉద్యోగులు కావాల్సిన స్థానంలో దశాబ్దాలుగా కొనసాగుతున్నారు. ఇక ఈ సంఘాల నాయకులకు అసలు బదిలీ అనేదే జరగడం లేదు. నిబంధనల ప్రకారం యూనియన్ నాయకుడైనప్పటికీ 9 ఏళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగికి 'ప్రొటెక్షన్' వర్తించదు. కానీ ఈ నిబంధన డిస్కంలలో ఎక్కడా అమలు కావడం లేదు. పైగా తాజాగా ప్రజాప్రతినిధులతో పాటు యూనియన్ సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకునే పరిస్థితిని తీసుకువచ్చారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇచ్చినట్లుగానే ఫలానా ఉద్యోగిని ఫలానా చోటికి బదిలీ చేయాల్సిందిగా యూనియన్లు కూడా సీఎండీలకు లేఖలు రాస్తున్నాయి.

జార్ఖండ్ హైకోర్టు సీజేగా జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు

- హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు నుంచి బదిలీ చేసిన రాష్ట్రపతి ముర్ము
- పలు హైకోర్టులకు సీజేలుగా మరికొందరు జడ్జీల నియామకం
- గతంలో తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ సీజేగా పనిచేసిన జస్టిస్ రామచంద్రరావు



సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ మామిడన్న సత్యరత్న రామచంద్రరావు నియమితులయ్యారు. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ రామచంద్రరావును జార్ఖండ్ హైకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బదిలీ చేశారు. అలాగే మరికొందరు న్యాయమూర్తులను ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, మేఘాలయ, జమ్మూకశ్మీర్–లడఖ్, మద్రాస్ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులుగా నియమించారు. మరో ముగ్గురు జ్యుడీషియల్ అధికారులను మద్రాస్ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తులుగా నియమించారు. ఈ నెల 17న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. దీంతో శనివారం కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2012లో ఏపీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులైన జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు... 2013లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2021 ఆగస్టు 31న తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2021 అక్టోబర్ 12న పంజాబ్–హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. అనంతరం 2023 మే 30న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు.

100 రోజుల వైఫల్య పాలన

- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి విమర్శ
- కూటమి పాలనపై ప్రజలంతా అసంతృప్తిగా ఉన్నారు
- మేనిఫెస్టో హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారు



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. '100 రోజుల్లో వెయ్యి అడుగులు వేస్తామన్న కూటమి సర్కార్.. ఆ తర్వాత బడుగు, బలహీనవర్గాల ప్రజల మనసులను గాయపర్చింది. కూటమి ప్రభుత్వ పాలనపై రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారు. ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు కులప్రాతిపదికే ప్రామాణికంగా జరిగాయన్న విమర్శలు ఎందుకు వచ్చాయో చంద్రబాబే చెప్పాలి. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు.. వరదల నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారు. ఏపీలో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతుంది. పార్టీలో, ప్రభుత్వంలో సర్వం తానే చక్రవర్తి అన్నట్లు వ్యవహరిస్తున్న నారా లోకేశ్ తీరుతో టీడీపీ సీనియర్లంతా విసిగిపోతున్నారు. మొన్న మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ, నిన్న బాలినేని, సామినేని.. ఇంకెంత మందిని అవినీతి సొమ్ముతో చేర్చుకుంటారు? రాష్ట్రం అభివృద్ధికి నోచుకోవట్లేదు. సంక్షేమ పథకాలు అమలు కావట్లేదు. ఇక జమిలి ఎన్నికల తర్వాత టీడీపీ జెండా పీకెయ్యడం ఖాయం. బీజేపీలో టీడీపీ విలీనం తథ్యం' అని విజయసాయిరెడ్డి విమర్శించారు.

సూపర్ సిక్స్‌ను పక్కనపెట్టి హింసకు ప్రాధాన్యత

కూటమి ప్రభుత్వం ఈ 100 రోజుల పాలనలో సూపర్ సిక్స్ హామీలను పక్కనపెట్టి హింసకు ప్రాధాన్యత ఇచ్చిందని విజయసాయిరెడ్డి విమర్శించారు. 'వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల హత్యలతో సహా సామూహిక హింసను ప్రభుత్వం ప్రేరేపించింది. 3 నెలల లోపే రూ. 19,000 కోట్లు అప్పు చేశారు. కీలక సంక్షేమ పథకాలు అటకెక్కించారు. తన అక్రమ నివాసాన్ని కాపాడుకోవడానికి విజయవాడ వరదలకు కారణమయ్యారు. తోడల్లుళ్లు అయిన వైజాగ్ ఎంపీ భరత్, మంత్రి లోకేశ్ కుమ్మక్కై రాజకీయ కక్షతో భీమిలిలో మా ప్రైవేట్ స్థలంలో ఈరోజు మళ్లీ రెండోసారి ప్రహరీ పగలగొట్టడం పిల్లచేష్టలుగా భావిస్తున్నా. చంద్రబాబు నివసిస్తున్న కృష్ణా నది కరకట్టపై ఉన్న అక్రమ కొంపను ఆ చట్టం, ఆ నిబంధనల ప్రకారమే కూల్చమని పలుమార్లు విజ్ఞప్తి చేశాను. కానీ బుద్ధిహీనత వల్ల మీరు అది చెయ్యలేరు'' అని మండిపడ్డారు.

స్వచ్ఛతా సైకతం



విశాఖ కోస్టు గార్డు ఆధ్వర్యంలో శనివారం ఆర్‌కే బీచ్‌లో స్వచ్ఛతా హీ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా సైకత శిల్పం ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దు అంటూ దానిపై రాశారు. ఇది విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది.

– విశాఖపట్నం

తిరుపతిలో భారీ చోరీ

రూ.11 లక్షల నగదు, భారీగా బంగారం, వెండి దొంగలపాలు



చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారి

తిరుపతి రూరల్: తిరుపతిలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు ఇళ్లలో చోరీ జరిగింది. 448 గ్రాముల బంగారం, 7 కిలోలకు పైగా వెండి, రూ.11 లక్షల నగదు దొంగల పాలైంది. బాధితుల ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు శనివారం ఘటనాస్థలాలను పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ నిపుణులు ఆధారాలు కోసం వెతికారు. తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీ తిరుమలనగర్‌కు చెందిన నల్లూరి నాగరాజ ఆచి మసాలా డిస్ట్రిబ్యూటర్. శుక్రవారం తెల్లవారుజామున మోటారు వేయడానికి కిందిరి రాగా..కింద పోర్షన్‌లో డోర్ తెరిచి ఉండడం, బీరువా పగులగొట్టి బెడ్‌రూమ్‌లో ఉన్న 420 గ్రాములు బంగారు అభరణాలు, 800 గ్రాముల వెండి వస్తువులు, రూ.11 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, టెలిఫోన్ కాలనీలో నివాసం ఉండే సురేష్ స్టీలు షాపు పెట్టుకుని వ్యాపారం చేస్తుంటాడు. కుటుంబంతో కలిసి విజయవాడకు వెళ్లాడు. ఇంట్లో ఎవరు లేనిది చూసి గుర్తు తెలియని దొంగలు తాళాలు పగలకొట్టి ఇంట్లోకి వెళ్లి ఆరు కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. అలాగే, టీటీడీ విశ్రాంత ఉద్యోగి వెంకటరమణ కుటుంబంతో కలిసి బయటకు వెళ్లారు. తాళం వేసిన ఇంటి తలుపులను పగలకొట్టి ఇంట్లోని 25 గ్రాముల బంగారు అభరణాలను దొంగలు దోచుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ ఏఎస్పీ నాగభూషణం పర్యవేక్షణలో దొంగల కోసం 4 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

తరగతి గదిలో టీడీపీ ఎమ్మెల్యే మీటింగ్

విద్యార్థులకు వరండాలో పాఠాలు




తరగతి గదిలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నెహ్రూనగర్: ఆయనొక ప్రజాప్రతినిధి.. విద్యార్థులకు పాఠాలు బోధించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలిగించకూడదనే జ్ఞానం లేకుండా ఏకంగా నగరపాలక సంస్థ పాఠశాల తరగతి గదిలోనే విద్యార్థినులను బయటకు పంపించి సచివాలయ సెక్రటరీలు, నగర పాలక సంస్థ అధికారులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం 53వ డివిజన్ వెంగళరావునగర్ మున్సిపల్ బాలికల హైస్కూల్ వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. స్కూల్ ముందే పెద్ద పెద్ద మైకులు ఏర్పాటు చేసి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అయిపోయిన తరువాత పాఠశాలలోనే విద్యార్థినులను బయటకు పంపించి సచివాలయ సిబ్బంది, అధికారులతో తరగతి గదిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు గుంటూరు తూర్పు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్. దీంతో చేసేదేమి లేక విద్యార్థినులకు బయట వరండాలోనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి టీచర్లవంతైంది.

లడ్డూ వివాదంపై సీబీఐతో విచారణ చేపట్టాలి

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలకు తెలపాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా వాఖ్యలు చేయడం తగదన్నారు. గతంలోనే అనుమానాలు వచ్చినప్పుడు ఎందుకు స్పందించలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజకీయ స్వలాభాల కోసం తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లేలా శ్రీవారి ప్రసాదంపై నిందలు వేయడం రాజకీయ కుట్రలో భాగమేనని మండిపడ్డారు. మత విశ్వాసాలు రెచ్చగొట్టడం కోసం గతంలో బాబ్రీ మసీద్, అయోధ్య, ఇప్పుడు తిరుపతిని వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు బ్రిటిష్ కాలంలో విభజించు పాలించు విధానంలో భాగంగా ఆవు కొవ్వు, పంది కొవ్వు విధానాన్ని తీసుకొచ్చారని, ఇప్పుడూ కూటమి ప్రభుత్వం అదే విధానం అనుసరిస్తోందని గుర్తు చేస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.



28 నుంచి కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి: కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి వారి ఆలయంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 27న సాయంత్రం పుణ్యాహవచనం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. 28న రక్షబంధనం, పవిత్రప్రతిష్ఠ, శేయాధివాసం, 29న స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ, సాయంత్రం పవిత్ర హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. 30న హోమాలు, మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.



వాడపల్లికి పోటెత్తిన భక్తులు



ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామివారిని వేద పండితులు, అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజాదికాలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని కానుకలు సమర్పించారు. ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్నసమారాధన జరిగింది.

రత్నగిరికి భక్తుల తాకిడి



అన్నవరం: రత్నగిరిపై కొలువైన వీర వేంకట సత్యనారాయణ స్వామి ఆలయంలోని ప్రాంగణాలు శనివారం వేలాదిగా వచ్చిన భక్తులతో నిండిపోయాయి. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, రెండు వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షలు ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు అన్నప్రసాదం పెట్టారు. అలాగే సత్యదేవుడు, అనంతలక్ష్మీ, సత్యవతీదేవి అమ్మవారి ప్రాకారసేవ కన్నులపండుగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


తరిగొండ ఆలయంలో విశేష పూజలు




గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శనివారం స్వామికి విశేష పూజలు జరిపారు. శ్రావణ మాసం రెండో శనివారం కావడంతో వేకువ జామునే స్వామికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకం, అర్చన, తోమాల సేవ, ఏకాంత సేవ నిర్వహించారు. అనంతరం స్వామిని రంగు రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఎస్‌జీఎఫ్ఐ అండర్‌-14, 17 బాలబాలికలకు వాలీబాల్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నార. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 25న జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.




డిగ్రీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు



వైవీయూ: డిగ్రీ చదవడం ద్వారా చక్కటి అవకాశాలు దక్కించుకోవచ్చని, ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలనతో లక్ష్యసాధనకు శ్రమించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ నిర్మల మాట్లాడుతూ విద్యార్థిదశ ఎంతో కీలకమని, బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడపలోని మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాఎంపికలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో యోగ, చదరంగం క్రీడాంశాల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. కడప మండల ఎస్‌జీఎఫ్ సమన్వయకర్త ఎస్. సాజిత్ మాట్లాడుతూ మండల, నియోజకవర్గస్థాయిలో రాణించిన క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపికల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. యోగ నిపుణుడు పెంచలయ్య మాట్లాడుతూ దైనందిత జీవితంలో యోగ ప్రాధాన్యతను వివరించారు.


• కమల్‌హాసన్

థగ్ లైఫ్‌కు బై బై

‘థగ్ లైఫ్’ సినిమాకు బై బై చెప్పారట కమల్‌హాసన్. ‘నాయగన్’ (తెలుగులో ‘నాయకుడు’) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం ‘థగ్ లైఫ్’. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటించారు కమల్‌హాసన్. ఈ సినిమాలో కమల్‌హాసన్ పాత్ర తాలూకు చిత్రీకరణ పూర్తయిందని, త్వరలోనే ‘థగ్ లైఫ్’ షూటింగ్ మొత్తం పూర్తవుతుందని కోలీవుడ్ సమాచారం. కాగా ఈ సినిమాకి సంబంధించి కమల్‌హాసన్ పాత్ర చిత్రీకరణ పూర్తి కావడంతో చిత్రబృందం పార్టీ చేసుకుందని సమాచారం. ఇక శింబు, త్రిష, జోజు జార్జ్, అశోక్ సెల్వన్, అలీ ఫజల్ కీలక పాత్రధారులుగా కనిపించనున్న ‘థగ్ లైఫ్’ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ‘నాయకుడు’ తర్వాత అంటే 37 ఏళ్లకు కమల్‌హాసన్, మణిరత్నం కాంబినేషన్‌లో రానున్న ‘థగ్ లైఫ్’ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుందని టాక్.

జనవరిలో ఎంట్రీ?


• ఎన్టీఆర్

‘దేవర’ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎన్టీఆర్ ఫుల్ బిజీగా ఉన్నారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదల కానున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత ఎన్టీఆర్ ఫ్రీ అవుతారు. సో... ఇక తదుపరి చిత్రం షూటింగ్‌తో బిజీ అవుతారనుకోవచ్చు. అయితే ఓ మూడు నెలల తర్వాతే నెక్ట్స్ మూవీ షూట్‌లో పాల్గొంటారట ఎన్టీఆర్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెల 21న ఆరంభమవుతుంది. అయితే అప్పుడు ఎన్టీఆర్ పాల్గొనరట. ఈ హీరో లేని సన్నివేశాల చిత్రీకరణ మొదలుపెడతారు. 21 నుంచి దాదాపు 40 రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్ పాల్గొనరు. జనవరిలోనే ఈ చిత్రం సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తారట. ఈ విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు ఎన్టీఆర్. మైత్రీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి ‘డ్రాగన్’ అనే టైటిల్ అనుకుంటున్నారట.

టార్గెట్ ఫిక్స్


• విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ‘వీడీ 12’ (వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం షూట్ ప్రస్తుతం కేరళలో జరుగుతోంది. విజయ్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా షూటింగ్‌ను నవంబరు కల్లా పూర్తి చేయాలని విజయ్ దేవరకొండ టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారట. ఇందుకు తగ్గట్లుగా చిత్రయూనిట్ ప్లాన్ చేసిందని సమాచారం. ఇక ఈ సినిమా టైటిల్‌పై ఈ దసరా పండగ సమయంలో ఓ స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ స్పైగా కనిపిస్తారని, ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే చాన్స్ ఉందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. వచ్చే ఏడాది మార్చి 25న చిత్రం రిలీజ్ కానుంది. అలాగే రాహుల్ సంకృత్యాన్, రవి కిరణ్ కోలాల దర్శకత్వాల్లోనూ సినిమాలు చేసేందుకు విజయ్ దేవరకొండ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమాల చిత్రీకరణను త్వరలోనే ప్రారంభించాలనుకుంటున్నారట. ఈ సినిమాల్లోని క్యారెక్టర్స్ కోసం విజయ్ మేకోవర్ కావాల్సి ఉంది. అందుకే ‘వీడీ 12’ సినిమా చిత్రీకరణను తొందరగా పూర్తి చేసి, తన తర్వాతి సినిమాలపై ఫోకస్ పెట్టాలని విజయ్ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

నలభైలలోనే అసలు జీవితం ఆరంభమవుతుంది!


• భర్త సుకుమార్‌తో తబిత

“నలభైలలోనే అసలు జీవితం ఆరంభం అవుతుంది అంటుంటారు. అప్పటి వరకూ మనం జీవించినది అంతా ఒక పరిశోధనే’’ అంటున్నారు తబితా సుకుమార్. ప్రముఖ దర్శకుడు సుకుమార్ భార్య తబిత తన పుట్టినరోజుని గ్రీస్‌లో జరుపుకున్నారు. భర్త, పిల్లల సమక్షంలో ఆమె బర్త్ డే సెలబ్రేషన్ జరిగినట్లు తెలుస్తోంది. తబిత వయసు ఇప్పుడు 40. ‘‘ఇప్పటివరకూ జీవితంలో నేనింత ఆత్మవిశ్వాసంగా, ఆనందంగా, సంతోషంగా ఉన్నట్లు అనిపించడంలేదు. ఎందుకంటే ఇప్పుడు నా జీవితంలో ముఖ్యమైన విషయాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి, అనవసర విషయాలకు తక్కువ ఇస్తున్నాను. ఈ దశ చాలా బాగుంది’’ అని పేర్కొని గ్రీస్‌లో దిగిన ఫొటోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు తబితా సుకుమార్. కాగా..., ఆ మధ్య విడుదలైన ‘మారుతీ నగర్ సుబ్రమణ్యం’ మూవీకి తబిత సమర్పకురాలిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రావు రమేశ్ టైటిల్ రోల్‌లో నటించారు.

అప్పుడు నా కల నిజం అవుతుంది

- కిరణ్ రావ్



హిందీ హిట్ ఫిల్మ్ ‘లాపతా లేడీస్’ ఆస్కార్ బరిలో నిలిస్తే తన కల నిజమౌతుందని దర్శక–నిర్మాత కిరణ్ రావ్ అన్నారు. నితాన్షి గోయెల్, ప్రతిభ ప్రధాన పాత్రధారులుగా స్పర్శ్ శ్రీవాస్తవ, రవికిషన్ ఇతర కీలక పాత్రల్లో నటించిన హిందీ చిత్రం ‘లాపతా లేడీస్’. ఆమిర్ ఖాన్, కిరణ్ రావ్, జ్యోతిదేశ్ పాండే నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చిలో విడుదలై, సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. మహిళా సాధికారత, సమానత్వం వంటి అంశాలతో సాగే ఈ చిత్రం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ‘‘ఆస్కార్‌కు ఈ సినిమాని పంపితే నా కల నిజం అవుతుంది. కానీ ఇందుకు కొన్ని విధి విధానాలు ఉన్నాయి. అయితే ఆస్కార్‌కు పంపే సినిమాలను ఎంపిక చేసేవారు మంచి చిత్రాలను ప్రోత్సహిస్తారనే నమ్మకం ఉంది’’ అని కిరణ్ రావ్ పేర్కొన్నారు. మరి... భారతదేశం తరపున అధికారిక ఎంట్రీగా ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ విభాగంలో ‘లాపతా లేడీస్’ ఎంపిక అవుతుందా? అసలు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) కమిటీ ఫైనల్‌గా ఆస్కార్ బరికి ఏ భారతీయ చిత్రాన్ని పంపిస్తుందో తెలియాలంటే మరి కొన్ని రోజులు వేచి చూడాల్సిందే. ఇక 97వ ఆస్కార్ వేడుక మార్చిలో జరగనుంది.

‘లాపతా లేడీస్’ కథ విషయానికి వస్తే... పెళ్లి చేసుకున్న తర్వాత అత్తారింటికి కాకుండా మరో ఇంటికి ఆ అమ్మాయి వెళ్లాల్సి వస్తుంది. అలాగే పెళ్లైన తర్వాత ట్రైన్‌లో తన భర్తను మిస్ అవుతుంది మరో అమ్మాయి. ఈ ఇద్దరి అమ్మాయిల జీవితాలు ఫైనల్‌గా ఎలా సుఖాంతం అవుతాయి? అన్నదే టూకీగా ‘లాపతా లేడీస్’ కథాంశం.

ఘాటీ షూట్‌లో...


• అనుష్క

ప్రతీకారం తీర్చుకునే పని మీద ఉన్నారు అనుష్క. ఎవరి పైనా అంటే... ‘ఘాటీ’ సినిమాలో చూడాల్సిందే. క్రిష్ దర్శకత్వంలో అనుష్క నటిస్తున్న చిత్రం ఇది. దాదాపు పద్నాలుగేళ్లకు అనుష్క–క్రిష్ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. గతంలో క్రిష్ దర్శకత్వం వహించిన ‘వేదం’ (2010)లో అనుష్క నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇక తాజాగా వీరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ‘ఘాటీ’ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. వార్తల్లో ఉన్న ప్రకారం ఈ చిత్ర కథేంటంటే... బిజినెస్ ఉమన్‌గా ఎదుగుతున్న ఓ మహిళను కొందరు కావాలని టార్గెట్ చేస్తారు. నష్టాలపాలైన ఆ మహిళ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది. ఏ విధంగా రివెంజ్ తీర్చుకుంది? అనే కథాంశంతో ఈ చిత్రం ఉంటుందట. గంజాయి నేపథ్యంలో ఈ చిత్రం ఆంధ్రా–ఒరిస్సా బార్డర్ నేపథ్యంలో సాగుతుందని సమాచారం. ఇక ఈ చిత్రం కాకుండా మలయాళంలో ‘కథనార్’ అనే చిత్రంలో నటిస్తున్నారు అనుష్క.

2025... ముచ్చటగా మూడు


• అడివి శేష్

వచ్చే ఏడాది మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తా అంటున్నారు హీరో అడివి శేష్. ఇంతకీ విషయం ఏంటంటే... 2022లో అడివి శేష్ హీరోగా నటించిన ‘మేజర్, హిట్: ది సెకండ్ కేస్’ సినిమాలు థియేటర్స్‌లో విడుదలై, బాక్సాఫీస్ వద్ద విజయాలు సాధించాయి. ఆ తర్వాత అడివి శేష్ నుంచి 2023లో ఏ చిత్రం రిలీజ్ కాలేదు. శేష్ ప్రస్తుతం ‘గూఢచారి 2, డెకాయిట్’ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు చిత్రాల్లో ఏదో ఒకటి ఈ ఏడాదిలో రిలీజ్ కావొచ్చని ఆయన ఫ్యాన్స్ ఆశించారు. కానీ 2024లో అంటే... ఈ ఏడాదిలో కూడా శేష్ నటించిన ఏ సినిమా థియేటర్స్‌కు రాదని స్పష్టం అవుతోంది. ఎందుకంటే, ‘త్రీ రిలీజెస్ 2025’ అంటూ శనివారం ‘ఎక్స్’లో షేర్ చేశారు శేష్. ఇలా శేష్ పోస్ట్ చేయగానే... ఈ ఏడాది శేష్ నుంచి ఏ సినిమా రాదని, 2025లో మాత్రం ముచ్చటగా మూడు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వస్తాయని నెటిజన్లు ఫిక్స్ అయ్యారు. కాగా ప్రస్తుతం శేష్ ‘గూఢచారి 2, డెకాయిట్’లో హీరోగా నటిస్తున్నారు. మరి... శేష్ హీరోగా నటిస్తున్న మూడో చిత్రం ఏమై ఉంటుందనేది హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా గురించి ప్రకటన రానుందని, అందుకే శేష్ ఇలా హింట్ ఇచ్చారని ఊహించవచ్చు.

ఓల్డ్ అండ్ గోల్డ్ బనారస్ బ్యూటీ!


• కరీనా కపూర్

టైమ్‌లెస్ బాలీవుడ్ స్టార్‌కి నిజమైన ఉదాహరణగా నిలిచారు కరీనా కపూర్. ‘ది బకింగ్‌హామ్ మర్డర్స్’ సినిమాతో పాతికేళ్ల తన సినీ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధునాతనంగా డిజైన్ చేసిన పాతకాలపు బ్లాక్ అండ్ గోల్డ్ బనారసీ శారీ గౌన్ ధరించి ఆహూతుల మధ్య అందంగా వెలిగిపోయారామె.

ఈ అద్భుతాన్ని డిజైనర్ అమిత్ అగర్వాల్ ఆవిష్కరించారు. చీర పొడవు, కుచ్చిళ్లు, రీ డిజైనింగ్ పద్ధతులను గమనిస్తే డిజైనర్ ప్రతిభ మనకు కళ్లకు కడుతుంది. స్లీవ్స్ పై నుంచి తీసుకున్న క్లిష్టమైన మడతలతోనూ. ఫ్యూజన్ ఆఫ్–షోల్డర్ భాగంలో అల్లిక, నడుము చుట్టూ సాఫ్ట్ ప్లీట్ డిజైన్ వచ్చేలా చేశారు. బంగారు బనారసీ బూటా వర్క్ డ్రేప్ అంతటా కనువిందు చేస్తుంది. సాంప్రదాయ భారతీయ చీర కట్టును పోలిన విధంగా కుచ్చిళ్లను అమర్చారు. బంగారు బ్రోకేడ్ వర్క్‌తో ఉన్న పొడవైన పల్లూ నడకను అనుసరించేలా సెట్ చేశారు.



యాక్సెసరీస్ మెరుపులు

బనారస్ శారీ గౌన్ వింటేజ్ లుక్‌ని మరింత ఆకర్షణీయంగా కనిపించేలా యాక్సెసరీస్‌లోనూ సరైన శ్రద్ధ వహించారు. కరీనా మూన్ ఇన్‌స్పైర్డ్ ట్రైబల్ గోల్డ్ చెవిపోగులు, నెక్లెస్, కాక్‌టెయిల్ రింగ్‌ని ధరించారు. ఇవన్నీ ఇండియన్ పింక్, ఎమరాల్డ్ గ్రీన్ యాక్రిలిక్ కలర్స్ పై పూతగా వాడినవి. స్టయిలిస్ట్‌లైన రియా కపూర్, షెరీన్‌లు కరీనా వైభవాన్ని అబ్బురపరిచేలా చేయడానికి అత్యంత జాగ్రత్త వహించారు. వారిద్దరి కృషిలో భాగంగా విక్టోరియన్ యుగాన్ని తలపించేలా షీర్ బ్లాక్ నెట్ గ్లోవ్స్ సెట్‌ను కూడా జోడించారు.

మేకప్ హంగులు

మేకప్ ఆర్టిస్ట్ మిక్కీ కాంట్రాక్టర్ కరీనా ముఖానికి కాంస్య రంగు, వంపు తిరిగిన కనుబొమ్మలు, స్మోక్డ్–అవుట్ బ్లాక్ ఐ లైనర్‌తో బ్రౌన్ ఐషాడో, మస్కరాతో నిండిన కనురెప్పలు, పీచ్ బ్లష్‌తో ముఖానికి పర్ఫెక్ట్ స్ట్రోక్స్ జోడించారు. ఆమె బుగ్గలు, పెదాలకు పీచ్ కలర్, నుదిటిపై మెరిసే కాంస్య బిందీ కరీనా మేనికి మెరుపులు అద్దాయి. కరీనా హెయిర్‌ను చిన్న ముడి వేసి, దానిని బన్‌గా స్టైల్ చేసి హెయిర్ స్టైలిస్ట్ మితేష్ రజనీ ఫినిషింగ్ టచ్ జోడించారు.

అంత సమయం లేదు


• శ్రీలీల

"నా జీవితంలోని ముఖ్యమైన విషయాల్లో ప్రేమ, పెళ్లి కూడా ఉన్నాయి. అయితే ప్రస్తుతం వీటికి నా దగ్గర సమయం లేదు" అని అంటున్నారు హీరోయిన్ శ్రీలీల. టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్లలో ఒకరైన శ్రీలీల ప్రేమలో ఉన్నారని, తన స్నేహితుడితో రిలేషన్‌లో ఉన్నారని ఇటీవల ఫిల్మ్‌నగర్‌లో పుకార్లు వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించారు శ్రీలీల. తన ప్రేమ, పెళ్లి గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదని చెబుతున్నారు శ్రీలీల. "చదువు మధ్యలో ఉన్నప్పుడే సినిమా ఇండస్ట్రీలోకి వచ్చాను. వరుసగా సినిమాలు ఒప్పుకుని, బిజీ అయ్యాను. ఇలా నా వ్యక్తిగత జీవితం పై దృష్టి పెట్టలేకపోయాను. ఇప్పుడు సినిమాలు చేస్తూనే చదువుకుంటున్నాను. చెప్పాలంటే ప్రస్తుతం నా దృష్టి మొత్తం చదువు, సినిమాలపైనే ఉంది. వేరే ఆలోచనే లేదు. భవిష్యత్‌లో నా వ్యక్తిగత జీవితం (ప్రేమ, పెళ్లి విషయం అయ్యుండొచ్చు) పై దృష్టి పెడతాను" అని పేర్కొన్నారు శ్రీలీల. ప్రస్తుతం రవితేజ, నితిన్ చిత్రాల్లో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే రెండు బాలీవుడ్ చిత్రాల్లోనూ ఆమె అవకాశం దక్కించుకున్నారనే టాక్ వినిపిస్తోంది.


గుర్బాజ్

అఫ్గాన్ అదిరే విజయం

దక్షిణాఫ్రికాపై తొలిసారి వన్డే సిరీస్ కైవసం ● మెరిసిన గుర్బాజ్, రషీద్ ఖాన్

షార్జా

అంతర్జాతీయ స్థాయిలో సంచలన ప్రదర్శన చేయడం అలవాటుగా మార్చుకున్న అఫ్గానిస్తాన్ క్రికెట్ జట్టు... దక్షిణాఫ్రికాపై తొలిసారి వన్డే సిరీస్ విజయం సాధించింది. మూడు మ్యాచ్‌లో సిరీస్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 177 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. వన్డేల్లో పరుగుల తేడా పరంగా అఫ్గాన్‌కు ఇదే అతి పెద్ద విజయం కావడం విశేషం. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే అఫ్గాన్ 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. ఓపెనర్ రహమానుల్లా గుర్బాజ్ (110 బంతుల్లో 105; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో చెలరేగగా... అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (50 బంతుల్లో 86 నాటౌట్; 5 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపు అర్ధశతకం సాధించాడు. రహమత్ షా (66 బంతుల్లో 50;2 ఫోర్లు) కూడా రాణించడంతో అఫ్గాన్ భారీ స్కోరు చేసింది. సఫారీ బౌలర్లలో ఎన్‌గిడి, బర్గర్, మార్క్‌రమ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 34.2 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ తెంబా బవుమా (38), టోనీ డి జోర్జి (31) ఫర్వాలేదనిపించారు. దీంతో ఒక దశలో 73/0తో పటిష్టంగా కనిపించిన సఫారీ జట్టు... ఆ తర్వాత అఫ్గాన్ స్పిన్ స్టార్ రషీద్ ఖాన్ (5/19) ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. హెండ్రిక్స్ (17), ఎయిడెన్ మార్క్‌రమ్ (21) రెండంకెల స్కోరు చేయగా... ట్రిస్టన్ స్టబ్స్ (5), కైల్ వెరినే (2), ముల్డర్ (2) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్ 5, నంగేయాలియా ఖరోటా నాలుగు వికెట్లు పడగొట్టారు. శుక్రవారమే తన 26వ పుట్టిన రోజు జరుపుకున్న రషీద్ ఖాన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన చివరి వన్డే ఆదివారం జరగనుంది.

1 ఐసీసీలో టాప్-5 జట్టుపై అఫ్గన్ సిరీస్ గెలవడం ఇదే తొలి సారి. గతంలో 13 వన్డే సిరీస్‌లు నెగ్గిన ఆ జట్టు 5 జింబాబ్వేపై, 4 ఐర్లాండ్‌పై, 2 స్కాట్లాండ్‌పై...బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌పై ఒక్కో సిరీస్ విజయం సాధించింది.

7 వన్డేల్లో గుర్బాజ్ సెంచరీ సంఖ్య. అఫ్గనిస్తాన్ తరఫున అత్యధిక సెంచరీలు సాధించిన షహజాద్ (6) రికార్డును అతను సవరించాడు.


రషీద్ ఖాన్

రికీ భుయ్ మెరుపులు

- భారత్ 'డి' రెండో ఇన్నింగ్స్ 244/5
- భారత్ 'బి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్

సాక్షి, అనంతపురం: ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్ (87 బంతుల్లో 90 బ్యాటింగ్; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులు మెరిపించాడు. ఫలితంగా భారత్ 'బి'తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భారత్ 'డి' జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (40 బంతుల్లో 50; 7 ఫోర్లు, ఒక సిక్సర్), సంజూ సామ్సన్ (53 బంతుల్లో 45; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. ఓపెనర్లు దేవదత్ పడిక్కల్ (3), శ్రీకర్ భరత్ (2) విఫలమయ్యారు. 18 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన దశలో భుయ్, శ్రేయస్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరిద్దరూ ఎడాపెడా బౌండ్రీలు బాదుతూ వన్డే తరహాలో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. భారత్ 'బి' బౌలర్లలో ముకేశ్ కుమార్ 3, నవ్‌దీప్ సైనీ రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 210/6తో శనివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'బి' చివరకు 76.2 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌటైంది. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ (140 బంతుల్లో 87; 7 ఫోర్లు, ఒక సిక్సర్) ఆకట్టుకున్నాడు. చివరి వరస ఆటగాళ్లతో కలిసి జట్టుకు విలువైన స్కోరు అందించాడు. భారత్ 'డి' బౌలర్లలో సౌరభ్ కుమార్ 5, అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టారు. నేడు ఆటకు చివరి రోజు కాగా... చేతిలో 5 వికెట్లు ఉన్న భారత్ 'డి' ఓవరాల్‌గా 311 పరుగుల ఆధిక్యంలో ఉంది. రికీ భుయ్‌తో పాటు ఆకాశ్ సేన్ గుప్తా (28 బ్యాటింగ్; 4 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.


రికీ భుయ్

స్కోరు వివరాలు

భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్: 349;
భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: 282
భారత్ 'డి' రెండో ఇన్నింగ్స్: దేవదత్ పడిక్కల్ (సి) జగదీశన్ (బి) నవ్‌దీప్ సైనీ 3; శ్రీకర్ భరత్ (బి) ముకేశ్ కుమార్ 2; రికీ భుయ్ (నాటౌట్) 90; నిశాంత్ సింధు (సి అండ్ బి) నవ్‌దీప్ సైనీ 5; శ్రేయస్ అయ్యర్ (సి) మోహిత్ అవస్థి (బి) ముకేశ్ కుమార్ 50; సంజూ సామ్సన్ (సి) ప్రభుదేశాయ్ (బి) ముకేశ్ కుమార్ 45; ఆకాశ్ సేన్ గుప్తా (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు: 21; **మొత్తం (44 ఓవర్లలో 5 వికెట్లకు) 244. వికెట్ల పతనం:** 1–9, 2–13, 3–18, 4–93, 5–161, **బౌలింగ్:** ముకేశ్ కుమార్ 13–0–80–3; నవ్‌దీప్ సైనీ 11–2–40–2; మోహిత్ అవస్థి 9–2–41–0; నితీశ్ కుమార్ రెడ్డి 3–0–19–0; రాహుల్ చాహర్ 5–0–27–0; ముషీర్ ఖాన్ 3–0–18–0.

రాణించిన రియాన్ పరాగ్

- భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 270/6
- భారత్ 'సి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్

సాక్షి, అనంతపురం: యువ ఆటగాడు రియాన్ పరాగ్ (101 బంతుల్లో 73; 5 ఫోర్లు, ఒక సిక్సర్) రాణించడంతో భారత్ 'సి'తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ చివరి రౌండ్ మ్యాచ్‌లో భారత్ 'ఎ' జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 'ఎ' జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 64 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 270 పరుగులు చేసింది. శాశ్వత్ రావత్ (53; 4 ఫోర్లు, ఒక సిక్సర్), కుమార్ కుషాగ్ర (40 నాటౌట్; 4 ఫోర్లు, ఒక సిక్సర్), కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (34) సత్తాచాటారు. భారత్ 'సి' బౌలర్లలో అన్షుల్ కంబోజ్, గౌరవ్ యాదవ్, మానవ్ సుతార్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 216/7తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'సి' జట్టు చివరకు 234 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్ పోరెల్ (82), పులకిత్ నారంగ్ (41) ఆకట్టుకున్నారు. భారత్ 'ఎ' బౌలర్లలో అవేశ్ ఖాన్, అఖీబ్ ఖాన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా... చేతిలో 4 వికెట్లు ఉన్న భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలుపుకొని ఓవరాల్‌గా 333 పరుగుల ఆధిక్యంలో ఉంది. కుమార్ కుషాగ్రతో పాటు తనుశ్ కోటియాన్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.


రియాన్ పరాగ్

స్కోరు వివరాలు

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: 297;
భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్: 234;
భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్: ప్రథమ్ సింగ్ (సి) రుతురాజ్ గైక్వాడ్ (బి) గౌరవ్ యాదవ్ 11; మయాంగ్ అగర్వాల్ (బి) అన్షుల్ కంబోజ్ 34; తిలక్ వర్మ (సి) రుతురాజ్ గైక్వాడ్ (బి) అన్షుల్ కంబోజ్ 19; రియాన్ పరాగ్ (సి) రుతురాజ్ గైక్వాడ్ (బి) గౌరవ్ యాదవ్ 73; శాశ్వత్ రావత్ (బి) మానవ్ సుతార్ 53; కుమార్ కుషాగ్ర (నాటౌట్) 40; షమ్స్ ములానీ (సి) అన్షుల్ కంబోజ్ (బి) మానవ్ సుతార్ 8; తనుశ్ కోటియాన్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు: 19; **మొత్తం (64 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి) 270. వికెట్ల పతనం:** 1–35, 2–73, 3–94, 4–199, 5–209, 6–234, **బౌలింగ్:** అన్షుల్ కంబోజ్ 16–3–52–2; గౌరవ్ యాదవ్ 14–0– 60–2; విజయ్‌కుమార్ వైశాఖ్ 6–0–36–0; పులకిత్ నారంగ్ 8–1–30–0; మానవ్ సుతార్ 20–0–75–2.

జాతీయ రైఫిల్ కొత్త అధ్యక్షుడిగా కాళికేశ్

న్యూఢిల్లీ: జాతీయ రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) నూతన అధ్యక్షుడిగా కాళికేశ్ నారాయణ్ సింగ్ దేవ్ ఎన్నికయ్యారు. శనివారం ఇక్కడి కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన రైఫిల్ సంఘం జనరల్ బాడీ మీటింగ్, ఎన్నికల్లో ఒరిస్సాకు చెందిన మాజీ ఎంపి కాళికేశ్ 36–21 ఓట్ల తేడాతో ప్రత్యర్థి వి.కె.ధల్‌పై స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందారు. కొన్నాళ్లుగా కాళికేశ్ ఎన్‌ఆర్‌ఏఐ రోజువారీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. జాతీయ స్పోర్ట్స్ కోడ్ ప్రకారం జాతీయ క్రీడా సమాఖ్యల్లో ఎవరైనా గరిష్టంగా 12 ఏళ్లకు మించి పదవుల్లో ఉండటానికి వీలు లేదు. దీంతో 2010 నుంచి 2022 వరకు పలు దఫాలు అధ్యక్షుడిగా ఎన్నికైన రణీందర్ సింగ్ గతేడాది కేంద్ర క్రీడాశాఖ ఆదేశాల మేరకు రాజీనామా చేశారు. అప్పటినుంచి సీనియర్ ఉపాధ్యక్షుడైన కాళికేశ్ జాతీయ రైఫిల్ సంఘం వ్యవహారాలను చక్కబెట్టారు. తాజా ఎన్నికతో ఆయన 2025 వరకు అధ్యక్ష పదవిలో ఉంటారు. ఆయన తాత్కాలిక బాధ్యతలు నిర్వహించిన హయాంలోనే పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్లు మూడు కాంస్య పతకాలు సాధించారు. అంతకుముందు జరిగిన రియో–2016, టోక్యో–2020 ఒలింపిక్స్‌లో భారత షూటర్లు ఒక్క పతకం కూడా గెలుపొందలేకపోయారు.



నోరిస్‌కు పోల్ పొజిషన్



సింగపూర్ గ్రాండ్‌ప్రి

సింగపూర్: ఫార్ములావన్ సింగపూర్ గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం నిర్వహించిన క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో నోరిస్ అందరి కంటే వేగంగా, అందరికంటే ముందుగా గమ్యాన్ని చేరుకున్నాడు. నోరిస్ 1 గంట 29 నిమిషాల 525 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానం దక్కించుకోగా... రెడ్ బుల్ రేసర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 గంట 29 నిమిషాల 728 సెకన్లు) రెండో స్థానంలో నిలిచాడు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన డ్రైవర్ల మధ్య కేవలం 0.203 సెకన్ల తేడా మాత్రమే ఉంది. బ్రిటన్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్; 1 గంట 29 నిమిషాల 841 సెకన్లు) మూడో స్థానంలో నిలిచాడు. జార్జి రసెల్ (మెర్సిడెస్; 1 గంట 29 నిమిషాల 867 సెకన్లు), ఆస్కార్ పీస్ట్రి (మెక్‌లారెన్; 1 గంట 29 నిమిషాల 953 సెకన్లు) వరుసగా నాలుగో, ఐదో స్థానాలు దక్కించుకున్నారు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును నోరిస్ పోల్ పొజిషన్‌తో ప్రారంభించనున్నాడు. 24 రేసుల సీజన్‌లో సింగపూర్ గ్రాండ్ ప్రి 18వ రేసు కాగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం నెదర్లాండ్స్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ 313 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. గత కొన్ని రేసులుగా నిలకడ కొనసాగిస్తున్న నోరిస్ 254 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. వీరిద్దరి మధ్య 59 పాయింట్ల అంతరం ఉంది. మరో ఏడు రేసులు మిగిలుండగా... ఈ ఏడాది డ్రైవర్స్ చాంపియన్‌షిప్ ట్రోఫీ కైవసం చేసుకునే దిశగా ఆదివారం జరగనున్న సింగపూర్ గ్రాండ్ ప్రి కీలకం కానుంది.

యువభారత్ శుభారంభం

ఆస్ట్రేలియా అండర్–19 జట్టుపై విజయం


కార్తికేయ

పుదుచ్చేరి: ఆల్‌రౌండర్ కేపీ కార్తికేయ అటు బంతితో, ఇటు బ్యాట్‌తో సత్తా చాటడంతో ఆస్ట్రేలియా అండర్–19 జట్టుపై భారత అండర్–19 జట్టు విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన యూత్ వన్డేలో మహమ్మద్ అమాన్ సారథ్యంలోని భారత అండర్–19 జట్టు 7 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా అండర్–19 జట్టు 49.4 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌటైంది. స్టీవెన్ హోగన్ (42), రిలీ కింగ్‌సెల్ (36) రాణించారు. యువ భారత బౌలర్లలో మహమ్మద్ ఇనాన్ 4, కేపీ కార్తికేయ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత అండర్–19 జట్టు 36 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసింది. కేపీ కార్తికేయ (99 బంతుల్లో 85 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ అమాన్ (58 నాటౌట్; 5 ఫోర్లు) అజేయ హాఫ్ సెంచరీలతో జట్టును గెలిపించారు. కార్తికేయకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య సోమవారం రెండో మ్యాచ్ జరగనుంది.

సెమీఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ

న్యూఢిల్లీ: భారత డబుల్స్ ఆటగాడు యూకీ బాంబ్రీ ఏటీపీ టోర్నీ చెంగ్డూ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. యూకీ బాంబ్రీ – ఫ్రాన్స్ ప్లేయర్ అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడి చక్కని పోరాట పటిమతో తమకన్నా మెరుగైనా ర్యాంకింగ్ ప్లేయర్లను కంగుతినిపించింది. పురుషుల డబుల్స్‌లో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రి–ఒలివెట్టి జంట 5–7, 6–3, 12–10తో ఈక్వెడార్‌కు చెందిన గాంజాలో ఎస్కోబార్–డీగో హిదాల్గో జోడీపై చెటడోడ్చి గెలిచింది. ఆరంభ సెట్‌లో వెనుకబడిన భారత్–ఫ్రాన్స్ ద్వయం రెండో సెట్‌లో అసాధారణ ఆటతీరుతో ఈక్వెడార్ జంటకు ఏమాత్రం అవకాశమివ్వకుండా సెట్‌ను కైవసం చేసుకొంది. కీలకమైన ఆఖరి సెట్ ఊహించని విధంగా సాగింది. ఇరు జోడీలు ధీటుగా ఆడటంతో ప్రతి పాయింట్ కోసం పెద్ద పోరాటం తప్పలేదు. చివరకు 12–10తో యూకీ బాంబ్రి జోడీ సెట్‌తో పాటు మ్యాచ్ గెలిచింది. ఆదివారం జరిగే సెమీఫైనల్లో భారత్–ఫ్రాన్స్ జోడీ... రెండో సీడ్ ఇవాండ్ డొడిగ్ (క్రొయేషియా)–రాఫెల్ మాటోస్ (బ్రెజిల్) జంటను ఎదర్కొంటుంది.



సెమీస్‌లో జీవన్ ద్వయం



హాంగ్జౌ: భారత టెన్నిస్ జంట జీవన్ నెడుంజెళియన్ – ప్రశాంత్ ఏటీపీ టోర్నీ హాంగ్జౌ ఓపెన్ డబుల్స్‌లో సెమీస్‌లోకి అడుగు పెట్టింది. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో నెడుంజెళియన్ –ప్రశాంత్ 6–7 (4/7), 7–6 (8/6), 10–8తో రెండో సీడ్ జులియన్ కాశ్ –లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్) జోడీపై చెమటోడ్చి గెలిచారు. మ్యాచ్ ఆరంభం నుంచి పోటాపోటీగా జరిగిన ఈ పోరులో టైబ్రేక్‌కు దారితీసిన తొలిసెట్‌ను భారత ద్వయం కోల్పోయింది. తర్వాత రెండో సెట్‌లో తమకన్నా మెరుగైనా ర్యాంకు జంటతో దీటుగా పోరాటం చేసింది. వరుసగా ఈ సెట్ కూడా టైబ్రేక్ దాకా వెళ్లినా... భారత జోడీ ఈ సెట్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా గెలిచి పోటీలో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లోనూ ఇరు జోడీలు ఏమాత్రం తగ్గలేదు. నువ్వానేనా అన్నట్లు ప్రతి పాయింట్ కోసం శ్రమించాయి. చివరకు భారత ద్వయం 10–8తో గెలిచి ఊపిరి పీల్చుకుంది. రెండు గంటల పాటు ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. సెమీస్‌లో మూడో సీడ్ ఎరియెల్ బెహర్ (ఉరుగ్వే)–రాబర్ట్ గెలొవే (అమెరికా) జంటతో భారత ద్వయం తలపడుతుంది.

జంషెడ్‌పూర్ విజయం

ఇండియన్ సూపర్ లీగ్



జంషెడ్‌పూర్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ కీలక విజయాన్ని నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో జంషెడ్‌పూర్ 3–2 గోల్స్ తేడాతో ముంబై సిటీ ఎఫ్‌సీని ఓడించింది. జంషెడ్‌పూర్ తరఫున 36వ నిమిషంలో జె.ముర్రే...44వ, 50వ నిమిషాల్లో జేవీ హెర్నాండెజ్ గోల్స్ నమోదు చేశారు. ముంబై ఆటగాళ్లలో ఎన్.కరేలిస్ 18వ నిమిషంలో, వాన్ నీఫ్ 77వ నిమిషంలో గోల్స్ సాధించారు. కోల్‌కతాలో మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్, ఎఫ్‌సీ గోవా మధ్య జరిగిన మరో మ్యాచ్ 1–1తో డ్రాగా ముగిసింది. మొహమ్మదాన్ తరఫున 66వ నిమిషంలో పెనాల్టీ ద్వారా ఎ.గోమెజ్ గోల్ కొట్టగా...గోవా ఆటగాళ్లలో ఎ.సాదికు (90+4) ఏకైక గోల్ సాధించాడు. కొచ్చిలో నేడు జరిగే మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీతో కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీ తలపడుతుంది.



ఓటు వేసిన శ్రీలంక కోచ్ జయసూర్య

టెస్టు మధ్యలో విశ్రాంతి రోజు?

శ్రీలంకలో ఎన్నికలే కారణం

గాలే: ఆధునిక క్రికెట్‌లో రిజర్వ్ డే గురించే అభిమానులకు తెలుసు! ప్రపంచకప్ మెగా ఈవెంట్లకు, మేజర్ టోర్నీల ఫైనల్స్‌కు రిజర్వ్ డేలు ఉండటం సర్వసాధారణం. అయితే విశ్రాంతి రోజు మాత్రం అంతగా తెలీదు. పైగా టెస్టు మ్యాచ్ మధ్యలో ఇచ్చే విశ్రాంతి దినం మూడు దశాబ్దాల క్రితం ఉండేది. కానీ ప్రస్తుత అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత అరుదు. ఇలాంటి అరుదైన ఘటనే ప్రస్తుతం శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టెస్టులో జరిగింది. గాలేలో 18న మొదలైన తొలి టెస్టులో మూడు రోజుల ఆట ముగిసింది. శనివారం నాలుగో రోజు ఆట ఉండేది. కానీ విశ్రాంతి రోజుగా ప్రకటించడంతో తర్వాతి రెండు రోజుల ఆటను ఆది, సోమవారాల్లో నిర్వహిస్తారు. ఇదేంటి కొత్తగా విశ్రాంతి దినమెందుకు అంటే... శ్రీలంకలో అధ్యక్ష ఎన్నికలే కారణం. రాజపక్స, గొటబాయ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో దివాళా తీసిన శ్రీలంక... తదనంతరం నెలకొన్న రాజకీయ అస్థిరత పరిస్థితుల వల్ల తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. ఇప్పుడు ఆ సంక్షోభం తర్వాత జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు కావడంతో స్వదేశంలోనే ఉన్న శ్రీలంక క్రికెటర్లు, సహాయ సిబ్బంది ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు లంక క్రికెట్ బోర్డు రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో విశ్రాంతి రోజును కూడా షెడ్యూలులో చేర్చింది. దీంతో లంక క్రికెటర్లంతా వారి వారి సొంత ఊర్లలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసి అధ్యక్ష ఎన్నికల్లో భాగం చేసింది. లంక టీమ్‌లో కామెందు మెండిస్ ఒక్కటే గాలేకు చెందిన వాడు. అతను స్థానికంగానే తన ఓటు హక్కు వినియోగించుకోనుండగా...మిగతావారంతా స్వస్థలాలకు పయనమయ్యారు.

రీ షెడ్యూల్ చేయలేరా!

ఇదంతా ఎందుకు తొలిటెస్టును రీ షెడ్యూల్ చేస్తే పోలా... అనే ఉచిత సలహాలెన్నో వస్తాయి. కానీ ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు సంబంధించిన షెడ్యూలు చాలా ముందుగా ఖరారైంది. న్యూజిలాండ్ కూడా బిజీ షెడ్యూలుతోనే ఉపఖండం పర్యటనకు వచ్చింది. లంక కంటే ముందు అఫ్ఘానిస్తాన్‌కు సంబంధించి భారత్‌లో ఏకైక టెస్టు కోసం నోయిడాకు వచ్చింది. దురదృష్టవశాత్తు ఆ మ్యాచ్ వర్షార్పణమైంది. లంక పర్యటన తర్వాత కివీస్ తిరిగి భారత్‌కు వెళ్లి మూడు టెస్టుల సిరీస్‌లో ఆడాల్సివుంది. ఇలాంటి పరిస్థితుల్లో లంకలో టెస్టును రీషెడ్యూల్ చేయడం అసాధ్యం కాబట్టే మధ్యలో విశ్రాంతి రోజు ఇచ్చారు. క్రికెట్ చరిత్రలో ఓ మ్యాచ్ మధ్యలో ఇలా రెస్ట్ ఇవ్వడం ఇదే కొత్తకాదు. 1990 కంటే పూర్వం టెస్టుల్లో తరచూ విశ్రాంతి రోజులుండేవి. ఆ తర్వాత చాలా ఏళ్ల తెరమరుగైన 'రెస్ట్ డే' 2008లో బంగ్లాదేశ్‌లో తెరమీదికొచ్చింది. బంగ్లాదేశ్‌లోనే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బంగ్లా, శ్రీలంక టెస్టు మ్యాచ్ మధ్యలో విశ్రాంతి ఇచ్చారు.



స్మృతి ఇరానీకి ఢిల్లీ పగ్గాలు?

ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీ ఎత్తుగడ ● ఆమెనే ఢిల్లీ సీఎం అభ్యర్థిగా పెడతారని ప్రచారం

ఇప్పటికే ఢిల్లీ సభ్యత్వ నమోదు బాధ్యతలు అప్పగింత ● దక్షిణ ఢిల్లీలో ఇల్లు సైతం కొనుగోలు

సాక్షి, న్యూఢిల్లీ

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా..నూతన ముఖ్యమంత్రి ఆతిశి ప్రమాణస్వీకారం.. వచ్చే ఏడాది ఆరంభంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల పరిణామాల నేపథ్యంలో అప్రమత్తమైన బీజేపీ అధిష్టానం ఢిల్లీ పీఠాన్ని అధిరోహించాలన్న గట్టి పట్టుదలతో ముందుకు కదులుతోంది. వచ్చే ఎన్నికల్లో ప్రజల్లోనే తన నిజాయితీని నిరూపించుకొని మళ్లీ ముఖ్యమంత్రిని అవుతానంటూ కేజ్రీవాల్ ఇప్పటికే ఎన్నికల శంఖారావం పూరించడంతో ఆయనకు గట్టి పోటీనిచ్చే నేతను రంగంలోకి దించే వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగానే మాజీ కేంద్రమంత్రి, ఫైర్‌బ్రాండ్ స్మృతి ఇరానీని ఢిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా తెరపైకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఢిల్లీ సభ్యత్వ నమోదు బాధ్యతలను ఆమెకు కట్టబెట్టిన కమలదళం, మున్ముందు మరిన్ని బాధ్యతలు కట్టబెట్టాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

పీఠమెక్కాలన్న కసితో బీజేపీ..

2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను ఎదుర్కొనే క్రమంలో బీజేపీ మాజీ ఐపీఎస్ కిరణ్‌బేడీని తమ ముఖ్యమంత్రిగా ప్రకటించి ఎన్నికల్లో పోటీ చేసింది. ఈ ఎన్నికల్లో కిరణ్‌బేడీ ఏమాత్రం ప్రభావం చూపకపోగా, ఆమె నాయకత్వాన్ని ఏమాత్రం లెక్కపెట్టని బీజేపీ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలో మౌనం వహించాయి. దీంతో ఆ ఎన్నికల్లో బీజేపీ 70 స్థానాలకు గానూ కేవలం 3 స్థానాలు మాత్రమే గెలుచుకోగలిగింది. ఆ తర్వాత 2020 ఎన్నికల్లో సీఎం అభ్యర్థిని ప్రకటించకుండానే బీజేపీ పోటీకి దిగింది. ఈ ఎన్నికల్లోనూ బీజేపీ ఏమాత్రం ప్రభావం చూపలేదు. కేవలం 8 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అదే 2019, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఢిల్లీలోని ఏడింటికి ఏడు సీట్లు గెలుచుకున్న బీజేపీ.. అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి బోల్తా పడుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆప్‌కు తిరిగి అధికారం ఇవ్వకూడదన్న ఉద్దేశంతో ఉన్న బీజేపీ ముందునుంచే ఎన్నికల ప్రణాళికలను అమలు చేసే పనిలో పడింది. ఇందులో భాగంగానే స్మృతి ఇరానీని ఢిల్లీ రాజకీయాల్లో క్రియాశీలం చేసే పనిలో పడింది. ఢిల్లీ బీజేపీకి చెందిన 14 జిల్లా యూనిట్లలోని ఏడింటిలో సభ్యత్వ నమోదు బాధ్యతలను పార్టీ ఆమెకు కట్టబెట్టింది. ఈ నెల 2వ తేదీ నుంచి ఢిల్లీలోని ప్రతి వార్డులో ఆమె విస్తృతంగా పర్యటిస్తున్నారు. సభ్యత్వ కార్యక్రమాలలో బూత్ స్థాయి కార్యకర్తల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, పార్టీని అట్టడుగు స్థాయిలో బలోపేతం చేయడంపై ఆమె దృష్టి పెట్టారు. దక్షిణ ఢిల్లీలో ఇప్పటికే ఆమె ఒక ఇంటిని సైతం కొనుగోలు చేశారని పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి.

గత ఎన్నికల్లో అమేథీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీలాల్ శర్మ చేతిలో ఓటమి అనంతరం ఎక్కడా కనిపించని ఆమెకు తాజాగా ఢిల్లీ బాధ్యతలు కట్టబెట్టారనే చర్చ జరుగుతోంది. ఢిల్లీలో ఇప్పటికే బీజేపీ తరఫున దివంగత నేత సుష్మా స్వరాజ్ కుమార్తె, ఎంపీ బాసూరీ స్వరాజ్ క్రియాశీలంగా ఉన్నప్పటికీ ఆమె తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆమెతో పాటు ఎంపీలు మనోజ్ తివారీ, ప్రదీప్ ఖండేల్‌వాల్, కామజీత షెరావత్, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా వంటి సీనియర్లు ముఖ్యమంత్రి ముఖాలుగా ఉన్నప్పటికీ వాక్చాతుర్యం, గాంధీ కుటుంబ వ్యతిరేక భావజాలమున్న ఇరానీనే సరైన మార్గమని బీజేపీ భావిస్తోందని అంటున్నారు. ఆప్ కొత్త ముఖ్యమంత్రి ఆతిశిని ఎదుర్కొనేందుకు ఇరానీ సరితూగుతారనే వ్యాఖ్యలు వస్తున్నాయి. ఇందులో భాగంగానే ఎన్నికల వ్యూహరచన, ప్రచార ప్రణాళిక, అభ్యర్థుల ఎంపిక, ప్రచారానికి నాయకత్వం వహించే బాధ్యతను ఆమెకు అప్పగించవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



పాపం పోలార్ బేర్!

దారితప్పి జనావాసాల్లోకి
- కాల్చి చంపిన పోలీసులు
- ఐస్‌లాండ్‌లో విషాద ఘటన

అది అరుదైన ధ్రువపు ఎలుగుబంటి. దారి తప్పి ఐస్‌లాండ్ సముద్రతీరంలోని మారుమూల జనావాసంలోకి చొరబడింది. ఓ ఇంటి తలుపు తట్టింది. దాని భారీ ఆకారం చూసి యజమానురాలు హడలిపోయింది. తలుపులన్నీ లోపల్నుంచి గట్టిగా బిగించుకుని పై అంతస్తుకు పారిపోయింది. అక్కన్నుంచి తన కుమార్తె ద్వారా పోలీసులకు సమాచారమిచ్చింది. వాళ్లకూ ఏం చేయాలో పాలుపోక సమీపంలోని పర్యావరణ సంస్థకు ఫోన్ చేశారు. దాన్ని తిరిగి క్షేమంగా గ్రీన్‌లాండ్ చేర్చడం తమ వల్ల కాదంటూ వాళ్లు చేతులెత్తేశారు. దాంతో మరో దారిలేక ఎలుగుబంటిని పోలీసులు కాల్చి చంపేశారు! జనం క్షేమం దృష్ట్యా అయిష్టంగానే ఈ పని చేయాల్సి వచ్చిందంటూ ఎంతగానో బాధపడ్డారు. ఈ హృదయ విదారక ఘటన ఐస్‌లాండ్ వాయవ్య ప్రాంతంలోని మారుమూల పల్లె ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. దాని మృతదేహాన్ని పరిశోధనల నిమిత్తం తరలించారు. చుట్టుపక్కల ఇంకేమన్నా ఉన్నాయేమోనని హెలికాప్టర్ ద్వారా పరిసరాలన్నింటినీ జల్లెడ పట్టారు.

ఎనిమిదేళ్ల తర్వాత తొలిసారి...

ఐస్‌లాండ్‌లో ధ్రువపు ఎలుగుబంట్లు ఉండవు. అవి ఆ దేశంలో కన్పించడం ఎనిమిదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. వాటి ప్రధానావాసం గ్రీన్‌లాండ్. అక్కడ భారీ మంచు పలకలు విరిగినప్పుడు వాటితో పాటుగా ఇలా కొట్టుకొస్తుంటాయి. ఐస్‌లాండ్‌లో ధ్రువపు ఎలుగుబంట్లు రక్షిత జంతువులు. సముద్రాల్లో వాటిని చంపడం తీవ్ర నేరం. మనుషులకు, ఇతర జీవాలకు ముప్పుగా పరిణమించినప్పుడు మాత్రం చంపవచ్చు. ధ్రువపు ఎలుగుబంట్లు మనుషులపై దాడి చేయడం అత్యంత అరుదు. 1870 నుంచి 2014 మధ్య గ్రీన్‌లాండ్‌తో పాటు కెనడా, నార్వే, రష్యా, అమెరికాల్లో అవి 20 మందిని చంపేశాయి. 63 మందిని గాయపరిచాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల ధ్రువాల్లో మంచు విపరీతంగా కరిగిపోతుండటంతో ధ్రువపు ఎలుగుబంటి వంటి అరుదైన ప్రాణులు ఇలా జనావాసాల్లోకి చొచ్చుకొస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

న్యూజిలాండ్ పైలట్‌కు 19 నెలల తర్వాత విముక్తి

సురక్షితంగా విడిచిపెట్టిన ఇండోనేసియాలోని పపువా రెబల్స్


పపువా రెబల్స్ మధ్య బందీగా మెహర్టెన్స్

జకార్తా: న్యూజిలాండ్ పైలట్‌ను ఏడాదిన్నర క్రితం నిర్బంధంలోకి తీసుకున్న ఇండోనేసియాలోని పపువా ప్రాంత వేర్పాటువాద గ్రూపు శనివారం విడిచిపెట్టింది. క్రైస్ట్‌చర్చ్ వాసి ఫిలిప్ మార్క్ మెహర్టెన్స్(38) ఇండోనేసియాకు చెందిన సుశి ఎయిర్ విమానయాన సంస్థలో పైలట్‌గా ఉన్నారు. మారుమూల పపువా ప్రాంతంలోని విమానాశ్రయంలో ఉన్న ఫిలిప్‌ను రెబల్స్ 2023 ఫిబ్రవరి 7వ తేదీన నిర్బంధంలోకి తీసుకున్నారు. 2023 ఏప్రిల్‌లో మెహర్టెన్స్‌ను విడిపించేందుకు ప్రయత్నించిన ఇండోనేసియా సైనికులు ఆరుగురిని రెబల్స్ చంపేశారు. దీంతో, అప్పటి నుంచి చర్చి మధ్యవర్తిత్వంతో ఇండోనేసియా ప్రభుత్వం, ఇతర విభాగాలు రెబల్స్‌తో చర్చలు జరుపుతూ వచ్చాయి. ఎట్టకేలకు చర్చలు సఫలమై మెహర్టెన్స్ బయటకు రాగలిగారు. ఇది చాలా క్లిష్టమైన వ్యవహారమంటూ ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో సైతం వ్యాఖ్యానించడం గమనార్హం. మెహర్టెన్స్ విడుదలకు సంబంధించిన వివరాలను ఎవరూ బహిర్గతం చేయలేదు. రెబల్స్ చెర నుంచి విముక్తి లభించిన అనంతరం మెహర్టెన్స్ పపువాలోని తిమికా నుంచి జకార్తాకు చేరుకున్నారు. అతడి కుటుంబం బాలిలో ఉంటోంది. ఇండోనేసియా సంస్కృతి, జాతిపరంగా పపువా ప్రజలు విభిన్నంగా ఉంటారు. న్యూ గినియాలోని పశ్చిమ భాగమైన పపువా గతంలో డచ్ పాలకుల చేతుల్లో ఉండేది. 1969లో ఐరాస సారథ్యంలో పపువాలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి ఇండోనేసియా కలిపేసుకుంది. ఇదంతా బూటకమంటున్న వేర్పాటువాదులు స్వతంత్రం కోసం సాయుధ పోరాటం సాగిస్తున్నారు. గతేడాది నుంచి ఈ పోరాటం తీవ్రరూపం దాల్చింది.


విడుదలయ్యాక..

యువతిని 30 ముక్కలుగా నరికి..

దొడ్డబళ్లాపురం: ఓ యువతిని చంపి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో దాచిన భయానక ఘటన బెంగళూరులో వెలుగులోకి వచ్చింది. వయ్యాలికావల్ పోలీస్‌స్టేషన్ పరిధి మల్లేశ్వరంలోని ఓ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో శనివారం స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి సోదా చేయగా ఫ్రిజ్‌లో కుక్కిన మహిళ శరీర భాగాలు 30కి పైగా బయటపడ్డాయి. వారం క్రితం ఈ దారుణం చోటుచేసుకున్నట్లు భావిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మహాలక్ష్మి (29)అనే బాధితురాలు కర్ణాటకలో కొంతకాలంగా ఉంటున్నారని ఏసీపీ సతీశ్ కుమార్ చెప్పారు. సింగిల్ బెడ్ రూం ఇంట్లో ఆమె ఒక్కతే ఉంటున్నారని తెలిపారు. ఆమె వివరాలను సేకరించామని, అయితే ఇప్పుడే వాటిని బయటపెట్టలేమని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. పరిచయమున్న వారే దారుణానికి పాల్పడి ఉంటారని అనుమానాలున్నాయి. ఇలా ఉండగా, మహాలక్ష్మి హత్యకు గురైన విషయం తెలిసిన ఆమె భర్త కూడా అక్కడికి చేరుకున్నాడు. మహాలక్ష్మి మాల్‌లో పని చేస్తుండగా, అతడు బెంగళూరుకు సమీపంలోని ఆశ్రమంలో ఉద్యోగి అని సమాచారం.

బెంగాల్ కాంగ్రెస్ చీఫ్‌గా శుభాంకర్ సర్కార్

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శుభాంకర్ సర్కార్ నియమితులయ్యారు. సీనియర్ నేత అధిర్ రంజన్ చౌదరి లోక్‌సభ ఎన్నికల అనంతరం పీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో శుభాంకర్‌ను నియమిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం ఆదేశాలు జారీచేశారు. ఏఐసీసీ కార్యదర్శిగా శుభాంకర్ అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరంలలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో తృణమూల్ కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్నప్పటికీ.. అధిర్ హయాంలో రాష్ట్రస్థాయిలో టీఎంసీతో తీవ్ర విభేదాలు ఉండేవి.

సీఎం పీఠంపై మహిళా శక్తి

దేశ చరిత్రలో 17వ మహిళా ముఖ్యమంత్రి ఆతిశి

న్యూఢిల్లీ:

ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఆతిశి దేశ చరిత్రలో 17వ మహిళా ముఖ్యమంత్రి కావడం విశేషం. అంతేకాదు ఇప్పటిదాకా ఢిల్లీ సీఎంగా పనిచేసిన మహిళల్లో అత్యంత పిన్నవయస్కురాలు అతిశి. ఆమె వయసు కేవలం 43 ఏళ్లు. ప్రస్తుతం దేశంలో ఉన్న మహిళా సీఎంలలో రెండో సీఎం ఆతిశి. పశ్చిమ బెంగాల్ సీఎంగా మమతా బెనర్జీ కొనసాగుతున్న సంగతి తెలిసిందే.


మొదటి వరుస: షీలా దీక్షిత్, ఉమా భారతి, ఆనందీబెన్ పటేల్, మెహబూబా ముఫ్తీ, జానకీ రామచంద్రన్, మాయావతి
రెండో వరుస: నందినీ శతపథి, అన్వర తైమూర్, రబ్డీదేవి, శశికళా కకోడ్కర్, వసుంధరా రాజె సింధియా
మూడో వరుస: సుష్మా స్వరాజ్, సుచేతా కృపలానీ, రాజీందర్ కౌర్, మమతా బెనర్జీ, జయలలిత

మహిళా ముఖ్యమంత్రులు

సుచేతా కృపలానీ

స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రిగా సుచేతా కృపలానీ రికార్డు సృష్టించారు. ఆమె 1963 నుంచి 1967 దాకా ఉత్తరప్రదేశ్ సీఎంగా పనిచేశారు.

నందిని శతపథి

దేశంలో రెండో మహిళా సీఎం నందిని శతపథి. 1972 నుంచి 1976 వరకు ఒడిశా ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఇందిరా గాంధీకి ఆమె అత్యంత సన్నిహితురాలు.

శశికళ కకోద్కర్

మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ నేత శశికళ కకోద్కర్ 1973 నుంచి 1979 దాకా కేంద్ర పాలిత ప్రాంతమైన గోవా, డయ్యూడామన్‌కు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 1987లో గోవాకు రాష్ట్ర హోదా లభించింది.

అన్వర తైమూర్

దేశంలో మొదటి ముస్లిం మహిళా ముఖ్యమంత్రిగా అన్వర తైమూర్ రికార్డుకెక్కారు. ఆమె 1980 నుంచి 1981 దాకా అస్సాం సీఎంగా పనిచేశారు.

వి.ఎన్.జానకి రామచంద్రన్

ప్రఖ్యాత తమిళ నటుడు, దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ భార్య వి.ఎన్.జానకి రామచంద్రన్ తమిళనాడు తొలి మహిళా సీఎంగా చరిత్ర సృష్టించారు. 1988లో భర్త ఎంజీఆర్ మరణం తర్వాత కేవలం 23 రోజులపాటు సీఎంగా పనిచేశారు.

జె.జయలలిత

ఎంజీఆర్ శిష్యురాలు, డీఎంకే నేత, ప్రముఖ సినీ నటి జె.జయలలిత ఆరు పర్యాయాలు తమిళనాడు సీఎంగా సేవలందించారు. మొత్తం 14 ఏళ్లకుపైగా ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు.

మాయావతి

బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత మాయావతి నాలుగు పర్యాయాలు ఉత్తరప్రదేశ్ సీఎంగా వ్యవహరించారు. మొత్తం ఏడు సంవత్సరాల పాటు పదవిలో ఉన్నారు.

రాజీందర్ కౌర్ భట్టాల్

పంజాబ్‌కు ఇప్పటిదాకా ఏకైక మహిళా సీఎంగా రాజీందర్ కౌర్ భట్టాల్ రికార్డుకెక్కారు. ఆమె 1996 నుంచి 1997 దాకా పంజాబ్ సీఎంగా పనిచేశారు.


ఆతిశి

రబ్రీ దేవి

ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ జైలుపాలు కావడంతో ఆయన భార్య రబ్రీ దేవి 1997లో బిహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బిహార్‌లో ఇప్పటివరకు ఏకైక మహిళా సీఎం రబ్రీ దేవి.

సుష్మా స్వరాజ్

ఢిల్లీ తొలి మహిళా సీఎం సుష్మా స్వరాజ్. 1998లో ఆమె 52 రోజులపాటు ఈ పదవిలో కొనసాగారు.

షీలా దీక్షిత్

ఢిల్లీ రెండో మహిళా సీఎం షీలా దీక్షిత్. ఢిల్లీలో అత్యధిక కాలం పనిచేసిన సీఎంగా రికార్డు నెలకొల్పారు. ఆమె 1998 నుంచి 2013 దాకా 15 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగారు.

ఉమా భారతి

రామ జన్మభూమి ఉద్యమ నేత, ఫైర్‌బ్రాండ్ ఉమా భారతి 2003 నుంచి 2004 దాకా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించారు.

వసుంధర రాజే

గ్వాలియర్ మహారాజు జీవాజిరావు సింధియా, విజయరాజే సింధియా దంపతుల కుమార్తె అయిన వసుంధర రాజే రెండు పర్యాయాల్లో 10 సంవత్సరాలపాటు రాజస్తాన్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

మమతా బెనర్జీ

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ 2011 నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు.

ఆనందిబెన్ పటేల్

గుజరాత్‌కు ఏకైక మహిళా ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్. నరేంద్ర మోదీ తర్వాత ఆమె 2014 నుంచి 2016 దాకా సీఎంగా పనిచేశారు.

మహబూబా ముఫ్తీ

పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) నేత మహబూబా ముఫ్తీ జమ్మూకశ్మీర్ తొలి మహిళా సీఎంగా చరిత్ర సృష్టించారు. 2016 నుంచి 2018 వరకు సీఎంగా వ్యవహరించారు.

ఆతిశి

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయడంతో నూతన ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు.

జాతీయ సైన్స్ విధానాన్ని మొదటిసారి ఎప్పుడు ప్రకటించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి ద్వారానే ఒక దేశ సామాజిక, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. సైన్స్ అండ్ టెక్నాలజీ రెండూ భావి భారత్‌కు మూలస్తంభాల వంటివని భారత మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత ఆలస్యం చేయకుండా ఈ రంగంలో అనేక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.
- హోమి జహంగీర్ బాబా, విక్రం సారాబాయ్, ఎం.ఎస్.స్వామినాథన్ వంటి వారిని నెహ్రూ ప్రోత్సహించారు. వీరిలో ఒక్కొక్కరు ఒక్కో రంగంలో దిక్సూచిగా వ్యవహరిస్తూ భారత శాస్త్ర, సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేశారు. అణుశక్తి రంగానికి హోమి బాబా పునాది వేయగా, అంతరిక్ష రంగానికి విక్రం సారాబాయ్, వ్యవసాయ రంగానికి ఎం.ఎస్. స్వామినాథన్ మూలస్తంభాలుగా నిలిచారు. వీరికి అదనంగా భారత శాస్త్ర, సాంకేతిక రంగ ప్రాధాన్యతను ప్రపంచవ్యాప్తంగా చాటిన వారిలో శ్రీనివాస రామానుజన్, జగదీశ్ చంద్ర బోస్, సత్యేంద్రనాథ్ బోస్, పి.సి.రే, మేఘానంద్ సాహా, సర్ సి.వి. రామన్, బీర్బల్ సహానీ, హర్ గోబింద్ ఖురానా, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, రాజా రామన్న, ఏపీజే అబ్దుల్‌కలాం, పి.ఎం.భార్గవ, పి.మహేశ్వరి, వెంకట రామకృష్ణన్ ప్రముఖులు. అయితే ప్రాచీన కాలంలోనే భారతదేశ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. అంతరిక్షం, గణితం, వైద్య, లోహ సంగ్రహణ శాస్త్రంలో భారతీయులు అద్భుతవిజయాలను సాధించారు. ఆర్యభట్ట, భాస్కర, బ్రహ్మగుప్త, ధన్వంతరి, ఆచార్య నాగార్జునుడు వంటి వారి కృషి అద్వితీయం. ప్రస్తుత కాలంలో భారత్‌లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చెప్పుకోదగ్గ విజయాలు నమోదు కావట్లేదు. గత మూడు దశాబ్దాలుగా శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిపై భారత్ పెట్టుబడులు చాలా తక్కువ. 2010 నాటికి భారత్ శాస్త్ర, సాంకేతిక రంగంలో 13 బిలియన్ డాలర్లు ఖర్చు చేయగా, చైనా 135 బిలియన్ డాలర్లకుపైగా ఖర్చు చేసింది. టెక్నాలజీలో అభివృద్ధి ద్వారా మాత్రమే దేశం వివిధ రంగాల్లో ముఖ్యంగా శక్తి, ఆహార పోషణ, పర్యావరణ, తాగునీరు, ఆరోగ్య రంగాల్లో భద్రత సాధించడం సాధ్యమవుతుంది. అంతేకాకుండా దేశంలో జీవ వైవిధ్యాన్ని మానవాళి శ్రేయస్సుకు ఉపయోగించవచ్చు.
- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అన్ని సంబంధిత అంశాలను ప్రతిబింబించే ఒక జాతీయ విధానం అవసరం. దీన్ని గుర్తించి 1958లో మొదటిసారిగా జాతీయ సైన్స్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీర్మానించింది. ఆ తర్వాత అవసరాలు, సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ఈ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా 1983లో ఒకసారి, 2003లో మరోసారి కొత్త టెక్నాలజీ పాలసీని ప్రభుత్వం విడుదల చేసింది. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాన్ని మరింత ప్రోత్సహించడానికి 2013లో సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ (ఎస్‌టీఐ) అనే సరికొత్త విధానాన్ని ప్రభుత్వం 100వ జాతీయ సైన్స్ సదస్సు (కోల్‌కతా) సందర్భంగా ప్రవేశపెట్టింది.
- భారతదేశ శాస్త్ర, సాంకేతిక రంగ వ్యవస్థలో ప్రధానమైనవి కేంద్ర ప్రభుత్వ ఎస్ అండ్ టీ విభాగాలు. ఈ రంగంలో ప్రధానంగా కృషి చేసే విభాగాలివి. వీటికి తోడుగా ఈ రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నవి – రాష్ట్ర ఎస్ అండ్ టీ విభాగాలు, ప్రైవేటు పరిశ్రమలు, ఎన్‌జీవోలు, కొన్ని ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు (వ్యవసాయ, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలు)
- దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగ పురోగతికి కృషి చేస్తున్నవి.. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్‌టీ), అంతరిక్ష విభాగం (డీఎస్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (డీఎస్‌ఐఆర్), అణుశక్తి విభాగం (డీఏఈ), బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్ (డీవోడీ).

శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్‌టీ)

ఇది 1971 మేలో ఏర్పాటైంది. జాతీయ సైన్స్ విధానాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) రూపొందిస్తుంది. ఈ రంగంలోని నూతన పరిశోధనలను ప్రోత్సహిస్తూ, దేశవ్యాప్తంగా కార్యక్రమాల నిర్వహణకు ఇది కృషి చేస్తుంది. జాతీయ సమాచార వ్యవస్థను నిర్వహిస్తుంది. ఈ రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. రాష్ట్ర ఎస్ అండ్ టీ మండళ్ల ద్వారా రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయిలో ఎస్ అండ్ టీ వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. స్వయం ప్రతిపత్తి సంస్థలకు కావాల్సిన నిధులను కూడా ఇది సమకూరుస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో శాస్త్ర, సాంకేతిక రంగంలో సహకారం, అభివృద్ధికి కూడా డీఎస్‌టీ కృషి చేస్తుంది. ఆధునికీకరణను ప్రోత్సహిస్తూ జాతీయ అవసరాలకు తగ్గట్టుగా ఈ రంగాన్ని అభివృద్ధి చేయాలనేది డీఎస్‌టీ మరో లక్ష్యం. దీని ఆధ్వర్యంలో ఎస్ అండ్ టీ అభివృద్ధికి కృషి చేసే కొన్ని ముఖ్యమైన సంస్థలు..

- టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ ఫోర్‌కాస్టింగ్ అండ్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (టీఐఎఫ్ఏసీ)
- ఇండియన్ మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ (భారత వాతావరణ విభాగం)
- సర్వే ఆఫ్ ఇండియా
- సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ కౌన్సిల్



- నేషనల్ అట్లాస్ అండ్ థీమాటిక్ మ్యాపింగ్ ఆర్గనైజేషన్
- నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్టింగ్

అంతరిక్ష విభాగం

- అంతరిక్ష సంఘం, అంతరిక్ష విభాగాలను మన దేశంలో 1972లో ఏర్పాటు చేశారు. అంతరిక్ష సంఘం రూపొందించే అంతరిక్ష విధానాన్ని అంతరిక్ష విభాగం ఆధ్వర్యంలోని ఇస్రో నిర్వహిస్తుంది. దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఉద్దేశించిన ఇన్సాట్, ఐఆర్ఎస్, నావిగేషనల్ ఉపగ్రహ వ్యవస్థలను అభివృద్ధి చేసి ప్రయోగించడం ఈ విభాగం ప్రధాన లక్ష్యం. వీటిని ప్రయోగించే లక్ష్యంతో పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్ వ్యవస్థలను ఇస్రో అభివృద్ధి చేసింది. ప్రపంచంలో అత్యంత విజయవంతమైన రాకెట్లలో పీఎస్ఎల్‌వీ ఒకటి. ఇప్పటివరకు నిర్వహించిన 28 పీఎస్ఎల్‌వీ ప్రయోగాల్లో 27 ప్రయోగాలు వరుసగా విజయవంతమయ్యాయి. దేశీయ క్రయోజెనిక్ ఇంజన్, జీఎస్ఎల్‌వీ–మార్క్–3 అభివృద్ధి, పరీక్ష ప్రయోగం, మంగళయాన్ వంటివి ఇటీవల అంతరిక్ష విభాగం సాధించిన విజయాలు.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (డీఎస్ఐఆర్)

- డీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో పని చేస్తున్న ప్రధాన విభాగం కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్). దీని ఆధ్వర్యంలో దేశంలో అనేక సంస్థలు వివిధ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. పరిశ్రమల్లో పరిశోధన – అభివృద్ధిని ప్రోత్సహించడం, టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధిని సాధించడం, టెక్నాలజీ బదిలీ, నేషనల్ ఇన్ఫర్మేషన్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఐఎస్ఏటీ)ని అభివృద్ధి చేయడం డీఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యాలు.

అణుశక్తి విభాగం

- శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని అభివృద్ధి చేయడం, భద్రతతో కూడిన లాభదాయకమైన అణుశక్తిని ఉత్పత్తి చేయడం అణుశక్తి విభాగం ముఖ్య లక్ష్యాలు. అణుశక్తి విధానాన్ని రూపొందించే అణుశక్తి సంఘం 1948లో, దాన్ని అమలు చేసే అణుశక్తి విభాగం 1954లో ఏర్పాటైంది. మూడు దశల అణుశక్తి కార్యక్రమాన్ని వేగంగా అభివృద్ధి చేసి స్థాపిత శక్తి సామర్థ్యంలో అణుశక్తి వాటాను పెంచడం, వైద్య, పారిశ్రామిక, వ్యవసాయ, సామాజిక రంగాల్లో ఉపయోగపడే రేడియో ఐసోటోపులను, రేడియో ధార్మిక టెక్నాలజీలను అభివృద్ధి చేయడం ఈ విభాగం లక్ష్యాలు.

బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ)

- విశ్వవిద్యాలయాలు, పరిశోధన కేంద్రాల్లో బయోటెక్నాలజీని ప్రోత్సహించే విభాగం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ. కణజాల వర్ధనం, సూక్ష్మవ్యాప్తి టీకాల అభివృద్ధి, క్యాన్సర్ మందుల ఉత్పాదన, డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, ఎయిడ్స్ మందుల ఉత్పాదన, నిర్ధారణ పద్ధతుల అభివృద్ధిలో ఇప్పటికే బయోటెక్నాలజీ రంగం ఎన్నో విజయాలను సాధించింది. అమెరికా, ఫ్రాన్స్, బెల్జియం తర్వాత హెపటైటిస్–బీ టీకాను ఉత్పత్తి చేసిన నాలుగో దేశం భారత్. మూలకణాల రంగంలో ఇప్పటికే ముఖ్యంగా ప్రౌఢ మూలకణాల ద్వారా సరికొత్త చికిత్స పద్ధతులు భారత్‌లో అందుబాటులోకి వచ్చాయి.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్

- సముద్ర రంగ వనరుల సర్వే, అభివృద్ధి వాటి వెలికితీత కోసం కృషి చేస్తుంది డీవోడీ. జీవ, నిర్జీవ వనరుల గుర్తింపు, సముద్ర లోతులో డీప్ సీ బెడ్ మైనింగ్, సముద్ర తరంగ శక్తి ఉత్పాదన, అంటార్కిటికాపై పరిశోధన ఈ విభాగం ముఖ్య లక్ష్యాలు.
- వివిధ మంత్రిత్వ శాఖల్లోని విభాగాలు కూడా దేశ ఎస్ అండ్ టీ అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. **ఉదా:** వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పనిచేస్తున్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. భారత అంతరిక్ష విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్) ఏ సంవత్సరంలో ఏర్పాటైంది?
   1) 1969 2) 1972 3) 1975 4) 1979
2. ఎవరి ఆధ్వర్యంలో అణుశక్తి విభాగం పనిచేస్తుంది?
   1) సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ
   2) రక్షణ మంత్రిత్వ శాఖ
   3) మానవ వనరుల అభివృద్ధి శాఖ
   4) ప్రధానమంత్రి
3. నీటి నుంచి ఫ్లోరిన్‌ను తొలగించే నల్లగొండ టెక్నిక్‌ను అభివృద్ధి చేసిన సంస్థ?
   1) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)
   2) నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)
   3) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్
   4) నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
4. 'గరీమ' అనే గేదె పిల్ల (దూడ)ను క్లోనింగ్ ద్వారా సృష్టించిన కేంద్రం?
   1) నేషనల్ బ్యూరో ఆఫ్ యానిమల్ జెనిటిక్ రిసోర్సెస్
   2) నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   3) సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ
   4) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్
5. సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
   1) కాసరగోడ్ 2) తిరువనంతపురం
   3) కోచి 4) హైదరాబాద్
6. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్ శాఖా మంత్రి?
   1) పీయూష్ చావ్లా 2) డా॥ జితేంద్ర సింగ్
   3) స్మృతి ఇరానీ 4) అనంతకుమార్
7. బోల్ క్యూర్ పేరుతో సరికొత్త జీవ క్రిమి సంహారకాన్ని అభివృద్ధి చేసిన సంస్థ?
   1) ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్
   2) ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   3) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్
   4) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెజిటబుల్ రీసెర్చ్
8. పూర్తి దేశీయ పరిజ్ఞానంతో సిసోరియం అనే మలేరియా నివారణ మందును అభివృద్ధి చేసిన సంస్థ?
   1) భారత్ బయోటిక్ 2) రాన్‌బ్యాక్సీ
   3) బయోకాన్ 4) డా.రెడ్డీస్ లేబొరేటరీ
9. అణు వ్యర్థాన్ని గాజు మాత్రికలో భద్రపర్చే విధానాన్ని అణుశక్తి విభాగం అభివృద్ధి చేసింది. ఈ విధానాన్ని ఏమంటారు?
   1) విట్రిఫికేషన్ 2) ట్రాన్స్‌మ్యుటేషన్
   3) అన్నీలింగ్ 4) ఎన్‌రిచ్‌మెంట్
10. మొదటి జాతీయ సైన్స్ విధానాన్ని ఎప్పుడు ప్రకటించారు?
    1) 1952 2) 1958 3) 1962 4) 1965
11. అణుశక్తి సంఘం చైర్మన్?
    1) శ్రీకుమార్ బెనర్జీ 2) అనిల్ కకోద్కర్
    3) డా॥ అజిత్ మహంతీ 4) యు.ఆర్.రావు
12. ప్రతి ఏటా దేశంలో శాస్త్రవేత్తలకు శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులను ప్రదానం చేసేది?
    1) కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)
    2) డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ)
    3) అంతరిక్ష విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్)
    4) అణుశక్తి విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ)
13. కలరా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలరా అండ్ ఎంట్రిక్ డిసీజెస్ సంస్థ ఎక్కడ ఉంది?
    1) న్యూఢిల్లీ 2) బెంగళూరు
    3) ముంబై 4) కోల్‌కతా

సమాధానాలు

1) 2; 2) 4; 3) 4; 4) 2; 5) 1; 6) 2; 7) 1; 8) 2; 9) 1; 10) 2; 11) 3; 12) 1; 13) 4.

స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు..

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు - కంటెంట్ (ఎస్ఏ/ఎల్‌పీ)

సంధులు - వ్యాకరణ పరిభాషలు

డీఎస్సీ అభ్యర్థులు శ్రద్ధగా చదవాల్సిన వ్యాకరణాంశాలు సంధులు, వ్యాకరణ పరిభాషలు. వీటిపై డీఎస్సీ–2012, టెట్‌లో 13 ప్రశ్నలు అడిగారు. ఈ డీఎస్సీలో కూడా ఎక్కువ ప్రశ్నలు రావచ్చు. స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్ పండిట్స్ అభ్యర్థులందరూ వీటిని తప్పకుండా అధ్యయనం చేయాలి.

సంధులు: I. సంస్కృత సంధులు, II. తెలుగు సంధులు.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి 2. గుణ సంధి
3. వృద్ధి సంధి 4. యణాదేశ సంధి
5. జశ్త్వ సంధి 6. శ్చుత్వ సంధి
7. అనునాసిక సంధి 8. విసర్గ సంధి
9. పరసవర్ణ సంధి 10. పరరూప సంధి

II. తెలుగు సంధులు:

1. ఉత్వ సంధి 2. ఇత్వ సంధి
3. అత్వ సంధి 4. యడాగమ సంధి
5. టుగాగమ సంధి 6. రుగాగమ సంధి
7. దుగాగమ సంధి 8. నుగాగమ సంధి
9. ద్విరుక్తటకార సంధి 10. సరళాదేశ సంధి
11. గ, స, డ, ద, వా దేశ సంధి
12. ఆమ్రేడిత సంధి 13. పుంప్వాదేశ సంధి
14. త్రిక సంధి 15. పడ్వాది సంధి
16. ప్రాంతాది సంధి 17. లు, ల, నల సంధి

సంధులకు సంబంధించి ఒక పదాన్నిచ్చి దాన్ని సరిగా విడదీయమని అడుగుతారు. లేదా విభజించిన రూపాన్నిచ్చి సరిగా కలుపమని అడుగుతారు. సంధి సూత్రాలు రాయాల్సిన అవసరం లేకపోయినా అవగాహన కోసం సూత్రాలు తెలుసుకోవడం మంచిది.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి
అ–ఇ–ఉ–ఋలకు అవే అచ్చులు పరమైనా వాటి దీర్ఘాలు ఏకాదేశమవడాన్ని సవర్ణ దీర్ఘ సంధి అంటారు.
ఉదా: రామ + ఆజ్ఞ = రామాజ్ఞ
మహి + ఈశుడు = మహీశుడు
గురు + ఉపదేశం = గురూపదేశం
పితృ + ఋణం = పితౄణం

2. గుణ సంధి: అకారానికి ఇ–ఉ–ఋలు పరమైతే క్రమంగా ఏ–ఓ–అర్‌లు ఏకాదేశ మవడాన్ని గుణసంధి అంటారు.
ఉదా: సూర్య + ఉదయం = సూర్యోదయం
మహా + ఈశ్వరుడు = మహేశ్వరుడు
ఇతర + ఇతర = ఇతరేతర
రాజ + ఋషి = రాజర్షి

3. వృద్ధి సంధి: అకారానికి ఏ, ఐలు పరమైతే ఐకారాన్ని; ఓ, ఔలు పరమైతే ఔకారాన్ని; ఋ, ౠలు పరమైతే ఆర్ ఏకాదేశమవడాన్ని వృద్ధి సంధి అంటారు. ఐ, ఔలను వృద్ధులు అంటారు.
ఉదా: భువన + ఏక = భువనైక
అఖండ + ఐశ్వర్యం = అఖండైశ్వర్యం
పాప + ఓఘం = పాపౌఘం
పరమ + ఔషధం = పరమౌషధం
ఋణ + ఋణం = ఋణార్ణం

4. యణాదేశ సంధి: ఇ–ఉ–ఋలకు అసవర్ణాచ్చులు పరమైతే క్రమంగా య–వ–రలు ఆదేశమవడాన్ని యణాదేశ సంధి అంటారు. "ఇకోయణచి" : ఇక్కులకు (ఇ–ఉ–ఋ) యణ్ణులు (య–వ–ర) పరమవుతున్నందు వల్ల ఇది యణాదేశ సంధి.
ఉదా: జయంతి + ఉత్సవం = జయంత్యుత్సవం
హిందూ + ఆర్యులు = హింద్వార్యులు
పితృ + ఆర్జితం = పిత్రార్జితం

5. జశ్త్వ సంధి: క–చ–ట–త–పలకు అచ్చులు కానీ, హ–య–వ–ర–లు కానీ, వర్గ తృతీయ చతుర్థ పంచమాక్షరాలు కానీ, పరమైతే గ, జ, డ, ద, బలు ఆదేశమవడాన్ని జశ్త్వసంధి అంటారు.
ఉదా: తత్ + అరణ్య భూములు = తదరణ్య భూములు
అచ్ + అంతం = అజంతం
వాక్ + ఈశుడు = వాగీశుడు
కకుప్ + అంతం = కకుబంతం
సత్ + భావం = సద్భావం

6. శ్చుత్వ సంధి: సకారత వర్గాలకు శకారచ వర్గాలు పరమైనప్పుడు శకారచ వర్గాలే ఆదేశమవడాన్ని శ్చుత్వ సంధి అంటారు.
(సకార–త థ ద ధ న) (త వర్గం)
(శకార – చ ఛ జ ఝ ఞ) (చ వర్గం)
తపస్ + శమము = తపశ్శమము
(స్(స)+శ= శ్శ)
సత్+చరిత్ర=సచ్చరిత్ర(త్ (త) – చ= చ్చ)
సత్+జనుడు= సజ్జనుడు(త్ (త)+జ= జ్జ)
విద్యుత్+శక్తి=విద్యుచ్ఛక్తి(త్ (త)+ శ=చ్ఛ)

7. అనునాసిక సంధి: వర్గ ప్రథమాక్షరాలకు (క–చ–ట–త–ప)'న, మ' అనునాసికాలు పరమైనప్పుడు ఆయా వర్గానునాసికాలు వికల్పంగా రావడాన్ని అనునాసిక సంధి అంటారు. మయాది ప్రత్యయాలకు నిత్యముగా వస్తాయి.
ఉదా: వాక్ + మయం = వాఙ్మయం
(క–ఙ=నిత్యం)
జగత్ + నాటకం = జగన్నాటకం
= జగద్నాటకం (వికల్పం)
(అనునాసికం రానప్పుడు వర్గ తృతీయాక్షరం (త–ద–వికల్పం)
మృట్ + మయం = మృణ్మయం,
మృడ్మయం (టకు అనునాసికం రానప్పుడు డకారం వికల్పం)

8. విసర్గ సంధి: అకారం పూర్వముందున్న విసర్గకు వర్గ తృతీయ, చతుర్థ, పంచమాక్షరాలు అ–హ–య–వ–ర–లలు పరమైనప్పుడు విసర్గ – ఓకారంగా మారుతుంది. (వర్గ తృతీయాక్షరాలు– గ, జ, డ, బ, లు వర్గ చతుర్థాక్షరాలు (ఘ, ఝ, ఢ, ధ, భ, లు)
వర్గ పంచమాక్షరాలు: ఙ– ఞ– ణ– న–మ్ (అనునాసికాలు) హ–య–వ–ర–లలు పరమైనప్పుడు మాత్రమే విసర్గ ఓకారంగా మారుతుంది. కొన్నిసార్లు రేఫ వస్తుంది.
ఉదా: అయః + మయం = అయోమయం
(యః + మ = ఓ)
ఇతః + అధికం = ఇతోధికం (తః+అ = ఓ)
చతుః + ఆత్మ = చతురాత్మ
(తుః + ఆ = 'ర' కారం వచ్చింది)
తపః ఫలము = తపఃఫలం (ఫ కారం వర్గ ద్వితీయాక్షరమైనందు వల్ల విసర్గలో మార్పు లేదు).

9. పర సవర్ణ సంధి: పదాంతం ముందున్న 'త' కారానికి లకారం పరమైనప్పుడు 'ల' కారమే ఆదేశంగా రావడాన్ని పర సవర్ణ సంధి అంటారు. (త్ – తకారానికి లకారం వస్తే 'ల్ల' కారం వస్తుంది)
ఉదా: భగవత్ + లీల = భగవల్లీల
(త్ + ల = ల్ల)
ఉత్ + లేఖనం = ఉల్లేఖనం (త్+లే = ల్లే)
విద్యుత్ + లత = విద్యుల్లత (త్ + ల = ల్ల)
సుహృత్ + లాభం = సుహృల్లాభం
(త్ + లా = ల్లా)

10. పరరూప సంధి: హల్లుల్లోని అకారానికి అకారం పరమైతే రెండో పదంలోని మొదటి అచ్చు ఏకాదేశమవుతుంది. దీన్ని పరరూపసంధి అంటారు.
ఉదా: సార + అంగము = సారంగము
(ర్ + అ = రకారంలోని అకారానికి 'అ' కారం పరమై రకారానికి దీర్ఘం వచ్చింది)
సీమ + అంతము = సీమంతము
(మ్ + అకారానికి అకారం పరమై అకార దీర్ఘం వచ్చింది)

తెలుగు సంధులు

1. ఉత్వ సంధి: ఉత్తునకచ్చుపరమైనప్పుడు సంధి నిత్యముగా వస్తుంది (హ్రస్వమైన ఉకారానికి మాత్రమే ఇది వర్తిస్తుంది)
ఉదా: రాముడు + అతడు = రాముడతడు (డులోని ఉ కారానికి అకారం పరమై అకారం నిత్యంగా వచ్చింది)
- ప్రథమేతర విభక్తి శత్రర్థక చువర్ణంబులందున్న ఉకారానికి సంధి వైకల్పికం అవుతుంది.
- ప్రథమా విభక్తి కాకుండా ఇతర విభక్తుల్లో శత్రర్థకమైన 'చున్' ప్రత్యయంలోని ఉకారానికి సంధి వైకల్పికమని అర్థం.
- వైకల్పికమంటే ఒకసారి సంధి జరిగిన రూపం, మరోసారి సంధి జరగని రూపం సిద్ధిస్తుంది.

ఉదా: నన్నున్ + అడిగె = నన్నడిగె
(సంధి జరిగిన రూపం)
నన్నునడిగె (సంధి జరగని రూపం)

2. ఇత్వ సంధి: ఇత్తునకు సంధి వైకల్పికం. ఏమ్యాదుల్లో ఇత్తునకు సంధి వైకల్పికం (ఏమి, మరి, అది, అవి, ఇది, ఇవి, కాన్) మొదలైనవి ఏమ్యాదులు.
ఉదా: ఏమి + అంటివి:
ఏమంటివి, (సంధి జరిగిన) ఏమియంటివి (సంధి జరుగని)
- మధ్యమ పురుష క్రియలందిత్తునకు సంధి నిత్యం.

ఉదా: చూచితిరి + ఇపుడు = చూచితిరిప్పుడు
- క్త్వార్థంబైన ఇత్తునకు సంధి లేదు. భూతకాలిక అసమాపక క్రియ క్త్వార్థంబు

ఉదా: వచ్చి + ఇచ్చి = వచ్చియిచ్చి (సంధి లేనందువల్ల యడాగమ రూపం)

3. అత్వ సంధి: అత్తునకు సంధి బహుళం.
- బహుళమంటే నిత్యం, నిషేధం, వైకల్పికం, అన్యవిధం అనే నాలుగు కార్యాలు ఉంటాయి.

నిత్యంగా జరిగేవి
ఉదా: రామ + అయ్య = రామయ్య (నిత్యం)
సంధి జరగని నిషేధ రూపం
ఉదా: దూత + ఇతడు = దూతయితడు
(యడాగమ రూపం)
వైకల్పికంగా జరగడం: సంధి జరిగిన రూపం, సంధి జరగని యడాగమ రూపం రెండూ వస్తాయి.
ఉదా: మేన + అల్లుడు = మేనల్లుడు
(సంధి జరిగిన రూపం)
మేనయల్లుడు (సంధి జరుగని యడాగమ రూపం)
అన్యవిధం: సూత్రంలో సూచించని విధంగా కొన్ని హల్లులు వచ్చి చేరతాయి.
ఉదా: తామర + ఆకు = తామరప్రాకు
పుగాగమం అన్య విధంగా వచ్చి చేరింది.

4. యడాగమ సంధి: సంధి లేని చోట స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు యడాగమంబగు. సంధి జరిగే అవకాశం లేనప్పుడు పర స్వరానికి ముందు 'య్' కారం ఆగమంగా వచ్చి చేరుతుంది.
ఉదా: వెల + (య్) ఆలు = వెలయాలు
మా + (య్) అమ్మ = మాయమ్మ

5. టుగాగమ సంధి: కర్మధాయంలో ఉత్తునకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబగుతుంది.
వివరణ: నామవాచక, విశేషణాలకు సంబంధించిన సమాసం కర్మధారయ సమాసం. ఇందులో పరస్వరానికి ముందు 'ట్' కారం ఆగమంగా వస్తుంది.
ఉదా: కఱకు+ (ట్) అమ్ము = కఱకుటమ్ము
- కర్మధారయమున పేర్వాది శబ్దాలకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబువిభాషనగు.

పేర్వాదులు: పేరు, పొదరు, చిగురు, తలిరు.
ఉదా: పేరు + ఉరము = పేరుటురము
(టుగాగగం రానప్పుడు)

6. రుగాగమ సంధి: కర్మధారయంబున 'పేరాది' శబ్దాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు రుగాగమం బగు.
పేరాది శబ్దాలు: పేద, బీద, ముగ్ధ, కొమ, జవ, మనుమ, ఐదవ మొదలైనవి.
ఉదా: పేద (ర్) + ఆలు = పేదరాలు
పరస్వరానికి ముందు 'ర్' కారం చేరి పేదరాలు రూపం వచ్చింది.
మనుమ(ర్) + ఆలు = మనుమరాలు
- కర్మధారయంబున తత్సమ పదాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు అత్వంబు నకు ఉత్వంబు రుగాగమవుతుంది.

(తత్సమ శబ్దాలు: ధీర, గుణవంత, ధనవంత, సంపన్న, గంభీర, ధైర్యవంత మొదలైనవి)
ఉదా: ధీర + ఆలు = ధీరు+ ర్ + ఆలు
= ధీరురాలు
గుణవంత + ఆలు =
గుణవంతు + ర్ +ఆలు= గుణవంతురాలు

7. దుగాగమ సంధి: నీ– నా– తన శబ్దాలకు ఉత్తర పదంబు పరమైనప్పుడు దుగాగమంబు విభాషనగు.
ఉదా: నా + (దు) విభుడు = నాదువిభుడు
(సంధి జరిగిన రూపం)
నా విభుడు (సంధి జరగని రూపం)
తన + (దు) కోపం = తనదు కోపం
(సంధి జరిగిన రూపం)
తన కోపం (సంధి జరగని రూపం)

8. నుగాగమ సంధి: ఉదంత తద్ధర్మార్థ విశేషణానికి అచ్చుపరమైనప్పుడు నుగామమంబగు.
తద్ధర్మార్థకాలు: భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో జరిగే క్రియలు. హ్రస్వమైన ఉకారం చివర ఉన్న తద్ధర్మార్థక క్రియలకు అచ్చుపరమైతే నుగాగమం వస్తుందని సూత్రార్థం.
ఉదా: చేయు + (న్) ఎడ = చేయునెడ
వ్రాయు + (న్) అది = వ్రాయునది
- షష్ఠీ తత్పురుష సమాస మందలి ఉకార, ఋకారంబులకు అచ్చుపరమైనప్పుడు నుగాగమంబగు.

ఉదా: రాజు + (న్) ఆనతి = రాజునానతి
చెరువు + (న్) ఉదకం = చెరువునుదకం

9. ద్విరుక్తటకార సంధి: కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల 'ఱ, డ'లకు అచ్చు పరమైనప్పుడు ద్విరుక్తటకారం ఆదేశమవుతుంది.
ఉదా: కు (ఱు) (ట్ట్)+ ఉసురు = కుట్టుసురు
చిఱు + (ట్ట్) ఎలుక = చిట్టెలుక
కడు + (ట్ట్) ఎదురు = కట్టెదురు
నడు + (ట్ట్) ఇల్లు = నట్టిల్లు
నిడు + ఊర్పు = నిట్టూర్పు
వివరణ: ద్విరుక్తటకారమంటే ద్విత్వటకారమని అర్థం. ద్విత్వటకారం ఆదేశంగా వచ్చి ఈ రూపాలు వచ్చాయి.

10. సరళాదేశ సంధి: ద్రుత ప్రకృతికం మీది పరుషాలకు సరళములగు.
ఉదా: పూచెను + కలువలు, పూచెను గలువలు: పరుషమైన కకారం సరళంగా (గ) మారింది.
- ఆదేశ సరళాలకు ముందున్న ద్రుతానికి బిందు సంశ్లేషణలు విభాషనగు. పూచెను + గలువలు – పూచెంగలువలు; పూచెన్గలువలు: పూచెనుగలువలు, పూచెఁగలువలు అనే నాలుగు రూపాలు వస్తాయి. సమాసములందు స్వత్వ సంశ్లేషణ రూపాలుండవు. అర సున్నా రూపం మరో సూత్రంతో నిషేధానికి గురైంది. 'పూచెంగలువలు' అనే ఒక్క రూపం మాత్రమే మిగులుతుంది.

11. గ, స, డ, ద, వా దేశ సంధి:
1. ప్రథమం మీది పరుషాలకు గ, స, డ, ద, వలు బహుళముగానగు. ప్రథమావిభక్తిలో ఉన్న పదాలకు పరమైన పదాల్లో ఉన్న పరుషాలకు (కచటతపలకు క్రమంగా గ, స, డ, వలు) బహుళంగా వస్తాయి.
ఉదా: వాడు + కొట్టె = వాడు గొట్టె
అపుడు + చనియె = అపుడుసనియె
2. ద్వంద్వ సమాసాల్లో పదాలపై పరుషాలకు గ, స, డ, ద, వలు ప్రాయికంగా వస్తాయి.
ఉదా: తల్లి + తండ్రి = తల్లిదండ్రులు
3. తెనుగుల మీది సాంస్కృతిక పరుషాలకు గ, స, డ, ద, వలు రావు. తెలుగు పదాలకు పరంగా వచ్చిన తత్సమ పదాల్లోని పరుషాలకు గ, స, డ, ద, వలు రావు.
ఉదా: వాడు + కంసారి = వాడు కంసారి
వీడు + చక్రపాణి = వీడు చక్రపాణి
(ఈ ఉదాహరణలో క, చ అనే పరుషాలకు గ,స,లు రాలేదు)

12. ఆమ్రేడిత సంధి:
1. అచ్చునకు ఆమ్రేడితం పరమైనప్పుడు సంధి తరచుగానగు. ద్విరుక్తం పదరూపం ఆమ్రేడితం. ఒక పదాన్ని రెండుసార్లు ఉచ్చరించినప్పుడు రెండోసారి ఉచ్చరించినదాన్ని ఆమ్రేడితమంటారు.
ఉదా: ఔర + ఔర (ఆమ్రేడితం) ఔరౌర
ఆహా + ఆహా = ఆహాహా
2. ఆమ్రేడితం పరమైనప్పుడు కడాదుల తొలి అచ్చు మీది వర్ణంబులెల్లా అదంతంబగు ద్విరుక్తటకారంబగు (**కడాదులు:** కడ, చివర, తుద, మొదలు, తెరువు, నడుమ మొదలైనవి)
ఉదా: క(డ)ట్ట + కడ = కట్టకడ
చివ(ట్ట)ర + చివర = చిట్టచివర
కడాదుల్లో తొలి అచ్చు తర్వాత వర్ణాలన్నింటికీ లోపం వచ్చి వాటి స్థానంలో అదంతమైన ద్విత్వటకారం వచ్చింది.
3. అందదుకు ప్రభృతులు యథా ప్రయోగంబుగా గ్రాహ్యములు.
ఉదా: అందుకు + అదుకు = అందదుకు
చెర + చెర = చెచ్చెర లాంటి రూపాలు యథావిధిగా గ్రహించవచ్చని చిన్నయ సూరి అభిప్రాయం.

13. పుంప్వాదేశ సంధి: కర్మధారయమందలి మువర్ణానికి 'పుంపు'లగు ము వర్ణానికి 'పువర్ణం' బిందు పూర్వక పువర్ణం (ంపు) రెండు రూపాలు వస్తాయి.
ఉదా: సరసము + మాట = 1. సరసపు మాట
2. సరసంపు మాట
విరసము + వచనం = 1. విరసపు వచనం
2. విరసంపు వచనం

14. త్రిక సంధి:
1. ఆ, ఈ, ఏ అనే సర్వనామాలను త్రికములు అంటారు. **ఉదా:** ఆ + కన్య
2. త్రికంబు మీది అసంయుక్త హల్లునకు ద్విత్వం బహుళంగా వస్తుంది.
ఉదా: ఆ + క్కన్య
3. ద్విరుక్తంబగు హల్లు పరమైనప్పుడు ఆచ్ఛికంబగు దీర్ఘం హ్రస్వం అవుతుంది.
ఉదా: ఆ + క్కన్య = అక్కన్య మూడు సూత్రాలతో – అక్కన్య రూపం వస్తుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
ఆదివారం । 22-9-2024

చేపల వల తయారీలో వాడే పాలీమర్?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

పాలీమర్లు

చిన్న చిన్న అణువులను అనేకసార్లు పునరావృతం చేసి అత్యంత పెద్ద అణువులను ఏర్పరిచే ప్రక్రియనే 'పాలీమరైజేషన్' అంటారు. ఈ విధంగా ఏర్పడిన అణువులను 'బృహదణువులు' లేదా 'పాలీమర్'లు అంటారు. ఈ ప్రక్రియలో ఉపయోగించిన చిన్న అణువులను 'మోనోమర్'లు అంటారు.

- ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించేవాటిని సహజ పాలీమర్‌లుగా పేర్కొంటారు.
  ఉదా: పట్టు, ఉన్ని, కాటన్ (సెల్యులోజ్), పిండి పదార్థం (స్టార్చ్), ప్రోటీన్లు, సహజ రబ్బరు.
- వివిధ రసాయన పదార్థాలను ఉపయోగించి ప్రయోగశాలలో, పారిశ్రామికంగా తయారు చేసేవాటిని కృత్రిమ పాలీమర్లు అంటారు.
  ఉదా: పాలీథీన్, నైలాన్, టెఫ్లాన్, పీవీసీ.
- సహజ పాలీమర్లను పాక్షికంగా మార్పు చేయడం ద్వారా రూపొందించేవాటిని అర్ధ కృత్రిమ పాలీమర్లు అంటారు.
  ఉదా: సెల్యులోజ్ ఎసిటేట్, సెల్యులోజ్ నైట్రేట్.
- –C(=O)–NH– అనే సమూహం పునరావృతమయ్యే పాలీమర్లను పాలీ ఎమైడ్లు అని అంటారు. కార్బాక్సిలికామ్ల గ్రూపు, ఎమైనో గ్రూపులున్న మోనోమర్ల సంఘనన పాలీమరీకరణ ప్రక్రియ వల్ల పాలీ ఎమైడ్లు ఏర్పడతాయి.
  ఉదా: ఉన్ని, మాంసం లాంటి సహజ ప్రోటీన్లు, నైలాన్ 6, 6 లాంటి కృత్రిమ పాలీమర్.
- –C(=O)–O– (–COO–) అనే సమూహం పునరావృతమయ్యే పాలీమర్లను పాలీ ఎస్టర్లు అంటారు. **ఉదా:** టెరిలీన్
- సాగే గుణం ఉన్న పాలీమర్లను 'ఎలాస్టోమర్లు' అంటారు. **ఉదా:** రబ్బరు.
- పోచల లాంటి నిర్మాణం ఉన్న పాలీమర్లను పోగులు (Fibres) అంటారు.
  ఉదా: కాటన్, నైలాన్, టెరిలీన్
- వేడి చేసినప్పుడు మెత్తబడి, చల్లార్చగానే తిరిగి గట్టిపడే పాలీమర్లను 'థర్మోప్లాస్టిక్'లు అంటారు.
  ఉదా: పాలీథీన్, పాలీ ఎస్టర్లు, పీవీసీ.
- వేడి చేసినప్పుడు వాటి ధర్మాలను పూర్తిగా కోల్పోయి, చల్లార్చినప్పుడు తిరిగి వాటి పూర్వ రూపాలను పొందని వాటిని ఉష్ణదృఢ పాలీమర్లు లేదా థర్మోసెట్టింగ్ పాలీమర్లు అంటారు. **ఉదా:** బేకలైట్, యూరియా - ఫార్మాల్డిహైడ్ రెజిన్.



ముఖ్యమైన పాలీమర్లు - అనువర్తనాలు

- **పాలీథీన్:** ఇథిలీన్(C_2H_4)ను పాలీమరీకరణం చేయడం ద్వారా లభించేదే పాలీథీన్. తయారీ విధానంలోని తేడా వల్ల ఇది రెండు రూపాల్లో లభిస్తుంది. మొదటిది అల్ప సాంద్రత ఉన్న పాలీథీన్ (LDPE). దీన్ని విద్యుత్ వైర్ల ఇన్సులేషన్‌లో, ఆటవస్తువులు, బాటిళ్లు, మృదువైన పైపులు, రెయిన్ కోట్లు, పాల ప్యాకెట్లు, క్యారీ బ్యాగుల తయారీలో ఉపయోగిస్తారు. రెండో రకమైంది అధిక సాంద్రత ఉన్న పాలీథీన్ (HDPE). దీన్ని బకెట్లు, చెత్తబుట్టలు, దృఢమైన బాటిళ్లు, పైపుల తయారీలో వినియోగిస్తారు.
- **రబ్బరు:** రబ్బరు చెట్ల ద్వారా లభించే సహజ/ ముడి రబ్బరును లేటెక్స్ అంటారు. ఇది నీటిలో రబ్బరు కణాలు విస్తరించి ఉన్న ఒక కొల్లాయిడ్. రసాయనికంగా ఇది పాలీ ఐసోప్రీన్ (ఐసోప్రీన్ యొక్క పాలీమర్). సహజ రబ్బరు గట్టిదనాన్ని పెంచడానికి 'సల్ఫర్'ను కలిపి వేడి చేసే ప్రక్రియను 'వల్కనైజేషన్' అంటారు.
- క్లోరోప్రీన్‌ను పాలీమరీకరణం చేసి తయారు చేసే కృత్రిమ రబ్బరును 'నియోప్రీన్' అంటారు. దీన్ని కన్వేయర్ బెల్టులు, గాస్కెట్ల తయారీలో ఉపయోగిస్తారు.
- బ్యూటా డయీన్, ఎక్రిలోనైట్రైల్‌లను ఉపయోగించి తయారు చేసే కృత్రిమ రబ్బరు బ్యూనా–N. ఇది పెట్రోల్, ఆయిల్ లాంటి వాటితో చర్య జరపదు. అందువల్ల దీన్ని 'ఆయిల్ సీల్'ల తయారీలో ఉపయోగిస్తారు.
- **పాలీ వినైల్ క్లోరైడ్ (పీవీసీ):** దీన్ని వినైల్ క్లోరైడ్ నుంచి తయారు చేస్తారు. ఇది గట్టి పదార్థం. నీటి పైపులు, చేతి సంచులు, గ్రామఫోన్ రికార్డులు, నేల కప్పడాలు, విద్యుత్ బంధకాలతో పాటు డయాలిసిస్, రక్త మార్పిడి చేయడానికి ఉపయోగించే గొట్టాల తయారీలో దీన్ని ఉపయోగిస్తారు.
- **నైలాన్ 6, 6:** గట్టిదనం, సాగే గుణం ఉన్న దారాల తయారీలో దీన్ని వాడతారు. బ్రష్‌లు, బ్రష్‌ల ముళ్లు, తివాచీలు, చేపల వలలు మొదలైన వాటిని తయారు చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు.
- **టెఫ్లాన్:** టెట్రాఫ్లోరో ఇథిలీన్ (C_2F_4) పాలీమర్‌ను టెఫ్లాన్ అంటారు. దీన్నే పాలీ టెట్రాఫ్లోరో ఇథిలీన్ అని కూడా అంటారు. ఇది రసాయన పదార్థాలతో చర్య జరపదు. అధిక వేడిని తట్టుకుంటుంది, క్షయం కాదు. అందువల్ల దీన్ని నాన్‌స్టిక్ వంటపాత్రలు, ఆయిల్ సీల్‌ల తయారీలో వినియోగిస్తారు.
- **బేకలైట్:** ఫీనాల్-ఫార్మాల్డిహైడ్ సంఘనన పాలీమర్ ఇది.మొదటి దశలోని 'నోవాలాక్'ను పెయింట్ల తయారీలో ఉపయోగిస్తారు. శాఖీయుత పాలీమర్ అయిన బేకలైట్‌ను దువ్వెనలు, ఎలక్ట్రిక్ స్విచ్‌ల తయారీలో వాడతారు.

కొన్ని పాలీమర్లు - వాటి మోనోమర్లు

పాలీమర్	సంబంధిత మోనోమర్
పాలీథీన్	ఇథిలీన్
పాలీ వినైల్ క్లోరైడ్ (పీవీసీ)	వినైల్ క్లోరైడ్
సహజ రబ్బరు	ఐసోప్రీన్
కృత్రిమ రబ్బరు	క్లోరోప్రీన్
టెఫ్లాన్	టెట్రా ఫ్లోరో ఇథిలీన్
నైలాన్ 6, 6	ఎడిపిక్ ఆమ్లం + హెక్సా మిథిలీన్ డై ఎమీన్ (హెచ్ఎండీఏ)
టెరిలీన్ (డాక్రాన్)	ఇథిలీన్ గ్లైకాల్ + డై మిథైల్ టెరిథాలేట్

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో పాలీమర్ ఏది?
   1) సుక్రోజ్ 2) స్టార్చ్
   3) సాధారణ ఉప్పు 4) నీరు
2. కిందివాటిలో సహజ పాలీమర్ కానిది ఏది?
   1) సెల్యులోజ్ 2) రబ్బరు
   3) పట్టు 4) పాలీథీన్
3. సహజ రబ్బరు అనేది ఒక? (గ్రూప్-2, 2012)
   1) జెల్ 2) ఘన ద్రావణం
   3) పాలీమర్ 4) కొల్లాయిడ్
4. సహజ రబ్బరు దేని పాలీమర్?
   1) వినైల్ క్లోరైడ్ 2) క్లోరోప్రీన్
   3) ఐసోప్రీన్ 4) ఎక్రిలోనైట్రైల్
5. రబ్బరును సల్ఫర్‌తో కలిపి వేడిచేసే ప్రక్రియను ఏమంటారు?
   1) కిణ్వ ప్రక్రియ 2) వల్కనైజేషన్
   3) రేషనలైజేషన్ 4) ప్లాస్టిసైజేషన్
6. టెరిలీన్‌కు మరో పేరు?
   1) రేయాన్ 2) టెఫ్లాన్
   3) నియోప్రీన్ 4) డాక్రాన్
7. జతపరచండి.
   ఎ) బేకలైట్ 1) థర్మోసెట్టింగ్ పాలీమర్
   బి) టెరిలీన్ 2) నైలాన్ 6, 6
   సి) పాలీ ఎమైడ్ 3) రేయాన్
   డి) కృత్రిమ సిల్కు 4) పాలీ ఎస్టర్

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	1	3	2	4
3)	4	1	2	3
4)	1	4	2	3

8. పరుపుల్లో ఫోమ్‌గా ఉపయోగించే 'కార్బమేట్' బంధాలున్న పాలీమర్ ఏది?
   1) పీవీసీ 2) టెఫ్లాన్
   3) పాలీయురీథేన్ 4) నియోప్రీన్
9. షాంపూలు, హెయిర్ కండిషనర్లలో వాడే పాలీమర్?
   1) పీవీసీ 2) పాలీథీన్
   3) పాలీసిలికోన్ 4) పాలీబ్యూటీన్
10. వేడిని తట్టుకునే, పెట్రోల్‌తో చర్యనొందని రబ్బరు ఏది?
    1) సహజ రబ్బరు
    2) నియోప్రీన్ రబ్బరు
    3) బ్యూనా-ఎన్
    4) సిలికోన్ రబ్బరు
11. పగలని స్వభావం ఉన్న కిచెన్ వేర్ తయారీలో వినియోగించే పాలీమర్ ఏది?
    1) పీవీసీ
    2) మెలమైన్ పాలీమర్
    3) సిలికోన్ పాలీమర్
    4) వినైల్ పాలీమర్
12. నోవాలాక్ పాలీమర్‌ను వేటి తయారీలో ఉపయోగిస్తారు?
    1) పెయింట్‌లు
    2) నాన్‌స్టిక్ వంటపాత్రలు
    3) పైపులు 4) చేతి సంచులు
13. నాన్‌స్టిక్ వంట పాత్రలు దేనితో పూత పూసి ఉంటాయి? (గ్రూప్-2, 2012)
    1) పాలీ వినైల్ క్లోరైడ్
    2) పాలీ టెట్రాఫ్లోరో ఎథిలీన్
    3) పాలీ ఎథిలీన్
    4) పాలీయురీథేన్
14. కృత్రిమ సిల్క్‌ను కింది విధంగా కూడా పిలువవచ్చు? (గ్రూప్-2, 2008)
    1) నైలాన్ 2) రేయాన్
    3) డెక్రాన్ 4) ఫైబర్ గ్లాస్
15. డయాలిసిస్, రక్త మార్పిడికి ఉపయోగించే నాళికలను ఏ పదార్థంతో రూపొందిస్తారు? (గ్రూప్-1, 2012)
    1) పాలీ ఇథిలీన్ 2) పాలీ సిలికాన్
    3) పాలీ వినైల్ క్లోరైడ్
    4) పాలీ బ్యూటేన్
16. పైపుల తయారీలో ఉపయోగించే ప్లాస్టిక్ ఏది?
    1) నైలాన్ 6, 6
    2) పాలీ ఇథిలీన్
    3) పాలీ వినైల్ క్లోరైడ్ (పీవీసీ)
    4) పాలీ ఎస్టర్
17. కిందివాటిలో పాలీ ఎస్టర్ ఏది?
    1) నైలాన్ 6, 6 2) పీవీసీ
    3) టెరిలీన్ (డాక్రాన్)
    4) సిల్కు
18. కృత్రిమ సిల్కుగా ప్రసిద్ధి చెందిన రేయాన్ తయారీకి ముడి పదార్థం ఏది?
    1) సెల్యులోజ్ 2) స్టార్చ్
    3) సహజ సిల్కు 4) సహజ రబ్బరు
19. కెమెరా ఫిల్ముల తయారీలో వాడే పాలీమర్?
    1) సెల్యులోజ్ ఎసిటేట్
    2) సెల్యులోజ్ నైట్రేట్
    3) స్టార్చ్ 4) పీవీసీ
20. బుల్లెట్ ప్రూఫ్ గాజు తయారీలో వాడే పదార్థం ఏది?
    1) పాలీ ఎస్టర్ 2) పాలీ కార్బొనేట్
    3) పాలీ ఎమైడ్ 4) పాలీ స్టైరీన్
21. జతపరచండి.
    ఎ) నైలాన్ 6, 6 1) బ్రష్‌లు
    బి) పీవీసీ 2) క్యారీ బ్యాగులు
    సి) అధిక సాంద్రత ఉన్న పాలీథీన్ 3) బొమ్మలు
    డి) అల్ప సాంద్రత ఉన్న పాలీథీన్ 4) పాల ప్యాకెట్లు

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	2	3	4	1
3)	4	1	2	3
4)	3	4	1	2

22. కిందివాటిలో 'పోగులు'గా వ్యవహరించని పాలీమర్ ఏది?
    1) డాక్రాన్ 2) సిల్క్
    3) ఉన్ని 4) టెఫ్లాన్
23. జతపరచండి.
    ఎ) సెల్లోఫేన్ టేప్ 1) సెల్యులోజ్
    బి) గన్‌కాటన్ 2) సెల్యులోజ్ ఎసిటేట్
    సి) సహజ దారం (కాటన్) 3) పాలీసిలికోన్
    డి) హెయిర్ కండిషనర్ 4) సెల్యులోజ్ నైట్రేట్

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	4	3	2	1
3)	3	4	1	2
4)	2	4	1	3

24. ఐసోప్రీన్ అనేది ఒక?
    1) చక్కెర 2) కృత్రిమ రబ్బరు
    3) సహజ రబ్బరు
    4) మత్తు పదార్థం
25. కిందివాటిలో సహజ పాలీమర్ కానిది ఏది?
    1) రెజిన్ 2) జిగురు
    3) సెల్యులోజ్ 4) టెఫ్లాన్

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 3; 5) 2; 6) 4; 7) 4; 8) 3; 9) 3; 10) 4; 11) 2; 12) 1; 13) 2; 14) 2; 15) 3; 16) 3; 17) 3; 18) 1; 19) 1; 20) 2; 21) 1; 22) 4; 23) 4; 24) 3; 25) 4.

The program in Bangalore was held in..



BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Directions (Q.No.1-6): Study the given information carefully to answer the given questions.

Seven people - A, B, C, D, E, F and G - are sitting in a straight line with equal distance between each other, but not necessarily in the same order. Some of them are facing north and some are facing south.

Only two people are sitting to the left of G. Only two people sit between G and B. A sits second to the left of B. The immediate neighbors of A face opposite directions (ie if one of the neighbors faces south then the other faces north and vice versa). Only one person sits between A and C. F sits third to the left of C. D is not an immediate neighbor of B. Both the immediate neighbors of C face the same direction (i.e. if one neighbor faces south then the other neighbour also faces south and if one neighbor faces north than the other neighbor also faces north). A faces the same direction as C. E faces north. B sits on the immediate left of E.

1. Who among the following sits exactly between G and the one who is sitting on the immediate left of B?
   1) A 2) C
   3) Other than those given as options
   4) E 5) F
2. Who among the following sits exactly in the middle of the line?
   1) D 2) A 3) F
   4) E 5) C
3. Which of the following statements is TRUE as per the given information?
   1) D faces south
   2) G sits third to the left of B.
   3) None of the given options are true
   4) D sits exactly between C and A
   5) F sits in the immediate right of A
4. Which of the following pairs represents the people sitting at the two extreme ends of the line?
   1) BC
   2) Other than those given as options
   3) EF 4) DB 5) DE
5. Who among the following sits second to the right of D?
   1) F 2) G 3) B
   4) Other than those given as options
   5) A
6. Which of the following pairs represents the immediate neighbors of B?
   1) EF 2) BA 3) AC
   4) EG 5) GF

Directions (Q.No.7-12): Study the given information carefully and answer the given questions.

Seven Personality Development Sessions are conducted in seven different cities of India - Chennai, Bangalore, Nagpur, Mumbai, Delhi, Bhopal and Hyderabad - not necessarily in the same order during the first seven months of the year (starting in January and ending in July). Each program was held only in one city during a month. There are exactly four programs held in four cities between the Hyderabad program and the Nagpur program. The Hyderabad program was not held in June. Only one program was held between the Hyderabad program and the Chennai program. The Mumbai program was held immediately after the Hyderabad program. The Delhi program was held immediately before the Bhopal program. The Bhopal program was not held in May.

7. How many programs were held between the Mumbai program and the Delhi program?
   1) One 2) Two 3) Three
   4) None 5) More than three
8. Which of the following statements is true according to the given sequence?
   1) Mumbai program was held in July
   2) Delhi program was held in April
   3) Nagpur program was held before May
   4) Hyderabad program was held in January
   5) None is true
9. Four of the following five are alike in a certain way based on the given sequence and hence form a group. Which does not belong to the group?
   1) January - Hyderabad
   2) March - Chennai
   3) June - Nagpur
   4) May - Bhopal
   5) February - Chennai
10. During March, the program was held in which of the following cities?
    1) Chennai 2) Hyderabad
    3) Mumbai 4) Nagpur
    5) None of these
11. The program in Bangalore was held in which of the following months?
    1) July 2) May
    3) February 4) March
    5) January
12. How many programs were held between the Bangalore program and the Nagpur program?
    1) Four 2) Two 3) Three
    4) Five 5) One

Direction (Q.No.13-18): Study the following arrangement of symbols, letters and numbers to answer the questions given below it.

= β 1 H F 2 * K S 7 5 # $ P V 8 @ U E 6 ↑ Q G © 9 3 & T Y £ B % R J + L M ÷ D A Δ 4 ≠ δ J

13. How many such symbols are there in the above arrangement which is immediately followed by a number and immediately preceded by a letter?
    1) One 2) Two 3) Three
    4) Four 5) Five
14. Which of the following is exactly in the middle of the thirteenth form the left end and the fifteenth from the right end in the above arrangement?
    1) P 2) ↑ 3) G
    4) Q 5) None of these
15. How many such symbols are there in the above arrangement each of which is either immediately followed by a number or immediately preceded by a letter?
    1) Seven 2) Eight 3) Nine
    4) Four 5) Five
16. Four of the following five are similar in relation to their positions in the above sequence and hence form group. Which one does not belong to that group?
    1) H7@ 2) *$6 3) 78©
    4) $E3 5) Y+4
17. Which of the following indicates the total number of symbols, letters and numbers respectively which get eliminated from the sequence when every second element of the sequence from your left is dropped from the sequence?
    1) 7, 8, 6 2) 6, 9, 7
    3) 7, 9, 6 4) 5, 9, 8
    5) None of these
18. Which of the following will be the twelfth to the left of the eighteenth letter/number/symbol from the left end?
    1) F 2) 2 3) *
    4) K 5) None of these

Directions (Q.No. 19- 23)Read the following questions carefully and choose the appropriate answer.

19. If it is possible to make a meaningful word with the 1st, 2nd, 5th, 6th, 8th and 9th letters of the word SIMULTANEOUS, which of the following will be first letter of that word? If only one such word can be formed, give 'D' as the answer. If only two such words can be formed, give 'P' as the answer. If three or more than three such words can be formed, give 'Z' as the answer, and if no such word can be formed, give 'X' as the answer.
    1) D 2) X 3) P
    4) Z 5) None of these
20. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to that group?
    1) Dolphin 2) Whale
    3) Bat 4) Tiger 5) Lizard
21. If A and B interchange their places, C and D interchange their places, E and F interchange their places and so on, which letter will be in midway between the 20th letter from the left and the 12th letter from the left?
    1) L 2) M 3) N
    4) O 5) None of these
22. If the letters in the word OBVIATE are rearranged as they appear in the English alphabet, the position of how many letters will remain unchanged after the rearrangement?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than One
23. If the letters of the word POWERFUL which are at the even numbered position in the English alphabet are picked on and arranged in alphabetical order from left and if they are now substituted by Z, Y, X and so on, beginning from left, which letter will get substituted by X?
    1) No letter will get substituted by X
    2) L 3) P 4) R
    5) None of these

Key with Solutions

(1 - 6):

↑ ↓ ↑ ↓ ↓ ↑ ↑
D C G A F B E

1) 1; **2)** 2; **3)** 2;
4) 5; **5)** 2; **6)** 1;

(7 - 12):

Month	City
January	Bangalore
February	Hyderabad
March	Mumbai
April	Chennai
May	Delhi
June	Bhopal
July	Nagpur

7) 1; **8)** 5; **9)** 5;
10) 3; **11)** 5; **12)** 4;

(13-18):

13) 2; G©9, AΔ4 **14)** 4; (Q)

15) 3;
Symbols followed by Number:
β1, ©9, Δ4
Symbols preceded by Letter:
G©, Y£, B%, J+, M÷, AΔ

16) 3;
Five elements are skipped between the first and the second element in the forward direction, and six elements are skipped between the second element and the third element in the forward direction. Third option is not matching.

17) 3;
Following are the symbols, letters and numbers eliminated.
Symbols:
β, #, ©, £, %, ÷, δ ...... (7)
Letters:
H, K, P, U, Q, T, J, L, A ...... (9)
Numbers:
2, 7, 8, 6, 3, 4 ......(6)

18) 2;
18th element from the left end is 'U'
12th element to the left of U is '2'
Quicker method:
18 – 12 = 6th from the left end which is '2'

19) 4;
TINSEL, LISTEN, SILENT,

20) 5;
All the remaining are mammals whereas lizard is a reptile.

21) 4;
Odd number position letter interchanges with the next even numbered position letter. Hence, 19th positioned letter 'S' interchanges with the 20th positioned letter 'T'.
And 11th positioned letter 'K' interchanges with the 12th positioned letter 'L'.
BADCFEHGJIL**K**NMP**O**RQT**S**VUX WZY
SO, middle letter between K and S is 'O'

22) 4;
O B V I A T E
A B E I O T V
There are three letters - B, I and T which remain unchanged after the rearrangement.

23) 3;
The value of each letter is given in the bracket.
P(16) O(15) W(23)
E(5) R(18) F(6)
U(21) L(12)
Even numbered position letters in the alphabetical order as follows:
F(6) L(12) P(16)
R(18)
F is substituted by Z, L is substituted by Y, P is substituted by X.